సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 193
శనివారం 4-10-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'


భారత్ 448/5
విండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో రాహుల్, జురేల్, జడేజా సెంచరీలు -15లో


విజయ్, రష్మిక నిశ్చితార్థం
నిరాడంబరంగా కార్యక్రమం.. ఫిబ్రవరిలో డెస్టినేషన్ వెడ్డింగ్! -12లో


నో అంటే నరకమే!
తన 20 సూత్రాల శాంతి ప్రణాళిక పట్ల హమాస్ మిలిటెంట్లు ఇంకా స్పందించక పోవడంపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు.
- వివరాలు 6లో▶


భారత్‌తో వాణిజ్య సమతూకం!
భారత్‌తో వాణిజ్య బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నట్లు రష్యా అధినేత పుతిన్ సంకేతాలిచ్చారు.
- వివరాలు 6లో▶


యువశక్తికి బూస్ట్
యువత విద్య, నైపుణ్యాభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.62 వేల కోట్లకు పైగా విలువైన కార్యక్రమాలను మోదీ ఆవిష్కరించనున్నారు.
- వివరాలు 6లో▶


ఆ పిల్లలకు దగ్గు సిరప్ వద్దు
రెండేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న చిన్నారులకు దగ్గు, జలుబు మందులను సూచించవద్దని కేంద్రం ప్రకటించింది.
- వివరాలు 6లో▶

రూ.కోట్లలో కోచింగ్!

దేశంలో రూ. 70 వేల కోట్లకు చేరిన కోచింగ్ సెంటర్ల వ్యాపారం

2028 నాటికి రూ. 1.38 లక్షల కోట్లకు పెరిగే అవకాశం


- ఇన్ఫినియం మార్కెట్ రీసెర్చ్ తాజా నివేదిక అంచనా
- 78% సెంటర్లలో కనీస ప్రమాణాలేవని గుర్తించిన కేంద్ర విద్యాశాఖ
- అయినా ఏటా రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న శిక్షణ కేంద్రాలు
- పోటీ పరీక్షల్లో వైఫల్యంతో మనోవేదనకు గురవుతున్న సగటు విద్యార్థులు
- ఏటా వేలల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు ఎన్‌సీఆర్‌బీ గణాంకాల వెల్లడి
- నష్ట నివారణకు కేంద్రం ప్రత్యేక కమిటీ వేసినా ఇంకా వెలువడని మార్గదర్శకాలు
- కోచింగ్ సెంటర్లను నియంత్రించాలని రాష్ట్రానికి ఉన్నత విద్యామండలి సిఫార్సు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, మెడికల్, సివిల్స్, గ్రూప్స్, టోఫెల్.. ఇలా రంగం ఏదైనా, ఎలాంటి పోటీ పరీక్షకైనా శిక్షణ ఇచ్చేందుకు దేశవ్యాప్తంగా వెలిసిన కోచింగ్ సెంటర్లు ఏటా రూ. వేల కోట్ల వ్యాపారం సాగిస్తున్నట్లు ప్రముఖ మార్కెట్ రీసెర్చ్ సంస్థ ఇన్ఫినియం తాజా నివేదికలో పేర్కొంది. 2022 నాటికి దేశవ్యాప్తంగా రూ. 58 వేల కోట్లుగా ఉన్న కోచింగ్ సెంటర్ల వ్యాపారం.. ఈ ఏడాది నాటికి ఏకంగా రూ. 70 వేల కోట్లకు చేరిందని వెల్లడించింది. అలాగే 2028 నాటికి రూ. 1.38 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. కోవిడ్ తర్వాత ఆన్‌లైన్, డిజిటల్ కోచింగ్ విధానం బాగా పెరగడం వల్ల కోచింగ్ కేంద్రాల వ్యాపారం పెరుగుదలకు దోహదపడుతోందని తెలిపింది. వ్యాపార మార్కెట్‌ను మరింత పెంచుకోవడానికి వీలుగా ప్రచారంపై ఏటా రూ. 150 కోట్లకుపైనే కోచింగ్ సెంటర్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొంది. అయితే దేశంలోని 78 శాతం కోచింగ్ కేంద్రాల్లో కనీస నాణ్యతా ప్రమాణాలు లేవని కేంద్ర విద్యాశాఖ గుర్తించింది. ఆయా కేంద్రాల్లో నిపుణులైన అధ్యాపకులు ఉండట్లేదని.. సూక్ష్మ బోధన విధానం తప్ప సబ్జెక్టుపై దృష్టి పెట్టడం లేదని కనుగొంది. ఫలితంగా జేఈఈ, నీట్‌లో వివిధ రూపాల్లో ప్రశ్నలు వస్తే విద్యార్థులు సమాధానం ఇవ్వలేకపోతున్నారని అభిప్రాయపడింది.

విద్యార్థులపై ఒత్తిడి..

దేశవ్యాప్తంగా ఏటా జేఈఈ మెయిన్‌కు సుమారు 13 లక్షల మంది, నీట్‌కు 22 లక్షల మంది పోటీ పడుతుండటంతో కోచింగ్ సెంటర్లు రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. దీనికితోడు మొత్తం విద్యార్థుల్లో మెరిట్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ మిగతా వారికి పెద్దగా నాణ్యత లేని ఫ్యాకల్టీతో కోచింగ్ ఇస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోటీ పరీక్షల్లో ర్యాంకులు రాని విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ లెక్కల ప్రకారం 2013లో 8,423 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా 2022 నాటికి ఈ సంఖ్య 13,044కు పెరిగింది. 2025 చివరి నాటికి ఈ సంఖ్య 13 శాతం పెరగొచ్చని అంచనా వేసింది. ర్యాంకుల కోసం కోచింగ్ కేంద్రాలు, తల్లిదండ్రుల ఒత్తిడి, విద్యార్థుల్లో పెరిగిన ఆందోళన, ఒంటరితనం మిగతా 13వ పేజీలో ▶


అనూప్‌గఢ్‌లో మాట్లాడుతున్న ద్వివేది

మరోసారి రెచ్చగొడితే ఆపరేషన్ సిందూర్ 2.0

ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదాన్ని ఆపాల్సిందే

- లేకపోతే ప్రపంచ పటంలో పాకిస్తాన్ ఉండదు
- పొరుగు దేశానికి భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరిక
- సర్వసన్నద్ధంగా ఉండాలని భారత సైనిక దళాలకు పిలుపు

6 లో

13 పాక్ ఫైటర్ జెట్లు కూల్చేశాం

ఇందులో అమెరికా, చైనా తయారీ విమానాలున్నాయి


- ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు చావుదెబ్బ
- ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్ వెల్లడి

6 లో



న్యూస్‌రీల్

ప్రపంచ ఫ్యాక్టరీగా భారత్



బొమ్మల నుంచి యుద్ధట్యాంకుల వరకు అన్నీ భారత్‌లోనే తయారవుతున్నాయని, మన దేశం ప్రపంచ ఫ్యాక్టరీగా ఎదిగే రోజు ఎంతో దూరంలో లేదని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. 'జిటో కనెక్ట్–2025' మూడు రోజుల సదస్సును ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు.
- వివరాలు 2లో▶

దివికేగిన ప్రముఖ రచయిత లల్లాదేవి



తెలుగు ప్రజలను సాహితీ సాగరంలో ఓలలాడించిన ప్రముఖ రచయిత లల్లాదేవి (పరుచూరి నారాయణాచార్యులు) (80) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఏపీలోని గుంటూరు జిల్లా నిమ్మగడ్డవారిపాలెంలో తుదిశ్వాస విడిచారు.
- వివరాలు 12లో▶

103 మంది మావోల లొంగుబాటు



ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఒకేరోజు 103 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఇందులో ఒక డీవీసీఎం, నలుగురు పీపీసీఎంలు, ఐదుగురు ఏరియా కమిటీ సభ్యులు, ఐదుగురు మిలీషియా సభ్యులు తదితరులు ఉన్నారు.
- వివరాలు 16లో▶

మూడు రోజుల్లో రూ. 700 కోట్లు



దసరా అక్టోబర్ 2న రావడంతో ఆ రోజున మహాత్మాగాంధీ జయంతి కూడా కావడంతో వైన్‌షాపులు బంద్ ఉంటాయనే ఆలోచనతో ముందుగానే లిక్కర్ కొనేసి పెట్టుకున్నారని మద్యం విక్రయాల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. దసరా ఒక్కరోజే మూడింతల మద్యం అమ్ముడైంది.
- వివరాలు 5లో▶

'లక్ష'ణంగా ఖజానా!

5 నెలల్లో రూ. 96 వేల కోట్లు దాటిన రాష్ట్ర రాబడులు

- రెవెన్యూ రాబడి రూ. 63 వేల కోట్లపైనే.. అప్పులు రూ. 33 వేల కోట్లు
- 'కాగ్' గణాంకాల్లో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ రాబడులు రూ. లక్ష కోట్లకు చేరవయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి ఐదు నెలలకుగాను రాష్ట్ర ఖజానాకు రూ. 96,654.25 కోట్లు సమకూరినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గణాంకాలు వెల్లడించాయి. ఈ ఏడాది ఆగస్టు 31 వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ, వ్యయాలపై కాగ్ ఇచ్చిన నివేదిక మేరకు రెవెన్యూ రాబడులు రూ. 63 వేల కోట్లు దాటగా అప్పులు రూ. 33 వేల కోట్ల మార్కు చేరాయి. పన్నుల ఆదాయం రూ. 60 వేల కోట్లకు చేరువ కాగా గతేడాదితో పోలిస్తే ఒక శాతం మేర పన్ను రాబడులు తగ్గాయి.

భారీగా అప్పుల పద్దు

కాగ్ లెక్కల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 54 వేల కోట్లకు పైగా అప్పులు సమకూర్చుకోవాలని రాష్ట్ర బడ్జెట్‌లో పొందుపర్చగా అందులో 61.87 శాతం అంటే రూ. 33,434 కోట్లు ఈ ఐదు నెలల్లో సమకూరాయి. అయితే ఈ లెక్క ఆగస్టు వరకు మాత్రమే. గత నెలలో ప్రభుత్వం రూ. 15 వేల కోట్ల మేర అప్పులు తీసుకుంది. ఈ అప్పులతో కలిపితే రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలతో పోలిస్తే మరో ఆరు నెలలు మిగిలి ఉండగానే అప్పులు దాదాపు 90 శాతానికి చేరనున్నాయి. గతేడాదితో పోలిస్తే అప్పులు మిగతా 13వ పేజీలో ▶

జీఎస్టీ జోరుకు కళ్లెం

సెప్టెంబర్‌లో 5 శాతం తగ్గిన ఆదాయం

- 2024 సెప్టెంబర్‌లో 5,267 కోట్లు 2025 సెప్టెంబర్‌లో రూ.4,998 కోట్లు
- దేశవ్యాప్తంగా రాబడులు పెరిగినా రాష్ట్రంలో లోటు

2 లో





పటంలో చెరిపేయొచ్చేమో కానీ నీ హృదయం నుండి చెరిపేయడం ఎవరి వల్లా కాదు!

మన మాటే ఆయుధం

ఏకే-47, ఆటంబాంబు కంటే శక్తివంతమైనది

- ప్రతి సమస్యపై గొంతెత్తాల్సిన అవసరం యువతపైనే ఉంది... వాటిని అణచివేసేందుకు ప్రభుత్వాలు ప్రయత్నించినా వెరవకుండా పోరాడాలి
- ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజనులను తప్పించడం మైనింగ్ కోసమే
- మంథన్ సంవాద్–2025లో సీనియర్ న్యాయవాది కొలిన్ గొన్సాల్వేస్
- వివిధ అంశాలపై మాట్లాడిన వక్తలు ప్రవీణ్ సాహ్నీ, ప్రొ.రతిన్ రాయ్, రుద్రాన్ష్ ముఖర్జీ, ఆర్ఫా ఖానమ్


మంథన్ సంవాద్–2025లో మాట్లాడుతున్న కొలిన్ గొన్సాల్వేస్

సాక్షి, హైదరాబాద్: 'ఆయుధం అంటే ఏకే–47, ఆటంబాంబులే కాదు... అంతకంటే శక్తివంతమైంది మన మాట'అని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్ వ్యవస్థాపకులు కొలిన్ గొన్సాల్వేస్ అన్నారు. ఏ సమస్య అయినా అది ప్రజల్లో విస్తృత చర్చ జరగాలన్నా... ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నా దానిపై గొంతెత్తి నినదించాలని చెప్పారు. అప్పుడే దాని తీవ్రత తెలుస్తుందని, సమస్యకు పరిష్కారం దొరుకుతుందని వివరించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శిల్పకళావేదికలో నిర్వహించిన 'మంథన్ సంవాద్–2025'కార్యక్రమంలో పలు అంశాలపై మేధావులు, నిపుణులు ప్రసంగించారు. ఇందులో మిగతా 13వ పేజీలో ▶

నిన్న, మొన్నటి వరకు స్కిన్ గ్లో కోసం లోషన్లు, క్రీములు, ఫౌండేషన్లు ఉపయోగించేవారు. ఇప్పుడు ఇండియన్ జెన్ జెడ్, మిలీనియల్స్ తరం వివిధ ఆన్‌లైన్ ప్లాట్‌ఫార మ్‌లలో కె-బ్యూటీ ఉత్పత్తులను విరివిగా కొనుగోలు చేస్తోంది. ఇప్పటికే ఈ కొరియన్ బెస్ట్ బ్యూటీ ఉత్పత్తుల మార్కెట్ పదకొండు లక్షల కోట్ల మార్క్‌ను తాకింది.

కొరియన్ మెరుపు


● కె-బ్యూటీ

కొరియన్ చర్మ సంరక్షణ ఉత్పత్తులకు పెరుగుతున్న ప్రజాదరణను కె-బ్యూటీ అని పిలుస్తున్నారు. చర్మ సంరక్షణ అంటే అందంగా కనిపించడానికి మాత్రమే కాదు. స్వీయ సంరక్షణ, దీర్ఘకాలిక పోషణ కూడా. నిజానికి భారత్ ఫ్రాన్స్, యుఎస్ .. వంటి సొంత ప్రాచీన సౌందర్య ఉత్పాదనల గల దేశాలు కూడా ఈ కె.బ్యూటీ అలల్లో మునిగిపోతున్నాయి. భారతీయ స్త్రీ, పురుషుల చర్మ తత్త్వం ప్రత్యేకమైనది. మన వాతావరణంలో ఎలాంటి సౌందర్య ఉత్పాదనలు పనిచేస్తాయో తెలిసినప్పటికీ కొరియన్ల చర్మం మరింత గ్లాసీ లుక్‌తో మెరవడమే దీనికి గల కారణంగా కనిపిస్తోంది. హైడ్రేషన్, ఎక్స్‌ఫోలియేషన్, ఉత్పత్తులను పొరలుగా వేయడం వంటి విధానాల ద్వారా 'గ్లాస్ స్కిన్'ను సాధించడానికి ప్రాధాన్యత ఇస్తుంది. ఈ పదం చాలా మంది భారతీయ వినియోగదారులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా భారతీయ యువత కె-బ్యూటీ, గ్లో-అప్‌ను బాగా ఇష్టపడుతోంది. దీంతో ఆన్‌లైన్ వేదికగా ఈ ఉత్పత్తులు ఇంటి ముందుకే డెలివరీ అవుతున్నాయి.

ఇంట్లో స్పా అనుభూతి

భారతదేశంలో వేడి, తేమతో కూడిన వాతావరణం, విభిన్న చర్మ రకాలు, కాలుష్య స్థాయిలు మన చర్మ సంరక్షణను సవాల్ చేస్తుంటాయి. స్నైల్ మ్యూసిన్, జిన్సెంగ్, గ్రీన్ టీ.. వంటి పదార్థాలతో కూడిన కొరియర్ ఉత్పత్తులు చర్మానికి చికాకు కలిగించక పోవడం కూడా బహుళ ఆదరణ పొందుతున్నాయి. వివిధ దశలలో చర్మ సంరక్షణ విధానం, క్లెన్సింగ్, టోనింగ్, సీరమ్స్, ఎసెన్స్‌లు, మాయిశ్చరైజర్లు, ఎస్‌పీఎఫ్ లు అందానికి మరింత ప్రయోజనాన్ని చేకూరుస్తున్నాయి. కె-బ్యూటీ ఉత్పత్తులలో ఇంట్లో స్పా అనుభూతిని సొంతం చేసే విధంగా వివిధ దశల అప్లికేషన్స్ ఉంటున్నాయి. కె-బ్యూటీ దృష్టి కూడా భారతీయ యువతలో పెరుగుతున్న స్వీయ సౌందర్యానికి పూర్తి అనుగుణంగా ఉంటుంది.



చర్మ సంరక్షణ తత్త్వాలకు అనుగుణంగా!

కె-బ్యూటీ కొరియన్ బ్రాండ్లకు మాత్రమే పరిమితం కావడం లేదు. జర్మనీ, ఫ్రాన్స్, యుఎస్ కంపెనీలు కొరియన్ చర్మ సంరక్షణ తత్త్వాలను స్వీకరించి, దక్షిణ కొరియాలో కూడా ఉత్పత్తులను తయారు చేస్తున్నాయి. భారతదేశంలో కె-బ్యూటీ భవిష్యత్తును గుర్తించి దక్షిణ కొరియాలోని అతిపెద్ద బ్యూటీ రిటైలర్ ఆలివ్ యంగ్ అమెరికాలో తన కంపెనీని ఏర్పాటు చేయాలనుకుంటోంది. దీంతో కె-బ్యూటీ గేమ్ మరింత పోటీతత్వాన్ని పొందబోతోందనేది అర్థం అవుతోంది. దీని వల్ల భారతీయ యువతకు మరిన్ని ఎంపికలు, మెరుగైన ఉత్పత్తులు, సమీప భవిష్యత్తులో కొన్ని స్వదేశీ కె-బ్యూటీ ప్రేరేపిత బ్రాండ్‌లు కూడా లభించనున్నాయి. ఇదంతా చూస్తుంటే కె-బ్యూటీ ప్రపంచవ్యాప్తంగా తన హవాను కొనసాగిస్తుందని అర్థం అవుతోంది.

లైఫ్@360

డైపర్.. సైజూ ముఖ్యమే!



బిడ్డ పుట్టిన తర్వాత తల్లిదండ్రులు తీసుకుంటున్న జాగ్రత్తలలో చిన్నారికి ఎలాంటి ఆహారం ఇవ్వాలి, ఎలాంటి బట్టలు కొనాలి, వాళ్లని ఎలా చూసుకోవాలి.. వంటి వాటితోపాటు వారికి వాడవలసిన డైపర్ల గురించి కూడా ఆలోచించాల్సిన అవసరం వచ్చిందిప్పుడు. ఎందుకంటే పిల్లల సంరక్షణలో డైపర్ల సైజు కూడా చాలా ముఖ్యం.

తల్లిదండ్రుల తమ పిల్లలకు వేసే డైపర్లను చాలా జాగ్రత్తగా ఎంచుకోవాలి. టేప్-స్టైల్ లేదా ప్యాంట్-స్టైల్‌లో తమ బిడ్డకు ఏ స్టైల్ డైపర్ సరైనదో అని తెలుసుకోవాలి. ఎందుకంటే, పిల్లలకు సరైన డైపర్ వేయకపోతే.. అది వారి కోమలమైన చర్మంపై ప్రభావం చూపిస్తుంది. డైపర్లలోనూ ఎన్నో రసాయనాలుంటాయి. ఇవి ఎక్కువ సేపు చర్మాన్ని అంటిపెట్టుకుని ఉండటం వల్ల బిడ్డకు హాని కలిగే ప్రమాదం ఉంది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని.. డైపర్ ఎంపికలో జాగ్రత్త వహించాలి.

క్లాత్ న్యాపీలు పిల్లలకు చాలా సౌకర్యంగా ఉంటాయి, కానీ వాటిని పదే పదే ఉతకడం తల్లిదండ్రులకు లేదా వారి సంరక్షకులకు కొంచెం ఇబ్బందిగానే ఉంటుంది. అంతే కాకుండా క్లాత్ న్యాపీలను తడిసిన వెంటనే మార్చకపోతే పిల్లలకు అసౌకర్యంగా ఉంటుంది.

సరైన డైపర్ ఎంపిక

అన్ని విషయాల కంటే వారికి వేసే డైపర్ బ్రాండ్ ముఖ్యమైనది. సాధ్యమైనంత వరకు డైపర్ తయారీలో లోకల్‌గా దొరికేవి, తెలియని బ్రాండ్ డైపర్లకు బదులు మెరుగైన ఫీచర్లతో తయారు చేసిన బ్రాండెడ్ డైపర్లు వాడటం చిన్నారికి కంఫర్ట్‌నిస్తుంది.

తడి పీల్చుకునేలా...

ఎక్కువ సేపు పొడిగా ఉండేలా...

పిల్లల మూత్రం, మలం త్వరగా... ఎక్కువ శాతం పీల్చుకునే డైపర్లు ఎంచుకోవాలి. లీక్ అయ్యే డైపర్లకు దూరంగా ఉండండి. లీక్ అయ్యే డైపర్ల వల్ల.. పిల్లల శరీరానికి తేమ అంటుతుంది. పిల్లల చర్మానికి తడి అంటితే వారికి చికాకుగా ఉంటుంది. అంతేకాదు చిన్నారుల చర్మం సున్నితంగా ఉంటుంది. తడి కారణంగా త్వరగా దద్దుర్లు వచ్చే ప్రమాదం ఉంది. పిల్లలకు రాత్రి సమయంలోనూ ఎక్కువ సేపు పొడిగా ఉండే డైపర్లు వేస్తే.. హాయిగా నిద్రపోతారు. వారి చర్మానికి తడి తగిలితే మధ్య రాత్రి ఏడవటం ప్రారంభిస్తారు. దీని దృష్టిలో ఉంచుకుని పొడిగా ఉండే డైపర్లు వేయండి.

సరైన సైజ్

పిల్లల బరువును బట్టి డైపర్ సైజులు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి డైపర్ కొనడానికి ముందు మీ బిడ్డ బరువు, సైజ్ ను చూసి కొనండి. వారి డైపర్ సైజ్ ప్రతి నెల మారుతుందని గుర్తు పెట్టుకోవడం అవసరం. అందుకే ఒకే సైజ్ డైపర్లు ఇంట్లో నిల్వ ఉంచుకోకండి. డైపర్ లూజ్‌గా ఉన్నా, బిగువుగా ఉన్న చిన్నారి ఇబ్బంది పడుతుంది. అవి వేసుకోవడానికి ఇష్టపడరు. పిల్లల కోమలమైన చర్మానికి సరిపోయేలా ఉండే సున్నితమైన ఉండే డైపర్లు మాత్రమే ఎంచుకోవాలి.

పబ్లిక్ టాయిలెట్స్‌లో హ్యాండ్ డ్రైయర్ వాడుతున్నారా?



చాలామంది రెస్టారెంట్లు లేదా సినిమాలకు వెళ్లినప్పుడు అక్కడి టాయిలెట్లలో చేతులు కడుకున్న తర్వాత హ్యాండ్ డ్రైయర్స్ వాడటం మామూలే. కానీ అలా పబ్లిక్ టాయిలెట్లలోని వాష్ బేసిన్లలో హ్యాండ్ వాష్ తర్వాత... అక్కడి డ్రైయర్లు ఉపయోగించి చేతుల్ని పొడిగా చేసుకోవడం అంత మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు.

కొందరు వైద్యుల సలహా ఏమిటంటే... టాయిటెట్లలో హ్యాండ్‌వాష్ లేదా లిక్విడ్ సోప్‌తో చేతులు కడుక్కన్న తర్వాత అవి ఎంతోకొంత శుభ్రమవుతాయి. కానీ అలా శుభ్రమైన చేతుల్ని కాస్తా అక్కడ హ్యాండ్ డ్రైయర్ కింద పెట్టడం వల్ల మళ్లీ అవి కలుషితమయ్యే అవకాశాలు ఎక్కువన్నది ఆరోగ్యనిపుణుల మాట. ఎందుకంటే అది టాయిలెట్ కావడం వల్ల ఎంత లేదన్నా అక్కడి పరిసరాల్లో సూక్ష్మజీవులు, జెర్మ్స్ వంటివి ఉండనే ఉంటాయి.

ఇలా మనం డ్రైయర్ కింద చేతులు పెట్టినప్పుడు ఆ డ్రైయర్ తాలూకు ఉష్ణోగ్రత పెద్ద ఎక్కువగా ఏమీ ఉండదు. కేవలం చేతుల్ని పొడిబార్చేందుకు ఉద్దేశించినంతే ఉంటుంది. అంతటి గోరువెచ్చటి ఉష్ణోగ్రతలో సూక్ష్మజీవులు అంతరించి పోవనీ, దానికి బదులు అక్కడి గాలిలో ఉండే సూక్ష్మక్రిములు, జెర్మ్స్ మళ్లీ చేతులకు అంటుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. డ్రైయర్‌కు బదులుగా వ్యక్తిగత హ్యాండ్ కర్చీఫ్ వాడటం లేదా అలా స్వతహాగా ఆరిపోయేదాకా వేచి చూడటమే మంచిదని అంటున్నారు. అలాగే కొందరు నిపుణులు చెబుతున్నదేమిటంటే... టాయిలెట్లలోని వాష్ బేసిన్ల దగ్గర ఒకసారి సబ్బుతో చేతులు కడుక్కన్న తర్వాత మళ్లీ అక్కడి ఏ ఉపరితలాన్నీ (సర్ఫేస్‌నూ) తాకకూడదని సూచిస్తున్నారు.

ఎడమ వైపు తిరిగి పడుకోవడం..

ఎడమ వైపు తిరిగి నిద్రపోయే అలవాటు కొందరికి ఉంటుంది. అయితే.. ఇప్పటికే గుండె జబ్బులు ఉన్న వారు ఎడమ వైపు తిరిగి అసలు నిద్రపోకూడదు. ఇలా నిద్రపోవడం వల్ల ఆసిడిటీ రిఫ్లక్స్ తగ్గిపోతుందని కొందరు చెబుతుంటారు. అయితే.. హార్ట్ పేషెంట్స్ మాత్రం ఇలా పడుకోవడం మంచిది కాదని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఎటువైపు తిరిగి పడుకుంటే మంచిదో తెలుసుకుందాం...

ఎప్పుడైతే ఎడమ వైపు తిరిగి నిద్రపోతారో అప్పుడు గుండెపైన ఒత్తిడిపడుతుంది. ఈ ఒత్తిడి కారణంగా గుండె కాస్తంత పక్కకు జరిగినట్టుగా అవుతుంది. అదే సమయంలో గ్రావిటీ కారణంగా కిందకు లాగినట్టుగా అవుతుంది. ఈ రెండింటి మధ్య రాపిడి కారణంగా హృదయ



స్పందనలో మార్పు వస్తుంది. అందుకే..గుండె జబ్బులు ఉన్న వారు వీలైనంత వరకూ ఎడమ వైపు తిరిగి నిద్రపోవడాన్ని అవాయిడ్ చేయాల్సి ఉంటుంది. లేదంటే గుండె జబ్బు లక్షణాలు ఇంకా తీవ్రమవుతాయి.

ఇక కుడి వైపునకు తిరిగి నిద్రపోవడం వల్ల ఎలాంటి ఎఫెక్ట్ ఉంటుందో కూడా తెలుసుకుందాం. ఎప్పుడైతే కుడి వైపు తిరిగి పడుకుంటారో అప్పుడు గుండెపైన ప్రెజర్ ఎక్కువగా పడదు. ఈసీజీలోనూ ఎలాంటి మార్పులు కనిపించవు. అంటే..హార్ట్ రేట్ నార్మల్ గానే ఉన్నట్టు లెక్క. అందుకే హార్ట్ పేషెంట్స్ కుడి వైపునకు తిరిగి నిద్రపోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

మీరు ఏ పొజిషన్‌లో నిద్రపోతున్నారనే విషయంతో పాటు ఎన్ని గంటల పాటు క్వాలిటీ స్లీప్ ఉంటోందన్నదీ ముఖ్యమే. కుడి వైపు తిరిగి పడుకున్నంత మాత్రాన స్లీప్ క్వాలిటీ ఉన్నట్టే అని అనుకోడానికి వీలులేదు. చాలా మంది 5 గంటల పాటు మాత్రమే నిద్రపోతున్నారు. రాత్రంతా మొబైల్ చూసుకుంటూ కూర్చుంటున్నారు. ఉదయమే ఆఫీస్ హడావుడి కారణంగా త్వరగా నిద్రలేవాల్సి వస్తోంది. ఇలా చేయడం వల్ల మెటబాలిజం దెబ్బ తింటుంది. అప్పటి నుంచి సమస్యలన్నీ మొదలవుతాయి. అందుకే.. సరైన విధంగా నిద్ర పట్టేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది.

సాక్షి సినిమా

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో దసరా సందడి ప్రతి ఏడాది కంటే ఈ సంవత్సరం మరింత ఎక్కువగా కనిపించింది. ఈ పండగ సందర్భంగా పలు సినిమాలు ఘనంగా ప్రారంభోత్సవాలు జరుపుకున్నాయి. ఆ చిత్రాల వివరాలేంటే చూద్దాం.


● సుజిత్, నాని, వెంకటేశ్

డిసెంబరులో...


● బాలకృష్ణ

బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్. ఎం. తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు మేకర్స్ తొలుత ప్రకటించారు. తాజాగా డిసెంబరు 5న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

24న ప్రారంభం

బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందిన తొలి చిత్రం 'వీరసింహా రెడ్డి' (2023). వీరి కాంబినేషన్‌లో రానున్న ద్వితీయ చిత్రం 'ఎన్‌బీకే 111' (వర్కింగ్ టైటిల్). వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించనున్న ఈ సినిమా ఈ నెల 24న ప్రారంభం కానుంది.

థ్రిల్‌గా ఉంది


● తేజ

వజ్ర యోగి, శ్రేయా భారతి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'సీ-మంతం'. ఈ క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ మూవీని సుధాకర్ పాణీ దర్శకత్వంలో ప్రశాంత్ టాటా నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ని దర్శకుడు తేజ విడుదల చేశారు. గర్భిణీ మహిళలపై హత్యలు అనేది ఈ చిత్రం ప్రధానాంశమని టీజర్ స్పష్టం చేస్తోంది. ''టీజర్‌లోని బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజువల్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ బాగున్నాయి'' అని తేజ ప్రశంసించారు. ''త్వరలో మా చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

క్లాప్... క్లాప్

వెంకటేశ్ క్లాప్‌తో... నాని హీరోగా 'సాహో, ఓజీ' చిత్రాల ఫేమ్ సుజిత్ దర్శకత్వంలో కొత్త సినిమాకి శ్రీకారం జరిగింది. 'నాని 34' అనే వర్కింగ్ టైటిల్‌తో నాని సొంత నిర్మాణ సంస్థ యునానిమస్ ప్రొడక్షన్స్, నిహారిక ఎంటర్‌టైన్మెంట్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవానికి హీరో వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై, క్లాప్ కొట్టారు. నాని తండ్రి రాంబాబు ఘంటా కెమెరా స్విచ్చాన్ చేయగా, నాని, వెంకట్ బోయనపల్లి కలిసి స్క్రిప్ట్‌ను సుజిత్‌కి అందించారు. ఫస్ట్ షాట్‌కి దర్శకులు రాహుల్ సంకృత్యాన్, శ్రీకాంత్ ఓదెల, శౌర్యువ్ గౌరవ దర్శకత్వం వహించారు. ''యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్‌ని బ్యాలెన్స్ చేస్తూ, నానీని ఎప్పుడూ చూడని పాత్రలో చూపించనున్నారు సుజిత్'' అని వెంకట్ బోయనపల్లి తెలిపారు.


● శ్రీవిష్ణు, రామ్ అబ్బరాజు

కాంబినేషన్ రిపీట్... హీరో శ్రీవిష్ణు, డైరెక్టర్ రామ్ అబ్బరాజు కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'సామజవరగమన' (2023) మంచి విజయం సాధించింది. ఈ కాంబినేషన్‌లో మరో సినిమా ఆరంభమైంది. 'శ్రీ విష్ణు రామ్ అబ్బరాజు 2' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రం రూపొందనుంది. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి హీరో సాయిదుర్గా తేజ్ క్లాప్ కొట్టగా, హీరో నారా రోహిత్ స్క్రిప్ట్‌ని నిర్మాతలకు అందజేశారు. ''హై ఓల్టేజ్ హ్యూమర్ ఎక్కువగా ఉండే కథనంతో ఈ చిత్రం నాన్‌స్టాప్ వినోదాన్ని అందించేలా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది.


● ఐరా, చైతన్యా రావు, సాక్షీ

సరికొత్త ప్రేమ కథ

'ఓనమాలు, మళ్లీ మళ్లీ ఇది రాని రోజు, వరల్డ్ ఫేమస్ లవర్' చిత్రాల ఫేమ్ క్రాంతి మాధవ్ దర్శకత్వంలో కొత్త సినిమా షురూ అయింది. చైతన్యా రావు హీరోగా, ఐరా, సాక్షీ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పూర్ణ నాయుడు, శ్రీకాంత్ .వి నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, డైరెక్టర్ దేవా కట్టా క్లాప్ కొట్టారు. నిర్మాతలు పూర్ణ నాయుడు, శ్రీకాంత్‌లు స్క్రిప్ట్‌ని డైరెక్టర్‌కి అందజేశారు. వర ముళ్లపూడి గౌరవ దర్శకత్వం వహించారు. ''సరికొత్త ప్రేమకథతో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రానుంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఫణి కల్యాణ్, కెమెరా: జ్ఞాన శేఖర్.

ముగ్గురు యువకుల స్నేహం: ప్రేమ్, వాసంతిక జంటగా 'మావా' టైటిల్‌తో సినిమా ఆరంభమైంది. ఏ.ఆర్. ప్రభావ్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ వెంకటేశ్ బాలసాని నిర్మిస్తున్నారు. తొలి సన్నివేశానికి వెంకటేశ్ బాలసాని క్లాప్ ఇవ్వగా, ఆయన సతీమణి పద్మ కెమెరా స్విచ్చాన్ చేశారు. మూవీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సత్య సిరికి గౌరవ దర్శకత్వం వహించారు. ''స్నేహం నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో ముగ్గురు అబ్బాయిల మధ్య ఉండే స్నేహాన్ని అద్భుతంగా చూపించబోతున్నాం'' అని యూనిట్ తెలిపింది.


● ప్రేమ్, వాసంతిక

థ్రిల్లర్ నేపథ్యంలో... అభిరామ్ హీరోగా కొత్త సినిమా ఆరంభం అయింది. అనురాధ దేవి సమర్పణలో అభిరామ్ రెడ్డి దాసరి స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తొలి సన్నివేశానికి భగీరథ కెమెరా స్విచ్చాన్ చేయగా, స్క్రిప్టును ఎస్.ఆర్. అనురాధా దేవికి అందించారు అభిరామ్. లవ్, థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందన్నారు మేకర్స్.

● అభిరామ్


థియేటర్‌పై దాడులు

● కెనడాలోని 'ఫిల్మ్.కా'లో 'ఓజీ, కాంతార చాప్టర్ 1' నిలిపివేత

''ఈ మధ్య రాత్రిపూట మా థియేటర్‌పై రెండు దాడులు జరిగాయి. ఆస్తి నష్టం చేయాలన్నదే ఆ దాడుల ఉద్దేశం. ఎందుకంటే థియేటర్ వెలుపలే ఈ దాడులు జరిగాయి. ఏది ఏమైనా థియేటర్‌కి వచ్చే ప్రేక్షకుల రక్షణను దృష్టిలో ఉంచుకుని, ఈ చిత్రాల ('ఓజీ, కాంతార చాప్టర్ 1') ప్రదర్శనను నిలిపివేస్తున్నాం'' అని కెనడాలోని 'ఫిల్మ్.కా' థియేటర్ సీఈవో జెఫ్ నాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కెనడాలోని ఓక్‌విల్లా ప్రాంతంలో గల 'ఫిల్మ్.కా' థియేటర్‌పై గత నెల 25న, ఈ నెల 2న దాడులు జరిగాయి. మొదటి దాడిలో ఆగంతకులు థియేటర్‌కి నిప్పంటించే ప్రయత్నం చేయగా, రెండో దాడిలో థియేటర్ ప్రవేశ ద్వారం వద్ద కాల్పులు జరిపారు. భారతీయ చిత్రాల ప్రదర్శన సమయంలోనే ఈ దాడులు జరిగాయని, అందుకే ఆ చిత్రాల ప్రదర్శనను నిలిపివేస్తున్నామని థియేటర్ యాజమాన్యం పేర్కొంది. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ 'ఓజీ', రిషబ్ శెట్టి 'కాంతార చాప్టర్ 1' చిత్రాలను ఆపివేశాయి. ''ఈ చిత్రాలను వీక్షించడానికి ప్రేక్షకులు ఆసక్తిగా ఉన్నారని మాకు తెలుసు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో నిలిపివేశాం'' అని నాల్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... వాంకోవర్‌లోని భారత కాన్సులేట్‌ని సీజ్ చేస్తామంటూ కెనడాలోని ఖలిస్తానీ ఉగ్రవాదులు ఇటీవల బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో తాజా దాడుల వెనక ఖలిస్తానీ ఉగ్రవాదుల హస్తం ఉండి ఉంటుందని థియేటర్ యాజమాన్యం అనుమానిస్తోంది. అలాగే సౌత్ ఏషియన్ ఫిల్మ్స్‌ని ప్రదర్శించడం వల్ల కూడా ఈ దాడులు జరిగి ఉండొచ్చనే సందేహాన్ని కూడా వ్యక్తం చేస్తోంది. ఇదిలా ఉంటే... 'ఫిల్మ్.కా'లోనే కాకుండా మరికొన్ని థియేటర్లలో భారతీయ చిత్రాల ప్రదర్శనను నిలిపివేశారని సమాచారం.

ఓయ్ మీసాల పిల్ల!


● నయనతార, చిరంజీవి

'ఓయ్ మీసాల పిల్ల... నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలె పిల్ల...' అంటూ నయనతార కోపం తగ్గించే ప్రయత్నం చేశారు చిరంజీవి. ఆయన హీరోగా, నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో చిరంజీవి, నయనతారలపై 'ఓయ్ మీసాల పిల్ల...' అంటూ సాగే తొలి పాట ప్రోమోని రిలీజ్ చేశారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ పాటని ఉదిత్ నారాయణ్ పాడారు. 2026 సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం విడుదల కానుంది.

మహాశక్తిగా... నయనతార లీడ్ రోల్‌లో సుందర్ సి. దర్శకత్వం వహిస్తున్న తమిళ చిత్రం 'మూకుత్తి అమ్మన్ 2'. 'మహాశక్తి' పేరుతో తెలుగులో విడుదల కానుంది. ఈ చిత్రం నుంచి నయనతార ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీలోనూ 'మహాశక్తి' విడుదల కానుంది.

● సాయికుమార్


సందేశాత్మక అరి

వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అరి'. 'పేపర్ బాయ్' మూవీ ఫేమ్ జయశంకర్ దర్శకత్వంలో రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్‌వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి. శేషురెడ్డి మారంరెడ్డి, నాయుడు నిర్మించారు. ఈ సినిమా ఏషియన్ సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10న విడుదల కానున్నట్లు ప్రకటించారు మేకర్స్. ''అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించే వాణిజ్య అంశాలతో పాటు ఒక మంచి సందేశంతో 'అరి'ని తెరకెక్కించారు జయశంకర్'' అని యూనిట్ పేర్కొంది.

పాన్ ఇండియా ప్రేమ ప్రాబ్లమ్



● షణ్ముఖ్ జస్వంత్

పాపులర్ యూట్యూబర్ షణ్ముఖ్ జస్వంత్ హీరోగా, ఉల్కా గుప్తా హీరోయిన్‌గా రూపొందుతున్న చిత్రం 'ప్రేమకు నమస్కారం'. మహాదేవ నాయుడుగా ఓ పవర్‌ఫుల్ రోల్‌ను శివాజీ పోషిస్తున్నారు. ఈ పాత్రకు సంబంధించిన వీడియోను రిలీజ్ చేశారు. ఈ వీడియోలో 'ఇది పాన్ ఇండియా ప్రేమ ప్రాబ్లమ్' అని షణ్ముఖ్ చెప్పే డైలాగ్ కూడా ఉంది. అనిల్ కుమార్ రావాడ, భార్గవ్ మన్నె నిర్మిస్తున్న ఈ చిత్రానికి వి. భీమశంకర్ దర్శకుడు. ''లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రంలో శివాజీ పాత్రలో కామెడీ, ఎమోషన్, సెంటిమెంట్ ఉంటాయి'' అని దర్శకుడు అన్నారు. ''వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రానున్న చిత్రమిది'' అని నిర్మాత పేర్కొన్నారు.

నవ్వుల్ నవ్వుల్


● కసి రెడ్డి, వైష్ణవి, సప్తగిరి, పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ హీరోగా, వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'పురుష'. వీరు ఉలవల దర్శకత్వంలో బత్తుల కోటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ''వైవిధ్యమైన వినోదంతో రూపొందిన చిత్రమిది. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.


'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 193

శనివారం 4-10-2025




ఉత్తమ లక్షణాలతో.. దీర్ఘాయుష్మాన్‌భవ
-2లో



పైరసీ.. బొమ్మచూపిస్తోంది
-13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఉత్తరాంధ్ర అతలాకుతలం

తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర వణికింది. ఎడతెరిపి లేని భారీ వర్షంతో తడిసిముద్దయింది.

- వివరాలు 12లో ▶



ఆర్థిక స్థిరీకరణ శక్తిగా భారత్

ఆర్థిక ఆంక్షలు–టారిఫ్‌లు ప్రపంచ సరఫరా వ్యవస్థలను మార్చేస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.


- వివరాలు 15లో ▶



మెలోని గారి మన్ కీ బాత్

కుటుంబ కల్లోలాన్ని మనసుపైకి రానివ్వకుండా తిరుగులేని నేతగా ఎదిగిన ఇటలీ తొలి మహిళా ప్రధాని మెలోని ఆత్మకథ విశేషాలు..

- వివరాలు 14లో ▶



యూట్యూబ్‌లో చూసి.. పైరసీ

హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు చిక్కిన సినీ పైరసీదారుడు అశ్వినీకుమార్ విచారణలో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి.

- వివరాలు 13లో ▶

ప్రచారం.. వారమే!

ఎంపీటీసీ, జెడ్పీటీసీల ప్రచారంపై రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు

- రాతపూర్వక అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు వాడొద్దు
- సమావేశాలు, ర్యాలీల నిర్వహణకూ అనుమతి తప్పనిసరి
- కరపత్రాలు, పోస్టర్లు మొదలైన వాటి ముద్రణపైనా ఆంక్షలు
- స్నేహపూర్వక వాతావరణాన్ని దెబ్బతీసేలా వ్యవహరించొద్దు
- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎన్నికల ప్రక్రియే ఆగిపోవచ్చని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్:

రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఈ నెల 9న మండల, జిల్లా పరిషత్ తొలిదశ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుంది. ప్రకటన వెలువడిన రోజు నుంచి మూడు రోజుల్లో నామినేషన్ల దాఖలు ముగియనుంది. ఇక ఉపసంహరణలు పూర్తయ్యాక పోటీలో ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి వారం రోజుల సమయమే కేటాయించారు. ఈ కాలంలో వారు ఓటర్లకు అవగాహన కల్పన, ఎన్నికల ప్రచారానికి, కార్యకర్తలు, ఏజెంట్లకు శిక్షణ ఇచ్చేందుకు ఉపయోగించుకోవచ్చు. అయితే పోలింగ్ ముగియడానికి నిర్ణయించిన సమయానికి 48 గంటల ముందు ఎలాంటి ప్రచారం నిర్వహించడానికి అవకాశం లేదని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

- ➤ రాత పూర్వక అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు వాడొద్దు..అదీ నిర్ణీత సమయం వరకే అనుమతి ఉంటుందని పేర్కొంది.
- ➤ సమావేశాలు, ర్యాలీల నిర్వహణలో ఆయా ప్రదేశాలకు అనుమతి కూడా తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది.
- ➤ అభ్యర్థులు ఉపయోగించే వాహనాల వివరాలు ముందుగానే కలెక్టర్లు, ఎన్నికల అధికారికి తెలియజేయాల్సిఉంటుంది. ప్రచారానికి ఉపయోగించే కరపత్రాలు, పోస్టర్లు మొదలైన వాటి ముద్రణపైనా ఆంక్షలున్నాయని, వీటి ముద్రణదారుల వివరాలు, అడ్రస్ వంటివి తప్పకుండా వాటిపై పేర్కొనాలని తెలిపింది.
- ➤ ప్రచారం నిర్వహించేటప్పుడు నైతికతకు ప్రాధాన్యతనిస్తూ, స్నేహపూర్వక పోటీ వాతావరణాన్ని దెబ్బతీసేలా అభ్యర్థులు వ్యవహరించొద్దని సూచించింది.
- ➤ ఎన్నికల సమయంలో ఎలాంటి అనైతిక కార్యకలాపాలకు తావు లేకుండా అభ్యర్థులు, ఏజెంట్లు, కార్యకర్తలు వ్యవహరించాలని పేర్కొంది.
- ➤ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎన్నికల ప్రక్రియ ఆగిపోవచ్చు. ఓటర్లకు ఏ రకంగానూ లంచం ఇచ్చేందుకు, అనుచిత ప్రవర్తనతో ఓటర్లను బెదిరించడం, భయపెట్టడం, దొంగ ఓట్లను ప్రోత్సహించేలా వ్యవహరించొద్దని ఎస్ఈసీ స్పష్టం చేసింది.
- ➤ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏదైనా వాహనంలో పోలింగ్ కేంద్రానికి ఓటర్లను తీసుకెళ్లేందుకు

మిగతా 12వ పేజీలో ▶



అలయ్‌బలయ్ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో దత్తాత్రేయ ఆలింగనం

సర్వేజనా సుఖినోభవంతే..

భారతీయ సంస్కృతి

అలయ్‌బలయ్ వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

సాక్షి, హైదరాబాద్: భారతీయ సంస్కృతి 'సర్వే జనా సుఖీనోభవంతు'తో ముడిపడి ఉందని గవర్నర్ డా.జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. భారత్‌లో ఒక ప్రాంతం, మరో ప్రాంతం, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి పండుగలు, ఆచారాల వంటివి మారినా భిన్నత్వంలో ఏకత్వం మాదిరిగా సంస్కృతి, సంప్రదాయాలు కలగలిసి పోయాయన్నారు. శుక్రవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అలయ్ బలయ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మార్గదర్శకత్వంలో చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన

మిగతా 13వ పేజీలో ▶



నకిలీ మద్యం తయారీకి టీడీపీ నేత ఏర్పాటు చేసిన ప్లాంటు లోపలి యంత్రాలు

నకిలీ మద్యం.. భారీ ప్లాంట్ గుట్టురట్టు

ములకలచెరువులో కళ్లు చెదిరేలా టీడీపీ నేత అక్రమ సామ్రాజ్యం

పెద్ద పెద్ద డ్రమ్ములు, యంత్రాలు, మోటార్లు వినియోగం

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ శాఖల దాడి
- 35 లీటర్ల సామర్థ్యం కలిగిన 48 క్యాన్లలో నకిలీ మద్యం, 15,024 బాటిళ్లు స్వాధీనం
- 35 లీటర్ల సామర్థ్యమున్న 30 క్యాన్ల స్పిరిట్ గుర్తింపు
- 10 వేలకు పైగా ఖాళీ బాటిళ్లు, మూతలు స్వాధీనం
- ఫ్లేవర్ రసాయనాలు, వివిధ కెమికల్స్ గుర్తింపు
- ఏడు నకిలీ బ్రాండ్లు.. లేబుళ్లు పట్టివేత.. ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాలకు నిత్యం సరఫరా
- తంబళ్లపల్లె టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడు సహా పది మంది అరెస్ట్.. టీడీపీ నేత ఇంట్లో 10 బాక్సుల కేరళ మాల్ట్ మద్యం స్వాధీనం

12లో




చంద్రబాబుతో నకిలీ మద్యం తయారీ ప్లాంట్ నిర్వాహకుడు కట్టా సురేంద్రనాయుడు

ఉత్తమ లక్షణాలతో.. దీర్ఘాయుష్మాన్‌భవ!

మంచి వ్యక్తిత్వ లక్షణాలు ఉన్నవారు మంచివారు అనిపించుకోవడమే కాదు..
దీర్ఘాయుష్మంతులు అని పిలిపించుకునే అదృష్టం కూడా దక్కుతుందట. చురుగ్గా ఉండటం, నలుగురికీ సాయపడే మనస్తత్వం, సమయపాలన, ఏ పనినైనా ఒక పద్ధతి ప్రకారం చేయడం, కష్టపడే వ్యక్తిత్వం, మనస్సాక్షికి అనుగుణంగా నడుచుకునేవారు.. ఈ లక్షణాలు లేనివారితో పోలిస్తే ఎక్కువ కాలం బతుకుతారని జర్నల్ ఆఫ్ సైకోసోమాటిక్ రీసెర్చ్‌లో ప్రచురించిన ఓ పరిశోధన వెల్లడించింది. తరచుగా ఒత్తిడికి గురికావడం, ఆందోళన చెందడం, అసంతృప్తిగా ఉండటం వల్ల జీవితకాలం తగ్గిపోతుందట.

ఆరోగ్యం అనగానే మనకు గుర్తుకొచ్చేవి..
మంచి పోషకాహారం, వ్యాయామాలే. ఇవే దీర్ఘాయుష్షుకు చిట్కాలు అనుకుంటాం. కానీ, కొన్ని విశిష్ట వ్యక్తిత్వ లక్షణాలు కూడా మనం సుదీర్ఘకాలంపాటు ఆరోగ్యంగా బతికేలా చేస్తాయని, మరణ భయాన్ని తగ్గిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి.
చెరపకురా చెడేవు.



సాక్షి, స్పెషల్ డెస్క్

మంచి లక్షణాలతో..

సాధారణంగా రక్తపోటు, కొలెస్ట్రాల్ వంటి వాటి ఆధారంగా వ్యాధులు లేదా రోగాలను అంచనా వేస్తారు. వ్యక్తుల ఆలోచనల తీరు, అనుభూతి చెందుతున్న విధానం, వారి ప్రవర్తన వంటివి.. భవిష్యత్తులో రాబోయే రోగాలు లేదా వ్యాధులను అంచనా వేయడానికి వైద్యులు సాధనాలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయని ప్రముఖ మనస్తత్వవేత్త రెనే మోటస్ తెలిపారు. మనుషులు తమ వ్యక్తిత్వ లక్షణాలను మార్చుకోవడం ద్వారా మరింత ఎక్కువ కాలం బతికేందుకు అవకాశం ఉందని అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయని ఆయన అన్నారు. ఈ నిర్దిష్ట వ్యక్తిత్వ లక్షణాలకు, మరణానికి సంబంధం ఉందని వెల్లడించారు. 'ఆందోళన, నిరాశ, కోపం వంటి ప్రతికూల భావోద్వేగాలను తరచుగా, తీవ్రంగా అనుభవించే ధోరణిని కలిగి ఉండడమే న్యూరోటిసిజం. ఈ లక్షణాలను మార్చడం కష్టం. దీనికంటే వ్యక్తిత్వ లక్షణాలు మార్చడం సులభం. తద్వారా న్యూరోటిసిజం కూడా నయమవుతుంది' అని ఆయన అన్నారు.

అవి వద్దు.. ఇవి ముద్దు

ఆందోళనకర మానసిక స్థితి, ప్రశాంతత లేనివారి ఆయుష్షు రోజురోజుకీ క్షీణిస్తుంటుంది. అలాగే అధిక కొవ్వుతో బాధపడుతున్నవారు, ధూమపానం చేసేవారికి సైతం ముప్పు ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వీరితో పోలిస్తే మనస్సాక్షిని నమ్మి, దానికి అనుగుణంగా పనిచేసేవారిలో.. మెరుగైన ఆరోగ్య నిర్వహణ, అధిక స్వీయ–క్రమశిక్షణ, బాధ్యత, ఉల్లాసభరితమైన జీవితం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు ఉండే అవకాశం ఎక్కువగా ఉందని అధ్యయనం తెలిపింది. విశాల దృక్పథం, స్నేహపూర్వకంగా ఉండే మనస్తత్వం, ఎప్పుడూ ఉల్లాసంగా, చురుగ్గా ఉండటం వంటి లక్షణాలు జీవితకాలాన్ని పెంచుతాయని పేర్కొంది.

వ్యక్తిత్వమూ కీలకమే

'ఆయుష్షు విషయంలో వ్యక్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందని మా పరిశోధనలో తేలింది. కానీ వైద్యరంగం, ప్రపంచం.. ఆరోగ్యం విషయంలో దీనికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇవ్వడం లేదు' అని ఐర్లాండ్‌లోని లిమెరిక్ విశ్వవిద్యాలయంలో మనస్తత్వశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్, నివేదిక సహ రచయిత పారిక్ ఓ సూలివాన్ వ్యాఖ్యానించారు. 'సమయపాలన పాటించేవారు, ఏ పనినైనా పద్ధతిగా చేసేవారు జీవితాన్ని చక్కగా ప్లాన్ చేసుకుంటారు. వీరికి క్రమశిక్షణతో కూడిన దినచర్య ఉంటుంది. సమయాన్ని అనవసర విషయాలకు వ్యర్థం చేయడం వీరికి నచ్చదు. అందువల్ల ఆరోగ్య సంబంధ విషయాల్లోనూ వీరు మిగతావారితో పోలిస్తే మరింత జాగ్రత్తగా ఉండే అవకాశం ఉంటుంది. తద్వారా వీరు మిగతావారికంటే ఎక్కువ కాలం జీవించడానికి కూడా అవకాశాలు ఎక్కువగా ఉంటాయి' అని అన్నారు.

28 ఏళ్లపాటు అధ్యయనం

- పరిశోధనలో 22,000 మంది పాలుపంచుకున్నారు. 6 నుంచి 28 ఏళ్లపాటు వీరిపై అధ్యయనం చేశారు. వ్యక్తిత్వ లక్షణాలను మరణానికి అనుసంధానించిన ఈ అధ్యయనంలో.. పరిశోధకులు ప్రధాన వ్యక్తిత్వ లక్షణాలను పరిశీలించి వీరి మరణ కాలాలను అంచనా వేశారు.
- మనస్సాక్షికి విలువ ఇచ్చి, అందుకు అనుగుణమైన విశిష్ట వ్యక్తిత్వ లక్షణాలు ఉన్నవారు.. ఈ లక్షణాలు లేనివారితో పోలిస్తే వేగంగా చనిపోయే అవకాశాలు 15శాతం తక్కువ.
- సమయపాలన పాటిస్తూ, ఏ పనినైనా ఒక పద్ధతిగా చేసే లక్షణాలున్న వారు.. తొందరగా మరణించే అవకాశం 14 శాతం తక్కువ.
- బాధ్యతాయుతంగా ఉండే వ్యక్తులూ ఎక్కువ కాలం బతుకుతారు. బాధ్యతారాహిత్యంతో ఉండేవారితో పోలిస్తే వీరు వేగంగా మరణించే అవకాశాలు 12 శాతం తక్కువ.
- కష్టపడి పనిచేసే మనస్తత్వం లేదా లక్షణాలు ఉన్నవారిలో మరణ అవకాశాలు 15 శాతం తక్కువ.

క్లుప్తంగా...

స్వగ్రామంలో డీజీపీ దసరా వేడుక



ఉత్సవాల్లో పాల్గొన్న డీజీపీ శివధర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి గురువారం రాత్రి స్వగ్రామం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్‌లోని స్వగృహంలో విజయదశమి వేడుకలు జరుపుకొన్నారు. స్థానికులతో కలిసి శమీ చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు మీనాక్షి రాక

స్థానిక ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై భేటీలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ శనివారం హైదరాబాద్ రానున్నారు. మధ్యాహ్నం తర్వాత.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకోనున్న ఆమె ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో బస చేస్తారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ దఫా పర్యటనలో భాగంగా ఆమె స్థానిక ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై పార్టీ నేతలతో చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఈనెల ఆరో తేదీన జరగ నున్న టీపీసీసీ స్క్రీనింగ్ కమిటీ భేటీకి ఆమె హాజరవుతారని సమాచారం. ఈనెల ఐదో తేదీకల్లా జిల్లాల నుంచి రానున్న జెడ్పీటీసీ అభ్యర్థిత్వాల వడపోతలో పాలు పంచుకోనున్నారని సమాచారం.

సీఐ సమక్షంలో జంతుబలి

నర్సంపేట రూరల్: దసరాను పురస్కరించుకొని గురువారం సాయంత్రం వరంగల్ జిల్లా నర్సంపేటలో టౌన్ సీఐ సమక్షంలో జంతుబలి జరగడం చర్చనీయాంశమైంది. వివరాలివి. ఈ ఏడాది దసరా పండుగ రోజే గాంధీ జయంతి కూడా వచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా మద్యం, మాంసం క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. నర్సంపేట బొడ్రాయి కమిటీ, గ్రామపెద్దల ఆధ్వర్యంలో జంతుబలివ్వడం ఆనవాయితీ. అయితే, బందోబస్తు నిమిత్తం టౌన్ సీఐ రఘుపతిరెడ్డి అక్కడే ఉన్నారు. ఆ సమయంలో జంతు బలిచ్చారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కలెక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు తెలిసింది. కాగా, జంతుబలి చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రపంచ ఫ్యాక్టరీగా భారత్

బొమ్మల నుంచి యుద్ధ ట్యాంకుల వరకు మన దగ్గరే తయారీ

- ఆర్థిక వ్యవస్థలో జైన సముదాయ వాటా అసాధారణం
- 0.5 శాతం ఉన్న జైనుల నుంచి 24 శాతం వాటా వస్తోంది
- 'జిటో కనెక్ట్–2025' మూడు రోజుల సదస్సు ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



వేదికపై నవ్వులు చిందిస్తున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, యోగా గురువు రాందేవ్ బాబా

సాక్షి, హైదరాబాద్: బొమ్మల నుంచి యుద్ధ ట్యాంకుల వరకు అన్నీ భారత్‌లోనే తయారవుతున్నాయని, మన దేశం ప్రపంచ ఫ్యాక్టరీగా ఎదిగే రోజు ఎంతో దూరంలో లేదని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ప్రారంభమైన 'జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జిటో) కనెక్ట్ 2025'మూడు రోజుల సదస్సును కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థలో జైన సముదాయ వాటా అసాధారణమన్నారు. దేశ జనాభాలో జైన సముదాయం కేవలం 0.5 శాతం ఉన్నా, మొత్తం పన్ను సేకరణలో వారి సహకారం 24 శాతంగా ఉందని చెప్పారు. కఠిన శ్రమ, సంపన్నతకు ప్రపంచవ్యాప్తంగా జైన సమాజం గుర్తింపు పొందిందని ప్రశంసించారు. జైన సముదాయ తాత్వికత భారతీయ సంస్కృతిలో లోతుగా పాతుకుపోయి ఉందని, దాని చరిత్ర భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రయాణంలో అమూల్యమైన పాఠమని పేర్కొన్నారు. ఫార్మా, ఏవియేషన్, విద్యా రంగాల్లో జైన సముదాయం ముందంజలో ఉందని తెలిపారు. 'పురాతన తీర్థంకరుల నుంచి ఆధునిక కాల నాయకుల వరకు, జైన సిద్ధాంతం భారతదేశ నైతిక, ధార్మిక ఆకృతిని రూపొందించింది. జైన సముదాయ ముద్ర ప్రతిచోటా కనిపిస్తుంది. జైనుల వ్యవస్థాపక ఉత్సాహం సవాళ్లను అవకాశాలుగా మార్చి, ఉద్యోగాలను సృష్టించడంతోపాటు వృద్ధిని పెంపొందించి, తద్వారా సమాజ ఉద్ధరణలో తన వంతు పాత్ర పోషించింది. జైన యువత అవకాశాలను స్వీకరించి జైన మత సూత్రాలకు అనుగుణంగా స్థిర, సమగ్ర, ప్రభావవంతమైన వ్యాపారాలను నిర్మించి 2047 నాటికి వికసిత్ భారత్‌కు సహకరించాలి'అని రాజ్‌నాథ్‌సింగ్ విజ్ఞప్తి చేశారు.

విలువలతో కూడిన వృద్ధికి చిరునామా: శ్రీధర్‌బాబు
తెలంగాణ విలువలతో కూడిన వృద్ధికి చిరునామాగా నిలుస్తూ దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అత్యంత అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. ఒకప్పుడు పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాలిచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలను చూసే పెట్టుబడులు పెట్టేవారన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇప్పుడు వారి ఆలోచన తీరు కూడా మారిందని చెప్పారు. జైన సమాజం సేవా స్ఫూర్తిని, తెలంగాణలో ఆవిష్కరణల వాతావరణంతో అనుసంధానిస్తే ప్రపంచం కోరుకుంటున్న నైతిక వృద్ధి నమూనా ఆవిష్కృతం అవుతుందని చెప్పారు.రెండేళ్లకో మారు రొటేషన్ ప్రాతిపదికన జరిగే జిటో సదస్సు ఈసారి హైదరాబాద్‌లో జరుగుతుండగా, ప్రపంచ నలుమూలల నుంచి 50 వేలకుపైగా ప్రతినిధులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, యోగాగురువు రాందేవ్ బాబా, జిటో హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధులు రోహిత్ కొఠారి, లలిత్ చోప్రా, విశాల్ అంచాలియా, జిటో కన్వీనర్ బీఎల్ భండారీ, సుశీల్ తదితరులు పాల్గొన్నారు. కాగా జిటో సదస్సుకు వచ్చిన రాజ్‌నాథ్ సింగ్‌కు బేగంపేట విమానాశ్రయంలో స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఉన్నారు.



కొండారెడ్డిపల్లిలో తన మనవడు రేయాన్‌ను ఒడిలో కూర్చోబెట్టుకుని శమీ శ్లోకాన్ని రాస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్ ప్రజల రుణం తీర్చుకుంటా

దసరా వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- స్వగ్రామంలోనూ పూజల్లో పాల్గొన్న సీఎం

సాక్షి, నాగర్‌కర్నూల్/కొడంగల్: తనకు అండగా నిలిచిన కొడంగల్ ప్రజల రుణం తీర్చుకుంటానని, అన్నివిధాలా అండగా ఉంటానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. దసరా పండుగను పురస్కరించుకొని ఆయన ముందుగా కొండారెడ్డిపల్లిలో గురువారం పర్యటించారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని తన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులు, బంధువులతో కాసేపు గడిపారు. సాయంత్రం 6 గంటలకు తన ఇంటి నుంచి గ్రామంలోని మైసమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న జమ్మి చెట్టు వద్దకు గ్రామస్తులతో కలసి కాలినడకన బయలుదేరారు. కుటుంబసభ్యులు, ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కుందూరు జయవీర్‌రెడ్డితో కలసి శమీ పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటల సమయంలో రోడ్డుమార్గంలో కొడంగల్‌కు బయలుదేరారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కొడంగల్‌లో సీఎంను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం పట్టణానికి చెందిన వక్ఫ్ బోర్డు సభ్యుడు మహ్మద్ యూసుఫ్ ఆహ్వానం మేరకు సీఎం మధ్యాహ్నం ఆయన ఇంటికి వెళ్లి భోజనం చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సీఎం కొడంగల్ నుంచి హెలికాప్టర్‌లో బయలు దేరి హైదరాబాద్‌కు వెళ్లారు.

దసరా పూజలో డిప్యూటీ సీఎం

స్వగ్రామంలో గృహ ప్రవేశం చేసిన రెవెన్యూ మంత్రి పొంగులేటి



మధిరలో జరిగిన శమీ పూజలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి–నందిని దంపతులు



పొంగులేటితో మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే కనకయ్య, దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, విజయ్, స్వర్ణ

మధిర/కల్లూరురూరల్: విజయదశమి పర్వదినం సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లా మధిరలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన తన సతీమణి నందినితో కలిసి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆయుధ, వాహన పూజల్లో కూడా పాల్గొన్నారు. ఆపై మధిరలోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామిఆలయంలో జరిగిన శమీ పూజకు హాజరయ్యారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కార్పొరేషన్ చైర్మన్లు నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నారాయణపురంలో..

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురంలో దసరా సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం కొత్తగా నిర్మించిన ఇంట్లో గృహ ప్రవేశం చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, డాక్టర్ తెల్లం కనకయ్య, కార్పొరేషన్ల చైర్మన్లు మువ్వా విజయబాబు, రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్లోబల్ టాప్ 2 శాతం సైంటిస్టుల జాబితాల్లో ఐఐటీహెచ్

స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, ఎల్సీవీయర్ వెల్లడి



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: గ్లోబల్ టాప్ 2 శాతం సైంటిస్టుల జాబితాలో హైదరాబాద్ ఐఐటీ (భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ) ప్రొఫెసర్లు సత్తా చాటారు. అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, ఎల్సీవీయర్ సంయుక్తంగా ఈ సైంటిస్టుల జాబితాను విడుదల చేసింది. రెండు విభాగాల్లో 31 మంది ప్రొఫెసర్లు 46 స్థానాలను దక్కించుకున్నారు. కెరీర్ – లాంగ్ రీసెర్చ్ ఇంపాక్ట్ విభాగంలో 17 మంది ప్రొఫెసర్లు, సింగిల్ – ఇయర్ రీసెర్చ్ ఇన్‌ఫ్లుయెన్స్ విభాగంలో 29 మంది ప్రొఫెసర్లకు స్థానం లభించింది. ఈ ప్రపంచ స్థాయి ర్యాంకింగ్‌లో శాస్త్రవేత్తలను సైటేషన్లు, హెచ్–ఇండెక్స్, సహ – రచయితల ఆధారంగా జాబితాలను రూపొందిస్తారు. పరిశోధనలు, నూతన ఆవిష్కరణల్లో ఐఐటీ హైదరాబాద్.. జాతీయ స్థాయిలో ముందు వరుసలో ఉంటోంది. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐఐటీహెచ్ గ్లోబల్ రీసెర్చ్ హబ్‌గా మరింత ఉన్నత స్థాయికి ఎదిగిందనడానికి ఈ గుర్తింపే నిదర్శనమన్నారు. ఈ ర్యాంకింగ్‌లు అధ్యాపకుల ప్రతిభ, అంకితభావాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు.

ఎర్రవల్లిలో కేసీఆర్ ఆయుధ పూజ

విదేశీ పర్యటనకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ఎర్రవల్లిలో జరిగిన దసరా వేడుకల్లో మాజీ సీఎం కేసీఆర్. చిత్రంలో కేటీఆర్, ఆయన కుమార్తె అలేఖ్య

సాక్షి, హైదరాబాద్: దసరా పండుగ సందర్భంగా బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి నివాసంలో ప్రత్యేక పూజలు చేశారు. దుర్గామాతకు పూజలు చేయడంతో పాటు ఆయుధ పూజలో పాల్గొన్నారు. కేసీఆర్ భార్యతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దంపతులు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా కేటీఆర్ మూడు రోజుల వ్యక్తిగత పనుల మీద శుక్రవారం విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటనలో ఆయన తన కుమార్తె అలేఖ్య కాలేజీ విద్య కోసం పలు కాలేజీలను పరిశీలిస్తారని సమాచారం. విదేశీ పర్యటన ముగించుకుని ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకోనున్న కేటీఆర్ సోమవారం నుంచి తిరిగి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి.

జీఎస్టీ జోరుకు కళ్లెం

ఐదు నెలలు ఆశాజనకం.. సెప్టెంబర్‌లో 5 శాతం తగ్గిన ఆదాయం

- 2024 సెప్టెంబర్‌లో 5,267 కోట్లు.. 2025 సెప్టెంబర్‌లో రూ.4,998 కోట్లు
- దేశవ్యాప్తంగా రాబడులు పెరిగినా రాష్ట్రంలో లోటు



సాక్షి, హైదరాబాద్: ఐదు నెలలుగా జోరు మీద ఉన్న వస్తు సేవల పన్ను (జీఎస్టీ)కు కళ్లెం పడింది. ఇటీవల కేంద్రం విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2025 సెప్టెంబర్‌లో తెలంగాణ జీఎస్టీ రాబడులు రూ.4,998 కోట్లకు పరిమితమయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.5వేల కోట్లకు తక్కువగా జీఎస్టీ ఆదాయం నమోదు కావడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. గత ఏడాది సెప్టెంబర్‌తో పోల్చినా ఇది తక్కువే. 2024 సెప్టెంబర్‌లో రూ.5,267 కోట్లు జీఎస్టీ ఆదాయం రాగా, ఈసారి అంతకంటే రూ.269 కోట్లు (5 శాతం) తక్కువగా వచ్చిందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దేశమంతా రాబడులు పెరిగినా తెలంగాణలో తక్కువగా రావడం గమనార్హం. దేశంలో రెండు, మూడు రాష్ట్రాల్లో మాత్రమే ఈ ఏడాది సెప్టెంబర్‌లో జీఎస్టీ ఆదాయం పడిపోయింది. మణిపూర్ (1 శాతం), ఢిల్లీ (1 శాతం), హిమాచల్‌ప్రదేశ్ (4శాతం)లో రాబడులు తగ్గాయి. మధ్య ప్రదేశ్‌లో 21 శాతం, బిహార్‌లో 17, ఉత్తరప్రదేశ్‌లో 11, రాజస్తాన్‌లో 10 శాతం మేర జీఎస్టీ పెరిగింది. దక్షిణాది విషయానికొస్తే కేరళలో 13 శాతం, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో (4 శాతం), కర్ణాటకలో 7 శాతం జీఎస్టీ పెరిగింది. కానీ, తెలంగాణలో మాత్రం గత సెప్టెంబర్‌తో పోలిస్తే ఈ సెప్టెంబర్‌లో తక్కువ ఆదాయం వచ్చింది.

ఆగస్టు వరకూ పైపైకే...:
ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ మినహాయిస్తే మిగిలిన ఐదు నెలల జీఎస్టీ రాబడులు రాష్ట్రంలో ఆశాజనకంగానే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే వరుసగా ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకూ పెరుగుతూనే ఉన్నాయి. అయితే, ఈ ఏడాదిలో చూస్తే మాత్రం ప్రతి నెలా (ఒక్క జూలై మినహా) తగ్గుతూనే ఉన్నాయి. 2025లో ఏప్రిల్‌లో అత్యధికంగా రూ. 6,983 కోట్లు వచ్చిన జీఎస్టీ రాబడులు ఆ తర్వాతి నెలలో రూ.5,310 కోట్లకు పడిపోయాయి. జూన్‌లోనూ అంతకంటే తక్కువగా నమోదు కాగా, జూలైలో మాత్రం రూ.300 కోట్ల పెరుగుదల కనిపించింది. ఇక, ఆగస్టు, సెప్టెంబర్‌లో మళ్లీ తగ్గుదలే నమోదైంది.

రెండేళ్లుగా జీఎస్టీ గణాంకాలు (రూ.కోట్లలో)

సంవత్సరం	ఏప్రిల్	మే	జూన్	జూలై	ఆగస్టు	సెప్టెంబర్	మొత్తం
2024	6,236	4,986	4,716	4,940	4,569	5,267	30,714
2025	6,983	5,310	5,111	5,417	5,103	4,998	32,922

కారణాలేంటి?

దేశవ్యాప్తంగా జీఎస్టీ రాబడులు పెరగ్గా.. రాష్ట్రంలో మాత్రం తగ్గేందుకు కారణాలేంటన్న దానిపై వాణిజ్య వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, జీఎస్టీ అధికారులు మాత్రం ఇందుకు చెప్పుకోదగిన కారణాలేవీ లేవని, సాంకేతిక కారణాలతోనే అలా జరిగి ఉంటుందని అంటున్నారు. ఈ తగ్గుదల యాదృచ్ఛికమేనని చెబుతున్నారు. తెలంగాణలో లగ్జరీ వస్తువుల వినియోగం ఎక్కువగా ఉంటుందని, సెప్టెంబర్ రిటర్న్స్ వచ్చే నెలలో ఆ వస్తువుల కొనుగోళ్లు తగ్గి ఉండటం, కేంద్రం నుంచి వచ్చిన పాత బకాయిలు, పరిహారం లాంటివి ఇతర రాష్ట్రాలకు ఎక్కువగా వచ్చి ఉండొచ్చని, లేదంటే ఆయా రాష్ట్రాల్లో పెద్ద స్థాయిలో వచ్చిన డిమాండ్ ఈనెలలో కార్యరూపం దాల్చి ఉంటుందని అంటున్నారు. అంతేతప్ప జీఎస్టీ రాబడుల్లో తెలంగాణలో ప్రత్యేక తగ్గుదల లేదని వారు చెబుతుండటం గమనార్హం.

సాక్షి
శనివారం, 4 అక్టోబర్ 2025

ఎన్సీఆర్బీ చాటుతున్న నిజం

కేంద్ర హోం శాఖ పర్యవేక్షణలో జాతీయ క్రైం రికార్డుల బ్యూరో(ఎన్సీఆర్బీ) వెలువరించే నివేదికలు రెండు విధాల కీలకమైనవి. ఆ నివేదికలు మన సమాజం తీరుతెన్నులకు అద్దం పడతాయి. అదే సమయంలో పాలకుల సమర్థతకో, వైఫల్యాలకో ఆనవాళ్లుగా నిలుస్తాయి. మూడు రోజులనాడు విడుదల చేసిన 2023 నాటి ఎన్సీఆర్బీ నివేదికలోని గణాంకాలు దిగ్భ్రమ కలిగించేలా ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీ జాతీయ నేర రాజధానిగా కూడా ఉన్నదని నివేదిక చెబుతోంది. అక్కడ ప్రతి లక్షమంది జనాభాకూ 1,508.9 నేరాలు జరుగుతున్నాయి. 721.7 నేరాలతో కేరళ రెండో స్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో వరసగా హరియాణా, తెలంగాణ, ఒడిషా ఉన్నాయి. జాతీయ స్థాయిలో వివిధ నేరాల శాతం పెరిగితే ఆంధ్రప్రదేశ్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో 2023లో అవి గణనీయంగా తగ్గాయని నివేదికను విశ్లేషిస్తే అర్థమవుతుంది.

తాజా నివేదిక ఆంధ్రప్రదేశ్లో ప్రస్తుతం ఏలుబడి సాగిస్తున్న ఎన్డీయే కూటమి పక్షాల నీతిబాహ్యతనూ, వంచననూ బజారుకీడ్చింది. జగన్ అయిదేళ్ల పాలనలో విపక్షాలుగా ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేనలు మైకు దొరికింది తడవుగా అబద్ధాలు వల్లెవేయటం అలవాటుగా చేసుకున్నాయి. ఏపీ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలుకొని జనసేన నేత పవన్ కల్యాణ్, బీజేపీ నాయకురాలు పురందేశ్వరి వగైరాలు గూడుపుఠాణి అయి ఒక పద్ధతి ప్రకారం ప్రజలను పక్కదోవ పట్టించారు. వీరికి యెల్లో మీడియా ఇతోధికంగా సహకరించింది. రైతుల ఆత్మహత్యలు ఎక్కువయ్యాయనీ, కల్తీ మద్యం మృతులు అపారంగా పెరిగిపోయారనీ, మహిళలు, బాలికల అదృశ్యం కేసుల సంఖ్య ఆందోళనకర స్థాయిలో ఉన్నదనీ తప్పుడు లెక్కలు వల్లెవేశారు. వాలంటీర్లే మహిళలూ, బాలికలూ మాయం కావటానికి కారణమని కూడా పవన్ దుష్ప్రచారం చేశారు. కేంద్ర ఇంటెలిజెన్స్ అధికారి ఒకరు ఈ విషయం తనకు చెప్పాడని దబాయించారు. ఏకంగా 34,000 మంది ఆచూకీ లేకుండా పోయారని ఆయన చేసిన ఆరోపణ పూర్తిగా అవాస్తవమనీ, కల్తీ మద్యం మృతులు అసలు లేనేలేరనీ నివేదిక తేటతెల్లంచేసింది. ఏదో ఒకరోజు నిజానిజాలు నిగ్గుతేలుతాయనీ, అప్పుడు దోషులుగా మిగిలిపోతామనీ వీరిలో ఏ ఒక్కరికీ అనిపించలేదంటే ఆశ్చర్యం కలుగుతుంది.

ఎప్పట్లాగే జాతీయ స్థాయిలో నేరాల సంఖ్య పెరిగిందని నివేదిక చెబుతోంది. ప్రతి లక్ష జనాభాకు 2022లో 422.2 నేరాలు జరిగితే, 2023కు అది 448.3కు ఎగబాకింది. సైబర్ క్రైం కేసులు 31.2 శాతం పెరిగితే, పిల్లలపై నేరాలు అంతక్రితంతో పోలిస్తే 9.2 శాతం మేరకు అధికమయ్యాయి. జగన్ ప్రభుత్వ హయాంలో ఏపీలో అన్ని రకాల నేరాలూ గణనీయంగా తగ్గాయి. హింసాత్మక ఘటనలూ, హత్యలూ, అపహరణలూ మాత్రమే కాదు... మహిళలు, బాలికలపై నేరాలు తగ్గాయి. దేశవ్యాప్తంగా సైబర్ క్రైం కేసులు, ఆర్థిక నేరాలు పెరిగితే ఏపీలో అవి నియంత్రణలో ఉన్నాయి. అలిగివెళ్లిన లేదా అపహరణలకు గురైన బాల బాలికల కేసుల్లో 85.7 శాతం మందిని పోలీసులు సురక్షితంగా వారి వారి తల్లిదండ్రుల దగ్గరకు చేర్చగలిగారు. జాతీయ స్థాయిలో ఇది 54 శాతం మాత్రమే. నేరాలకు పాల్పడేవారిపై సత్వరం తీసుకునే చర్యలవల్ల వాటి నియంత్రణ సాధ్యమవుతుందంటారు నిపుణులు. నేరం జరిగిన రెండు నెలల్లో న్యాయస్థానంలో చార్జిషీటు దాఖలు చేయటం పోలీసుల సమర్థతకు నిదర్శనం. ఆ పని జగన్ హయాంలో జరిగింది. 91.6 శాతం కేసుల్లో గడువులోగా చార్జిషీట్లు దాఖలు చేసి దేశంలోనే మూడో స్థానంలో ఉంది. జగన్ సర్కారు రూ. 15 లక్షల కోట్లు అప్పుచేసిందని బీజేపీ నేత పురందేశ్వరి చేసిన ప్రచారం పూర్తిగా అబద్ధమని అప్పట్లోనే కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. నేరాల విషయంలో సైతం వారివి తప్పుడు మాటలేనని తాజాగా రుజువైంది. నిజం బయటికొచ్చేలోగా అబద్ధం లోకాన్ని చుట్టేస్తుందని నానుడి. ఏణ్ణర్థం క్రితం అబద్ధాలు, వంచనలతో అధికారానికి ఎగబాకిన ఎన్డీయే కూటమి నిజ స్వరూపాన్ని ఇన్నాళ్లకు ఎన్సీఆర్బీ నివేదిక బట్టబయలు చేసింది. ముద్దాయిలుగా బోనులో నిలబడాల్సిన ఈ నేతలు ఇప్పుడు 'తగుదునమ్మా' అంటూ సైబర్ నేరాలకింద దాదాపు 2,000 మంది సామాన్యుల్ని తప్పుడు కేసుల్లో ఇరికిస్తుండటం ఒక వైచిత్రి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.ద్వాదశి ప.1.58 వరకు తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ధనిష్ఠ ఉ.7.01 వరకు తదుపరి శతభిషం, **వర్జ్యం:** ప.2.08 నుండి 3.43 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.48 నుండి 7.29 వరకు, **అమృత ఘడియలు:** రా.11.40 నుండి 1.15 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.47
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

పని ఇవ్వండి



కార్మికులు నిరుద్యోగులుగా ఎంత ఎక్కువ కాలం ఉంటే, వారి నైపుణ్యాలు అంతగా క్షీణిస్తాయి. వారు తమ శ్రమశక్తి పట్ల అనుబంధాన్ని కోల్పోయే ప్రమాదం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ చైతన్యాన్ని కోల్పోయి, శాశ్వతంగా దెబ్బ తింటుంది.

– జెరోమ్ పావెల్, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్

నాన్న నాన్నే!



మా నాన్నగారు పూర్తిగా వేరే తరానికి చెందిన వారు. మా జీవితాలను సౌకర్యవంతంగా మార్చడానికి ఆయనకు తన కెరీర్ అంతా కష్టపడటానికే సరిపోయింది. అందుకే ఇప్పటి తండ్రీ కొడుకుల మధ్య ఉన్నట్లుగా మా మధ్య స్నేహం లాంటిది ఉండదు.

– బాబీ డియోల్, నటుడు

ఒకేలా ఉండదు



నేను ఎప్పుడూ ఒకే చోట ఎక్కువసేపు ఉండలేను. ఒక సెట్ నుంచి ఇంకొక సెట్కి తిరుగుతాను. ఒక సెట్లో అద్భుతమైన స్నేహితులు దొరుకుతారు. మరొక సెట్లో పూర్తి ఒంటరిగా ఉండిపోవాల్సి వస్తుంది. జీవితం అనే సెట్లోకి మాత్రం నేనింకా ప్రవేశించలేదు.

– సిడ్నీ స్వీనీ, అమెరికన్ యువ నటి

అప్పుల పెళ్లిళ్లు



డబ్బు సంపాదించడం చాలా కష్టం. కానీ పెళ్లిళ్లలో డబ్బు విపరీతంగా ప్రవహిస్తుంది! పెళ్లనేది అసలు విలాసవంతంగా ఎందుకు ఉండాలి? లేని వాళ్లు అప్పులు తెచ్చి పెళ్లి చేస్తారు. ఉన్నవాళ్లు పెళ్లి చేసి అప్పుల పాలు అవుతారు. ఈ ధోరణి మారాలి.

– అంగద్ బేడీ, నటుడు

ప్రార్థన



ఉగ్రవాదం అనేది ప్రపంచ వ్యాప్త ప్రతిస్పందన అవసరమయ్యే ఒక మహమ్మారి. ఇటువంటి దారుణమైన హింసాత్మక చర్యలను ఎప్పటికీ సమర్థించలేము.

– అనా టబాన్, ఇండియాకు మాల్డోవా రాయబారి

సహోదరులు



ఒక ప్రెస్ కాన్ఫరెన్స్లో ఎవరో నా దగ్గరకు వచ్చి, నా చెవిలో గుసగుసగా... "నువ్వు ఇప్పుడు ఒక పాట పాడాలి. నీ పాటలు ఇండియా–పాకిస్తాన్ సంబంధాలను మెరుగుపరుస్తాయి" అన్నారు. నేను అలీ జాఫర్ను (పాక్ గాయకుడు) కాదని అతడిని నమ్మించాల్సి వచ్చింది.

– అలీ ఫజల్, నటుడు, 'మీర్జాపూర్' ఫేమ్

స్వదేశీ అమలుకు అడ్డంకేమిటి?

విశ్లేషణ



టంకశాల అశోక్

'స్వదేశీ' అనే గొప్ప నినాదాన్ని స్వాతంత్ర్యోద్యమ కాలంలో అప్పటి నాయకులు ఒకసారి ఇచ్చారు. స్వాతంత్ర్యాన్ని సాధించుకుని కొన్ని దశాబ్దాలు గడిచిన తర్వాత ప్రస్తుత నాయకత్వం మరొకసారి ఇస్తున్నది. ఆ నినాదం పారిశ్రామిక వర్గాలను గానీ, సమాజాన్ని గానీ అపుడెట్లా ఉత్తేజపరిచింది, ఇపుడెట్లా చేస్తున్నది? ఆ దరిమిలా నినాదపు అమలు అపుడెట్లా జరిగింది, ఇపుడెట్లా జరుగుతున్నది? ఇందుకు సమాధానాన్ని మామూలు పద్ధతిలో వెతికి అపుడు గొప్పగా ఉండేదనీ, ఇపుడు ఆశించిన ఫలితాలు లేవనీ ప్రభుత్వాన్ని విమర్శించవచ్చు. కానీ అది విషయాలను సమగ్ర దృష్టితో పరిశీలించి చేసే విమర్శ కాబోదు. ఎందుకంటే, స్వాతంత్ర్యోద్యమ కాలపు స్వదేశీ నినాద స్ఫూర్తి లోపించటం స్వాతంత్ర్యం లభించిన తర్వాత కాంగ్రెస్ పాలనా కాలం నుంచే మొదలై, ప్రస్తుత బీజేపీ పాలన వరకు కూడా కొనసాగుతున్నది. ఎందుకన్నది ప్రశ్న. ఆ స్ఫూర్తి తిరిగి రావటం ఎట్లాగన్నది విషయం.

బెంగాల్ విభజన కాలంలో...

చర్చలోకి వెళ్లేముందు ఈ రెండు సందర్భాలలో 'స్వదేశీ' భావనల నేపథ్యం కొంత చూడాలి. ఆ మాట మొదటిసారిగా బ్రిటిష్ వలస పాలనా కాలంలో అప్పటి వైస్రాయ్ లార్డ్ కర్జన్ బెంగాల్ ప్రావిన్స్ను 1905లో రెండుగా విభజించినపుడు అందుకు నిరసనగా అక్కడి నాయకులు, సమాజం ముందుకు తెచ్చినటువంటిది. వారు బ్రిటన్కు సంబంధించిన అన్నింటిని బహిష్కరించి హింసాత్మక ఉద్యమం సాగించగా విభజన రద్దయింది. తర్వాత కాన్ఫ్లోకు ఉద్యమ ప్రవేశం చేసిన గాంధీజీ ఆ నినాదానికి కొత్త అజెండాను రూపొందించారు. ప్రస్తుతం మనం అంటున్న స్వదేశీ నినాదానికి మూలాలు ఆయన అజెండాలో ఉన్నాయి. అందులో భాగంగా ఆయన ప్రజలకు బోధించింది ఆర్థిక స్వావలంబన, స్వయం సమృద్ధి, స్థానిక ఉత్పత్తుల వాడకం, అందుకు అవసరమైన వృత్తి నైపుణ్యాల అభివృద్ధి, వీటన్నింటికి సమాంతరంగా విదేశీ వస్తు బహిష్కరణ. ఆ కాలంలో టాటా, బిర్లా వంటి భారీ పారిశ్రామిక సంస్థలు ఒక మేర బ్రిటిష్ కంపెనీల సహకారంతో నడిచినప్పటికీ, మరొకవైపు గాంధీజీ నినాదం ప్రజల స్థాయిలో ఒక ఉద్యమంగా సాగింది. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ ప్రభుత్వాలు పారిశ్రామికాభివృద్ధి కోసం ప్రయత్నించటం అవసరమే అయినా, అందుకు సమాంతరంగా ఖాదీ గ్రామీణోద్యోగ రంగాన్ని కొంతకాలం మొక్కుబడిగా నడిపి దిక్కులేనిదిగా వదిలారు. పారిశ్రామిక రంగం క్రమంగా స్వదేశీ – విదేశీ మిశ్రమంగా మారింది. ప్రజలలో సైతం గత కాలపు స్ఫూర్తి అంతరించి విదేశీ ఉత్పత్తుల పట్ల మోజు పెరుగుతూ పోయింది.



◆ దీనర్థం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ పెనవేసుకు పోయిన స్థితిలో ఒంటరితనంగా ఎదగాలని కాదు. మారుతున్న పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా పునర్నవీకరణ జరుగుతూనే, మౌలిక స్థాయిలో స్వదేశీ, స్వావలంబనలను పునాదులుగా నిలబెట్టుకోవచ్చు.

ఆ మాటే వినని తరం...

1991లో భారతదేశం డబ్ల్యుటీవోలో ప్రవేశించి, ఆర్థిక సంస్కరణల ద్వారా విదేశీకి తలుపులు పూర్తిగా తెరిచింది. మతం విషయాన్ని అట్లుంచితే, జాతీయతా భావనలు బలంగా ఉండే ఆరెస్సెస్ ద్వారా అదే సంవత్సరం స్వదేశీ జాగరణ్ మంచ్ ఏర్పడింది గాని పరిమితంగానే పనిచేయగలిగింది. తర్వాత కాలంలో వాజ్పేయి ప్రధానిగా ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం కూడా స్వదేశీని పక్కకు పెట్టింది. అందుకు కారణం, భారత పారిశ్రామిక, వాణిజ్య వర్గాలలో అత్యధికులు విదేశీ పెట్టుబడులతో కలిసి ఉమ్మడి ఉత్పత్తులు, వ్యాపారాల వైపు మొగ్గటం. బయటినుంచి ప్రత్యక్ష పెట్టుబడులు, జాయింట్ వెంచర్లు, ఎగుమతులకు తగిన స్థాయిలో ఉత్పత్తులు చేసేందుకు టెక్నాలజీ దిగుమతులు, ఎక్స్పోర్ట్ ఓరియెంటెడ్ అభివృద్ధి అవసరమనే దృష్టి పెరుగుతూ పోయాయి. ఈ కొత్త దశలో అత్యధికులు 'స్వదేశీ' అనే మాటనే విని ఉండరు. 1947కు ముందటి స్వదేశీ దృక్పథం, స్ఫూర్తి, ఆ తర్వాత అర్ధ శతాబ్దం గడిచి, రెండు తరాలు మారి, రెండు ప్రధానమైన పార్టీల పరిపాలనను కూడా చూసిన వెనుక, ఉక్కిరిబిక్కిరై అవసాన దశలోకి ప్రవేశించింది.

ఈ విధమైన రెండు దశల వెనుక 2014లో అధికారానికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ, మరొక పేరుతో తిరిగి స్వదేశీ నినాదాన్ని ఇచ్చారు. అందుకు ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా, వికసిత్ భారత్ వంటి పేర్లు పెట్టారు. ఆయన గుజరాత్కు చెందినవారు కావటం, గుజరాత్ – మహారాష్ట్ర ప్రాంతంలో స్థానిక పారిశ్రామిక, వాణిజ్య వర్గాలు బలంగా ఎదగటం ఒకటైతే, విదేశీ పెట్టుబడులు, కంపెనీలు రావాలి గానీ అవి తమకు అనుకూలమైన విధంగా వ్యవహరించాలనుకునే ధోరణులు పెరగటం మరొకటిగా మారి, ఈ కొత్త తరహా స్వదేశీ నినాదానికి భూమికగా మారాయి. దీనితోపాటు ఆత్మనిర్భర్కు మూల స్తంభాలని అయిదింటిని పేర్కొన్నారు. అవి ఆర్థికం, మౌలిక సదుపాయాల కల్పన, వ్యవస్థలను నిర్మించి బలోపేతం చేయటం, సమాజాన్ని క్రియాశీలం చేయటం, దేశీయ ఉత్పత్తులకు డిమాండ్ పెంచటం.

నాలుగు కీలకాంశాలు

అప్పటినుంచి 10 సంవత్సరాలు గడిచిన తర్వాత జరిగిన సమీక్షలు ప్రోత్సాహకరంగా లేకపోవటం గమనించదగ్గది. ఆత్మనిర్భర్కు మూలస్తంభాలుగా పైన పేర్కొన్న అయిదు రంగాలలో పెరుగుదల లేదని కాదు. కానీ అది సాధారణమైన రీతిలో జరుగుతుండేదే తప్ప ప్రత్యేకమైన ఊపు ఏదీ రాలేదు. మొత్తం ఆర్థిక వ్యవస్థ పరిమాణం జపాన్ను మించి నాల్గవ స్థానానికి చేరటానికి ఒక కారణం మన దేశ పరిమాణం ఇంత పెద్దది కావటమైతే, మరొక కారణం జపాన్ అభివృద్ధి వేగం మందగించటం.

దీని అర్థం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ పెనవేసుకుపోయిన స్థితిలో ఒంటరితనంగా ఎదగాలని కాదు. అది అసాధ్యం, అవాంఛనీయం కూడా. మారుతున్న పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా పునర్నవీకరణ జరుగుతూనే, మౌలిక స్థాయిలో స్వదేశీ, స్వావలంబనలను పునాదులుగా నిలబెట్టుకోవచ్చు. ఇతరులపై ఆధారపడటం తగ్గుతూ, వారి ఒత్తిడులకు భయపడే స్థితిని పోగొట్టుకోవచ్చు. ఇది ప్రభుత్వపరంగా జరగవలసినది కాగా, సమాజాన్ని కూడా అదే స్ఫూర్తితో ఆ ప్రణాళికలో భాగస్వామిని చేయటం అసాధ్యం కాదు. అమెరికా టారిఫ్లు వాణిజ్య ఒప్పంద ఒత్తిడుల స్థితిలో ఇపుడీ మాటను ప్రధాని మోదీ తనకు తాను పదేపదే గుర్తు చేసుకుంటూ దేశ ప్రజలకు గుర్తు చేయవలసిన పరిస్థితి ఏర్పడింది.

వీటన్నింటికీ మూలంలో అసలు ప్రస్తావనకు రాని కీలకమైన విషయం ఒకటున్నది. భారతదేశానికి గొప్ప చరిత్ర, సంస్కృతి ఉన్నాయి. ప్రజలకు గొప్ప దేశభక్తి, జాతీయతా భావాలున్నాయి. ఏ దేశానికైనా, జాతికైనా ఈ నాలుగు అంశాలు కలిసి ఎనలేని శక్తిని ఇవ్వగలవు. వాటిని ఒక దార్శనికత, ప్రణాళిక, పట్టుదల, నిజాయితీ అనే నాలుగు అంశాలతో సమన్వయం చేసి ఆచరణలోకి తేగల నాయకత్వం ఉన్నట్లయితే ఆశించిన ఫలితాలను సాధించగలరు. అది జరిగినందువల్లనే స్వదేశీ నినాదం స్వాతంత్ర్యోద్యమ కాలంలో విజయవంతమైంది. స్వాతంత్ర్యానంతరం ఎవరు పాలించినా ఆ పని చేయలేక పోతున్నారు. స్వదేశీ నినాదాల అమలుకు మౌలికమైన అడ్డంకిగా నిలుస్తున్న లోపం అదే.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

ప్రపంచ చరిత్రనే మార్చిన యుద్ధం

టైమ్ మిషన్

ప్రపంచ చరిత్రలో అత్యంత నిర్ణయాత్మకమైన యుద్ధాలలో 'గౌగమేలా' యుద్ధం ఒకటి. ఈ యుద్ధంలో మేసిడోనియా యువరాజు అలెగ్జాండర్... అకిమెనిడ్ పారసీక సామ్రాజ్యపు చక్రవర్తి డరియస్–3ను చిత్తు చేశాడు. దీనితో ప్రపంచ చరిత్ర గతే మారి పోయింది. గ్రీకు సేనలకు ఆసియా ద్వారాలు తెరచుకున్నాయి.

గౌగమేలాకు ముందు 'ఇసస్' యుద్ధంలో (క్రీ.పూ. 333) కూడా డరియస్ను అలెగ్జాండర్ ఓడించాడు. కానీ ఆ విజయం పారసీక సామ్రాజ్యాన్ని బలహీనం చేయలేకపోయింది. ఈసారి డరియస్ తన సామ్రాజ్య అపారమైన వనరులను ఉపయోగించుకుని భారీ సైన్యాన్ని (సుమారు లక్షన్నర నుంచి రెండున్నర లక్షల మంది) సమకూర్చుకున్నాడంటారు. అలెగ్జాండర్ కేవలం తన 47,000 మంది సైనికులతో ఈ భారీ సైన్యాన్ని ఎదుర్కొని విజయం సాధించడంలో అతడి యుద్ధ తంత్రమే ప్రధాన కారణం అయ్యింది.





గౌగమేలా యుద్ధం ఊహాచిత్రం – బ్రిటిష్ మ్యూజియంలోని శాసనం

మెసపొటేమియా ఉత్తర ప్రాంతం (ప్రస్తుత ఇరాక్)లోని గౌగమేలా మైదానంలో క్రీస్తు పూర్వం 331 అక్టోబర్ మొదటివారంలో (1వ తేదీ) జరిగిన ఈ యుద్ధంలో... డరియస్ తన రథాలను, యుద్ధ గజాలను ప్రధాన ఆయుధాలుగా ఉపయోగించాలని భావించాడు. అందుకే సమతలమైన ఈ మైదానాన్ని యుద్ధ క్షేత్రంగా ఎంచుకున్నాడు. కానీ అలెగ్జాండర్ ఈ వ్యూహాన్నే తనకనుకూలంగా మార్చుకున్నాడు.

మైదానంలో ఎడమవైపు ఉన్న జాగాలో డరియస్ తన అపార సైన్యాన్ని మోహరించి ఉన్నాడు. అతి కొద్ది సైన్యాన్ని డరియస్ను ఎదుర్కోవడానికి అలెగ్జాండర్ అక్కడ మోహరించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ స్థానాన్ని వీడకుండా ఉండాలని ఆదేశించాడు. ప్రధాన సైన్యాన్ని కుడి వైపునకు మరల్చి దూరంగా పొమ్మని ఆజ్ఞ జారీ చేశాడు. ఇది చూసిన డరియస్ చుట్టూ ఉన్న సైన్యం... శత్రుసైనికులు వెనక్కి తిరిగి పారిపోతున్నారని భావించి వారిని వెంబడించడం ప్రారంభించింది. దీంతో డరియస్ చుట్టూ ఖాళీ ఏర్పడింది. ఈ అవకాశం కోసమే ఎదురు చూస్తున్న అలెగ్జాండర్ తనను వెన్నంటి ఉన్న సుశిక్షిత అశ్విక దళంతో శరవేగంతో ఆ ఖాళీలో ప్రవేశించి డరియస్ను చుట్టుముట్టాడు. అలెగ్జాండర్ అత్యంత వేగంగా సైన్యాన్ని నడిపిస్తూ డరియస్ చుట్టూ ఉన్న సైన్యాన్ని ఊచకోత కోశాడు. ఎడమవైపుకు డరియస్ సైనికులు పారిపోకుండా అంతకు ముందే మోహరించి ఉన్న తన కొద్దిపాటి సైనిక సమూహం వీరోచితంగా పోరాడుతూ ప్రధాన సైన్యం విజయం సాధించేంత వరకు తమ స్థానాన్ని కాపాడుకుంది. వారు వెనక్కి తగ్గి ఉంటే అలెగ్జాండర్ ప్రణాళిక విఫలమై ఉండేది. ప్రస్తుతం బ్రిటిష్ మ్యూజియంలో భద్రపరచబడిన ఓ మృత్తికా ఫలక శాసనం (క్లే టాబ్లెట్ ఇన్స్క్రిప్షన్)లో ఈ వివరాలు ఉన్నాయి.

యుద్ధ ప్రాముఖ్యం

గౌగమేలా యుద్ధం తరువాత, అకిమెనిడ్ సామ్రాజ్యం అంతరించిపోయింది. డరియస్ తప్పించుకున్నాడు. కానీ అలెగ్జాండర్ పారసీక రాజధానులైన బాబిలోన్, సూసా, పెర్సెపోలిస్లను సులభంగా స్వాధీనం చేసుకున్నాడు. యుద్ధం తరువాత, గ్రీకు సంస్కృతి, ఆచారాలు ప్రాచ్య ప్రపంచంలోకి వ్యాపించడానికి మార్గం సుగమమైంది. ఈ సంస్కృతుల మిశ్రమమే 'హెలెనిస్టిక్ యుగం'గా ప్రసిద్ధికెక్కింది. ఇది శాస్త్రీయ, సాంస్కృతిక, రాజకీయ రంగాల అభివృద్ధికి దోహదపడింది. ఈ విజయం తరువాత, అలెగ్జాండర్ను 'అలెగ్జాండర్ ద గ్రేట్' అని పిలవడం ప్రారంభమయ్యింది. చరిత్రలో ఆయన గొప్పవారిలో అత్యంత గొప్పవాడిగా నిలిచాడు. ◆

దేశ సేవలో మునుముందుకు...

ఇన్ బాక్స్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) మన దేశంలో అత్యున్నత స్థాయి సర్వీసు ఉద్యోగుల నియామక సంస్థ. బ్రిటిష్ గవర్నర్ జనరల్ లార్డ్ కార్న్వాలిస్ భారతదేశంలో 'సివిల్ సర్వీసెస్'ను ప్రవేశపెట్టాడు. అయితే 1854లో 'లార్డ్ మెకాలే' కమిటీ సివిల్ సర్వీసెస్ నియామకాలను పోటీ పరీక్షల ద్వారా భర్తీ చేయాలని సూచించింది. 1926 అక్టోబర్ 1న 'ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్' ఏర్పాటయ్యింది.



1950లో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 315–323 వరకు ఉన్న నిబంధనల ప్రకారం 'యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్' 'రాజ్యాంగ బద్ధమైన', 'స్వతంత్ర ప్రతిపత్తి సంస్థ'గా స్థాపించబడింది. యూపీఎస్సీ నాటి నుంచి నేటి వరకూ ప్రజా పరిపాలనలో సుస్థిరత, నిబద్ధత, నైపుణ్యం కలిగిన అధికారులను అందించే వేదికయ్యింది. కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల సేవలకు గాను ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఇతర కేంద్ర సర్వీసులు, డిఫెన్స్ సర్వీసుల కోసం వివిధ పరీక్షలు నిర్వహిస్తోంది.


ప్రపంచంలోనే అత్యంత కఠినమైన ఈ పరీక్ష భారత యువతకు సవాలునూ, అవకాశాన్నీ ఇస్తోంది. పేదరిక నిర్మూలన, విద్య, వైద్యం, పరిశ్రమల స్థాపనలో సివిల్ సర్వెంట్ల చరిత్ర, పాత్ర ఎంతో గణనీయమైనది. యూపీఎస్సీ ఈ సుదీర్ఘ శత వసంతాల ప్రయాణంలో మెకాలే కమిటీ (1854), కొఠారీ కమిటీ (1974), సతీశ్ చంద్ర కమిటీ (1988), సురేంద్రనాథ్ – బీఎస్ యుగంధర్ కమిటీ (2003), పీసీ హోతా (2004), కన్నన్ (2010) వంటి కమిటీల సిఫార్సుల మేరకు సివిల్ సర్వీసెస్ పరీక్షల విధానంలో నిర్మాణాత్మకమైన మార్పులు తీసుకువస్తూ ముందుకు సాగుతోంది.

2025 జూన్ నెలలో 'ప్రతిభా సేతు పథకం' ప్రారంభమయ్యింది. యూపీఎస్సీ రాత పరీక్ష, ఇంటర్వ్యూ దశలను విజయవంతంగా పూర్తి చేసి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినప్పటికీ... తుది ఎంపికలో నిలబడని అభ్యర్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం. ఇది అభ్యర్థుల కృషిని వృథా కాకుండా చేయడానికి, వారి ప్రతిభను సద్వినియోగం చేసుకోవడానికి ఒక మంచి అవకాశంగా మారింది.


యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు ప్రతిష్ఠాత్మకమైనవి అయినప్పటికీ, పరీక్షా విధానం అత్యంత కఠినమనీ, నియామకానికి సుదీర్ఘ కాలం పడుతుందనీ, ఎంపికలో అసమానతలు చోటుచేసుకుంటున్నాయనీ విమర్శలు ఉన్నాయి. మొత్తం మీద ఈ సంస్థ మెరికల్లాంటి అధికారులను దేశానికి అందిస్తున్నదన్నమాట నిజం.

– మంతెన శ్రీనివాస రాజు I నలంద విద్యాసంస్థల ఛైర్మన్, హైదరాబాద్

డేటా పాయింట్



వ్యక్తిత్వ విశిష్టత...



మంచి ఆలోచనలు సానుకూల దృక్పథం నుండి జనిస్తాయి. సానుకూల దృక్పథం ఒక వ్యక్తి వ్యక్తిత్వం, సంస్కారాల నుండి ఆవిష్కృతమౌతుంది. నిరాశా నిస్పృహలతో సహజీవనం చేసే వారి వ్యక్తిత్వం సమాజాన్ని నిర్వీర్యం చేస్తుంది. విలువలతో కూడిన వ్యక్తిగత జీవితం... సమాజంతో మమేకమైతే వికాసం కలుగుతుంది.

ఓ పట్టణంలో ధనవంతులు నివసించే ఒక కాలనీలో మద్యం లారీ తలక్రిందులయింది. లారీడ్రైవర్ నిశ్చేష్టుడై చూస్తుండగా మద్యం సీసాలను కాలనీవాసులు ఎత్తుకుపోయారు. అదే ఒక పల్లెటూరిలో ఎద్దుల బండి విరిగిపోయింది. విరిగిన భాగాన్ని తీసుకొని రైతు... పల్లెకు వెళ్ళాడు. బండిని కాని, బండిలోని వస్తువులను కాని ఎవరూ తాకలేదు. ఈ రెండు ఉదాహరణలు ప్రజల వ్యక్తిత్వాలకు దర్పణంగా నిలుస్తున్నాయి. అన్నీ అనుకూలంగా ఉన్నప్పుడు, అందరూ ధార్మికుల వలెనే ప్రవర్తిస్తారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైన సమయంలోనే వ్యక్తి వ్యక్తిత్వ పరిణతి వెలుగు చూస్తుంది. దుర్మార్గుడైన రాజు ప్రజలను పీడిస్తూ... స్త్రీలను చెరపడుతూ శీలభ్రష్టుడై రాజ్యపాలన చేస్తున్నాడు. అతని ప్రధానమంత్రి సౌమ్యుడు, శాస్త్రాలు అభ్యసించినవాడు, ప్రజల పట్ల ఆదరణ కలిగిన వాడు. కాలక్రమేణా రాజు దురాగతాలపై ప్రజలకు ఆగ్రహం పెరిగిపోయింది. ప్రధానికీ రాజుపై అసహ్యం కలిగింది. బాగా ఆలోచించిన ప్రధాని పొరుగురాజును సంప్రదించి, రాజ్య భద్రతకు సంబంధించిన రహస్యాలను చెరవేసి తన రాజ్యంపై దండెత్తేందుకు ప్రేరణనిచ్చాడు. ఫలితంగా శీలభ్రష్టుడైన రాజును పొరుగురాజు ఓడించాడు. అక్కడితో ఆగకుండా... మందిరాలను కూల్చాడు. స్త్రీలను చెరబట్టాడు. చివరగా ప్రధానమంత్రినీ సంహరించాడు. దానితో రాజు వ్యక్తిగత శీలభ్రష్టతకు శిక్షపడినా... ప్రధాని జాతీయశీల భ్రష్టత వల్ల జాతి పతనమయింది. దేనికోసం దేనిని వదులుకోవాలో తెలియడమే ఉన్నత వ్యక్తిత్వం. అందువల్ల వ్యక్తిత్వం జాతి నిర్మాణంలో ప్రముఖ పాత్రను పోషిస్తూ ముందుకు నడిచినప్పుడే విశిష్టతను సంతరించుకుంటుంది.

– పాలకుర్తి రామమూర్తి

మూడు రోజుల్లో రూ. 700 కోట్లు

- సెప్టెంబర్ 30న అత్యధికంగా రూ.333 కోట్ల మద్యం విక్రయం
- మందుబాబుల ముందు జాగ్రత్త
- గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో అమ్మకాలు
- దసరాకు రెండు రోజుల ముందు భారీస్థాయిలో కొనుగోళ్లే కారణం
- సెప్టెంబర్ నెలలో రూ. 3వేల కోట్లు దాటిన మద్యం విక్రయాలు
- గత ఏడాది సెప్టెంబర్‌తో పోలిస్తే ఏడు శాతం ఎక్కువ



- దసరా పండుగ సందర్భంగా 2023లో 10 రోజుల వ్యవధిలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మద్యం విక్రయాల విలువ రూ. 800 కోట్లు.
- అదే 2024లో దసరా సందర్భంగా 8 రోజుల్లో మద్యం విక్రయాల విలువ రూ.852.38 కోట్లు.
- 2025లో మాత్రం మూడంటే మూడు రోజుల్లోనే (సెప్టెంబర్ 29, 30, అక్టోబర్ 1వ తేదీ కలిపి) అమ్మిన మందు విలువ రూ.697.23 కోట్లు..అంటే కొంచెం అటూ ఇటుగా రూ.700 కోట్లు అన్నమాట.

తెలంగాణ మందు బాబులు 'ముందు జాగ్రత్త'పడ్డట్టు ఈ మద్యం అమ్మకాల గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

సాక్షి, హైదరాబాద్: దసరా పండుగ ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీన రావడంతో ఆ రోజున మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వైన్‌షాపులు బంద్ ఉంటాయనే ఆలోచనతో ముందుగానే లిక్కర్ కొనేసి పెట్టుకున్నారని మద్యం విక్రయాల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణ రోజుల్లో సగటున రోజుకు రూ.100 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరుగుతా యి. లక్ష కేసుల వరకు లిక్కర్ అమ్ముడవుతుంది. కానీ, దసరా సందర్భంగా ఈసారి ఒక్కరోజే మూడింతల మద్యం అమ్ముడయ్యింది. సెప్టెంబర్ 30వ తేదీన రికార్డు స్థాయిలో ఏకంగా రూ.333 కోట్ల విలువైన మద్యం లిక్కర్ డిపోల నుంచి వైన్‌షాపులకు వచ్చింది. అంతకంటే ముందు రోజు సెప్టెంబర్ 29న కూడా అదే జోరు కొనసాగింది. ఆ రోజున రూ. 278 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. గత ఏడాది లెక్కలే కాదు.. ఏ ఏడాదిలోనూ దసరాకు రెండు, మూడు రోజుల ముందు ఈ స్థాయిలో లిక్కర్ అమ్మకాలు జరగలేదని ఎక్సైజ్ వర్గాలంటున్నాయి.

- గత ఏడాది అక్టోబర్ 12న దసరా పండుగ జరగ్గా, అక్టోబర్ 5న రూ.127 కోట్లు, ఏడో తేదీన రూ.129 కోట్లు, 9వ తేదీన రూ.120 కోట్లు, 10వ తేదీన రూ.139 కోట్ల విలువైన మద్యం మార్కెట్‌లోకి వెళ్లిపోయింది. అంటే ఏ రోజునా కనీసం రూ.150 కోట్లు కూడా దాటలేదు. కానీ, ఈ ఏడాది మాత్రం అంతకు రెట్టింపు కంటే ఎక్కువగా మద్యం అమ్మకాలు జరగడం గమనార్హం. అయితే, రెండు రోజుల ముందుగానే మందు బాబులు జాగ్రత్త పడడంతో దసరా పండుగకు ముందు రోజు మాత్రం అత్యల్పంగా రూ. 86.23 కోట్ల మేర మాత్రమే మద్యం అమ్మకాలు జరగడం గమనార్హం.

సెప్టెంబర్‌లో పెరిగిన అమ్మకాలు

2024తో పోలిస్తే ఈ ఏడాది సెప్టెంబర్‌లో మద్యం అమ్మకాలు పెరిగాయని ఎక్సైజ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2024 సెప్టెంబర్‌లో రూ. 2,838 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరగ్గా, ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఏడు శాతం ఎక్కువగా రూ.3,046 కోట్ల మందు అమ్ముడయ్యింది. 2024లో సెప్టెంబర్ నెలలో 28.81 లక్షల కేసులు, 2025లో 29.92 లక్షల కేసుల లిక్కర్ అమ్మకాలు జరిగాయి. 2024లో 39.71 లక్షల కేసుల బీర్ల అమ్మకాలు జరగ్గా, 2025లో 36.46 లక్షల కేసుల బీర్ల అమ్మకాలు జరిగాయి. అంటే 2024 కంటే లిక్కర్ అమ్మకాలు పెరిగి, బీర్ల విక్రయాలు తగ్గాయని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

పదేళ్ల వరకు పోటీ చేయను

- వచ్చే ఎన్నికల్లో నిర్మల బరిలో ఉంటారు
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: తాను పదేళ్ల వరకు సంగారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేయనని, పదేళ్ల తర్వాత సంగారెడ్డి నుంచే బరిలోకి దిగుతానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గం నుంచి తన భార్య నిర్మల పోటీ చేస్తారని స్పష్టం చేశారు. ఆమెకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తున్నానని వెల్లడించారు. గురువారం సంగారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో దసరా వేడుకల్లో రావణ దహనం, జంబిచెట్టు పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉందని, నిర్మల కష్టపడి పనిచేస్తారని తెలిపారు. తాను వెనకుండి అభివృద్ధి పనులు చేస్తానన్నారు. మూడు సార్లు ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించారని, శక్తి కొద్ది పనిచేశానని, సీఎంలు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుంచి మొదలు, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డితో చర్చించి సంగారెడ్డికి ఐఐటీహెచ్‌ను తెచ్చానని, తాగునీటి వసతి కల్పించానని వివరించారు. సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ పదవికి కాంగ్రెస్ అభ్యర్థిగా కూన సంతోష్ ఉంటారని జగ్గారెడ్డి తెలిపారు.

నైనీ నుంచి తమిళనాడుకు బొగ్గు సరఫరా

- సింగరేణి సీఎండీతో తమిళనాడు జెన్‌కో ఎండీ చర్చలు


సాక్షి, హైదరాబాద్/ సూపర్‌బజార్ (కొత్తగూడెం): సింగరేణి సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి తమిళనాడు పవర్ జనరేషన్ కార్పొరేషన్‌కు బొగ్గు సరఫరా చేయనున్నారు. ఈ బ్లాక్ నుంచి ఏటా 2.88 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాకు తమిళనాడు జెన్‌కోతో సింగరేణి సంస్థ మరో 10 రోజుల్లో ఒప్పందం చేసుకోనుంది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో తమిళనాడు పవర్ జనరేషన్ కార్పొరేషన్ ఎండీ ఎం.గోవిందరావు, సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్‌ను కలిసి చర్చలు జరిపారు. తమిళ నాడులోని తుత్తుకూడి జిల్లా ఉడింగిడిలో ఉన్న 1,200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ కోసం ప్రతీ ఏడాది 2.88 మిలియన్ టన్నుల బొగ్గు అవసరమని, ఈ మేరకు బొగ్గు సరఫరా చేయాలని జెన్‌కో ఎండీ గోవిందరావు కోరగా, ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి రైలు, జల మా ర్గంలో సరఫరా చేస్తామని సీఎండీ బలరామ్ చెప్పారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు చేయాలని బలరామ్ నైనీ అధికారులను ఆదేశించారు. తమిళనాడు జెన్‌కోతో పది రోజుల్లో ఒప్పందం కుదుర్చుకోవడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.



సింగరేణి సీఎండీ బలరామ్‌తో సమావేశమైన తమిళనాడు జెన్‌కో ఎండీ గోవిందరావు

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో ఒకటి నుంచి ఆరు తరగతులకు ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. పోలీస్ అధికారులు, సిబ్బంది పిల్లల కోసం ప్రత్యేకంగా ఈ పాఠశాలను గత విద్యా సంవత్సరంలో మంచిరేవులలో ఏర్పాటు చేశారు. 2026–27 విద్యాసంవత్సరానికి ప్రవేశ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్టు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల తల్లిదండ్రులు yipschool.in వెబ్‌సైట్‌లో లేదా 9059196161 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కాగా, పాఠశాలలో 50 శాతం సీట్లు పోలీసు సిబ్బంది పిల్లలు, మరో 50 శాతం సీట్లను ఇతరులకు కేటాయిస్తున్నారు.


అమర్‌ప్రీత్ సింగ్

13 పాక్ జెట్లు కూల్చేశాం

- ఇందులో అమెరికా, చైనా తయారీ విమానాలున్నాయి
- ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు చావుదెబ్బ
- ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ వెల్లడి

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌తో ప్రత్యర్థి దేశం పాకిస్తాన్‌కు చావుదెబ్బ తగిలిందని, భారీగా నష్టపోయిందని భారత వైమానిక దళం(ఐఏఎఫ్) ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాకిస్తాన్‌కు చెందిన 12 నుంచి 13 ఫైటర్ జెట్లు కూల్చివేశామని, ఇందులో అమెరికాలో తయారైన ఎఫ్–16 యుద్ధ విమానాలు, చైనాలో తయారైన జేఎఫ్–17 యుద్ధ విమానాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. భారత యుద్ధ విమానాలను పాక్ సైన్యం కూల్చివేసిందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. అవన్నీ 'మనోహరమైన కథలు' అంటూ కొట్టిపారేశారు. శుక్రవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో అమర్‌ప్రీత్ సింగ్ మాట్లాడారు. పాకిస్తాన్ భూభాగంలోకి 300 కిలోమీటర్లకుపైగా చొచ్చుకెళ్లి మరీ దాడి చేశామని, మన వైమానిక దళం ఇప్పటిదాకా సాధించిన వాటిలో ఇది 'లాంగెస్ట్ కిల్' అని పేర్కొన్నారు. దూరంగా ఉన్న శత్రువును దెబ్బకొట్టామని, ఇది ఈ సంవత్సరానికే 'హైలైట్' అని అభివర్ణించారు. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌కు వాటిల్లిన నష్టంపై భారత వైమానిక దళం అధినేత స్పష్టమైన వివరాలు బయటపెట్టడం ఇదే మొదటిసారి. పాక్ గగనతలంలో కొన్ని, భూభాగంపై మరికొన్ని ఫైటర్‌జెట్లను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. వీటిలో ఎఫ్–16లు, జేఎఫ్–17లతోపాటు ఒక నిఘా విమానం కూడా ఉందని వెల్లడించారు. పాక్ రాడార్ వ్యవస్థలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు, రన్‌వేలు, హ్యాంగర్లపై అత్యంత కచ్చితత్వంలో కూడిన దాడులు చేశామన్నారు. నాలుగు ప్రాంతాల్లో పాక్ రాడార్లు, రెండుచోట్ల కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు, మూడు హ్యాంగర్లు, రెండు రన్‌వేలు, ఒక సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ సిస్టమ్ ధ్వంసమయ్యాయని వివరించారు. మే 10వ తేదీన పాకిస్తాన్‌కు ఊహించని నష్టం జరిగిందన్నారు. దాంతో దిక్కుతోచని పాక్ సైన్యం కాల్పుల విరమణ కోసం భారత్‌ను వేడుకుందని పేర్కొన్నారు. కాల్పులు తక్షణమే ఆపాలంటూ మనల్ని అభ్యర్థించే స్థాయికి పాకిస్తాన్‌ను తీసుకొచ్చామని వ్యాఖ్యానించారు. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కొన్నిరోజుల క్రితం ఐక్యరాజ్యసమితిలో మాట్లాడుతూ... ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు చెందిన ఏడు యుద్ధ విమానాలు కూల్చివేశామని చెప్పుకొచ్చారు. కానీ, దానిపై ఎలాంటి సాక్ష్యాధారాలను ఆయన బయటపెట్టలేకపోయారు. దీనిపై అమర్‌ప్రీత్ సింగ్ స్పందించారు. 15 భారత యుద్ధ విమానాలు కూల్చామని కూడా పాక్ చెప్పుకోవచ్చని.. వారు అలాగే భావిస్తూ సంతోషపడనివ్వండి అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

'సుదర్శన్ చక్ర'తో పటిష్ట రక్షణ

ఆపరేషన్ సిందూర్‌తో మన వైమానిక దళం సత్తా ఏమిటో ప్రపంచానికి తెలిసొచ్చిందని అమర్‌ప్రీత్ సింగ్ అన్నారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. 'సుదర్శన్ చక్ర' పేరిట శత్రుదుర్భేద్యమైన గగనతల రక్షణ వ్యవస్థను రూపొందిస్తున్నామని వెల్లడించారు. 2035 నాటికి ఈ నూతన భద్రతా వ్యవస్థ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నట్లు చెప్పారు. 'సుదర్శన్ చక్ర' కోసం త్రివిధ దళాలు ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించాయని వివరించారు. దీనితో మన దేశంలోని కీలకమైన వ్యవస్థలకు పటిష్టమైన రక్షణ లభిస్తుందన్నారు. మరోసారి భారత్‌వైపు కన్నెత్తి చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పాకిస్తాన్‌ను హెచ్చరించారు.


ఉపేంద్ర ద్వివేది

మరోసారి రెచ్చగొడితే ఆపరేషన్ సిందూర్ 2.0

ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదాన్ని ఆపాల్సిందే

- లేకపోతే ప్రపంచ పటంలో పాకిస్తాన్ ఉండదు
- పొరుగు దేశానికి భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరిక
- సర్వసన్నద్ధంగా ఉండాలని భారత సైనిక దళాలకు పిలుపు

జైపూర్: భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పాకిస్తాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. భారత్‌కు వ్యతిరేకంగా ఇప్పటిదాకా సాగించిన ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదాన్ని ఇకనైనా ఆపాలని, లేకపోతే ప్రపంచ పటంలో పాకిస్తాన్ ఉండదని తేల్చిచెప్పారు. భారత్‌పైకి ఉగ్రవాదులను ఎగదోస్తే పాకిస్తాన్ అనే దేశం ఇకపై చరిత్రలో మాత్రమే మిగిలిపోతుందని స్పష్టంచేశారు. తమను మరోసారి రెచ్చగొడితే ఆపరేషన్ సిందూర్ 2.0 ప్రారంభిస్తామని ఉద్ఘాటించారు. ఆపరేషన్ సిందూర్ 1.0లో చూపించిన సహనం, సంయమనాన్ని ఈసారి చూపించబోమని పేర్కొన్నారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం రాజస్తాన్‌లోని అనూప్‌గఢ్‌లో ఆర్మీ పోస్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రపంచ చరిత్రలో స్థానాన్ని, భౌగోళిక ఉనికిని కాపాడుకోవాలా? వద్దా? అనేది పాకిస్తాన్ చేతుల్లోనే ఉందన్నారు. ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదాన్ని ఆపాల్సిందేనని పాకిస్తాన్‌కు తేల్చిచెప్పారు. లేకపోతే ఆ దేశమే ప్రమాదంలో పడుతుందన్నారు. ఈసారి బలంగా దెబ్బకొడతామని అన్నారు.

త్వరలో మరో అవకాశం రావొచ్చు

ఎలాంటి పరిణామాలు ఎదురైనా సరే దీటుగా తిప్పికొట్టడానికి సర్వసన్నద్ధంగా ఉండాలని భారత సైనిక దళాలకు జనరల్ ఉపేంద్ర ద్వివేది సూచించారు. 'మీ శక్తి సామర్థ్యాలు ప్రదర్శించడానికి త్వరలో మరో అవకాశం రావొచ్చు. అందుకే ఇప్పటినుంచే పూర్తి సన్నాహాలతో సిద్ధంగా ఉండండి. ఆల్ ద బెస్ట్' అని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ఆగలేదని, కేవలం విరామం మాత్రమే ఇచ్చామని ప్రధాని నరేంద్ర మోదీ పలుమార్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. భారత్‌పై మరోసారి దాడికి దిగితే ఆపరేషన్ సిందూర్ వెంటనే ప్రారంభమవుతుందని పాకిస్తాన్‌ను ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో పాక్ దుస్సాహసానికి పాల్పడితే ఆపరేషన్ సిందూర్ 2.0 ఉంటుందని జనరల్ ఉపేంద్ర ద్వివేది ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాంలో ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఈ ఏడాది మే 7వ తేదీన ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది. పాక్ ఉగ్రవాద స్థావరాలు, శిక్షణ కేంద్రాలు, ఎయిర్‌బేస్‌లపై నాలుగు రోజులపాటు విరుచుకుపడింది. క్షిపణులు, డ్రోన్ల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 100 మందికిపైగా పాక్ ఉగ్రవాదులు హతమయ్యారు. ముష్కరుల మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి.

భారత్‌తో వాణిజ్య సమతూకం!

వ్యవసాయ ఉత్పత్తులు, ఔషధాల దిగుమతులు పెంచుకుంటాం

- ప్రధాని మోదీతో భేటీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా
- ఆయన నాకు మంచి మిత్రుడు, విశ్వసనీయ భాగస్వామి
- రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడి
- ఉక్రెయిన్ విషయంలో అమెరికాకు హెచ్చరిక

మాస్కో: భారత్‌తో వాణిజ్య బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నట్లు అధినేత పుతిన్ స్పష్టమైన సంకేతాలిచ్చారు. భారత్ నుంచి వ్యవసాయ ఉత్పత్తులు, ఔషధాల దిగుమతులను భారీగా పెంచుకోవాలని, ఇందుకోసం ప్రత్యేక విధానం రూపొందించాలని రష్యా అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. రష్యా నుంచి భారత ప్రభుత్వం భారీగా ముడిచమురు కొనుగోలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇరుదేశాల మధ్య వాణిజ్య లోటు తగ్గిపోయి, వాణిజ్యంలో సమతూకం ఏర్పడేలా చర్యలు తీసుకోవడానికి పుతిన్ సిద్ధమయ్యారు. అందులో భాగంగానే భారత్ నుంచి దిగుమతులు పెంచాలని నిర్ణయించారు. గురువారం వాల్డాయ్ ప్లీనరీలో పుతిన్ ప్రసంగించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో ఇండియాలో పర్యటించబోతున్నానని, ఇందుకోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని చెప్పారు. తనకు మంచి మిత్రుడు, విశ్వసనీయ భాగస్వామి నరేంద్ర మోదీతో సమావేశం కాబోతున్నానని వెల్లడించారు. ప్రధాని మోదీపై పుతిన్ ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన సమతూకం కలిగిన, తెలివైన నాయకుడు అని కొనియాడారు. భారతదేశ ప్రయోజనాల కోసం మోదీ నిరంతరం శ్రమిస్తుంటారని వ్యాఖ్యానించారు. మోదీ నేతృత్వంలో జాతీయవాద ప్రభుత్వం చక్కగా పనిచేస్తోందన్నారు. మోదీతో సమావేశమైనప్పుడు తాను ఎంతో సౌకర్యవంతంగా ఉన్నట్లు భావిస్తానని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌కు సహకరించడం మానుకోవాలని అమెరికాను పుతిన్ హెచ్చరించారు. ఉక్రెయిన్‌కు దీర్ఘశ్రేణి క్షిపణులు సరఫరా చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని తేల్చిచెప్పారు.

స్వప్రయోజనాలు దెబ్బతింటే భారత్ సహించదు

భారతదేశ ఉత్పత్తులపై అమెరికా ప్రభుత్వం భారీగా టారిఫ్‌లు విధించడాన్ని పుతిన్ తప్పుపట్టారు. దేశ స్వప్రయోజనాలు, ప్రాధాన్యతల కోణంలోనే భారతీయులు నిర్ణయాలు తీసుకుంటారని, వాటిని దెబ్బతీసేలా ఎవరైనా వ్యవహరిస్తే వారు సహించబోరని తేల్చిచెప్పారు. అమెరికా విధిస్తున్న టారిఫ్‌ల కారణంగా వాటిల్లుతున్న నష్టాన్ని రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్ భర్తీ చేసుకుంటోందని అన్నారు. అదేసమయంలో ఒక సార్వభౌమ దేశంగా ప్రతిష్టను కాపాడుకుంటోందని ప్రశంసించారు. భారత్ నుంచి దిగుమతులు పెంచుకుంటామని, వ్యవసాయ ఉత్పత్తులతోపాటు ఔషధ ఉత్పత్తులు, ఫార్మాస్యూటికల్స్ అధికంగా కొనుగోలు చేస్తామని ఉద్ఘాటించారు. భారత్, రష్యాల మధ్య ఆర్థిక సహకారాన్ని పెంపొందించుకోవడానికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ విషయంలో కొన్ని సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉందని చెప్పారు. ఫైనాన్సింగ్, లాజిస్టిక్స్‌తోపాటు చెల్లింపుల్లో కొన్ని అవరోధాలు ఎదురవుతున్నాయని గుర్తుచేశారు. భారత్, రష్యాలు ఏనాడూ ఘర్షణ పడలేదని, భవిష్యత్తులోనూ అలాంటిది తలెత్తే అవకాశమే లేదని పుతిన్ తేల్చిచెప్పారు.



భారతీయ సినిమాలంటే ఇష్టం

భారతీయ సినిమాలు వీక్షించడం తనకు ఎంతో ఇష్టమని పుతిన్ వ్యాఖ్యానించారు. ఈ సినిమాలకు రష్యాలో విశేషమైన ఆదరణ లభిస్తోందని చెప్పారు. భారతీయ సినిమాలను రోజంతా ప్రసారం చేసేందుకు ప్రత్యేకంగా ఓ చానల్ కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండు దేశాల నడుమ రాజకీయ, దౌత్య సంబంధాలే కాకుండా సాంస్కృతిక, మానవీయ బంధాలు కూడా బలంగా ఉన్నాయని గుర్తుచేశారు. భారతీయ సంస్కృతి అంటే రష్యన్లకు ఎంతో అభిమానం అని వ్యాఖ్యానించారు. చాలా మంది భారతీయ విద్యార్థులు రష్యాలో చదువుకుంటున్నారని వెల్లడించారు.

రష్యా నుంచి అదనంగా ఎస్‌-400 సిస్టమ్స్

న్యూఢిల్లీ: రష్యా నుంచి కొనుగోలు చేసిన ఎస్–400 సర్ఫేస్–టు–ఎయిర్ మిస్సైల్ సిస్టమ్స్ కీలకపాత్ర పోషించాయి. వీటి పనితీరు అద్భుతంగా ఉన్నట్లు తేలింది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అదనపు ఎస్–400 సర్ఫేస్–టు–ఎయిర్ మిస్సైల్ సిస్టమ్స్‌ను సమకూర్చుకోవాలని భారత సైన్యం నిర్ణయించింది. రష్యా అధ్యక్షుడు ఈ ఏడాది డిసెంబర్‌లో భారత్‌లో పర్యటించబోతున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన భేటీ అవుతారు. ఈ సందర్భంగా ఎస్–400ల కొనుగోలు గురించి పుతిన్‌తో మోదీ చర్చించబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఐదు ఎస్–400ల కొనుగోలు కోసం భారత ప్రభుత్వం 2018 అక్టోబర్‌లో రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం విలువ 5 బిలియన్ డాలర్లు. ఇందులో మూడు ఎస్–400లను భారత్‌కు రష్యా అప్పగించింది. మిగిలిన రెండు త్వరలో రానున్నాయి. ఇవి కాకుండా అదనపు వ్యవస్థల కొనుగోలుకు ప్రతిపాదన సిద్ధమైంది.

రెండేళ్ల లోపు పిల్లలకు దగ్గు సిరప్ వద్దు!

వైద్యులు, తల్లిదండ్రులకు కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ: రెండేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న చిన్నారులకు దగ్గు, జలుబు మందులను సూచించవద్దని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం ఒక అడ్వైజరీ జారీ చేసింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో దగ్గు సిరప్ తాగి 11 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) ఈ మేరకు శుక్రవారం స్పందించింది. చిన్నారులకు దగ్గు సిరప్ సిఫారసు చేసే విషయంలో వైద్యులు జాగ్రత్తగా ఉండాలని కోరింది. సాధారణంగా ఐదేళ్లలోపు పిల్లలకు దగ్గు సిరప్‌లను సిఫారసు చేయవద్దని కోరింది. ఆపై వయస్సుండే చిన్నారులకు కూడా సరైన మోతాదు, నిర్ణీత కాలావధి, వైద్యుల సరైన పర్యవేక్షణ వంటి అంశాల ఆధారంగానే ప్రిస్క్రైబ్ చేయాలంది. అదేవిధంగా, వైద్యుల సలహాలను తీసుకోకుండా యథేచ్ఛగా దగ్గు సిరప్‌ను వాడరాదని తల్లిదండ్రులను కోరింది. ఈ విషయంలో వీరికి సరైన అవగాహన కల్పించాలని వైద్యులను కోరింది. 'పిల్లల్లో దగ్గు సంబంధ వ్యాధులు వాటంతటవే లేదా ఔషధాలతో పనిలేకుండానే చాలావరకు తగ్గిపోతాయి. తగినంత హైడ్రేషన్, విశ్రాంతి, సహాయక చర్యల ద్వారా ఇటువంటి వాటిని తగ్గించుకోవచ్చు'అని అది పేర్కొంది. అదే సమయంలో, సరైన ప్రమాణాలను పాటిస్తూ తయారైన ఉత్పత్తులను వాడాలని ఆరోగ్య విభాగాలు, ఆస్పత్రులకు సూచించింది. ప్రభుత్వ వైద్యసంస్థలతోపాటు అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు తమ అడ్వైజరీని పాటించేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరింది.

సిరప్‌లలో కల్తీ సత్యదూరం

దగ్గు మందు తాగిన అనంతరం కిడ్నీలు ఫెయిలై మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లాలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారుల సంఖ్య 9కి చేరిందని డీజీహెచ్ఎస్ తెలిపింది. అదేవిధంగా, పొరుగునున్న రాజస్తాన్‌లో సికార్‌లో సంభవించిన ఓ మరణం దగ్గు మందు తాగడంతో అవయవాలు ఫెయిలై సంభవించినట్లు అధికారులు గుర్తించారు. చనిపోయిన 9 మంది చిన్నారుల్లో కనీసం ఐదుగురు కోల్‌డ్రెఫ్, ఒకరు నెక్స్‌ట్రో సిరప్ తాగినట్లు తేల్చారు. వైరల్ జ్వరాల కేసుల విషయంలో ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు అప్రమత్తంగా ఉండాలని డీజీహెచ్ఎస్ తెలిపింది. ఇటువంటి కేసులను తీసుకోవద్దని, గుర్తించిన వెంటనే నేరుగా ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలని కోరింది. అదేవిధంగా, డెక్స్‌ట్రో మెథోర్ఫాన్ హైడ్రోబ్రోమైడ్ సిరప్‌లతో తీవ్ర అనారోగ్యం బారినపడుతున్న ఘటనల నేపథ్యంలో రాజస్తాన్‌లో ఈ సిరప్ వాడినట్లుగా గుర్తించిన 1,420 చిన్నారులను పరిశీలనలో ఉంచామంది. అయితే, చిన్నారుల మరణాలకు దగ్గు మందు కల్తీయే కారణమన్న ఆరోపణలకు తగు ఆధారాలు లేవని కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. కిడ్నీలు ఫెయిలయ్యేందుకు అవకాశమున్న డైఇథలీన్ గ్లైకాల్(డీఈజీ) లేదా ఇథిలీన్ గ్లైకాల్(ఈజీ) రసాయనాలు ఈ దగ్గు సిరప్‌లలో లేవని శాంపిళ్ల పరీక్షల్లో తేలినట్లు స్పష్టం చేసింది. సిరప్‌లలో కల్తీ జరిగిందన్న ఆరోపణలు నిరాధారాలంటూ కొట్టిపారేసింది.

భారత న్యాయ వ్యవస్థను నడిపించేది న్యాయ పాలనే.. బుల్‌డోజర్ పాలన కాదు

సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: భారత న్యాయ వ్యవస్థను నడిపించేది న్యాయ పాలనే తప్ప, బుల్‌డోజర్ న్యాయం కాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. న్యాయస్థానం వెలువరించే తీర్పుతోటే ఈ విషయం అర్థమవుతుందన్నారు. ప్రభుత్వమే జడ్జి, లాయర్, అధికారి బాధ్యతలను ఏకకాలంలో నిర్వర్తించలేదన్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన 75 ఏళ్లలో 'చట్ట పాలన'పరిణతి చెందుతూ వస్తోందన్నారు. చట్ట పాలన కేవలం నిబంధనావళి మాత్రమే కాదు, నైతిక చట్టం ఇది విభిన్న, సంక్లిష్టమైన సమాజంలో సమానత్వాన్ని నిలబెట్టడానికి, వ్యక్తి గౌరవాన్ని కాపాడటానికి, పాలనను మార్గనిర్దేశం చేయడానికి రూపొందించిన నైతిక చట్రమని ఆయన అన్నారు. నేరారోపణలు ఎదుర్కొంటున్న వారి ఇళ్లను కూల్చడం చట్ట పరమైన ప్రక్రియలను మరుగు పర్చడం, నియమాలను, రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే అవుతుందంటూ యూపీ ప్రభుత్వంపై కేసు విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ పేర్కొనడం తెల్సిందే. వివిధ కేసుల్లో చారిత్రక తీర్పులను ఈ ప్రసంగం సందర్భంగా జస్టిస్ గవాయ్ ఉదహరించారు. 'రూల్ ఆఫ్ లా ఇన్ ది లార్జెస్ట్ డెమోక్రసీ'అంశంపై మారిషస్‌లో జరిగిన వార్షిక సర్ మౌరిస్ రౌల్ట్ స్మారక ఉపన్యాసం సందర్భంగా ఆయనీ వ్యాఖ్యలు చేశారు. మారిషస్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా 1978–82 సంవత్సరాల్లో జస్టిస్ రౌల్ట్ పనిచేశారు.

నేడు బిహార్‌కు సీఈసీ బృందం

- రెండు రోజులపాటు ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష
- పలు దశల్లో పోలింగ్..ఈ నెలాఖరులో తొలి విడత జరిగే చాన్స్

న్యూఢిల్లీ: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై సమీక్షించేందుకు కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషి, ఎస్ఎస్ సంధు శనివారం పట్నాకు వెళ్లనున్నారు. వీరు రెండు రోజులపాటు అక్కడి అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షిస్తారు. 243 సీట్లున్న రాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబర్ 22న ముగియనుంది. అక్టోబర్ నెలాఖరులో పోలింగ్ ప్రారంభమై వచ్చే నెలలో పలు దశల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే ముందు ఈసీ ఆయా రాష్ట్రాల్లో పర్యటించడమనేది సాధారణంగా జరిగే ప్రక్రియ. ఇందులోభాగంగా ఈసీ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పాలనా సంబంధిత అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, రాష్ట్ర ఎన్నికల అధికారులతో సమావేశమవుతుంది. ఎన్నికల నిర్వహణ సిబ్బంది ఆయా చట్టాలు, నియమాలతో పూర్తి అవగాహనతో ఉండి పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించేలా ఈసీ సమాయత్తం చేస్తుంది. కేంద్ర పరిశీలకులు బరిలో నిలిచే అభ్యర్థులకు సమాన అవకాశాలు ఉండేలా నిర్ధారించుకుంటారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఓటర్ల సమస్యలను తీర్చేందుకు పరిశీలకులు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఓటర్ల సౌలభ్యం కోసం ఈసీ తీసుకొచ్చిన కార్యక్రమాలు సరిగా అమలవుతున్నాయో లేదో చూసేందుకు పరిశీలకులు పోలింగ్ బూత్‌లను సందర్శించాలని ఈసీ ఆదేశించింది. గత సెప్టెంబర్ 30న ప్రచురితమైన ఓటర్ల తుది జాబితా ప్రకారం 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు.

చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్ ఆర్చ్‌బిషప్‌గా ములాలీ

- ప్రకటించిన యూకే ప్రధానమంత్రి కార్యాలయం
- 500 ఏళ్లలోనే మొదటి మహిళా ఆర్చ్‌బిషప్‌గా రికార్డు
- 165 దేశాల్లో 8.50 కోట్ల మంది ఆంగ్లికన్‌లు



లండన్: చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా మహిళా ఆర్చ్‌బిషప్ నియమితులయ్యారు. ఆర్చ్‌బిషప్ ఆఫ్ కాంటర్‌బరీగా డేమ్ సారా ములాలీ(63)ని కింగ్ ఛార్లెస్–3 నియమించారని శుక్రవారం యూకే ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. దీంతో, చర్చ్ 500 ఏళ్ల చరిత్రలో నాయకత్వ స్థాయికి ఎదిగిన మహిళా మతపెద్దగా ములాలీ చరిత్ర సృష్టించినట్లయింది. ప్రపంచ వ్యాప్తంగా 165 దేశాల్లో ఉన్న 8.5 కోట్ల మంది ఆంగ్లికన్‌లకు ములాలీ ఆధ్యాత్మిక నాయకత్వం వహించనున్నారు. జాతీయ ఆరోగ్య సేవల(ఎన్‌హెచ్ఎస్) విభాగంలో చీఫ్ నర్స్‌గా పనిచేసిన సారా ములాలీ 2006లో బోధకురాలిగా బాధ్యతలు చేపట్టారు. 2018లో మొట్టమొదటి మహిళా బిషప్ ఆఫ్ లండన్‌గా, చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్‌లో అత్యంత మూడో సీనియర్ మతపెద్దగా ఎదిగారు. గతేడాది నవంబర్ 12వ తేదీన రెవరెండ్ జస్టిన్ వెల్బీ రాజీనామా చేశారు. చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్‌తో సంబంధమున్న ఓ న్యాయ వాది చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడి నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయం తెలిసీ సంబంధిత అధికారులకు సమాచారమివ్వలేదని విమర్శలు రావడంతో ఆయన బాధ్యతల నుంచి వైదొలిగారు. అప్పట్నుంచీ ఆర్చ్‌బిషప్ ఆఫ్ కాంటర్‌బరీ పదవి ఖాళీగా ఉంది. 106వ ఆర్చ్‌బిషప్ ఆఫ్ కాంటర్‌బరీగా మొట్టమొదటి మహిళగా సారా ములాలీ నియమితులవడాన్ని యూకే ప్రధాని స్టార్మర్ స్వాగతించారు. అయితే, 2026 జనవరిలో లండన్‌లోని సెయింట్ పాల్స్ కేథడ్రల్‌లో జరిగే కార్యక్రమంలో ప్రత్యేకంగా ఆర్చ్‌బిషప్ ఆఫ్ కాంటర్‌బరీగా ప్రకటించే వరకు ఆమెను ఆర్చ్‌బిషప్ ఆఫ్ కాంటర్‌బరీ–డిజిగ్నేట్‌గా వ్యవహరిస్తారు. అనంతరం మార్చిలో కాంటర్‌బరీ కేథడ్రల్‌లో జరిగే కార్యక్రమంలో అధికారికంగా ఆమెను ఆసీనురాలిని చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లికన్ కమ్యూనియన్ అంతటా లక్షలాది మంది ప్రజలతో విశ్వాస ప్రయాణాన్ని పంచుకోవడానికి ఎదురు చూస్తున్నట్లు సారా ములాలీ తెలిపారు. 'ఇది చాలా పెద్ద బాధ్యత అని నాకు తెలుసు. కానీ, దేవుడు ఎప్పటిలాగే నా బాధ్యతను తీసుకుంటాడనే నమ్మకంతోనే కొత్త బాధ్యతల్లోకి అడుగు పెడుతున్నాను'అని ఆమె వినమ్రంగా చెప్పారు. అంతకుముందు, నర్స్‌గా పనిచేసిన ములాలీ 2001లో కేవలం 37 ఏళ్లకే యూకే ప్రభుత్వ చీఫ్ నర్సింగ్ అధికారిగా బాధ్యతలు చేపట్టి, చరిత్ర సృష్టించారు. చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్, గ్లోబల్ ఆంగ్లికన్ కమ్యూనియన్, కాంటర్‌బరీ డయోసెస్‌ల ప్రతినిధులతో కూడిన కాంటర్‌బరీ కోసం క్రౌన్ నామినేషన్స్ కమిషన్ (సీఎన్‌సీ) సారా ములాలీని ఈ పదవికి ఎంపిక చేసింది.

నో అంటే నరకమే!

- డెడ్‌లైన్ ఆదివారం సాయంత్రం 6 గంటలు
- హమాస్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అల్టిమేటం



గాజా స్ట్రిప్: గాజాలో శాంతి సాధన కోసం తాను ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళిక పట్ల హమాస్ మిలిటెంట్లు ఇంకా స్పందించకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 6 గంటల్లోగా ఒప్పుకోవాలని అల్టిమేటం విధించారు. లేకపోతే నరకం అంటే ఏమిటో ప్రత్యక్షంగా చూపిస్తామని హమాస్‌ను హెచ్చరించారు. ఈ మేరకు ట్రంప్ శుక్రవారం సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం మొదలై ఈ నెల 7వ తేదీకి రెండేళ్లు పూర్తవుతాయి. ఈ నేపథ్యంలో యుద్ధాన్ని వెంటనే ముగించాలని ట్రంప్ పట్టుదలతో ఉన్నారు. ఇటీవలే 20 శాతం శాంతి ప్రణాళికను తెరపైకి తెచ్చారు. ట్రంప్ ప్లాన్‌ను ఇజ్రాయెల్ అంగీకరించింది. ప్రపంచ దేశాలు సైతం స్వాగతించాయి. హమాస్ మాత్రం ఇంకా స్పందించలేదు. ట్రంప్ ప్రణాళిక తమకు ఆమోదయోగ్యం కాదని, ఇందులో కొన్ని అంశాలు అభ్యంతరకరంగా ఉన్నాయని పరోక్షంగా పేర్కొంది. అభ్యంతకర అంశాలపై చర్చించాల్సి ఉందని మధ్య వర్తులుగా వ్యవహరిస్తున్న ఈజిప్టు, ఖతార్ కూడా చెబుతున్నాయి.

మధ్యప్రాచ్యంలో శాంతిని నెలకొల్పుతాం

గడువులోగా హమాస్ తమతో ఒప్పందానికి రావాల్సిందేనని ట్రంప్ స్పష్టంచేశారు. ఇదే ఆఖరి అవకాశంగా భావించాలన్నారు. ఒప్పందానికి రాకపోతే ఇప్పటిదాకా ఎవరూ చూడని నరకాన్ని హమాస్‌కు చూపిస్తామని ఉద్ఘాటించారు. మిలిటెంట్లపై పూర్తిస్థాయి సైనిక చర్య ప్రారంభమవుతుందన్నారు. ఒక మార్గంలో కాకపోతే.. మరో మార్గంలోనైనా మధ్యప్రాచ్యంలో శాంతిని నెలకొల్పుతామని ట్రంప్ పేర్కొన్నారు. హమాస్‌ను పూర్తిగా అంతం చేస్తామన్న సంకేతాలిచ్చారు.

యువశక్తికి రూ.62,000 కోట్ల బూస్ట్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో యువత విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకతకు ఊతం ఇచ్చే దిశగా రూ.62 వేల కోట్లకు పైగా విలువైన పలు యువత–కేంద్రీకృత కార్యక్రమాలను ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించనున్నారు. శనివారం ఉద యం 11 గంటలకు న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 'కౌశల్ దీక్షాంత్ సమారోహ్'లో ఆయన పాల్గొంటారు. దేశ వ్యాప్తంగా పారిశ్రామిక శిక్షణా సంస్థల(ఐటీఐ) నుంచి ఆల్ ఇండియా టాపర్లుగా నిలిచిన 46 మందిని ప్రధాని మోదీ సత్కరించనున్నారు.ఈ కార్యక్రమాల్లో అత్యంత కీలకమైనది ప్రధానమంత్రి స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ త్రూ అప్‌గ్రేడెడ్ ఐటీఐలు' (పీఎం–సేతు). కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకమైన దీనికోసం రూ.60 వేల కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 1,000 ప్రభుత్వ ఐటీఐలను 'హబ్ అండ్ స్పోక్' నమూనాలో ఆధునీకరించనున్నారు. ఇందులో 200 ఐటీఐలు 'హబ్'లుగా, 800 ఐటీఐలు 'స్పోక్'లుగా పనిచేస్తాయి. ప్రతి హబ్‌కు సగటున నాలుగు స్పోక్‌లు అనుసంధానమై ఉంటాయి. దేశవ్యాప్తంగా 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 400 నవోదయ విద్యాలయాలు, 200 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 1,200 వృత్తి నైపుణ్య ల్యాబ్‌లను ప్రధాని ప్రారంభించనున్నారు. మారుమూల, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు సైతం ఐటీ, ఆటోమోటివ్, వ్యవసాయం, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్, టూరిజం వంటి 12 కీలక రంగాల్లో ప్రత్యక్ష శిక్షణ అందించడమే ఈ ల్యాబ్స్ లక్ష్యం. జాతీయ విద్యా విధానం–2020కి అనుగుణంగా 1,200 మంది వృత్తి విద్యా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. బిహార్‌కు సంబంధించిన పలు పథకాలను ప్రధాని మోదీ ప్రారంభిస్తారు.

మాంచెస్టర్ సినగాగ్ వద్ద దాడి

మాంచెస్టర్: ఇంగ్లాండ్‌లోని మాంచెస్టర్ సిటీలో దారుణంగా జరిగింది. యూదుల ప్రార్థనా మందిరం(సినగాగ్) వద్ద ఓ దుండగుడు దాడికి దిగాడు. సినగాగ్ బయట నిల్చున్నవారిపైకి గురువారం కారుతో దూసుకొచ్చాడు. అనంతరం కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో అడ్రియాన్ డల్బీ(53), మెల్విన్ క్రావిట్జ్(66) మరణించారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అయితే, మరణించిన ఇద్దరితో ఒకరు పోలీసుల కాల్పుల్లో మృతువాత పడినట్లు తెలిసింది. దుండగుడిని అడ్డుకోవాలన్న ఉద్దేశంతో కాల్పులు జరపగా, ఒకరు మృతిచెందినట్లు గుర్తించారు. కానీ, తమ కాల్పుల్లో దుండగుడే హతమైనట్లు పోలీసులు చెబుతున్నారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 4 । అక్టోబర్ । 2025



బహ్రేన్ టు హైదరాబాద్..

వ్యవస్థీకృతంగా సాగుతున్న ఎండీఎంఏ డ్రగ్ దందాను హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) ఛేదించింది. ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. -8లో



స్పోర్ట్స్.. 'స్టార్స్'..

ఇటీవల పలువురు సెలబ్రిటీలు సరికొత్త క్రీడలను ప్రోత్సహించాలని వాటికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలుస్తున్నారు. పికిల్ బాల్ వంటి క్రీడలు మరింత అభివృద్ధిలోకి వస్తున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.0/22.0

నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటిపూట పొడి వాతావరణం నెలకొంటుంది. గరిష్ఠంగా 30, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

ఉస్మా 'నయా' పనులకు శ్రీకారం

రూ.2,700 కోట్లతో ఆస్పత్రి భవన నిర్మాణం



సాక్షి, సిటీబ్యూరో: ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రూ.2,700 కోట్లతో రాబోయే వందేళ్ల అవసరాలకు తగ్గట్లు డిజైన్ చేశారు. ఏకకాలంలో 5 వేల మంది ఓపీ, 41 ఆపరేషన్ థియేటర్లు, 2 వేల పడకల సామర్థ్యంతో అత్యాధునిక మౌలిక సదుపాయాల భవన సముదాయం నిర్మించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి గోషామహల్ పోలీసు స్టేడియంలో దసరా పండగ రోజు నిర్మాణ సంస్థ ఎంఈఐఎల్ ప్రాజెక్టుల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి భూమి పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన భవనాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామన్నారు. ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు దీటుగా నిర్మాణాలు ఉంటాయన్నారు. ఆస్పత్రి నిర్మాణం కోసం ఈ ఏడాది జనవరి 31న సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసినప్పటికి వివిధ కారణాలతో పనులు ప్రారంభించడంలో జాప్యం జరిగింది. ఈ పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వం రెండున్నరేళ్ల గడువు విధించింది. 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆస్పత్రిని అభివృద్ధి చేయనున్నారు. ఆస్పత్రి బ్లాక్, అకడమిక్ బ్లాక్, ధర్మశాల, మార్చురీ, యుటిలిటీ భవనాలు, పురుషులు, మహిళల వసతి గృహాలు, సెక్యూరిటీ భవనం, రోబోటిక్ సర్జరీ థియేటర్లు, హెలీ ప్యాడ్, ట్రాన్స్‌ప్లాంట్ యూనిట్లు, సీవరేజీ ట్రీట్‌మెంట్, బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు,, 1,500 కార్ల పార్కింగ్ సామర్థ్యం గల రెండు బేస్‌మెంట్లు అందుబాటులోకి రానున్నాయి. నర్సింగ్, డెంటల్, ఫిజియోథెరపీ కళాశాలలు నిర్మించనున్నారు.

పూటకో మాట.. రోజుకో తీరు

'తెలంగాణ తల్లి' బోర్డు తెర తీశారు



తెర తొలగించాక అక్షరాలు, సూచికలు కనిపిస్తున్న బోర్డు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్ బోర్డుకు సంబంధించి జీహెచ్ఎంసీ తీరు ప్రజలకు అంతుచిక్కడం లేదు. ఫ్లై ఓవర్ ఒకవైపు (పాత సచివాలయం వైపు) ప్రవేశ మార్గంలో గత మంగళవారం ప్రజలకు దర్శనమిచ్చిన బోర్డును సాయంత్రానికి అక్షరాలు కనిపించకుండా తెర వేశారు. తెలుగుతల్లిగా ఉన్న పేరును తెలంగాణ తల్లిగా మార్చడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న తరుణంలో జీహెచ్ఎంసీ చేసిన ఆ పనితో పలు సంశయాలు వెల్లువెత్తాయి. సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఫ్లై ఓవర్ రెండో వైపు(లోయర్‌ట్యాంక్‌బండ్) ప్రవేశమార్గంలో కూడా బోర్డు ఏర్పాటు చేశాక రెండింటినీ కలిపి ఒకేసారి ప్రారంభిస్తామని జీహెచ్ఎంసీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రెండు రోజుల్లో రెండింటినీ కలిపి ఒకేసారి ప్రారంభిస్తామని పేర్కొంది. కానీ.. రెండో వైపు బోర్డు ఏర్పాటు కాకుండానే సచివాలయం వైపు బోర్డుకు వేసిన తెరను తొలగించి, తిరిగి అక్షరాలు కనిపించేలా చేసింది. ఇంతమాత్రానికి ఈ తతంగమంతా ఎందుకు? అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. తొలుత ఒకవైపు మాత్రమే ఏర్పాటు చేస్తే ఎవరైనా కాదన్నారా? ఎందుకు మూసేశారు? రెండోవైపు ఏర్పాటు కాకున్నా మళ్లీ ఎందుకు తెర తీశారు? రెండూ ఒకేసారి ప్రారంభిస్తామని ఎందుకు ప్రకటించారు? అంటూ పలువురు జీహెచ్ఎంసీ చర్యల్ని తప్పుపడుతున్నారు.



ఆదివాసీ కళాకారులతో మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఆయన కుమార్తె

అలయ్.. బలయ్.. రుచులు అదిరాయ్

నగరంలో శుక్రవారం జరిగిన అలయ్ బలయ్ ఆద్యంతం ఆకట్టుకుంది. వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులతో వేదిక చూడముచ్చటగా కనిపించింది. అలాగే.. అతిథులకు సుమారు 80 రకాలకు పైగా వంటకాలను వడ్డించారు. తెలంగాణ సంప్రదాయల రుచులు ఎంతగానో నోరూరించాయి. సుమారు 12వేల మందికి ఇక్కడ భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖులకు చికెన్, మటన్ బిర్యానీ, భగారా, బోటీ, తలకాయ, చేపల ఇగురు, బొమ్మిడాల పులుసు, రొయ్యలు, తదితర మాంసాహారాలు కర్రీ, ఫ్రై, రకాలు అందుబాటులో ఉంచారు. వీటితో పాటు చపాతీలు, వడలు, జొన్నరొట్టెలు, రుమాల్ రోటీ వంటి డైట్ ఫుడ్, తెలంగాణలో ప్రత్యేక గుర్తింపు ఉన్న డబుల్‌కా మీఠాతో పాటు వివిధ రకాల స్వీట్స్‌ను తయారు చేయించారు. తెలంగాణలో గుర్తింపు పొందిన రకరకాల పిండి వంటలు నోరూరించాయి. అలాగే.. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ వేషధారణలు, డప్పు వాయిద్యాలు, జానపద కళాకారులు సందర్శకులను ఆకట్టుకున్నారు. అలయ్ బలయ్‌పై గాయనీ మంగ్లీ ఆలపించిన గీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

– సాక్షి, సిటీబ్యూరో



పారాహుషార్.. ప్లేట్‌లో డేంజర్



- 83శాతం మందిలో కనిపించిన మెటబాలిక్ రిస్క్
- 41శాతం మందిలో ప్రీ డయాబెటిస్
- మార్పు చేర్పులు, ప్రొటీన్ కూర్పులతోనే పరిష్కారం
- తాజాగా వెల్లడించిన ఐసీఎంఆర్ అధ్యయనం

సాక్షి, సిటీబ్యూరో

దేశవ్యాప్తంగా నిర్వహించిన ఒక తాజా సర్వే.. పెరుగుతున్న మధుమేహం, ఊబకాయం గుండె జబ్బులకు ఆహారం జీవనశైలి మార్పులే కారణమని నిర్ధారించింది. సగటున వయసు 40 సంవత్సరాలున్న పురుషులు, మహిళలను ఎంచుకున్న ఈ సర్వే ఫలితం దేశంలో తీవ్రతరమవుతున్న ఆరోగ్య సంక్షోభపు స్థాయిని వెల్లడించింది, ఆహారం జీవనశైలిలో మార్పులు మధుమేహం, ఊబకాయం గుండె జబ్బులతో నేరుగా ఎలా ముడిపడి ఉన్నాయో తేల్చి చెప్పింది.

83 శాతం మందిలో మెటబాలిక్ రిస్క్...

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్– ఇండియా డయాబెటిస్ (ఐసీఎంఆర్–ఐఎన్‌డీఐఏబీ) ప్రాజెక్ట్‌లో భాగమైన ఈ పరిశోధన, 83% మంది కనీసం ఏదో ఒక మెటబాలిక్ రిస్క్ ఫ్యాక్టర్ కలిగి ఉన్నారని, రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, ఊబకాయం మధుమేహం ఇప్పుడు సర్వసాధారణంగా మారాయని తేల్చింది. మొత్తం 18,090 మందిపై జరిగిన ఈ పరిశోధన నేచర్ మెడిసిన్‌లో ప్రచురితమైంది, సంప్రదాయ ఆహార విధానాలు చురుకైన జీవనశైలి స్థానంలో నిశ్చల దినచర్యలు, అధిక–కార్బోహైడ్రేట్ ఆహారాలు చేరడమే ముప్పునకు కారణమని వెల్లడించింది.

రక్తపోటు.. ప్రీ డయాబెటిస్..

దాదాపు మూడింట ఒక వంతు మందికి అధిక రక్తపోటు (తీవ్రంగా అధిక రక్తపోటు) ఉన్నట్లు కనుగొంటే 9% మందికి కొత్తగా నిర్ధారణ అయిన టైప్ 2 డయాబెటిస్ ఉంది. భవిష్యత్తులో మధుమేహం వచ్చే ప్రమాదాన్ని సూచించే ప్రీడయాబెటిస్ 41% కన్నా ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగించే అంశం.


పాలతో ప్రీ డయాబెటిస్, గుడ్డుతో చెక్..

- రకరకాలుగా కార్బోహైడ్రేట్ల వాడకాన్ని తగ్గించకుండా శుద్ధి చేసిన తెల్ల బియ్యం వంటి వాటిని గోధుమలు.. తదితరాలతో భర్తీ చేయడం మధుమేహం లేదా ఊబకాయం ప్రమాదాన్ని తగ్గించలేదని అధ్యయనం స్పష్టం చేసింది. ఆహారంలో ప్రొటీన్ బాగా పెంచాల్సిన అవసరం ఉందని, కొన్ని కార్బోహైడ్రేట్లను ప్రొటీన్‌తో భర్తీ చేసినప్పుడు అత్యంత ఆశాజనకమైన ఫలితాలు వచ్చాయని వెల్లడించింది. శాకాహారం,, పాల ఉత్పత్తులు, గుడ్డు లేదా చేప ద్వారా ప్రొటీన్లను తీసుకోవడం టైప్ 2 డయాబెటిస్ ప్రమాదం 9–11% తగ్గిస్తుందని, ప్రీడయాబెటిస్ ప్రమాదం 6–18% తగ్గిస్తుందని తేల్చింది.
- ముఖ్యంగా ప్రీడయాబెటిస్‌ను నివారించడంలో పాల ద్వారా వచ్చే ప్రొటీన్ మంచి పనితీరు చూపింది, అదే సమయంలో గుడ్డు ద్వారా వచ్చే ప్రొటీన్ డయాబెటిస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తోంది. మొత్తంగా చూస్తే వ్యాధుల భారాన్ని తగ్గించడానికి ప్రొటీన్–రిచ్ ఫుడ్‌ను ఎక్కువగా తీసుకునేందుకు ప్రోత్సహించాలని అధ్యయనం సూచిస్తోంది. తక్షణం ఈ మార్పుల వైపు దృష్టి సారించాలని లేకపోతే పరిణామాలు వినాశకరమైనవి కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, ఊబకాయం మధుమేహం కలయిక గుండె జబ్బులు స్ట్రోక్ రేటును వేగవంతం చేసి దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై అపారమైన భారాన్ని మోపుతుందని హెచ్చరిస్తున్నారు.

తెల్ల బియ్యంలోనూ అనేక అనారోగ్య కారకాలు

లావెక్కి.. రోగాలు నక్కి..

ఊబకాయం రేట్లు కూడా అంతే ఆందోళనకరంగా ఉన్నాయి. దేశ సగటు బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 22.2 మధ్యస్థంగా కనిపించినప్పటికీ, 43% మంది పెద్దవాళ్లు అధిక బరువుతో ఉన్నారు. అలాగే ఆసియా ప్రాంత ప్రమాణాల ప్రకారం చూస్తే 26% మంది ఊబకాయంతో ఉన్నారు. నడుము చుట్టూ అదనపు కొవ్వుతో వచ్చే ఉదర ఊబకాయం, 36 శాతం మందిలో ఉంది ఇదే గుండె ఆరోగ్యానికి ముఖ్యమైన హాని కారకంగా మారుతోంది. మరోవైపు కొలెస్ట్రాల్ సమస్యలు విస్తతమై సగం మందిలో డిస్లిపిడెమియా లేదా అసాధారణ లిపిడ్ స్థాయిలు కనిపిస్తున్నాయి. పట్టణాలు, నగరాల్లో ఇది మరింత తీవ్రంగా ఉంది, ఇక్కడ నిశ్చల జీవనశైలి ఆహారపు అలవాట్లు ప్రమాదాలను పెంచుతున్నాయి. గ్రామీణ నివాసితులతో పోలిస్తే అధిక బరువు, ఊబకాయం లేదా అధిక రక్తపోటు ఉన్నవారు నగరాల్లో ఎక్కువగా ఉన్నారు. మహిళలు అధిక స్థాయిలో ఊబకాయాన్ని కలిగి ఉంటే పురుషులకు అధిక రక్తపోటు కొలెస్ట్రాల్ సంబంధిత అసాధారణ పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి.



అధిక కార్బోహైడ్రేట్స్‌తో అనర్థం

జీవనశైలి, దేశ ఆహార అలవాట్లు జీవక్రియ వ్యాధికి దాని సంబంధాలను అధ్యయనం లోతుగా పరిశీలించింది. దాని ప్రకారం.. రిఫైన్డ్/ శుద్ధి చేసిన గోధుమలు అదనపు చక్కెర. అదే సమయంలో, శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల ప్రొటీన్ కొరత పెరుగుతోంది. ఈ అసమతుల్యత డయాబెటిస్ ఊబకాయాలకు ప్రధాన కారణమవుతోంది. మొత్తంగా ఆహారం తక్కువగా తీసుకునే వారితో పోలిస్తే అధిక కార్బోహైడ్రేట్లు తీసుకున్న వ్యక్తులకు ఆరోగ్య సమస్యల ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. వీరికి టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశాలు 30% ప్రీడయాబెటిస్ వచ్చే అవకాశాలు 20%,సాధారణ ఊబకాయం వచ్చే అవకాశాలు 22% ఉదర ఊబకాయం వచ్చే అవకాశాలు 15% ఎక్కువగా కనిపించింది.

చేతిలో కైట్!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు ఎంఐఎం దూరం!!

- అధికార కాంగ్రెస్‌కు మద్దతు యోచన
- ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయం
- పరోక్షంగా సంకేతాలిచ్చిన మజ్లిస్ చీఫ్
- త్వరలో తుది నిర్ణయం ప్రకటించే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు మజ్లిస్ పార్టీ దూరం పాటించనుందా? అనే ప్రశ్నకు సమాధానం ఔననే వస్తోంది. రెండు రోజుల క్రితం జూబ్లీహిల్స్ సెగ్మెంట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ 'ఎన్నికల్లో స్థానికుడు, సమర్థుడు, ప్రజా సమస్యల పరిష్కారానికి తపించే యువ నేతను ఎన్నుకోవాలి' అని పిలుపునివ్వడం ఇందుకు బలం చేకూర్చుతోంది. ఏకంగా ఒవైసీ.. బీఆర్ఎస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. గత పదేళ్ల ప్రాతినిధ్యం వహించిన ప్రజాప్రతినిధి పార్టీ అధికారంలో ఉన్నప్పటికి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని.. తాను బాధ్యతాయుతంగా చెబుతున్నానంటూ అనడమే కాకుండా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి నియోజకవర్గ అభివృద్ధి పనులు తీసుకెళ్లినప్పుడు తనకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో కాంగ్రెస్‌కు మజ్లిస్ మద్దతు యోచన ఉన్నట్లు పరోక్షంగా వెల్లడించినట్లైంది. మరోవైపు బీజేపీ బలోపేతం కాకుండా నిలువరించాల్సి అవసరం ఉందని, మధ్యలో ఓట్లు చీల్చేందుకు కొన్ని కత్తెర పార్టీలు రావచ్చని, ఆలోచించి యువనేతను ఎన్నుకోవాలని సూచించడాన్ని బట్టి ఉప ఎన్నికల్లో పోటీకి దూరం పాటిస్తున్నట్లు పరోక్షంగా స్పష్టం చేసినట్లయింది. పార్టీ పరంగా అధికారికంగా ఒకటి రెండు రోజుల్లో తుది నిర్ణయం ప్రకటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

అధికారపక్షంతో కలిసి నడిచేందుకు..

మజ్లిస్ పార్టీ వ్యూహంలో భాగంగా తాము ప్రాతినిధ్యం వహించే అసెంబ్లీ సెగ్మెంట్లలో అభివృద్ధి పనుల కోసం రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో కలిసి నడిచే అనవాయితీ ఉంది. అందులో భాగంగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని సూత్రపాయంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా హైదరాబాద్ పాతబస్తీలో ఎదురులేని రాజకీయ శక్తిగా తయారైన మజ్లిస్ పార్టీ గత మూడు పర్యాయాలుగా జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌పై పాగా వేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. తెలంగాణ ఆవిర్భావ సమయంలో బరిలో దిగి ఢీ.. అంటే ఢీ అనే విధంగా పోటీ పడి స్వల్ప ఓట్ల తేడాతో రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో అప్పటి అధికార పక్షం బీఆర్ఎస్ దోస్తీ కోసం బరిలోకి దిగలేదు. అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం పోటీ చేసినప్పటికీ పరాజయం తప్పలేదు. తాజాగా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ప్రస్తుతం అధికార కాంగ్రెస్‌తో సత్సంబంధాలు కలిగి ఉండటంతో ఉప ఎన్నికలకు దూరం పాటించాలని భావిస్తోంది.



సెగ్మెంట్‌లో మజ్లిస్ ప్రస్థానం

తొలిసారిగా 2014లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన మజ్లిస్ గట్టి పోటీ ఇచ్చింది. అప్పటో మజ్లిస్ తరఫున రంగంలో దిగిన బీసీ సామాజిక వర్గానికి చెందిన నవీన్ యాదవ్ తొమ్మిది వేల ఓట్లతో తేడాతో రెండో స్థానంలో నిలిచి ఓటమి పాలయ్యారు. 2018లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేయకుండా అప్పటి మిత్రపక్షమైన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యేకు మద్దతు ప్రకటించింది. దీంతో నవీన్ యాదవ్ మజ్లిస్‌కు రాజీనామా చేసి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి సుమారు 18 వేల పై చిలుకు ఓట్లు సాధించారు. 2023లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చిన మజ్లిస్ పార్టీ.. జూబ్లీహిల్స్ సిట్టింగ్ ఎమ్మెల్యేపై స్నేహపూర్వక పోటీకి దిగింది. ముస్లిం మైనారిటీ ఓట్లు కాంగ్రెస్ పార్టీకి మళ్లకుండా చేసి అధికార బీఆర్ఎస్‌కు సహకరించేందుకు ఆ పార్టీ బరిలో దిగినట్లు ప్రచారం సాగింది. అంతా ఊహించినట్లే బీఆర్ఎస్‌కు లాభం చేకూరింది. కానీ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం చేజారగా.. కాంగ్రెస్ గద్దెనెక్కింది. ఆ తర్వాత కాంగ్రెస్‌తో మజ్లిస్ స్నేహం కుదిరింది. తాజాగా ఉప ఎన్నికల్లో దూరం పాటించేందుకు సిద్ధమైనట్లు కనిపిస్తోంది.

దేశ స్వాతంత్య్రం కోసం ఆర్ఎస్ఎస్ చేసింది శూన్యం

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: దేశ స్వాతంత్య్ర సమరంలో ఆర్ఎస్ఎస్ పాత్ర శూన్యమని మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం షేక్‌పేట్ డివిజన్ పారామౌంట్ కాలనీలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఆర్ఆర్ఎస్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడుతూ.. దేశాభివృద్ధి కోసం ఆర్ఆర్ఎస్ ఎంతో కృషి చేసిందని కొనియాడటంపై ఆయన అసదుద్దీన్ మండిపడ్డారు. దండి యాత్ర, క్విట్ ఇండియా.. తదితర ఉద్యమాలలో ఆర్ఎస్ఎస్ పాల్గొనలేదన్నారు. కేవలం ఆర్ఎస్ఎస్‌లో సభ్యులుగా చేర్చుకోవడం కోసమే హెగ్డేవార్ లాంటి వారు పలు ఉద్యమాలలో పాల్గొన్నారన్నారు. ప్రస్తుతం ప్రధానితో పాటు ఆర్ఎస్ఎస్ నాయకులు మైనార్టీలపై కక్షసాధింపుగా వ్యవహరిస్తున్నారని, దేశ స్వాతంత్య్రం కోసం వేలాది మంది ముస్లింలు తమ ప్రాణాలు అర్పించారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అందరికీ అందుబాటులో ఉంటూ స్థానికంగా ఉండే వ్యక్తిని గెలిపించాలని కోరారు. గురువారం షేక్‌పేట్ డివిజన్‌లో రూ.9.97 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఎంపీ అసదుద్దీన్ మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో బీఆర్ఎస్‌కు చెందిన వ్యక్తి ఎమ్మెల్యేగా పని చేశారని, జూబ్లీహిల్స్ ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్



ఆర్ఓబీని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం తదితరులు

పాతబస్తీలో కొత్త మార్గం

బార్కాస్ జంక్షన్ నుంచి చార్మినార్ వరకు తగ్గనున్న ట్రాఫిక్ చిక్కులు

- ఫలక్‌నుమా వద్ద రెండో ఆర్ఓబీ ప్రారంభం
- పాల్గొన్న మంత్రి పొన్నం, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీలోని ఫలక్‌నుమా జంక్షన్ (జీమ్యాక్స్ కన్వెన్షన్) నుంచి ఫలక్‌నుమా బస్‌డిపోతో పాటు చార్మినార్ వరకు వెళ్లే వారికి ఇప్పటిదాకా ఉన్న ట్రాఫిక్ చిక్కులు తగ్గనున్నాయి. సికింద్రాబాద్ –ఫలక్‌నుమా బ్రాడ్‌గేజ్ లైన్‌లోని ఫలక్‌నుమా వద్ద ఇప్పటికే ఉన్న ఆర్ఓబీకి సమాంతరంగా రూ. 52.03 కోట్లతో నిర్మించిన కొత్త ఆర్ఓబీని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. పాత ఆర్ఓబీ పునరుద్ధరణతో పాటు కొత్త ఆర్ఓబీని నాలుగు వరుసల క్యారేజ్‌వేతో నిర్మించడంతో బార్కాస్ జంక్షన్ నుంచి ఫలక్‌నుమా బస్ డిపో, రైల్వే స్టేషన్, చార్మినార్ వైపు వెళ్లే వాహనాలకు ఇబ్బందులు తొలగనున్నాయి. ఎంతో సమయం ఆదాతో కావడంతో పాటు గంటల తరబడి నిలిచిపోయే ట్రాఫిక్ నుంచి ఉపశమనం లభించనుంది.కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ, మీర్జా రహమత్ బేగ్, ఎమ్మెల్యేలు మహమ్మద్ ముబీన్, మీర్ జుల్ఫికర్ అలీ, మేయర్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు. తొలుత ఈ ఫ్లై ఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని ప్రకటించినప్పటికీ, ఆయన కార్యక్రమానికి హాజరు కాలేదు.

గాంధీజీకి ఘన నివాళి

లంగర్‌హౌస్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. లంగర్‌హౌస్ బాపుఘాట్‌లో గవర్నర్, ముఖ్యమంత్రి బాపుజీకి నివాళులర్పించారు. త్రివేణి సంగమ ఒడ్డున ఉన్న బాపు సమాధిపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాపు ధ్యాన మందిరంలో జరిగిన సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆ తరువాత బాపుఘాట్ ప్రాంగణంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి మౌనం పాటించారు. వేడుకల్లో మాజీ గవర్నర్ దత్తాత్రేయ, స్పీకర్ గడ్డం ప్రసాద్, మహేష్ గౌడ్, గుత్తా సుఖేందర్ రెడ్డి, రాంమోహన్ రెడ్డి, కాలె యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కేటాయింపు పత్రాల అందజేత



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్: గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించి కోర్టులో కేసు కారణంగా ఆగిపోయి తిరిగి కోర్టు నుంచి క్లియరెన్స్ వచ్చిన పలువురు లబ్ధిదారులకు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టాలు పంపిణీ చేశారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో కలిసి పత్రాలను అందజేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పథకంలో భాగంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంకల్ గ్రామంలో ఇళ్ల నిర్మాణాన్ని జీహెచ్‌ఎంసీ చేపట్టింది. హైదరాబాద్ జిల్లాకు చెందిన 1730 మంది లబ్ధిదారుల జాబితాను కలెక్టర్ ప్రచురించగా వీరికి మంకల్ ఫేజ్–2 స్థానంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించారు. అందులో భాగంగా చార్మినార్, మలక్‌పేట, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఉన్న లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. 75 మంది లబ్ధిదారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పట్టాలు అందజేశారు.

బహ్రెయిన్ టు హైదరాబాద్ వయా బెంగళూరు!

వ్యవస్థీకృతంగా సాగుతున్న మాదకద్రవ్యం దందా

- ఆన్‌లైన్‌లో ఆర్థిక లావాదేవీలు, డెడ్‌డ్రాప్‌తో డెలివరీ
- ఇరువురు నిందితుల్ని అరెస్టు చేసిన హెచ్–న్యూ టీమ్
- వీరి నుంచి 50 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో : నగరంలో ఉన్న డ్రగ్ పెడ్లర్ బహ్రెయిన్‌లో ఉన్న సప్లయర్‌కు ఆర్డర్ ఇస్తాడు. ఇతగాడు విదేశీయుల ద్వారా డెడ్ డ్రాప్ విధానంలో బెంగళూరుకు సరుకు చేరుస్తాడు. అక్కడ ఉన్న ట్రాన్స్‌పోర్టర్ దాన్ని హైదరాబాద్ తీసుకువచ్చి డెలివరీ చేస్తాడు. ఈ పంథాలో వ్యవస్థీకృతంగా సాగుతున్న ఎండీఎంఏ డ్రగ్ దందాను హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) ఛేదించింది. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి 50 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర శుక్రవారం ప్రకటించారు.

ఇన్‌స్టాగాం ద్వారా ఆ నెట్‌వర్క్‌లోకి...

బండ్లగూడ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఉస్మాన్ పదో తరగతి వరకు చదివాడు. ఆపై స్థానికంగా ఉన్న ఓ బేబీ స్టోర్‌లో ఉద్యోగిగా మారాడు. యజమానికి తీవ్ర నష్టాలు రావడంతో 2024లో షాపు మూతపడి తన ఉద్యోగం కోల్పోయాడు. దీంతో తేలిగ్గా డబ్బు సంపాదించే మార్గాలు అన్వేషించిన ఉస్మాన్‌కు ఇన్‌స్టాగాం యాప్ ద్వారా అశ్విన్ దాస్ రమావత్‌తో పరిచయమైంది. కేరళకు చెందిన ఇతగాడు బెంగళూరులో బీసీఏ చదివాడు. ఆపై అక్కడే కొన్ని ఉద్యోగాలు చేసినా ఈ ఏడాది ఫిబ్రవరిలో బహ్రెయిన్ ఉద్యోగం కావడంతో అక్కడకు వెళ్లాడు. ఆన్‌లైన్ ద్వారా పరిచయమైన విదేశీయులతో కలిసి డ్రగ్ నెట్‌వర్క్ నడుపుతున్నాడు. వాట్సాప్ ద్వారా అశ్విన్‌ను సంప్రదించే ఉస్మాన్ తనకు అవసరమైన డ్రగ్ ఆర్డర్ పెట్టి, అందుకు అవసమైన మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తాడు.

డెడ్‌డ్రాప్ విధానంలో డెలివరీ...

అశ్విన్ బెంగళూరులో చదువుతున్న రోజుల్లో అదే కాలేజీలో విద్యనభ్యసిస్తున్న రాహుల్ కుమార్‌తో పరిచయమైంది. ఇద్దరూ మలయాళీలే కావడంతో వీరి మధ్య స్నేహం బలపడింది. 2024 జులైలో చదువు పూర్తయిన తర్వాత రాహుల్ అక్కడే ఓ రెస్టారెంట్‌లో ఉద్యోగిగా చేరాడు. పని ఒత్తిడి కారణంగా కొన్నాళ్లకే మానేశాడు. అశ్విన్ ఆదేశాల మేరకు అతడి నెట్‌వర్క్‌లో ట్రాన్స్‌పోర్టర్‌గా మారాడు. ఉస్మాన్ ఇచ్చిన ఆర్డర్‌ను బట్టి అశ్విన్ కొందరు విదేశీయుల ద్వారా ఆ డ్రగ్‌ను బెంగళూరు చేరుస్తాడు. వీళ్లు నేరుగా రాహుల్‌ను కలవకుండా ఓ నిర్మానుష్య ప్రాంతంలో డ్రగ్ ప్యాకెట్ ఉంచుతారు. ఆ ఫొటో, లోకేషన్‌ను అశ్విన్‌కు వాట్సాప్ ద్వారా షేర్ చేస్తారు. ఈ వివరాలను రాహుల్‌కు పంపే అశ్విన్ ఆ డ్రగ్ ప్యాకెట్ తీసుకోమని చెప్తాడు. ఆపై ఉస్మాన్ సహా వివిధ పెడ్లర్స్‌కు సరఫరా చేయిస్తాడు.

రూ.2 వేలకు కొని రూ.10 వేలకు విక్రయం...

ఈ డ్రగ్‌ను గ్రాము రూ.2 వేలకు ఖరీదు చేస్తున్న అశ్విన్ దాన్ని ఉస్మాన్‌కు రూ.8 వేలకు సరఫరా చేస్తున్నాడు. ఈ మొత్తం నుంచి ట్రాన్స్‌పోర్టర్ రాహుల్‌ను కమీషన్ ఇస్తున్నాడు. ఉస్మాన్ కస్టమర్లకు గ్రాము రూ.10 వేలకు విక్రయిస్తున్నాడు. ఈ నెట్‌వర్క్‌పై హెచ్–న్యూ ఇన్‌స్పెక్టర్ జీఎస్ డానియేల్‌కు సమాచారం అందింది. ఆయన నేతృత్వంలో ఎస్సై సి.అనంతరాములు నేతృత్వంలోని బృందం నిఘా ఉంచింది. 50 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ డెలివరీ చేయడానికి వచ్చిన రాహుల్, తీసుకునే ప్రయత్నం చేసిన ఉస్మాన్‌లను చాదర్‌ఘాట్ వద్ద పట్టుకుంది. ఆ ఆపరేషన్‌లో చాదర్‌ఘాట్ పోలీసులతో కలిసి చేశాయని పేర్కొన్న డీసీపీ సుధీంద్ర కేసును తదుపరి చర్యల నిమిత్తం ఆ ఠాణాకే అప్పగించామని తెలిపారు. డ్రగ్స్ దందాపై వివరాలు తెలిసిన వాళ్లు 8712661601 నెంబర్‌కు కాల్ చేసి తెలపాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

ప్రజా ప్రయోజనాల కోసం రక్షణ భూములు ఇవ్వండి

రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్‌కు పొన్నం లేఖ

సాక్షి,సిటీ బ్యూరో : హైదరాబాద్‌లోని కొన్ని రక్షణ భూములను ప్రజా ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే విషయంలో సానుకూలంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్‌కు లేఖ రాశారు. శుక్రవారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రికి లేఖను అందజేశారు. ఇప్పటికే కొన్ని రక్షణ భూములను ప్రజా వినియోగానికి ఇవ్వడానికి అంగీకరించినందుకు భారత ప్రభుత్వానికి కతజ్ఞతలు తెలిపారు.అయితే ఈ భూములను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. నగర అభివద్ధికి, ప్రజా సౌకర్యానికి అధిక ప్రాముఖ్యత కలిగిన కొనసాగుతున్న మౌలిక సదుపాయాలు, మొబిలిటీ ప్రాజెక్టులను అమలు చేయడానికి భూమార్పిడి కీలకమన్నారు. అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్, సికింద్రాబాద్‌లో నివసిస్తున్న ప్రజలకు కీలకమైన మౌలిక సదుపాయాల అవసరాలను తీర్చడంలో, పౌర సౌకర్యాలను మెరుగుపరచడంలో రక్షణ శాఖ భూములు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కంటోన్మెంట్ నుండి తెలంగాణ ప్రభుత్వానికి యూజర్ ఛార్జీల భాగం కింద దాదాపు రూ.1,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బకాయిలను సకాలంలో క్లియరెన్స్ చేయడం వల్ల రక్షణ శాఖ పరిధిలో అభివద్ధి చెందుతున్న ప్రాంతాలలో ప్రజా మౌలిక సదుపాయాలు కల్పించడం వారికి అవసరమైన పౌర సేవలు కొనసాగించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు లభిస్తుందన్నారు.

కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించండి

గత కొనేళ్లుగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరగడం లేదని లేఖ ద్వారా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రజాస్వామ్య పాలన,స్థానిక ప్రాతినిధ్యం దష్ట్యా, ఈ ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ అభివద్ధికి కీలకమైన ఈ అంశాలపై రక్షణ మంత్రిత్వ శాఖ తగిన పరిశీలన చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ లేఖపై జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తదితరుల సంతకాలు చేశారు.

నైజీరియన్ డిపోర్టేషన్

నేపాల్ మీదుగా భారత్ వచ్చినట్లు గుర్తింపు



సాక్షి, సిటీబ్యూరో: ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా దేశంలోకి ప్రవేశించి, డ్రగ్ పెడ్లర్స్‌తో కలిసి సంచరిస్తున్న నైజీరియన్ జియోఫ్రీ డోజియోబిబ్‌ను ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు డిపోర్ట్ చేశారు. ఈ ప్రక్రియలో ఫారెనర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్‌ఆర్‌ఆర్‌ఓ) సహకరించిందని అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటించారు. నైజీరియాకు చెందిన జియోఫ్రీ డోజియోబిబ్ 2019లో అక్రమంగా దేశంలోకి వచ్చాడు. నైజీరియా నుంచి నేపాల్ చేరిన ఇతగాడు ఎలాంటి పత్రాలు లేకుండా రోడ్డు మార్గంలో ఢిల్లీ వచ్చాడు. అక్కడ నుంచి నగరానికి చేరుకున్న జియోఫ్రీ టోలీచౌకీలో అక్రమంగా నివసిస్తున్నాడు. బెంగళూరు, హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్న ఇతగాడు కొందరు డ్రగ్ పెడ్లర్స్‌తోనూ కలిసి తిరుగుతున్నట్లు ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ నేతృత్వంలోని బృందం జియోఫ్రీని టోలీచౌకీలో అదుపులోకి తీసుకుంది. విచారణలో పొంతన లేని సమాధానాలు చెప్పడం, ఎలాంటి పత్రాలు లేకపోవడంతో తనిఖీలు చేసింది. అతడి వద్ద ఎలాంటి మాదకద్రవ్యాలు లభించకపోవడంతో అక్రమంగా ఉంటున్న ఆరోపణలపై సీసీఎస్‌లోని డిటెన్షన్ సెంటర్‌లో ఉంచింది. నగర పోలీసు ఉన్నతాధికారులు, ఎఫ్‌ఆర్‌ఆర్‌ఓ అధికారుల సాయంతో అవసరమైన ప్రక్రియలు పూర్తి చేశారు. ఆపై ముంబై విమానాశ్రయం నుంచి నైజీరియాకు డిపోర్టేషన్ ప్రక్రియ ద్వారా బలవంతంగా తిప్పి పంపింది.

మమ్మీ నన్ను క్షమించు.. నాకు బతకాలని లేదు

మైనర్ బాలిక ఆత్మహత్య..

కుత్బుల్లాపూర్: మమ్మీ నన్ను క్షమించు.. నాకు బతకాలని లేదు.. నీకు కూడా తెలుసు ఆ శ్రీను గాడు.. వాళ్ల అమ్మ, నాన్నలు.. మనకు మనశాంతి లేకుండా చేస్తున్నారు.. రోజూ ఇంటి వద్ద జరిగే గొడవ భరించలేకపోతున్నా.. అంటూ ఓ మైనర్ బాలిక సూసైడ్‌నెట్ రాసి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. కొంపల్లి పోచమ్మగడ్డకు చెందిన అనూరాధకు ఇద్దరు ఆడపిల్లలు. కాగా ప్రైవేట్ ఫైనాన్స్‌లో అప్పు తీసుకున్న ఆమె భర్త వారి వేధింపులు భరించలేక చనిపోయాడు. అనూరాధ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. తండ్రి చేసిన అప్పులతో ఫైవ్ స్టార్ ఫైనాన్స్ సిబ్బంది బకాయి చెల్లించాలని ఇటీవల వేధింపులకు గురి చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో అనురాధ బావ శ్రీను ఎలాగైనా అనురాధ, ఇద్దరు కుమార్తెలను కుటుంబాన్ని ఇంటి నుండి గెంటేయాలని కొద్ది రోజులుగా వేధింపులకు గురి చేస్తున్నాడు. దసరా పండుగ రోజు అనూరాధ ఇంట్లోని లేని సమయంలో వచ్చిన శ్రీను తనకు రావల్సిన డబ్బులు ఇవ్వాలని గొడవ చేశాడు. అవమానకరంగా మాట్లాడటంతో మానసికంగా కుంగిపోయిన మైనర్ బాలిక ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన చావుకు కారణమైన శ్రీను ను కఠినంగా శిక్షించాలని సూసైడ్ నోట్‌లో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంజీబీఎస్‌ను పరిశీలించిన ఆర్టీసీ ఎండీ



బస్టాండును పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి



ప్రయాణికులతో మాట్లాడుతూ..

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి శుక్రవారం మహాత్మా గాంధీ, జూబ్లీ బస్‌స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణికుల సదుపాయాలను పరిశీలించారు. పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, సీటింగ్, తదితర సదుపాయాలను పరిశీలించారు.అలాగే బస్‌స్టేషన్లలో ప్రయాణికుల భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రయాణికులకు మరింత భద్రత, సౌకర్యవంతమైన ప్రయాణ వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే ఈవీ బస్సుల చార్జింగ్ స్టేషన్లను పరిశీలించారు. అనంతరం ఆయన స్వయంగా కొన్ని బస్సుల్లోకి వెళ్లి వాటి శుభ్రత, సీటింగ్ సౌకర్యాలు, సాంకేతిక పరిస్థితులను సమీక్షించారు. అలాగే సంస్థ సిబ్బందితో, ప్రయాణికులతో ముచ్చటించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అధికారులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వెంకన్న, ఖుస్రు షా ఖాన్,జాయింట్ డైరెక్టర్ నర్మద,రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అజయ్ రెడ్డి(ఫైల్)

మేడ్చల్ రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పోతారం గ్రామానికి చెందిన బడికోల్ భాస్కర్ రెడ్డి కుటుంబం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని జమున వెంచర్ లో నివాసముంటోంది. భాస్కర్ రెడ్డి కుమారుడు అజయ్ రెడ్డి(21) డిగ్రీ చదువుతూ తండ్రి నిర్వహించే వ్యాపారంలో చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. గురువారం దసరా పండుగ సందర్భంగా కాళకల్‌లో ఉన్న స్నేహితులను కలిసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. రాత్రి 10.30 గంటల ప్రాంతంలో తిరిగి వస్తుండగా రేకుల బావి ప్రాంతానికి సమీపంలో వాహనం అదుపు తప్పి, గుంతలో పడిపోయాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఫోను చోరీ... ఖాతా ఖాళీ!

ప్రయాణికుడి సెల్‌ఫోన్ తస్కరించిన ఆటోడ్రైవర్

- మరో ఇద్దరితో కలిసి ఫోన్‌పే ద్వారా నగదు స్వాహా
- ముగ్గురిని అరెస్టు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు



హుసేన్



మొయినుద్దీన్



సయ్యద్ సల్మాన్

సాక్షి, సిటీబ్యూరో: తన ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికుడి సెల్‌ఫోన్ తస్కరించిన ఆటోడ్రైవర్ అందులో ఉన్న ఫోన్‌పే యాప్ ఆధారంగా బాధితుడి బ్యాంకు ఖాతా ఖాళీ చేశాడు. ఈ వ్యవహారంలో అతడికి కారు డ్రైవర్‌తో పాటు కూరగాయల వ్యాపారి సహకరించాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ దార కవిత శుక్రవారం వెల్లడించారు. ఈస్ట్ ఆనంద్ బాగ్‌లోని ఎన్ఎండీసీ కాలనీకి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి (68) గత నెల 17 రాత్రి ఉప్పల్ నుంచి తార్నాక వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఆ సమయంలో బాలానగర్‌కు చెందిన మహ్మద్ మొయినుద్దీన్ నడిపే షేర్ ఆటో ఎక్కారు. అదే ఆటోలో మొయినుద్దీన్ స్నేహితుడైన కారు డ్రైవర్ మహ్మద్ సయ్యద్ సల్మాన్ కూడా ఉన్నాడు. ఆటో ఎక్కిన వెంటనే తనకు చెల్లించాల్సిన మొత్తం ఫోన్‌పే ద్వారా బదిలీ చేయాలంటూ బాధితుడిని మొయినుద్దీన్ కోరాడు. దీంతో తన ఫోన్ అన్‌లాక్ చేసి, దానిలోని ఫోన్‌పే యాప్ ఓపెన్ చేసిన బాధితుడు నిర్ణీత మొత్తం క్యూర్ కోడ్ స్కానింగ్ ద్వారా మొయినుద్దీన్‌కు బదిలీ చేశాడు. ఆ సందర్భంలో అతగాడు బాధితుడి ఫోన్‌తో పాటు ఫోన్‌పేలకు సంబంధించిన ఆన్‌లాక్, నగదు బదిలీకి సంబంధించిన పిన్స్ తెలుసుకున్నాడు. ఆపై ఆటోలో ప్రయాణిస్తుండగా సల్మాన్‌తో కలిసి బాధితుడి దృష్టి మరల్చడం ద్వారా ఫోన్ తస్కరించాడు. ఈ విషయం గమనించని బాధితుడు తార్నాకలో దిగిపోయారు. తన ఇంటికి చేరిన తరవాత ఫోన్ పోయిన విషయం గుర్తించిన బాధితుడు మర్నాడు సిమ్ బ్లాక్ చేయించి వేరేది తీసుకున్నారు. బాధితుడి ఆ ఫోన్‌లోని యాప్ వినియోగించిన నిందితులు 17 నుంచి 20వ తేదీ వరకు 13 లావాదేవీల ద్వారా రూ.1.95 లక్షలు కాజేశారు. అన్‌లాక్, నగదు పేమెంట్స్‌కు సంబంధించిన పిన్స్ తెలిసి ఉండటంతో వీరి పని తేలికైంది. పెట్రోల్ బంకుల్లో చెల్లింపులకు, బదిలీ ద్వారా నగదు తీసుకోవడం చేసి కాజేశారు. ఈ మొత్తంలో కొంత ఎంఎం పహాడ్‌కు చెందిన కూరగాయల వ్యాపారి మహ్మద్ హుస్సేన్ సహకారంతో స్వాహా చేశారు. అతడి సహకారంతో బాధితుడి ఫోన్‌పే ఖాతా నుంచి రూ.90 వేల వివిధ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌కి పంపారు. అట్నుంచి హుస్సేన్ ఖాతాలోకి మళ్లించి నగదు డ్రా చేసి ఇచ్చాడు. ఈ మొత్తాన్ని ముగ్గురు నిందితులూ పంచుకున్నారు. గత నెల 20న రూ.5 వేల లావాదేవీకి సంబంధించిన సందేశం తన ఫోన్‌కు రావడంతో బాధితుడు షాక్ అయ్యాడు. బ్యాంకు ఖాతాను సరిచూసుకోగా మొత్తం రూ.1.95 లక్షలు పోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రమోద్ కుమార్ నేతృత్వంలో ఎస్సై షేక్ అజీజ్ తన బృందంతో ఈ కేసు దర్యాప్తు చేశారు. బ్యాంకు ఖాతాల వివరాలతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి ముగ్గురు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు.

నగరంలో నేడు

- ఆధ్యాత్మిక గురువు అచ్యుత గోపి భారత దేశ యాత్ర సందర్భంగా గచ్చిబౌలి బ్లైండర్ హిల్స్‌లోని గోల్ఫ్ కోర్సులో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 4.30గంటల వరకు సంగీత కార్యక్రమం
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, చిత్ర ప్రదర్శన
- మాదాపూర్‌లోని శిల్పారామంలోని హస్తకళా ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఇద్దరు దోపిడీ దొంగల అరెస్టు



మహ్మద్ సొహైల్



పసుపులేటి అన్వేష్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బోరబండ ఎస్సార్టీనగర్‌లో నివసించే పసుపులేటి అన్వేష్ అలియాస్ అన్నూ(24) ఆఫీస్‌బాయ్‌గా పని చేస్తుండగా, బోరబండకే చెందిన మహ్మద్ సోహైల్(24) డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నాడు. వీరికి అల్లాపూర్‌కు చెందిన ఎండీ అజర్(23)తో పాటు మరో మైనర్ బాలుడు తోడయ్యాడు. వీరంతా రాత్రిపూట వీధుల్లో తిరుగుతూ ఒంటరిగా వెళ్తున్నవారిని లక్ష్యంగా చేసుకుని దారికాచి కత్తులు, బ్లేడ్లతో బెదిరిస్తూ సెల్‌ఫోన్లు, గొలుసులు, నగదు దోచుకుంటున్నారు. గత నెల 30వ తేదీన సినిమా షూటింగ్‌ల్లో పనిచేసే రహమత్‌నగర్ నివాసి సాదిక్ షూటింగ్ ముగించుకుని వెళ్తుండగా మెట్రో పిల్లర్ నెంబర్ 1540 వద్ద నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై వచ్చిన ఈ నలుగురు అడ్డగించి కొట్టి సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. అదే రోజు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జూబ్లీహిల్స్ క్రైమ్ పోలీసులు యూసుఫ్‌గూడ చెక్‌పోస్టులో నిఘా వేసి వీరిని అదుపులోకి తీసుకున్నారు. సెల్‌ఫోన్‌తో పాటు డ్యూయో బైక్‌ను స్వాధీనం చేసుకుని అన్వేష్, సోహైల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు అజర్ పరారీలో ఉండగా, మైనర్ బాలుడిని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు.

ఎగ్జిబిషన్‌కు ఏర్పాట్లు షురూ

అబిడ్స్: ఎగ్జిబిషన్ (నుమాయిష్ 2026)కు ఏర్పాట్లు ప్రారంభించినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఆర్.సుకేష్‌రెడ్డి వెల్లడించారు. నూతన ఉపాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం ఎగ్జిబిషన్ ఏర్పాట్లపై వివరాలు వెల్లడించారు. జనవరి 1న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రారంభమయ్యే అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనశాల ఫిబ్రవరి 15 వరకు కొనసాగుతుందన్నారు. దాదాపు 40 సబ్ కమిటీలు ఏర్పాటు చేసి ఎగ్జిబిషన్ నిర్వహిస్తామన్నారు. దేశంలోని నూతన ఉత్పత్తులు మహిళా రంగాల తయారీతో పాటు పలు రంగాల్లో కొత్త కొత్త తరహా ఉత్పత్తుల స్టాళ్ల ఏర్పాట్లుకు ఆహ్వానిస్తున్నట్లు ఆయన వివరించారు. ఎగ్జిబిషన్ సొసైటీ నూతన కమిటీ, సొసైటీ సభ్యులు అందరి సహకారంతో రాబోయే ఎగ్జిబిషన్‌ను విజయవంతంగా చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు.

పెట్టుబడి పేరుతో మోసం

ముగ్గురి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

చిక్కడపల్లి: ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేసిన కేసులో ముగ్గురు సైబర్ నేరస్తులను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు.పోలీసులు తెలిపిన మేరకు.. మైలార్ దేవ్‌పల్లికి చెందిన మహ్మద్ జహంగీర్ అహ్మద్(40), గోల్నాకకు చెందిన మహ్మద్ జహంగీర్ ఫహామి అలియాస్ ఫరాజ్(27), మహ్మక్ అఫ్రోజ్(20)లు కమీషన్ తీసుకొని సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చుతున్నారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడి పేరుతో చిక్కడపల్లికి చెందిన మహిళను మోసం చేసిన సైబర్ నేరగాళ్లు ఆమె వద్ద నుంచి పలు దఫాలుగా రూ.94,800 కాజేశారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న చిక్కడపల్లి పోలీసులు ఖాతాలను గుర్తించారు. బ్యాంకు ఖాతాలు సమకూర్చిన అహ్మద్, ఫరాద్, అఫ్రోజ్‌ను అరెస్ట్‌చేశారు. అహ్మద్‌పై మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. చిక్కడపల్లి డీఐ శంకర్ ముగ్గురు నేరగాళ్లను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులో ప్రధాన నిందుతులైన టెలిగ్రామ్ ఐడి జ్యోతి, నాగండ్ల పూర్ణాచారి , దినేష్‌కుమార్, సాజిద్‌లు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వీరిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టినట్లు డీఐ శంకర్ మలోతు శుక్రవారం తెలిపారు.

కేకే నివాసంలో దసరా సంబురం


కేకేను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

బంజారాహిల్స్: ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు కే కేశవరావు నివాసంలో దసరా పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కేకే అభిమానులు, నేతలు, కార్యకర్తలు బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎన్‌బీటీనగర్‌లో ఉన్న ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేద పండితులు పండుగను పురస్కరించుకుని ఆయనకు ఆశీర్వచనాలు అందించారు.

ఘనంగా చండీ హోమం


పూజలు నిర్వహిస్తున్న కంజర్ల విజయలక్ష్మి

రహమత్‌నగర్: బోరబండలోని మల్లన్న స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. జూబ్లీ హిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు కంజర్ల విజయలక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకులు రాజు యాదవ్, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వాక్‌వేలో నిలిచిన వరద



బంజారాహిల్స్: వర్షాలు తగ్గుముఖం పట్టినా బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును ఆనుకుని ఉన్న జీహెచ్‌ఎంసీ వాక్ వేలో పలుచోట్ల వరద నిలిచిపోయి వాకర్లు, సందర్శకులకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతుంది. కేబీఆర్ పార్కు లోపల చెరువులు, కుంటలు నిండిపోవడంతో ఈ వరదంతా వాక్‌వేను ముంచెత్తుతుంది. వాక్‌వేల నుంచి వరద బయటకు వెళ్లే మార్గాలు మూసుకుపోవడంతో ఈ సమస్య తలెత్తుతుంది. గత నెల రోజుల నుంచి వాక్‌వేలో వరద నిలిచి బురదతో పాటు పారిశుధ్య సమస్య తీవ్రరూపం దాల్చింది. జీహెచ్‌ఎంసీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాక్‌వేలో వరద, బురద లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

5న 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్ నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటలవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'హోలిస్టిక్ ట్రయాంగిల్ ఆఫ్ హీలింగ్ బ్యాక్ పెయిన్' అనే అంశంపై ఒడిశా యూత్ ఐకాన్-2018, బెస్ట్ ఫిజియోథెరపిస్ట్-2017 గుర్తింపు పొందిన ప్రొఫెసర్ డాక్టర్ ప్రేమ్‌రంజన్ ఓజా ఉపన్యాసం ఇస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

కనువిందు.. కూచిపూడి



మాదాపూర్: దసరా ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సిద్ధేంద్ర కూచిపూడి డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ గురువు సుధా స్రవంతి, సాయిగౌరి శిష్య బృందాలు కూచిపూడి నృత్యప్రదర్శనలతో అలరించారు. శ్రీ విఘ్నరాజం భజే, రామరామ, మహా గణపతిం, కృష్ణం కలయసఖి సుందరం, నటేశకౌతం, శ్రీ చక్రరాజ, అంబే అంబికే, ఓంకారం సృష్టిసారం, దశావతారాలు, నమోనమో దుర్గే, శివాష్టకం, మహిషాసుర మర్ధిని తదితర అంశాలను కళాకారులు లిఖిత, లలిత, లికితేష్, నిత్య, ధన్విత, కీర్తన, విజ్ఞత తదితరులు ప్రదర్శించారు. శిల్పారామంలో ఈనెల 5వ తేదీ వరకు కొనసాగనున్న మేళాలో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల చేనేత, హస్తకళా, గృహాలంకరణ ఉత్పత్తులను నగరవాసులు కొనుగోలు చేస్తున్నారు.

ఆక్రమణల చెరలో నడకదారులు!

- రోడ్డెక్కుతున్న పాదచారులు
- ఫ్లెక్సీలతో నిండిపోతున్న ఫుట్‌పాత్‌లు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- కన్నెత్తి చూడని జీహెచ్‌ఎంసీ అధికారులు
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్‌లలో 78 కిలోమీటర్ల మేర ఫుట్‌పాత్‌ల కబ్జా


బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు ఫుట్‌పాత్‌పై ఫ్లెక్సీల కోసం ఏర్పాటు చేసిన కర్రలు

బంజారాహిల్స్: పాదచారులు నడవాల్సిన నడకదారులు ఒకవైపు ఆక్రమణలు, చిరువ్యాపారాలతో, మరోవైపు ఫ్లెక్సీలతో కబ్జాకు గురవుతున్నాయి. దర్జాగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా, ఆక్రమిస్తున్నా అటు జీహెచ్‌ఎంసీ గానీ, ఇటు ట్రాఫిక్ పోలీసులు గానీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఫుట్‌పాత్‌లు అంటేనే పాదచారుల కోసం కాదు.. ఆక్రమణల కోసం అనే పద్ధతిలో నడవలేని దుస్థితికి దిగజారాయి.

- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, కేబీఆర్ పార్కు, చింతల్‌బస్తీ, పంజగుట్ట, అమీర్‌పేట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, శ్రీనగర్‌కాలనీ, ఇందిరానగర్, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాతలన్నీ ఏనాడో ఆక్రమణలకు గురయ్యాయి.
- ఇందిరానగర్, కృష్ణానగర్, శ్రీనగర్‌కాలనీ ప్రాంతాల్లో ఫుట్‌పాత్ అనేది కనిపించకుండాపోతోంది.
- బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు ప్రధాన గేటు ముందు నిత్యం వేలాది మంది వాకర్లు, సందర్శకులు, నడిచే ఫుట్‌పాత్‌పై అక్రమంగా, అడ్డగోలుగా ఏర్పాటవుతున్న ఫ్లెక్సీలతో నడవలేని దుస్థితిలో రోడ్డును ఆశ్రయించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. జీహెచ్‌ఎంసీ చెక్‌పోస్టులో సైతం ఫుట్‌పాత్‌ల పైకి వెళ్లకుండా భారీ ఫ్లెక్సీలను కర్రలు, తాళ్లు, వైర్లతో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ఏర్పాటు చేశారు.
- ఫిలింనగర్‌లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. పెద్దమ్మ గుడికి వచ్చే భక్తులు ఫుట్‌పాత్‌పై నడుద్దామంటే అందుబాటులో లేకుండాపోయాయి. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-10లో, 36లోనూ ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు న్యూసెన్స్‌గా మారాయి.
- పంజగుట్ట ప్రధాన రహదారిలో అమీర్‌పేట దాకా ఫుట్‌పాత్ అనే పదం ఏనాడో కనుమరుగైపోయింది. ఎన్టీఆర్‌మార్గ్‌లోనూ సందర్శకులు నడవలేని స్థితిలో ఫుట్‌పాతలన్నీ కబ్జాలకు గురయ్యాయి. లక్డీకాపూల్‌తో పాటు మాసబ్‌ట్యాంక్, కేర్ ఆస్పత్రి రోడ్డులో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఫుట్‌పాత్‌లను పాదచారులకు అందుబాటులోకి తీసుకురావాలని హైకోర్టు ఏనాడో జీహెచ్‌ఎంసీని ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలు ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు.
- అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలను తొలగించడానికి జీహెచ్‌ఎంసీతో పాటు ట్రాఫిక్ పోలీసులు వెనుకడుగు వేస్తున్నారు. ఇటీవల బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్సార్‌నగర్, సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్ ఆక్రమణలపై కొరఢా ఝళిపించి కొంత హడావుడి చేసినా తిరిగి ఏర్పాటయ్యాయి. నిఘా లేకపోవడం, పర్యవేక్షణ లోపం కారణంగా పంజగుట్ట చౌరస్తాలోని మెరీడియన్ హోటల్‌కు రెండు వైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలు నిత్యకృత్యమయ్యాయి.
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫుట్‌పాత్ ఆక్రమణలపై సరైన ప్రణాళికతో ఆదేశాలు జారీ చేశారు తప్పితే నడక మార్గాలు అందుబాటులో వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి


కంటి వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

శ్రీనగర్‌కాలనీ: కంటి సమస్యల పట్ల అశ్రద్ధ వద్దని, ఏదైనా కంటి సమస్య ఉంటే వెంటనే కంటి వైద్యుడిని సంప్రదించి తగు వైద్యం తీసుకోవాలని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్‌యాదవ్ సూచించారు. శుక్రవారం షేక్‌పేటలో ఏకేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు బస్తీల్లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాలను ఆయన సందర్శించారు. కంటి వైద్యులు స్థానికులకు కంటి పరీక్షలు నిర్వహించి, తగు సలహాలు, సూచనలు చేసి మందులను అందించారు. ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, కంటి సమస్యలను అశ్రద్ధ చేయవద్దన్నారు. నేతలు డాక్టర్ కళ్లెం శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, ఒమర్, ఆసిఫ్, సాయికిరణ్ పాల్గొన్నారు.

సందడిగా 'ఆర్యవైశ్య దసరా మిలన్'


సమ్మేళనంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు

రహమత్‌నగర్: ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో శుక్రవారం దసరా మిలన్ (ఆత్మీయ సమ్మేళనం) స్థానిక వాసవి మాత ఆలయంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నిజామాబాద్ శ్రీను గుప్తా మాట్లాడుతూ... ఆత్మీయ సమ్మేళనంతో సంబధాలు ప్రతిష్టమై, ఐక్యతాభావం పెరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం దసరా పర్వదినం తరువాత ఆత్మీయ సమ్మేళన్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాసవి మాత కృపతో అందరు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి మధుసూదన్ గుప్తా, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి రాజేష్ గుప్తా, కమిటీ సభ్యులు కృష్ణమూర్తి గుప్తా, మల్లేశ్‌గుప్తా, నాగరాజు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

'ఆశ్రయ్-ఆకృతి' డైరెక్టర్ బాబుకు ప్రతిష్టాత్మక అవార్డు


అవార్డు అందుకుంటున్న డైరెక్టర్ డీపీకే బాబు

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీ ఆశ్రయ్-ఆకృతి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డీపీకే బాబుకు ప్రతిష్టాత్మక మహాత్మా-2025 అవార్డు లభించింది. ఢిల్లీలో ఆదిత్యా బిర్లా గ్రూప్ సహకారంతో నడిచే మహాత్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సోషియల్ గుడ్-ఇంపాక్ట్ నాన్‌ప్రాఫిట్ ఆర్గనైజేషన్ కేటగిరీలో ఆశ్రయ్-ఆకృతి స్వచ్ఛంద సంస్థ చేసిన సేవలకు మహాత్మా ఫౌండేషన్ ప్రతినిధులు అవార్డును సంస్థ డైరెక్టర్ డీపీకే బాబుకు అవార్డును అందించారు. ఈ అవార్డు నాలో మరింత బాధ్యతను పెంచిందని, సంస్థ మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లి బధిరులకు మరింత సేవలకు అందించనున్నట్లు డీపీకే బాబు పేర్కొన్నారు.

మహానుభావులు పుస్తకావిష్కరణ


మహానుభావులు పుస్తకావిష్కరణలో అతిథులు

సనత్‌నగర్: రచయిత నందిరాజు రాజరాజేశ్వరి రచించిన 'మహానుభావులు' పుస్తకావిష్కరణ కార్యక్రమం జెక్‌కాలనీలోని గాంధీవనంలో జరిగింది. విశ్వమానవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సోమా వెంకట్, వ్యవస్థాపకుడు మస్తాన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రీన్‌సిటీ అధినేత కే. సుబ్బరాజు పుస్తకావిష్కరణ చేయగా, సీహెచ్.అనంతరెడ్డి, డాక్టర్ మల్లు ప్రసాద్, విశ్వనాథరాజు, తెలంగాణ బాలోత్సవం కార్యదర్శి సోమయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమా వెంకట్ మాట్లాడుతూ.. విశ్వ మానవ సంక్షేమ సంఘం 1987లో స్థాపించబడి 38 ఏళ్లుగా సేవ చేస్తున్నట్లు చెప్పారు. తాము మురికివాడల్లో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో 62 ట్యూషన్ సెంటర్లు నడుపుతున్నామని, వీటి ద్వారా పిల్లలకు చదువుతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సమయపాలన, మానవత్వం, భారతీయ సంస్కృతిపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అవేకాకుండా స్వచ్ఛ భారత్, ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం మస్తాన్‌రావు, జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్ మాట్లాడారు. విశ్వ మానవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మురికివాడల్లో ఎక్కువగా బీసీలు, ఎస్సీ, ఎస్టీలు ఉన్నచోట ట్యూషన్ సెంటర్లను ప్రారంభించి సేవలు అందించడం శుభపరిణామం అన్నారు. మహానుభావులు పుస్తకంలో గాంధీ, నెహ్రూ, తిలక్, గోఖలే, పొట్టి శ్రీరాములు, అంబేద్కర్, దామోదరం సంజీవయ్య లాంటి స్వతంత్ర్య సమరయోధులు, ఐన్‌స్టీన్, ఎడిసన్, సీవీ రామన్ లాంటి వారి చరిత్రలు, మంచినీటి కథలు ఉన్నాయని చెప్పారు.

సత్తా చాటిన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని



రాయదుర్గం: రాష్ట్ర స్థాయి పోటీలలో రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాజశ్రీ సత్తా చాటారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో రాయదుర్గం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సత్తా చాటింది. గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీలో అహింస, ప్రకృతి పట్ల ప్రేమతో సహా జాతిపిత మహాత్మాగాంధీ యొక్క విలువలు, బోధనలను వ్యక్తీకరించడంతో రాజశ్రీకి ఎల్బీ స్టేడియంలో రూ.5వేల నగదు బహుమతి ,సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు.

గంజాయి సేవిస్తున్న యువకుడి అరెస్టు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సేవిస్తున్న ఓ యువకుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఎన్‌బీటీనగర్‌లో నివసిస్తూ డెకరేషన్ వర్క్ చేసే జి.ఆంజనేయులు అలియాస్ అంజి కొంతకాలంగా గంజాయి సేవిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు పక్కాగా దాడులు జరిపి సర్కార్ బడి ముందు గంజాయి సేవిస్తున్న ఆంజనేయులను శుక్రవారం మధ్యాహ్నం పట్టుకున్నారు. ఆయన నుంచి 5 గ్రాముల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

సెల్‌ఫోన్ స్నాచర్ అరెస్టు

ఫిలింనగర్: సెల్‌ఫోన్ స్నాచింగ్‌కు పాల్పడిన యువకుడిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరక... చర్లపల్లి సెయింట్ జోసఫ్‌కాలనీకి చెందిన డ్రైవర్ చిన్నబత్తిని రాజ్‌కుమార్(40) గత నెల 16న మధ్యాహ్నం 12 గంటల సమయంలో షేక్‌పేట డీ-మార్ట్ సమీపంలో రెడీమిక్స్ వాహనాన్ని పార్కు చేసి ఉన్నాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ముగ్గురు వ్యక్తులు యాక్టివా వాహనంపై వచ్చి రెడీమిక్స్ వాహనం ముందు నిలిపి అతని వద్దకు వచ్చి పర్సు అడిగారు. భయంతో రాజ్‌కుమార్ వారికి పర్సు ఇచ్చాడు. అందులో ఎస్‌బీఐ కార్డు మాత్రమే ఉండగా పిన్ నెంబర్ చెప్పాలని డిమాండ్ చేయగా అందుకు నిరాకరించాడు. దీంతో అందులోని ఓ వ్యక్తి కత్తితో దాడి చేయగా ఎడమ చేతి మణికట్టుపై గాయమైంది. దీంతో బాధితుడు వారికి రాంగ్ పిన్ నెంబర్‌ను ఇచ్చి వెళ్లిపోయాడు. అయితే అతని వద్ద పర్సు, సెల్‌ఫోన్‌ను తీసుకుని కత్తితో దాడి చేసిన ముగ్గురి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సెల్‌ఫోన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఫహాద్ అలీఖాన్ (20)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా అలయ్ బలయ్


ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో జరిగిన అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

బంజారాహిల్స్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ అశోకవనంలో శుక్రవారం కాలనీ వాసుల అలయ్ బలయ్ కార్యక్రమం కన్నులపండువగా ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. కాలనీవాసులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆలింగనాలతో దసరా పండుగను కన్నులపండువగా నిర్వహించుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ సొసైటీ అధ్యక్షుడు కొలను హనుమంతరెడ్డి, సందీప్‌రెడ్డి, ఉమా మాధవరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీ బీ వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి ఇ.పెద్దిరెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులతో పాటు 200 మంది దాకా ఈ కార్యక్రమంలో పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు. ప్రతియేటా దసరా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని క్రమంతప్పకుండా నిర్వహిస్తుంటామని, పండుగ విశేషాలను ఒకరితో ఒకరు పంచుకోవడంతో పాటు ఆనందంగా జరపడానికి అలయ్ బలయ్ బాగా దోహదపడుతుందని కాలనీవాసులు తెలిపారు. మహిళలు కూడా ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భవానీ అమ్మవారికి వెండి కిరీటం


అమ్మవారి పూజల్లో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని కమాన్ మిథిలానగర్ రోడ్డులో శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో కొలువుదీరిన శ్రీభవానీ అమ్మవారికి దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని వెండి కిరీటంతో పాటు వెండి హస్తభూషణాలు, శంఖు చక్రాలు తొడిగారు. గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఈ వేడుకలో పాల్గొని వెండి అలంకార వస్తువులను అమ్మవారికి అందజేశారు. ఇందులో భాగంగా మేయర్‌కు ఆలయ వర్గాలు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. అమ్మవారి సన్నిధిలో మేయర్ విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు పి.వేణుగోపాల్‌గౌడ్, గౌడ సంఘం నాయకుడు ఆర్.బాలరాజ్‌గౌడ్, కోశాధికారి ఎస్.శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు డైరెక్టర్లు జి.శ్రీనివాస్‌గౌడ్, ఎన్.శారదమ్మ, బి.సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

వైభోగం.. శ్రీవారి చక్రస్నానం


శ్రీవారి చక్రస్నానంలో పాల్గొన్న ఆలయ చైర్మన సిపిరి అర్జున్‌యాదవ్

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గత నెల 24వ తేదీన ప్రారంభమైన శ్రీవెంకటేశ్వరస్వామి వారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున స్వామివారికి అభిషేకం నిర్వహించారు. పూర్ణాహుతి, చక్రస్నానం, శ్రీపుష్పయాగం తదితర వేడుకలు కూడా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ సిపిరి అర్జున్‌యాదవ్‌తో పాటు ఈఓ, ట్రస్టీబోర్డు సభ్యులు పాల్గొన్నారు. వేడుకను తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో విచ్చేయగా, ఆలయంలో జాతర వాతావరణం నెలకొంది. విశేష పూజలో భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతిరోజూ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగగా ముగింపు వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. సాయంత్రం జరిగిన శ్రీపుష్పయాగం కనులపండువగా జరిగింది.

నృత్యం.. నయనానందకరం





బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-18లోని శ్రీసీతారామ స్వామి దేవాలయ సముదాయంలో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా దసరా పండుగ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు వివిధ సంస్థల ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీత నృత్యోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నృత్యోపచార సంస్థచే భరతనాట్యం, థిల్లానా ఆర్ట్స్ ద్వారా భరతనాట్యంలో పాల్గొన్న నృత్యకళాకారులు దేవిని స్తుతిస్తూ చేసిన శాస్త్రీయ నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. నృత్యాలను తిలకించేందుకు ఆహూతులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.

వేడుకగా రావణ దహనం

- బోరబండలో పాల్గొన్న ఎమ్మెల్సీ విజయశాంతి
- నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో అట్టహాసంగా రావణ దహనం


రావణ దహనంలో పాల్గొన్న కార్పొరేటర్ విజయారెడ్డి



బంజారాహిల్స్: అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి సూచికగా విజయదశమి వేడుకలను బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్ కట్టమైసమ్మ గ్రౌండ్‌లో అంగరంగ వైభవంగా ఉత్సాహంగా నిర్వహించారు. ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి, ఇందిరానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మోహన్‌యాదవ్‌తో పాటు పెద్ద సంఖ్యలో బస్తీవాసులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొనగా విజయారెడ్డి సంప్రదాయ పూజలు నిర్వహించి రావణ దహనాన్ని ప్రారంభించారు. మూడు గంటల పాటు ఇక్కడ యువతీ యువకుల కేరింతలు, ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి.

ఎన్‌బీటీనగర్‌లో రావణ దహనం

బంజారాహిల్స్: దసరా పండుగను పురస్కరించుకుని గురువారం రాత్రి బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్‌లో రావణదహనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విచ్చేసిన బస్తీవాసులు కేరింతలు కొడుతుండగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ రావణ దహనం పూజలు నిర్వహించారు. బాణాసంచా మోతలతో ఈ ప్రాంతం దద్దరిల్లింది.

రహమత్‌నగర్: బోరబండ, రహమత్‌నగర్ డివిజన్‌లలో గురువారం రాత్రి నిర్వహించిన రావణ దహన కార్యక్రమాలకు జనం పోటెత్తారు. కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఆధ్వర్యంలో బోరబండ బస్‌స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన రావణ దహణ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటి, ఎమ్మెల్సీ విజయశాంతి హాజయ్యారు. జూబ్లీహిల్స్ నియోజవర్గం కాంగ్రెస్ నాయకుడు నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో రహమత్‌నగర్ నిమ్స్‌మే మైదానం వద్ద ఏర్పాటు చేసిన రావణ దహన కార్యక్రమం ఆకట్టుకుంది. యూసుఫ్‌గూడ చెక్ పోస్టు నుంచి మధురానగర్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగింది. నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్, రమేష్ యాదవ్,వెంకట్ యాదవ్, దేవిరెడ్డి నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాంలీలా మైదానంలో...

ఖైరతాబాద్: చింతలబస్తీలోని రాంలీలా మైదానంలో దసరా సమ్మేళనం, రావణ దహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సమితి చైర్మన్ ఎం.ఎస్.ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పెద్ద ఎత్తున జనం పాల్గొన్నారు. హనుమాన్ వేషధారణలతో పలువురు రావణాసుర బొమ్మకు నిప్పంటించారు. సమితి ప్రధాన కార్యదర్శి మనోహర్ బాబు, కోశాధికారి సుధాకర్, సమితి సభ్యులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ విజయశాంతి, బాబాఫసియుద్దీన్


చిన్నారులతో కాంగ్రెస్ నాయకుడు నవీన్ యాదవ్

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, శనివారం, 4, అక్టోబర్, 2025



స్పోర్ట్స్.. స్టార్స్..

స్పోర్ట్స్ సిటీగా హైదరాబాద్‌కు గుర్తింపు

* సరికొత్త గేమ్స్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా సెలబ్రిటీలు
* గతంలో పికిల్ బాల్ వంటి వాటికి సమంత
* ప్రస్తుతం ఆర్చరీకి రామ్ చరణ్, రేసింగ్‌కి చైతూ
* మరికొన్ని ఆదరణ పెరుగుతున్న గేమ్స్‌కు సెలబ్రిటీ టచ్

హాకీ క్రీడలు మొదలు ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో ఫేవరెట్ అయినటువంటి క్రికెట్ వరకూ ఏ క్రీడ అయినా హైదరాబాద్ నగరానికి ఇక్కడి క్రీడాకారులకు అవినాభావ సంబంధం ఉంది. ప్రస్తుతం ప్రఖ్యాతి చెందిన టెన్నిస్ మొదలు ఈమధ్య భారత్‌కు ఒలింపిక్ పథకాలు తీసుకొచ్చిన బ్యాడ్మింటన్ వరకూ హైదరాబాద్ వేదికగా ప్రసిద్ధ క్రీడలుగా ఉనికిని కొనసాగిస్తున్నారు. దీనికి తగ్గట్టుగానే స్థానిక క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తమ ప్రశస్తిని, క్రీడా నైపుణ్యాలను ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ క్రీడలకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది. ఈ మధ్య కాలంలో పలువురు సెలబ్రిటీలు సరికొత్త క్రీడలను ప్రోత్సహించాలని వాటికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలుస్తున్నారు. ఈమధ్య వింటున్న పికిల్ బాల్ వంటి క్రీడలు మరింత అభివృద్ధిలోకి వస్తున్నాయి. ఇదే అదునుగా స్థానికంగా ఉన్న ప్రముఖులు, క్రీడాకారులు సినీ సెలబ్రిటీలు ఆయా క్రీడలకు బ్రాండ్ అంబాసిడర్లుగాను, కొంతమంది ఆ క్రీడలకు భాగస్వాములుగానూ కొనసాగుతున్నారు. ఇప్పుడు ఇది ఒక ట్రెండ్‌గా మారింది.

- సాక్షి, సిటీబ్యూరో



గడిచిన కొన్ని సంవత్సరాల్లో హైదరాబాద్ పలు క్రీడలకు హాట్‌స్పాట్ అయ్యింది. నేషనల్ గేమ్స్, ప్రాంతీయ టోర్నమెంట్స్, అంతర్జాతీయ మ్యాచ్‌లతో పాటు... ఇటీవల సరికొత్త క్రీడలు పికిల్‌బాల్, ఆర్చరీ వంటి మరికొన్ని ఆటలు యువతకు, మధ్య వయస్కులకు ఆకర్షణగా మారాయి. ఈ క్రీడలను సామాజికంగా, మార్కెటింగ్ రూపంలో అప్‌గ్రేడ్ చేయడంలో ప్రముఖులు ముందున్నారనేది ఆసక్తికరం. క్రీడా శక్తిని ఎంటర్‌టైన్మెంట్ బ్రాండ్ ప్రపంచంతో సమ్మేళనం చేస్తూనే తమ వ్యక్తిత్వంతో, జీవనశైలితో ఆ క్రీడలకు మద్దతు ఇస్తున్నారు.

సినీతారల భాగస్వామ్యం..

నగరంలో మొదట్లో పికిల్ బాల్ గేమ్‌కు ప్రముఖ సునీతార సమంత బ్రాండ్ అంబాసిడర్‌గా, భాగస్వామ్యం మంచి గుర్తింపు తీసుకొచ్చింది. పికిల్‌బాల్.. చిన్న కోర్ట్, తక్కువ భారంతో వాడే పరికరాలు, సులువైన రూల్స్.. ఇవి ఈ క్రీడను ప్రతి ఒక్కరికీ సాధ్యమైనవిగా మార్చాయి. హైదరాబాద్‌లో ప్రస్తుతం పికిల్ బాల్ కోర్టులు పెరిగాయి. ఈ గేమ్‌కు ఒకవైపు క్రేజ్ పెరుగుతుంటే అదే సమయంలో సెలబ్రిటీలు కూడా ఈ క్రీడకు మద్దతు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఇందులో భాగంగానే టాలీవుడ్ నటుడు సుశాంత్ ఇటీవల హైదరాబాద్ పికిల్ బాల్ లీగ్‌లో 'ఆల్ స్టార్స్' అనే బృందానికి యజమానిగా బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ఈ క్రీడను వ్యాప్తిచేయండంలో భాగస్వామిగా నిలిచారు.

రేసింగ్ షార్ప్‌లా..

మరోవైపు అక్కినేని నాగచైతన్య హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ అనే రేసింగ్ టీమ్ యజమానిగా ఉన్నారు. ఈ హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్‌ఎల్)లో ప్రధాన పోటీదారుగా పాల్గొంటోంది. ఇది దేశంలో ఏర్పాటు చేసిన ఫ్రాంచైజీ మోటార్ స్పోర్ట్స్ లీగ్. ఇది యువ డ్రైవర్స్ కోసం ఎఫ్ఐఏ ప్రమాణాలతో నిర్వహించబడే ఫార్ములా- 4 స్థాయి పోటీ. అంతేకాకుండా తమ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం ఎఫ్-3ఆర్ స్థాయిలో ప్రయోగాలు చేసే లీగ్‌లో కూడా తమ పరిధిని విస్తరించాలని ప్రచారం చేస్తున్నారు.

పికిల్‌బాల్‌కు మద్దతుగా..

సినీ సెలబ్రిటీలే కాకుండా పికిల్‌బాల్ ప్రపంచస్థాయి క్రీడాకారులైన ఇతర క్రీడలకు చెందిన ప్రముక క్రీడాకారులు కూడా మద్దతు పలుకుతున్నారు. బ్యాడ్మింటన్ లెజెండ్ సైనా నెహ్వాల్ హైదరాబాద్ పికిల్‌బాల్ లీగ్‌లో కీర్తి వారియర్స్ బృందానికి కో-ఓనర్‌గా చేరారు. ఇందులో భాగంగా సైనా తన క్రీడా అవగాహన, శిక్షణా అనుభవం యువతలో స్ఫూర్తి కల్పించే ప్రయత్నానికి నాంది పలికింది. మరో జట్టు నంది ఛార్జర్స్‌కు స్టమక్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ భాగస్వామిగా, బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు.



ఆర్చరీకి గుర్తింపుగా..

గత కొంతకాలంగా హైదరాబాద్‌లో ఆర్చరీ కూడా అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందుతోంది. గడిచిన ఒలింపిక్స్‌లో భారతీయ ఆర్చరీ బృందం మంచి క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించగా అందులో హైదరాబాద్ ఆర్చర్లు ఉండడం విశేషం. ఈ నేపథ్యంలో నగరంలో భవిష్యత్తు క్రీడగా ఆర్చరీ గుర్తింపు పొందుతోంది. ఈ సందర్భంగా ఇటీవల ప్రారంభమయ్యే ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)కి గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. ఆర్చరీ సాధారణంగా మనలో ఉన్న 'శాంతియుత, ధైర్యవంతమైన, ఆత్మనియంత్రిత' భావాలను ప్రతిబింబించే క్రీడ అని రామ్ చరణ్ తెలిపారు. ఆ క్రీడకు తన సినీ ప్రస్తావన, అభిమాన సంద్రంతో మరో ప్రోత్సాహక క్రీడగా నిలవనుంది. ఇలా సినీ ప్రముఖులు, స్పోర్ట్స్ స్టార్స్ పలు క్రీడల పట్ల తమ వ్యక్తిగత ఆసక్తిని, జీవన విధానాన్ని తమ ఫాలోవర్లలో చేర్చుకుంటున్నారు.

ఈ విధంగా ఈ సెలబ్రిటీలు తమ ప్రశస్తిని వినియోగించి క్రీడల సామాజిక, ఆర్థిక ఉత్పత్తి పెంచుతున్నారు. యువత, మధ్య వయస్కులు ఈ క్రీడల్లో రాణించాలనే పట్టుదల పెరిగి వారి భాగస్వామ్యం మొదలవుతుంది. క్రీడా వసతులు- కోర్టులు, శిక్షణా తరగతులు, టోర్నమెంట్స్ పెరుగుతుంటాయి. హైదరాబాద్‌లో పికిల్‌బాల్, ఆర్చరీ వంటివి పాపులర్ కాకపోయినా క్రీడలు ప్రస్తుతం ట్రెండింగ్‌గా మారుతున్నాయి. ఈ మార్పుతో యువతలోని నోమోఫోబియా తగ్గదలకు, బద్ధకాన్ని వదిలి ఫిట్‌నెస్ పెరగారినికి ఉపకరిస్తుంది. ఇందుకు ప్రమాణంగా ఈ సెలబ్రిటీ బ్రాండ్ అంబాసిదర్లు, కో-ఓనర్, ప్రమోటర్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ ట్రెండ్ కొనసాగితే భారతీయ క్రీడా వేదికపై స్థిరమైన స్థానం సాధించడం సాధ్యమే అవుతుంది.



ఆసక్తి.. అనుకరణే ఉద్దేశం..

ఫిట్‌నెస్ డైలీ రొటీన్ : సినిమా షూటింగ్ మధ్య వీరు జిమ్, యోగా, ప్రాణాయామం, స్ట్రెచింగ్ తప్పక చేస్తారు. ఇది క్రీడాభిమానులలో అనుకరణ కల్పిస్తుంది.

బ్రాండ్ ఇంటిగ్రేషన్: క్రీడల ప్రమోషన్ స్ట్రాటజీలో వారు తమ సోషల్ మీడియా, బ్రాండ్ ఇనిషియేటివ్‌లో క్రీడా అంశాలను చేర్చుకుంటారు.

మెసేజ్ - మిషన్ : స్పోర్ట్ అన్ని వయసుల వారికీ, ముఖ్యంగా తెలుగు యువతలో హిడెన్ టాలెంట్, వ్యాయామం ద్వారా మానసిక శక్తి.. వంటి అంశాలు సామాన్యంగా ప్రచారంలో ఉపయోగించే పాయింట్లు.





ఫ్యాషన్ డిజైనింగ్ ఇష్టం..

మిస్‌పీ అండ్ ఇండియా అంబాసిడర్ అమూల్య ప్రియదర్శిని

గోవాలో మిస్‌పీఅండ్ ఇండియా-2025 పోటీల్లో ప్రకటన

అంతర్జాయ అందాల పోటీలే లక్ష్యం : అమూల్య

గచ్చిబౌలి: నగరానికి చెందిన ఓ కార్పొరేట్ ఆఫీస్‌లో హెచ్‌ఆర్‌గా పని చేస్తున్న అమూల్య ప్రియదర్శిని మిస్‌పీ అండ్ ఇండియా అంబాసిడర్-2025గా ఎంపికయ్యారు. ప్రస్తుతం మోడలింగ్‌లో రాణిస్తున్న ఆమె సెప్టెంబర్ 21న గోవాలో జరిగిన మిస్‌పీ అండ్ ఇండియా-2025 పోటీల్లో తెలంగాణ నుంచి ప్రాతినిథ్యం వహించి మూడో స్థానంలో నిలిచారు. ఈ మేరకు పీ అండ్ ఐ ఇండియా అంబాసిడర్ అవార్డును సొంత చేసుకున్నారు. ఈ పోటీల్లో మొదటి ఐదు స్థానల్లో నిలిచిన వారికి అంతర్జాతీయ వేదికలపై అందాల పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. 2018లో మిస్ తెలంగాణ వాక్‌గా ఎంపికయ్యారు. 2024లో మిస్ ఏషియాటిక్ ఫైనలిస్ట్‌గా నిలిచారు. 2024లో మిస్ నార్త్ ఆసియా యూనివర్స్‌గా గెలుపొందారు. తాజాగా మిస్ పీ అండ్ ఐ ఇండియా అంబాసిడర్‌గా ఎంపికవ్వడంతో అంతర్జాతీయ పోటీలకు మార్గం సుగమం అయ్యింది.

హాబీగా మొదలై..

మోడలింగ్, యాంకరింగ్ హాబీగా మొదలైందని అమూల్య ప్రయదర్శిని 'సాక్షి'కి తెలిపారు. '2018 నుంచి మోడలింగ్ యాంకరింగ్ హాబీగా పార్ట్ టైంగా చేసేదాన్ని. అదే ఫుల్ టైంగా మారింది. ఫ్యాషన్ డిజైనింగ్ అంటే ఎంతో ఇష్టం. బిగ్ బాస్‌లో పాల్గొన్న సెలబ్రిటీలకు డ్రెస్సులు డిజైన్ చేస్తాను. యూసుఫ్‌గూడలోని సెయింట్ మేరీస్‌లో బీఏ మాస్ కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ పూర్తి చేశా. యూకేలో సోషల్‌మీడియా మాస్ కమ్యూనికేషన్‌లో పీజీ చేశా. ఒక వైపు చదువుకుంటూనే మోడలింగ్‌పై శ్రద్ధపెట్టా' అని చెప్పారు. ఆత్మ విశ్వాసం, ప్రతిభ, వినయంతో మోడలింగ్‌లో అమూల్య మెరిశారు. అంతర్జాతీయ పోటీల్లో అవకాశం కోసం ఎన్నో కలలు కన్నానని తెలిపారు. పీ అండ్ ఐ ఇండియా వ్యవస్థాపకులు ప్రతిభ, శక్తిని అందించారని పేర్కొన్నారు.

అమ్మ ప్రోత్సాహంతో..

హెచ్‌ఎస్‌బీసీ కార్పొరేట్ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్న శైలజ ప్రోత్సాహంతో కూతురు అమూల్య ప్రియదర్శిని మోడలింగ్‌లో రాణిస్తున్నారు. గుంటూరుకు చెందిన శైలజ కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చారు. కూతురు అమూల్యతో కలిసి హఫీజ్‌పేట్ డివిజన్‌లో నివాసం ఉంటున్నారు. అమ్మ ప్రోత్సాహం ఎంతో ధైర్యాన్ని ఇస్తుందని అమూల్య చెబుతున్నారు.

సిల్వర్ పాడెల్ టోర్నీ ఏర్పాట్లు

దేశంలో మొట్టమొదటి ఎఫ్ఐపీ సిల్వర్ పాడెల్ టోర్నమెంట్

కోటక్ పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా

ఈ నెల 7 నుంచి 12వరకూ టోర్నీ

గచ్చిబౌలి: దేశంలో మొట్ట మొదటి సారి అంతర్జాతీయ పాడెట్ ఫెడరేషన్(ఎఫ్ఐపీ) టూర్ ఈవెంట్‌ను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ప్రకటించారు. గచ్చిబౌలిలోని కోటక్ పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ టోర్నమెంట్‌ను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. దేశ క్రీడా చరిత్రలో కీలకమైన ఘట్టంగా మొట్టమొదటి ఎఫ్ఐపీ సిల్వర్ హైదరాబాద్-2025 టోర్నమెంట్ నిర్వహిస్తారు. అక్టోబర్ 7 నుంచి 12వ తేదీ వరకూ ఈ టోర్నీ నిర్వహిస్తారు. ఈ పోటీలకు హైదరాబాద్ నగరం వేదిక కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని కేపీజీబీఏలో అంతర్జాతీయంగా అత్యుత్తమ నాణ్యత, పనితీరుకు గుర్తింపు పొందిన మూడు ప్రపంచ స్థాయి మెజోర్‌సెట్ పాడెల్ కోర్టులు ఉన్నాయని ఎఫ్ఐపీ అధ్యక్షుడు స్నేహ అబ్రహం సెహగల్, రాధా టీఎంటీ చైర్మన్ సునీల్ సరాఫ్ వివరించారు. ఈ చారిత్రాత్మక ఈవెంట్ దేశంలో పాడెల్ క్రీడ రూపురేఖలను పూర్తిగా మార్చనుందన్నారు. ఈ టోర్నమెంట్‌లో రికార్డు స్థాయి ప్రైజ్‌పూల్ ఉందని వారు వివరించారు. దేశంలో పాడెల్ క్రీడ చరిత్రలోనే అత్యధికమని పేర్కొన్నారు. పురుషులు, మహిళల విభాగాల్లో ప్రపంచ స్థాయి అంతర్జాతీయ స్టార్లు అలాగే ప్రతిభావంతులు పాల్గొంటారని, టోర్నీని హైదరాబాద్‌లో నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు.

వెడ్డింగ్ జ్యువెలరీ ప్రదర్శన





బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో మూడు రోజుల పాటు జరుగనున్న ప్రతిష్టాత్మక జ్యువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్ జీఎస్టీ హైదరాబాద్ గ్రామీణ అప్పిలేట్ జాయింట్ కమిషనర్ వై.శ్రీలీల శుక్రవారం ప్రారంభించారు. ఏఐసీసీ జాతీయ ప్రతినిధి మహ్మద్ రెహమాన్, మహ్మద్ ఖలీఖూర్ రెహమాన్, సోషలైట్ శైలజారెడ్డి, అషూగౌరీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశంలోని ప్రముఖ ఆభరణాల వ్యాపారులు, డిజైనర్లు, చేతివృత్తుల వారిని ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఈ ప్రదర్శన ఏర్పాటుచేశారు. జైపూర్, సూరత్, ముంబయి, ఉత్తరప్రదేశ్, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన ప్రఖ్యాత డిజైనర్లు ఈ ప్రదర్శనలో అరుదైన కళాత్మక ఆభరణాలు ప్రదర్శించారు. ఇక్కడి వజ్రాభరణాలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

టీనేజ్ మొదలు పండు ముసలి వరకూ నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలని, నిత్య యవ్వనంగా ఉండాలనే కోరిక ప్రతి ఒక్కరిలోనూ పెరుగుతోంది. ఇప్పడున్న పరిస్థితుల్లో ఉద్యోగం, వ్యాపారం, ఒత్తిళ్లు, రాత్రి షిఫ్టలలో విధులు, ఆహారం, లైఫ్ స్టైయిల్, వాతావరణ పరిస్థితుల్లో అందరికీ ఇది సాధ్యం కాకపోవచ్చు. ఖరీదైన బట్టలు, ఫ్యాషన్‌లుక్ ఉండే ఆభరణాలు ధరించినా ముఖ సౌందర్యం చాలా ముఖ్యం. మగవారిని ప్రధానంగా వేధిస్తున్న జుట్టు సమస్య, మహిళల్లో మొటిమలు, హార్మోన్ సమస్యలు కుంగదీస్తున్నాయని సర్వేలు చెబుతున్నాయి. ఇటువంటి వారి కోసం ఇప్పటికే మార్కెట్‌లో పలు రకాల చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చాయి. తాజాగా డీఎన్‌ఏ ఆధారిత చికిత్సలకు భాగ్యనగరం వేదికగా మారింది. డీఎన్‌ఏ అనాలసిస్‌తో సమస్యకు కచ్చితమైన కారణాలను అన్వేషించడంతో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. - సాక్షి, సిటీ బ్యూరో

బ్యూటీ విత్ ట్రెండ్..



* చర్మ సౌందర్యానికీ డీఎన్‌ఏ ఆధారిత చికిత్సలు
* అందుబాటులో అధునాతన పద్ధతులు

హైదరాబాద్ వాసులు సౌందర్యంపై ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నారు. అందుకు తగ్గట్లే నగరంలో గల్లీకో బ్యూటీ పార్లర్, స్కిన్ కేర్, ఏస్థటిక్స్ వంటివి అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా డీఎన్‌ఏ ఆధారిత సౌందర్య కేంద్రాలు వెలుస్తున్నాయి. పురుషుల్లో అత్యధికంగా జుట్టు రాలే సమస్యలు కనిపిస్తున్నాయి. రెండు పదుల వయసులోనే జుట్టు రాలడం మొదలైపోతోంది. వివిధ రకాల నూనెలు, ఇతర థెరపీలను ఆశ్రయిస్తున్నారు. మహిళల్లో ముఖంపై పింపుల్స్, మచ్చలు రావడం, చర్మ సమస్యలు వస్తున్నాయి. బరువు పెరగడం, నిద్రలేమి, ఆహారం, వయసులో మార్పులు, హార్మోన్ సమస్యలు కారణాలుగా కనిపిస్తున్నాయి. దీని వల్ల వ్యక్తుల్లో కాన్ఫిడెన్స్ లెవల్స్ దెబ్బతింటున్నాయని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. డీఎన్‌ఏ ఆధారిత చికిత్సల్లో వ్యక్తుల లాలాజలం నుంచి నమూనా సేకరించి డీఎన్‌ఏ పరీక్షకు పంపిస్తాం. నివేదికలు రావడానికి సుమారు నాలుగు వారాలు పడుతుంది. బాడీకాంపొజిషన్ అనాలసిస్ (బీసీఏ) చేపట్టి, వ్యక్తి ఎత్తు, వయసు ఆధారంగా ఏ పరిమాణంలో ఉండాలి, ప్రస్తుతం ఎంత ఉందనేది నిర్ధారించుకుని, ఆపై నిపుణులైన డెర్మటాలజీ, న్యూట్రిషిన్లు పరంగా చికిత్సలు అందిస్తారు.



కచ్చితమైన ఫలితాలు..



ప్రతి వ్యక్తికీ డీఎన్‌ఏ యూనిక్‌గా ఉంటుంది. జీన్ అనాలసిస్ చేసి, ఆ ఫలితాల ఆధారంగా చికిత్సలు తీసుకునే కొత్త పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయి. ఒకే రకమైన సమస్యకు అందరికీ ఒకే రకమైన చికిత్సలు అందించడం మంచిది కాదు. ఫలితాల్లోనూ తేడాలు ఉండే అవకాశం ఉంటుంది. సామాజిక మాధ్యమాలకు ప్రభావితం కావొద్దు. సౌందర్య రంగంలో అధునాతన పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయి. జీన్స్ ఆధారంగా చికిత్సలు తీసుకోవడం ఉత్తమం. ఖచ్చితత్వంతో పనిచేసే అవకాశం ఉంటుంది. - డా.రేఖా సింగ్, చర్మ సౌందర్య నిపుణురాలు

సాక్షి రియల్టీ
శనివారం
04-10-2025

రెరా.. గృహ కొనుగోలుదారులకు భరోసా!

పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ

- చట్టం అమలులో నాల్గో స్థానంలో తెలంగాణ
- టీజీ రెరాలో 10,123 ప్రాజెక్ట్‌లు, 4,516 మంది ఏజెంట్ల నమోదు

ప్రీలాంచ్‌లు, సాఫ్ట్ లాంచ్‌ల పేరుతో ప్రాజెక్ట్‌ను స్టార్ట్ చేయకముందే కస్టమర్ల నుంచి ముందస్తుగా డిపాజిట్లు సేకరించడం, వసూలు చేసిన సొమ్ము వ్యక్తిగత అవసరాలకు మళ్లించడం, న్యాయ పరమైన చిక్కులతో నిర్మాణ అనుమతులు రాకపోవడం, ఒకవేళ వచ్చినా నిర్మాణ వ్యయ భారంతో నిర్మాణ పనులను మధ్యలోనే ఆపేయడం, సంవత్సరాల కొద్దీ నిర్మాణ పనులు కొనసాగిస్తుండటం.. ఇలా ఒకట్రెండు కాదు సొంతింటి కలకు సవాలక్ష సవాళ్లు. కానీ, ఇవన్నీ రెరా కంటే ముందు మాట. దేశంలో రెరా చట్టం అమలులోకి వచ్చిన తర్వాత డెవలపర్లలో స్థిరాస్తి రంగంలో పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ పెరిగింది. దీంతో గృహ కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల్లో విశ్వాసం నెలకొంది. – సాక్షి, సిటీబ్యూరో

దేశంలో 2016లో అమలులోకి వచ్చిన రెరా.. రియల్ ఎస్టేట్ రంగంలో ఒక కీలకమైన ఘట్టం. దశాబ్దాలుగా అనిశ్చితి దేశీయ స్థిరాస్తి రంగాన్ని సంఘటితంగా, పారదర్శక, జవాబుదారీతనంగా మార్చింది మాత్రం రెరానే. విక్రయాలు, ప్రాజెక్ట్ డెలివరీ, స్థిరమైన ధరల పెరుగుదలను తీసుకురావడంతో పాటు రియల్టీలోకి సంస్థాగత, ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులకు అవకాశాలను కల్పించిందని నైట్‌ఫ్రాంక్, నరెడ్కో సంయుక్త నివేదిక వెల్లడించింది. అయితే రెరా అమలు అన్ని రాష్ట్రాల్లో ఏకరీతిగా లేకపోయినప్పటికీ.. చట్టం ప్రధాన ఉద్దేశం మాత్రం విప్లవాత్మకమైనదే. దేశం పట్టణీకరణ, ఆర్థిక వృద్ధి ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ప్రస్తుత తరుణంలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో రెరా స్థిరమైన, సమానమైన అమలు సాగడం అత్యవసరం.



ఎస్క్రో అకౌంట్..

దేశీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ విలువ 648 బిలియన్ డాలర్లకు చేరింది. ఇందులో 52 శాతం వాటా ఉన్న నివాస సముదాయం విభాగంలో పారదర్శకత అత్యవసరం. కస్టమర్ల నుంచి వసూలు చేసే సొమ్ములో 70 శాతాన్ని ప్రత్యేకంగా ఎస్క్రో బ్యాంక్ ఖాతా తెరిచి అందులో వేయాలి. ఆయా సొమ్మును కేవలం నిర్దిష్ట ప్రాజెక్ట్ నిర్మాణ పనుల కోసం మాత్రమే వెచ్చించాలి.

ఇప్పటి వరకు మన దేశంలో నాగాలాండ్ మినహా 27 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల్లో రెరా నోటిఫై అయ్యింది. దేశవ్యాప్తంగా రెరాలో 1.50 లక్షలకు పైగా ప్రాజెక్ట్‌లు, లక్ష కంటే ఎక్కువ మంది ఏజెంట్లు నమోదయ్యారు. ఇప్పటి వరకు 1.50 లక్షలకుపైగా ఫిర్యాదులు పరిష్కృతమయ్యాయి.

1.50 లక్షల ప్రాజెక్ట్‌ల నమోదు..

మన రాష్ట్రంలో..

2016లో రెరా అమలులోకి వచ్చినప్పటి నుంచి మహారాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (మహారెరా) ముందంజలో ఉంది. పారదర్శకత, సామర్థ్యం, చురుకైన అమలుతో దేశంలో అత్యధిక ప్రాజెక్ట్‌లు, ఏజెంట్ల నమోదులో ఇతర రాష్ట్రాల కంటే తొలిస్థానంలో నిలిచింది. మహా రెరాలో ఇప్పటి వరకు 50 వేలకు పైగా ప్రాజెక్ట్‌లు, 52 వేల మంది ఏజెంట్లు రిజిస్టరయ్యారు. ఆ తర్వాత తమిళనాడు, గుజరాత్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు ఉన్నాయి. ప్రస్తుతం టీజీ రెరాలో 10,123 ప్రాజెక్ట్‌లు, 4516 ఏజెంట్లు రిజిస్టరయ్యారు. 2,340 ఫిర్యాదులు అందగా.. 1,566 పరిష్కృతమయ్యాయి.



రెరాలో ప్రాజెక్ట్‌ల రిజిస్ట్రేషన్లలో టాప్-5 రాష్ట్రాలివీ: (శాతంలో)

రాష్ట్రం	ప్రాజెక్ట్‌లు
మహారాష్ట్ర	34
తమిళనాడు	20
గుజరాత్	11
తెలంగాణ	6
కర్ణాటక	5

రెరా నమోదు గణాంకాలివీ..

సంవత్సరం	ప్రాజెక్ట్‌లు	ఏజెంట్లు
2018	34,893	27,073
2019	47,937	37,749
2020	58,044	45,163
2021	72,108	56,912
2022	94,244	70,025
2023	1,16,117	82,755
2024	1,31,873	88,775
2025 (ఇప్పటివరకు)	1,49,838	1,05,712

ఏ దేశంలో ఏ రకమైన నిర్మాణ రంగం చట్టాలంటే?

- 1920: దక్షిణాఫ్రికా, ది హౌసింగ్ యాక్ట్
- 1937: అమెరికా, యునైటెడ్ స్టేట్స్ హౌసింగ్ యాక్ట్
- 1960: సింగపూర్, హౌసింగ్ డెవలప్‌మెంట్ బోర్డ్(హెచ్‌డీబీ)
- 1965: యూఎస్ఏ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (హెచ్‌యూడీ)
- 1985: యూకే, హౌసింగ్ యాక్ట్
- 1994: చైనా, అర్బన్ రియల్ ఎస్టేట్ అడ్మినిస్ట్రేషన్ లా
- 2007: దుబాయ్, యూఏఈ, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ ఏజెన్సీ(రెరా)
- 2016: ఇండియా, రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) యాక్ట్

రెరా ఎందుకొచ్చిందంటే?

గత దశాబ్దంలో దేశీయ ఆర్థిక వ్యవస్థ రియల్ ఎస్టేట్ రంగంలో వేగవంతమైన విస్తరణకు కారణమైంది. రెరా కంటే ముందు రియల్టీ పరిశ్రమలో అనిశ్చితి ఉంది. ప్రత్యేక నియంత్రణ వ్యవస్థ అంటూ లేదు. డెవలపర్లను, లావాదేవీలను నియంత్రించడానికి నిర్దిష్టమైన చట్టాలు లేవు. ముంబై, ఢిల్లీ–ఎన్సీఆర్, బెంగళూరు, హైదరాబాద్, పుణె, చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కతా వంటి ప్రధాన మెట్రో ప్రాంతాలలోనే రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్నాయి. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో పెద్దగా రియల్టీ మార్కెట్ ఉండేది కాదు. డెవలపర్లు తరచూ ఊహాజనిత పెట్టుబడులపై ఆధారపడేవారు. లావాదేవీలలో పారదర్శకత లోపించేది. దీంతో అధిక పరపతి, విస్తృత రుణ డిఫాల్ట్‌లు, ప్రాజెక్ట్ డెలివరీలో తీవ్ర జాప్యం, వ్యయాల పెరుగుదల, గృహ కొనుగోలుదారుల నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం వంటివి జరిగేవి. ఈ వ్యవస్థాగత వైఫల్యాలతో అనేక ప్రాజెక్ట్‌లు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో కొనుగోలుదారుల విశ్వాసం దెబ్బతింది. లక్షలాది మంది కస్టమర్లు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుపోయారు. స్థిరాస్తి మార్కెట్ కార్యకలాపాలు క్షీణించాయి. దీంతో విధానపరమైన జోక్యం, కఠిన నిబంధనల అమలు అత్యవసరమయ్యాయి. 2016లో రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ మరియు అభివృద్ధి చట్టం(రెరా)కు దారి తీసింది. స్థిరాస్తి రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం, క్రమబద్ధీకరణతో పాటు పెట్టుబడిదారులు, కొనుగోలుదారులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రెరా అమలులోకి వచ్చింది.




అమ్మకాలు తగ్గాయి.. లాంచింగ్స్ పెరిగాయి!

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ అస్థిరతలు కొనసాగుతున్నప్పటికీ.. మన దేశంలో నివాస విభాగం స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తోంది. పెరుగుతున్న ఆదాయాలు, పట్టణీకరణ, గృహ యజమానుల అభిరుచులతో గృహాల కొనుగోళ్లు స్థిరంగానే ఉంటున్నాయి. దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఈ ఏడాది మూడో త్రైమాసికం(క్యూ3)లో 97,080 ఇళ్లు అమ్ముడుపోయాయి. గతేడాది క్యూ3లో విక్రయమైన 1,07,060 యూనిట్లతో పోలిస్తే 9 శాతం తగ్గగా.. ఈ ఏడాది క్యూ2లో సేల్ అయిన 96,290 నివాసాలతో పోలిస్తే 1 శాతం వృద్ధి చెందాయని అనరాక్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. ఇక, 2025 క్యూ3లో 96,690 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. క్యూ2లో సరఫరా అయిన 98,630 యూనిట్లతో పోలిస్తే 2 శాతం క్షీణించగా.. గతేడాది క్యూ3లో సప్లయ్ అయిన 93,750 యూనిట్లతో పోలిస్తే మాత్రం 3 శాతం పెరిగాయి. అయితే ఇళ్ల అమ్మకాలు తగ్గినప్పటికీ వాటి విలువ మాత్రం 14 శాతం పెరిగింది. గతేడాది క్యూ3లో అమ్ముడైన ఇళ్ల విలువ రూ.1.33 లక్షల కోట్లుగా ఉండగా.. ఈ ఏడాది క్యూ3లో విక్రయమైన గృహాల విలువ రూ.1.52 లక్షల కోట్లుగా ఉంది.

లగ్జరీ ఇళ్లదే హవా..

ఇళ్ల విక్రయాలు, లాంచింగ్స్‌లో ముంబైలో అత్యధికంగా జరిగాయి. దేశ ఆర్థిక రాజధానిలో 2025 క్యూ3లో 30,260 గృహాలు అమ్ముడుపోగా.. 29,565 యూనిట్లు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత పుణెలో 16,620 ఇళ్లు విక్రయం కాగా.. 19,375 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. లాంచింగ్స్‌లో అత్యధికంగా లగ్జరీ గృహాలదే ఆధిపత్యం కొనసాగుతుంది. రూ.కోటిన్నర కంటే ఎక్కువ ధర ఉన్న విలాసవంతమైన ఇళ్ల వాటా 38 శాతంగా ఉండగా.. అందుబాటు గృహాల వాటా 16 శాతంగా ఉంది. రూ.80 లక్షల నుంచి రూ.కోటిన్నర ధర ఉన్న ప్రీమియం గృహాల వాటా 24 శాతం, రూ.40–80 లక్షల ధర ఉన్న మధ్యతరగతి ఇళ్ల వాటా 23 శాతంగా ఉంది.



5.64 లక్షల ఇన్వెంటరీ..

అమ్మకానికి సిద్ధంగా ఉన్న(ఇన్వెంటరీ) యూనిట్ల సంఖ్య గతేడాది క్యూ3లో 5.64 లక్షలుగా ఉండగా.. ఈ క్యూ3 నాటికి 5.61 లక్షలకు తగ్గాయి. ఏడాదిలో ప్రాపర్టీల ధరలు 9 శాతం పెరిగాయి. వార్షిక ప్రాతిపదికన అత్యధికంగా ఎన్సీఆర్‌లో ధరలు 24 శాతం పెరగగా.. బెంగళూరులో 10 శాతం వృద్ధి చెందాయి.

హైదరాబాద్‌లో..

ఈ ఏడాది మూడో త్రైమాసికంలో హైదరాబాద్‌లో 8,630 గృహాలు లాంచింగ్ అయ్యాయి. గతేడాది ఇదే కాలంలో ప్రారంభమైన 13,890 యూనిట్లతో పోలిస్తే ఇది 38 శాతం తక్కువ. ఏడాది కాలంలో నగరంలో లాంచింగ్స్ 22 శాతం మేర తగ్గాయి. నగరంలో ప్రీమియం, లగ్జరీ, అల్ట్రా లగ్జరీ గృహాల డిమాండ్ కొనసాగుతోంది. అందుకే ఈ క్యూ3లో లాంచింగ్ అయిన యూనిట్లలో రూ.80 లక్షల కంటే ఎక్కువ ధర ఉన్న ఇళ్ల వాటా ఏకంగా 87 శాతంగా ఉంది. ఇక, 2025 క్యూ3లో నగరంలో 11,305 యూనిట్లు అమ్ముడుపోయాయి. గతేడాది ఇదే కాలంలో విక్రయమైన 12,735 ఇళ్లతో పోలిస్తే ఇది 11 శాతం తక్కువ.

షాపింగ్ మాల్స్ విస్తరణ



సాక్షి, సిటీబ్యూరో: సంస్థాగత పెట్టుబడులు ద్వితీయ శ్రేణి పట్టణాలకు శరవేగంగా విస్తరిస్తున్నాయి. పట్టణీకరణ, అధిక జనాభా, కొనుగోలు శక్తి పెరుగుతుండటంతో వ్యవస్థీకృత రిటైల్ కేంద్రాలకు అవకాశాలు లభిస్తున్నాయి. మారుతున్న వినియోగదారుల అభిరుచులతో ప్రపంచ బ్రాండ్లు విస్తరణపై దృష్టిసారిస్తున్నాయి. చండీఘడ్, ఇండోర్, సూరత్, భువనేశ్వర్, కోయంబత్తూరు వంటి ద్వితీయ శ్రేణి పట్టణాలు నెక్సస్(బ్లాక్ స్టోన్), డీఎల్ఎఫ్, ఫీనిక్స్ మిల్స్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్, లేక్‌షోర్, రహేజా గ్రూప్, పసిఫిక్ వంటి సంస్థాగత దిగ్గజాలను ఆకర్షిస్తున్నాయి. ఈ ఏడు సంస్థలు వచ్చే 3–5 ఏళ్లలో 4.25 కోట్ల చ.అ. కంటే ఎక్కువ విస్తీర్ణంలో కొత్తగా 45 షాపింగ్ మాల్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నాయి. ప్రస్తుతం ఈ ఏడు సంస్థలకు సమష్టిగా 3.4 కోట్ల చ.అ. విస్తీర్ణంలో 58 మాల్స్ ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో గ్రేడ్-ఏ, బీ, సీ కేటగిరీ మాల్స్ అన్నీ కలిపి 650 షాపింగ్ మాల్స్ ఆపరేషనల్‌లో ఉన్నాయి. ఇండియాలో 11 కోట్ల చ.అ. నాణ్యమైన రిటైల్ స్పేస్ ఉంది. అమెరికాలో 70 కోట్ల చ.అ., చైనాలో 40 కోట్ల చ.అ. రిటైల్ స్థలం అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో అధిక శాతం స్థలం సంస్థాగత నిర్మాణ సంస్థల యాజమాన్యంలోనే ఉన్నాయని అనరాక్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది.

స్థిరాస్తికి పండగే..

- కస్టమర్లకు డబుల్ ధమాకా
- స్థిరమైన వడ్డీ రేట్లు, జీఎస్టీ తగ్గింపులు
- 25–30 శాతం పెరగనున్న అమ్మకాలు



సాక్షి, సిటీబ్యూరో: పండగ అంటే ప్రతి ఇంటా ఆనందమే.. ఫెస్టివల్ సీజన్ వస్తుందంటే చాలు మార్కెట్లు కళకళలాడుతుంటాయి. దీనికి స్థిరాస్తి రంగం మినహాయింపు కాదు. తెలుగు రాష్ట్రాలలో వినాయక చవితితో ఆరంభమయ్యే పండగ సీజన్ హోలీ వరకూ కొనసాగుతుంది. ఇలాంటి తరుణంలో కేంద్రం వస్తు సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణలు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) వడ్డీ రేట్లు స్థిరంగానే ఉంచింది. దీంతో ఈసారి పండగ ప్రాపర్టీ కొనుగోలుదారులకు డబుల్ ధమాకాగా మారింది. దీంతో ఈ ఏడాది ఫెస్టివల్ సీజన్‌లో విక్రయాలు 25–30 శాతం అధికంగా ఉంటాయని స్థిరాస్తి నిపుణులు అంచనా వేస్తున్నారు. డెవలపర్లలో నూతనోత్తేజం నెలకొంది.

- పండగ సీజన్‌లో రియల్ రంగానికి పండగే. కాకపోతే ఈసారి కొనుగోలుదారులకే సిసలైన పండగ అని చెప్పాలి. ఎందుకంటే గతేడాదితో పోలిస్తే ఈసారి గృహ రుణాలపై వడ్డీ భారం తగ్గుముఖం పట్టింది. జీఎస్టీ భారం తగ్గింది. అందుకే ఈ పండగ సీజన్‌లో సొంతింటి కలను సాకారం చేసుకోవాలని భావించేవారికి డబుల్ ధమాకాగా చెప్పొచ్చు. హైదరాబాద్‌లో ఏడాదిన్నరగా ఇళ్ల విక్రయాలు గణనీయంగా తగ్గుముఖం పట్టిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలతో అడుగులు ముందుకు వేస్తుండటంతో కొనుగోలుదారుల్లో ఉత్సాహం పెరుగుతోంది. కాకపోతే ఇళ్ల ధరలు కాస్త తగ్గుముఖం పట్టాలని కొందరు ఎదురుచూస్తుండగా.. మార్కెట్ మెరుగ్గా లేని తరుణంలో కొంటేనే మెరుగని, ఒకసారి అమ్మకాలు పెరిగితే కొనుగోలు చేయడం కష్టమని భావించిన కొందరు కస్టమర్లు నచ్చిన ప్రాజెక్ట్‌లలో ఫ్లాట్లను కొనేందుకు ముందుకొస్తున్నారని పలువురు డెవలపర్లు అభిప్రాయపడుతున్నారు.
- ఔత్సాహిక బయ్యర్లు ఆచితూచి అడుగులు వేస్తున్నప్పటికీ.. కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నియోపొలిస్ వంటి ప్రాంతాల్లో ఫ్లాట్లను ఎంచుకోవడానికి కొనుగోలుదారులు అధిక ఆసక్తి చూపిస్తున్నారు. ఎందుకంటే ఇక్కడ పరిమిత సంఖ్యలో ఉన్న ఫ్లాట్లను ఇప్పుడు కొనకపోతే మరెప్పుడూ కొనలేమనే ఆలోచన బయ్యర్లలో ఏర్పడింది. అందుకే ఆయా ప్రాంతాలలో ఏ కొత్త ప్రాజెక్ట్ ప్రారంభించినా కస్టమర్ల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది.

పార్కింగ్ కాజేసి..

డెవలపర్ల పార్కింగ్ దందా

- అనుమతికి మించి పార్కింగ్ స్థలం విక్రయం
- డ్రైవ్ వేలను సైతం వదలని పలువురు బిల్డర్లు
- టీజీ రెరాలో పెరుగుతున్న ఈ తరహా ఫిర్యాదులు



'గ్రోహె–హురన్ ఇండియా రియల్ ఎస్టేట్ రిచ్ లిస్ట్‌లో చోటు సంపాదించుకున్న నగరానికి చెందిన ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ఇది. హైదరాబాద్‌లోని ఓ ప్రాజెక్ట్‌లో ద్విచక్ర వాహనం కోసం కేటాయించిన పార్కింగ్ స్థలాన్ని.. కార్‌గా ఏమార్చి కొనుగోలుదారునికి విక్రయించి సొమ్ము చేసుకుంది. భవన నిర్మాణ అనుమతి పత్రంలో బైక్ పార్కింగ్ స్థలాన్ని డ్రాయింగ్‌లో కారు బొమ్మగా మార్చారని ఆరోపిస్తూ ఓ ఫిర్యాదుదారుడు తెలంగాణ రియల్ ఎసేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ–రెరా)ను ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన టీజీ–రెరా అప్రూవల్ ప్లాన్‌ను తప్పనిసరిగా అనుసరించాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు'.. గృహ కొనుగోలుదారులకు పార్కింగ్ స్థలం విక్రయంలో పేరు మోసిన నిర్మాణ సంస్థ తీరే ఇలా ఉంటే చిన్నాచితక డెవలపర్ల సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈమధ్య కాలంలో బిల్డర్ల అక్రమ పార్కింగ్ విక్రయాలపై టీజీ–రెరాకు కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు వస్తున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

జీవో నంబరు 168 ప్రకారం 2 వేల గజాలపైన నిర్మించే నివాస భవన నిర్మాణాలలో 33 శాతం బిల్టప్ ఏరియాను పార్కింగ్‌కు కేటాయించాలి. ఇందులో 30 శాతం ఆ భవనంలోని నివాసితులకు, 3 శాతం సందర్శకుల కోసం కేటాయించాల్సి ఉంటుంది. అలాగే వాణిజ్య భవన నిర్మాణాలలో అయితే 44 శాతం బిల్టప్ ఏరియాను పార్కింగ్‌కు కేటాయించాల్సి ఉంటుంది. ఇందులో 40 శాతం రిటైల్ స్టోర్లకు, 4 శాతం సందర్శకులకు కేటాయించాలి. 2.5/4.5 మీటర్ల పొడవు, వెడల్పుతో కారు పార్కింగ్‌ను కేటాయించాలి. దీనికంటే తక్కువ ఉండకూడదు. కానీ, ప్రస్తుతం ఈ నిబంధనలను తూ.చ. తప్పకుండా అనుసరించే డెవలపర్లు చాలా తక్కువే.

లాటరీ పద్ధతిలో పార్కింగ్ ప్లేస్..

ఏ గృహ కొనుగోలుదారుడికి ఎక్కడ పార్కింగ్ ప్లేస్ కేటాయించాలనే అంశంపై కూడా నిబంధనలు ఉన్నాయి. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) వచ్చిన మూడు నెలలలోపు అసోసియేషన్ ఏర్పాటు కావాలి. నివాసితులకు పార్కింగ్ ప్లేస్‌ల కేటాయింపు కోసం ఆఫీస్ బేరర్స్ సమక్షంలో లాటరీ పద్ధతిలో కేటాయించాలి. 600 గజాలలోపు నిర్మించే స్టిల్ట్+5 అంతస్తుల భవనాలకైతే డీమ్డ్ టు సాటిస్‌పై ఉంటుంది. బహుళ అంతస్తుల భవనాలలో అక్రమ పార్కింగ్ విక్రయాలపై సమస్యలు ఎక్కువగా జరుగుతుంటాయి.

టీడీఆర్‌తోనూ పార్కింగ్ సమస్యలే..

సాధారణంగా డెవలపర్లు అనుమతి ఉన్న దాని కంటే అదనంగా పార్కింగ్ ప్లేస్‌లను విక్రయిస్తుంటారు. ఉదాహరణకు అప్రూవల్ డ్రాయింగ్‌లో 450 కార్ల పార్కింగ్ ప్లేస్‌లకు అనుమతి లభిస్తే.. 600ల పార్కింగ్ ప్లేస్‌లుగా మార్చి విక్రయిస్తుంటారు. డిమాండ్‌ను బట్టి ఒక్కో కారు పార్కింగ్‌ను రూ.1–5 లక్షల చొప్పున అమ్ముకుంటుంటారు. కొందరు డెవలపర్లు స్టిల్+4 అంతస్తులకు నిర్మాణ అనుమతులు తీసుకొని, ఆ తర్వాత ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్(టీడీఆర్) తీసుకొని ఇంకో అంతస్తు నిర్మిస్తున్నారు. 400 గజాల్లో 8 అపార్ట్‌మెంట్లు వస్తే.. టీడీఆర్ తీసుకొని ఇంకో అదనపు అంతస్తులో రెండు ఫ్లాట్లను నిర్మిస్తున్నారు. దీంతో యూనిట్ల సంఖ్య పెరిగి, పార్కింగ్ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి.





డ్రైవ్ వేలు కూడా పార్కింగ్‌గానే..

ఆరు నెలల్లో 10–12 అక్రమ పార్కింగ్ విక్రయ ఫిర్యాదులే వచ్చాయి. కొందరు డెవలపర్లు డ్రైవ్ వేలను కూడా పార్కింగ్ ప్లేస్‌గా మార్చి విక్రయిస్తున్నారు. ఈ తరహా ఫిర్యాదులలో అప్రూవ్డ్ డ్రాయింగ్ ప్లాన్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నాం.

– కే.శ్రీనివాసరావు, సభ్యులు, టీజీ–రెరా

నకిలీ మద్యం.. భారీ ప్లాంట్ గుట్టురట్టు

ములకలచెరువులో కళ్లు చెదిరేలా టీడీపీ నేత అక్రమ సామ్రాజ్యం

అడ్మిరల్ బ్రాందీ, బెంగళూరు బ్రాందీ, కేరళ మాల్ట్ విస్కీ, రాయల్ లాన్సర్, సుమో, మరికొన్ని బ్రాండ్లకు చెందిన లేబుళ్లను తయారు చేయించి నకిలీ మద్యం నింపిన బాటిళ్లకు అంటిస్తున్నారు. ఈ తతంగం పూర్తయ్యాక బాటిళ్లను బాక్సుల్లో పెట్టి పాల వ్యాన్లలో సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజూ వేల సంఖ్యలో నకిలీ మద్యం బాటిళ్లు ములకలచెరువు ప్లాంట్ నుంచి తరలిపోతున్నాయి. ఏ బ్రాండ్‌తో నకిలీ మద్యం కావాలంటే ఆ బ్రాండ్ పేరుతోనే నకిలీ మద్యం తయారు చేసి పంపుతున్నట్లు ప్లాంట్ వాతావరణం స్పష్టం చేస్తోంది. రంగు, వాసనలో ఎలాంటి తేడా లేకుండా అసలు మద్యాన్ని పోలి ఉండేలా నకిలీ తయారు చేయడానికి నిపుణులను నియమించుకున్నారు. ఇంత భారీ ఎత్తున్న తయారవుతున్న ఈ నకిలీ మద్యాన్ని ఇప్పటిదాకా ఎంత మంది ఏ మోతాదులో తాగారో.. వారి ఆరోగ్యం పరిస్థితి ఏమిటో!

మదనపల్లె : చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో ఏకంగా నకిలీ మద్యం తయారీ భారీ ప్లాంట్ బండారం బట్టబయలైంది. రాష్ట్రమంతటా ఉలిక్కి పడేలా చేసింది. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని మండల కేంద్రం ములకలచెరువుకు కూతవేటు దూరంలో కళ్లు చెదిరేలా నిర్వహిస్తున్న నకిలీ మద్యం తయారీ భారీ కర్మాగారం బాగోతం శుక్రవారం వెలుగు చూసింది. ఈ కేంద్రం నిర్వహణ, సరఫరాలో అధికార టీడీపీ నేతల ప్రమేయం స్పష్టంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేయడమే ఇందుకు నిదర్శనం. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ములకలచెరువు సమీపంలోని పాత హైవే రోడ్డు వద్ద గతంలో డాబాగా ఉన్న భవనాన్ని యజమాని లక్ష్మీనారాయణ..రామ్మోహన్ అనే వ్యక్తికి లీజుకు ఇచ్చారు. ఈ భవనంలో నకిలీ మద్యం తయారు చేసి సరఫరా చేస్తున్న విషయం ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ దృష్టికి వచ్చింది. ఆయన ఇక్కడి ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అసిస్టెంట్ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి (కడప), అన్నమయ్య జిల్లా ఈఎస్ మధుసూదనరావు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నీలకంఠేశ్వరరెడ్డి, ఎస్‌ఐలు యల్లయ్య, జహీర్, సిబ్బంది ఆ భవనంపై దాడులు నిర్వహించడంతో కళ్లు చెదిరే రీతిలో, ఎవరూ ఊహించని విధంగా భారీ స్థాయిలో నకిలీ మద్యం తయారీ ప్లాంట్ గుట్టు రట్టయ్యింది. దాడులు జరిగిన సమయంలో తొమ్మిది మంది కూలీలు అక్కడ నకిలీ మద్యం తయారీ, బాటిళ్లలో భర్తీ, ప్యాకింగ్ పనులు చేస్తున్నారు. కొన్ని గంటల పాటు లోపలికి ఎవరినీ రానివ్వకుండా అధికారులు గేటు మూసేశారు. అక్కడ మద్యం తయారీ యూనిట్, సరఫరా విధానం అంతా పరిశీలించారు. నకిలీ మద్యం తయారీకి సంబంధించి మూడు యంత్రాలు, స్పిరిట్, కలర్ ఫ్లేవర్ వేసి కలిపే యంత్రాన్ని గుర్తించారు. బాటిళ్లలో నకిలీ మద్యం నింపాక వాటిపై మూతను బిగించే యంత్రాలు, 70 ఖాళీ క్యాన్లు, 180 ఎంఎల్ ఖాళీ బాటిళ్లు 10 వేలు, వేల సంఖ్యలో బాటిళ్ల మూతలు, 35 లీటర్ల సామర్థ్యం కలిగిన 30 క్యాన్ల స్పిరిట్, బాటిలింగ్‌కు సిద్ధమైన 35 లీటర్ల సామర్థ్యం కలిగిన 48 క్యాన్ల నకిలీ మద్యం గుర్తించారు. సరఫరాకు సిద్ధం చేసిన 15,024 నకిలీ మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇంత భారీ స్థాయిలో నకిలీ మద్యం ప్లాంట్ ఉండటం చూసి అధికారులు నివ్వెరపోయారు.

టీడీపీ నేత కట్టా అరెస్ట్

నకిలీ మద్యం తయారీ ప్లాంట్ నిర్వహిస్తున్న తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ ఈఎస్ మధుసూదనరావు వెల్లడించారు. నియోజకవర్గంలో కీలక నాయకుడైన ఈయన స్వగ్రామం కమ్మవారిపల్లెలో సైతం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కట్టా ఇంట్లో 10 బాక్సుల కేరళ మాల్ట్ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ బాటిళ్లలో నకిలీ మద్యం ఉన్నట్టు నిర్ధారించి అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఈయన పెద్దతిప్పసముద్రం మండలం ఆంధ్రా–కర్ణాటక సరిహద్దులో ఆంధ్రా వైన్స్ పేరుతో మద్యం దుకాణం నిర్వహిస్తున్నాడు. కాగా, నకిలీ మద్యం తయారీ ప్లాంట్‌లో పని చేస్తున్న ఎనిమిది మంది కూలీలను అరెస్ట్ చేశారు. వారిలో విజయవాడకు చెందిన సయ్యద్ హాజీ, విశాఖపట్నంకు చెందిన చుక్కల బాలరాజు, తమిళనాడుకు చెందిన మణిమారన్, వి.సురేష్, వి.సూర్య, ఎస్.ఆనందం, ఒడిశాకు చెందిన డి.ఆనందదాస్, బి.మిథున్ ఉన్నారు. తన బెల్ట్ షాపులో విక్రయాలకు నకిలీ మద్యం తీసుకెళ్లడానికి అదే సమయంలో వచ్చిన పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన కే.నాగరాజును సైతం అరెస్ట్ చేశారు. పాల వ్యాన్ల ద్వారా నకిలీ మద్యం తరలించేందుకు సిద్ధం చేసిన వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా 40 బాక్సుల్లో నకిలీ మద్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యాను ద్వారానే నిత్యం చుట్టుపక్కల ప్రాంతాల్లోని వివిధ వైన్ షాపులకు నకిలీ మద్యం సరఫరా చేస్తున్నట్టు స్పష్టమైంది.

నకిలీ మద్యం తయారీ ఇలా..

నకిలీ మద్యం తయారీ విధానాన్ని ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి మీడియాకు వివరించారు. 'నకిలీ మద్యం తయారీ కోసం ఒక మోటార్ యంత్రాన్ని పెట్టారు. 200 లీటర్ల స్టీల్ క్యాన్‌లోని నీటిలో స్పిరిట్‌ను కలుపుతున్నారు. ఆ తర్వాత దాన్ని విస్కీనా, బ్రాందీనా.. ఏ విధంగా మార్చాలనే దాన్ని బట్టి కలర్, ఫ్లేవర్ కలుపుతున్నారు. ఇందుకోసం ఓ మోటార్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం దాన్ని మిషిన్ ద్వారా బాటిళ్లలో నింపుతున్నారు. ఇదే సమయంలో రెండు యంత్రాలతో గ్యాస్ మిక్స్ చేస్తున్నారు. దీనికి రెండు ఆటోమెటిక్ యంత్రాలు, ఒకటి మాన్యువల్ యంత్రాన్ని ఉపయోగిస్తున్నారు. తర్వాత మూతలు బిగించి నకిలీ లేబుళ్ల అతికిస్తున్నాను. ఈ లేబుళ్ల ఏపీకి చెందినవేనని తేలింది' అని వెల్లడించారు.

కీలక వ్యక్తి జనార్దన్‌రావు

నకిలీ మద్యం తయారీ కేంద్రం గుట్టురట్టయిన నేపథ్యంలో ఈ ప్లాంట్ మేనేజర్‌గా విజయవాడకు చెందిన జనార్దనరావు వ్యవహరిస్తున్నట్టు ఎక్సైజ్ పోలీసులు ప్రకటించారు. నకిలీ మద్యం తయారీ ప్లాంట్‌లో పని చేస్తున్న కూలీలను ఇతనే ఇక్కడికి పంపినట్టు తేలింది. జనార్దన్‌రావుకు రాష్ట్ర వ్యాప్తంగా పలువురు టీడీపీ నేతలతో సత్సంబంధాలు ఉన్నట్టు సమాచారం. ఇతన్ని పోలీసులు ఇంకా విచారించ లేదు. ఇతన్ని విచారిస్తే తెర వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులు.. పెద్ద తలకాయల వివరాలు వెలుగులోకి వస్తాయి. కాగా, ఇక్కడ తయారయ్యే నకిలీ మద్యాన్ని ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాలకు పెద్ద ఎత్తున సరఫరా చేస్తున్నట్టు తేలింది. ఆర్డర్లను బట్టి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా పంపుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

ష్.. గప్‌చుప్!

- అమరావతి నుంచి పెద్దల ఆదేశం
- కల్తీ మద్యం దందాకు ప్రభుత్వ రక్షా కవచం
- ప్రభుత్వ కీలక నేతలే కల్తీ మద్యం రింగ్ మాస్టర్లు
- నియోజకవర్గ నేతలే సూత్రధారులు
- యథేచ్ఛగా సాగుతున్న కల్తీ మద్యం రాకెట్ దోపిడీ
- రాష్ట్రంలో మూడో వంతు అమ్మకాలు కల్తీ మద్యమే
- తొలి ఏడాదే రూ.5,280 కోట్ల దోపిడీ

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



దామోదర్‌రెడ్డి కుమారుడు సర్వోత్తంరెడ్డిని పరామర్శిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో గోపాల్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి తదితరులు

దామోదర్‌రెడ్డి మృతి తీరని లోటు: సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మరణం నల్లగొండ జిల్లా, పార్టీకి తీరని లోటని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అనారోగ్యంతో ఈనెల 1న దామోదర్‌రెడ్డి మృతి చెందడం తెలిసిందే. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని దామోదర్‌రెడ్డి నివాసంలో ఆయన పార్థివ దేహానికి సీఎం రేవంత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

అత్యంత బాధాకరం: భట్టి



దామోదర్‌రెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ప్రజలతో మమేకమైన నేత అని, ఆయన మరణం అత్యంత బాధాకరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి నల్లగొండ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని గుర్తు చేశారు. రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పార్థివ దేహానికి శుక్రవారం నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని.. దివంగత నేత తనయుడు సర్వోత్తమ్ రెడ్డికి భట్టి ధైర్యం చెప్పారు.

సూర్యాపేటకు 'దామన్న' పార్థివ దేహం



సూర్యాపేట పట్టణానికి చేరుకున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పార్థివ దేహం

సూర్యాపేట: అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతిచెందిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం సూర్యాపేటకు అంబులెన్స్‌లో తరలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (రెడ్‌హౌజ్) వరకు అంబులెన్స్ వెంట కార్యకర్తలు, అభిమానులు ర్యాలీగా వచ్చారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా నిలబడి ప్రత్యేక అంబులెన్స్‌లో ఉన్న దామోదర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. రెడ్‌హౌజ్‌లో మంత్రి సీతక్క, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తదితరులు నివాళులర్పించారు. అనంతరం దామోదర్‌రెడ్డి పార్థివదేహాన్ని తుంగతుర్తికి తరలించారు. శనివారం ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం తెండి

కేంద్ర మంత్రి మేఘ్వాల్‌కు తెలంగాణ బార్ కౌన్సిల్, బీజేపీ లీగల్ సెల్ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: న్యాయవాదుల పరిరక్షణ కోసం పార్లమెంటులో చట్టం తీసుకురావాలని కేంద్ర న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖల సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌కు తెలంగాణ బార్ కౌన్సిల్, బీజేపీ లీగల్ సెల్ విజ్ఞప్తి చేశాయి. ఇందులో భాగంగా న్యాయవాదులకు వైద్య బీమా, మరణ పరిహారం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, జూనియర్ అడ్వొకేట్లకు స్టైపెండ్ వంటివి కల్పించాలని కోరాయి. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు వివిధ అంశాలపై తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ. నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ కె. సునీల్‌గౌడ్, బీజేపీ లీగల్‌సెల్ కన్వీనర్ గోకుల రామారావు, జాయింట్ కన్వీనర్ ఎస్. జనార్దన్ నాలుగు వినతిపత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన మేఘ్వాల్.. న్యాయవాదుల రక్షణకు పార్లమెంటులో చట్టం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ లీగల్ సెల్ కేంద్ర ప్రభుత్వ ఇమేజ్ పెంచే ప్రయత్నం చేయాలని.. కేంద్రం పాలసీలకు అనుగుణంగా కోర్టుల్లో వాదించేందుకు వీలుగా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, ఎంపీలు ఎం.రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, లీగల్ సెల్ నాయకులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఈఈఎస్‌ఎల్ జాతీయ సలహాదారుగా చంద్రశేఖర్‌రెడ్డి



అఖిలేశ్‌కుమార్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న చంద్రశేఖర్

సాక్షి, హైదరాబాద్: ఇంధన పొదుపు రంగంలో మూడు దశాబ్దాలుగా విశిష్ట సేవలందిస్తున్న ఎ.చంద్రశేఖర్ రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఆయనను తమ జాతీయ సలహాదారుగా నియమించింది. ప్రభుత్వ మీడియా వ్యవహారాలకు సంబంధించి ఆయన ఇక నుంచి సలహాదారుగా వ్యవహరిస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆయన చీఫ్ పబ్లిక్ రిలేషన్ అధికారిగా పని చేశారు. విద్యుత్ సంస్థల్లో 30 ఏళ్ల పాటు సేవలు అందించారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీకి దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మీడియా సలహాదారుగా పనిచేశారు. కాగా, తనకు ఈ అవకాశం కల్పించిన ఈఈఎస్ఎల్ సీఈవో అఖిలేశ్‌కుమార్ దీక్షిత్‌కు చంద్రశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇంధన పొదుపు ఆవశ్యకతను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్తానని ఆయన చెప్పారు.

బిహార్ ప్రజలను అవమానిస్తారా?

సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రశాంత్ కిశోర్ ఫైర్

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ ప్రజల డీఎన్‌ఏతో పోలిస్తే తెలంగాణ ప్రజల డీఎన్‌ఏ ఎంతో మెరుగైనదని.. మాజీ సీఎం కేసీఆర్‌ది బిహార్ డీఎన్‌ఏ అయితే తనది తెలంగాణ డీఎన్‌ఏ అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఓ టీవీ చానల్ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలపై బిహార్‌కు చెందిన ఎన్నికల మాజీ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ అంశంపై టైమ్స్ నౌ నవ్‌భారత్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పందిస్తూ 'రేవంత్‌రెడ్డి స్థాయి ఏంటి? బిహార్ ప్రజల డీఎన్‌ఏను తక్కువ చేసి మాట్లాడటమేంటి?' అంటూ నిలదీశారు. తెలంగాణ ఎన్నికల్లో రేవంత్‌ను ఓడించేందుకు శాయశక్తులా ప్రయత్ని స్తానని.. రేవంత్ ఎలా గెలుస్తారో చూస్తానని శపథం చేశారు. రాహుల్ గాంధేయే కాదు.. రేవంత్‌ను ఎవరూ కాపడలేరంటూ సవాల్ విసిరారు.

సాహితీ సాగరంలో ఓ'లల్లా'డించి..

దివికేగిన ప్రముఖ రచయిత లల్లాదేవి

- అశ్రునయనాల మధ్య స్వగ్రామంలో అంత్యక్రియలు
- 150కుపైగా కథలు, నవలలు, నాటికలు రాసిన లల్లాదేవి
- పలు సినిమాలకూ కథలు అందించిన ఘనత



లల్లాదేవి (ఫైల్)

ప్రత్తిపాడు: తెలుగు ప్రజలను సాహితీ సాగరంలో ఓలలాడించిన ప్రముఖ రచయిత లల్లాదేవి (పరుచూరి నారాయణాచార్యులు)(80) కన్ను మూశారు. వృద్ధాప్యంతోపాటు, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం నిమ్మగడ్డవారిపాలెంలో ఆయన శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఆదిలక్ష్మి, కుమారుడు నందగోపాల్, కుమార్తె హరిప్రసన్న రాణి సంతానం. 1945 ఏప్రిల్ 26న పరుచూరి కృష్ణమాచార్యులు, ఆండాళమ్మలకు లల్లాదేవి జన్మించారు. ఎస్ఎస్ఎల్‌సి భాషా ప్రవీణ చేసిన లల్లాదేవి తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ (గుంటూరు) పురాణ పండిట్‌గా, దేవదాయశాఖ ఆస్థాన పౌరాణికగా పనిచేశారు. లల్లాదేవి అంకురం, కాంచనమాల, కొండవీటి కథలు, క్షేత్రపాలిక, దొరబిడ్డ, నియోగిని, బొబ్బిలి మల్లమ్మ, భస్మసింహాసనం, భ్రమర, శైశవ' గీతం.. వంటి ముప్పైకు పైగా కథలు, అగ్ని కిరీటం, అర్ధమానవుడు, ఎడారి సూర్యుడు, ఎయిడ్స్, కోకిలమ్మ పెళ్లి, కాలానికి నిలిచిన కథ, కృష్ణరాయల కీర్తి, క్షేత్ర సంభవుడు, ఛత్రపతి శివాజీ, నడిరేయి నాయకీ నాగమ్మ, లకుమాదేవి, సాగరదుర్గం, శ్వేతనాగు, ఆమ్రపాలి, మహామంత్రి తిమ్మరుసు వంటి యాభైకు పైగా నవలలు, క్షేత్రవతి వంటి కథా సంపుటి చారిత్రక, సాంఘిక నవలలు, నాటికలు 150కుపైగా రాశారు. మాస, వార, పక్ష పత్రికల్లో సుమారు 40 ధారావాహికలు (సీరియల్స్), వందకు పైగా నవలలు రచించారు.

సినిమాలకూ కథలు

బి. విఠలాచార్య దర్శకత్వం వహించిన కరుణించిన కనకదుర్గ, ప్రముఖ కథానాయికి సౌందర్య నటించిన శ్వేతనాగు, కన్నడ ప్రముఖ హీరో అంబరీష్ నటించిన అరణ్యదల్లి, అభిమన్యు వంటి సినిమాలకు కథలనూ లల్లాదేవి అందించారు. 14 నవలలను కన్నడంలోకి కూడా అనువదించారు. వాటిలో కొన్ని నవలలు కన్నడ పత్రికల్లో ధారావాహికలుగా ప్రచురితమయ్యాయి. లల్లాదేవి రచించిన తిరుచరణాలు నవల శ్రీచరణ్‌గా హిందీలోకి అనువాదమైంది. మా తెలుగు తల్లి, గలగలగోదారి, లకుమాదేవి, కృష్ణరాయల కీర్తి, మల్లమదేవి ఉసురు, నాయకీనాగమ్మ.. వంటి అనేక చారిత్రకాలను రచించారు. ఎన్నో పురస్కారాలను అందుకున్నారు. ప్రస్తుతం ఆయన గ్రామంలోని ఆంజనేయ స్వామి, కోదండ రామాలయం, విఘ్నేశ్వరాలయం, అంకమ్మతల్లి దేవస్థానాల్లో పూజారిగా చేస్తూ దేవుని సేవలో తరిస్తూ కన్నుమూశారు.

ప్రచారం.. వారమే!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రయత్నించొద్దు.

➤ ఎస్ఈసీ విధించిన అభ్యర్థుల వ్యయ పరిమితి మాత్రం పూర్వకాలం నాటిదే కొనసాగుతోంది. జెడ్పీటీసీగా పోటీచేసే వారి వ్యయ పరిమితి రూ.4 లక్షలుగా ఉంది.

విద్వేష భావాలు రెచ్చగొడితే అంతే...

ఎన్నికల లబ్ధి కోసం అభ్యర్థి లేదా అతడి అనుమతితో ఏజెంట్, ఇతరులు మతం, జాతి, కులం, వర్గం లేదా భాషా ప్రాతిపదికన ప్రజల మధ్య విభేదాల సృష్టి, వ్యక్తుల మధ్య విద్వేష పూరిత భావాలు లేదా దేశంలోని వివిధ తరగతుల మధ్య విద్వేష భావాలు రెచ్చగొట్టడం వంటి వాటిని కూడా అవినీతి చర్యగానే పరిగణిస్తామని ఎస్ఈసీ స్పష్టం చేసింది. విద్వేషాలతో రెచ్చగొట్టిన వారు ఒకవేళ గెలిచినా సభ్యత్వం రద్దయ్యే పరిస్థితి ఎదురవుతుంది. ఎన్నికల నేరంగా పరిగణిస్తే మూడేళ్ల వరకు పొడిగించే జైలుశిక్ష, జరిమానా రెండూ విధిస్తారు.

ఏదో ఒక నామినేషనే ఉంచుకోవాలి

ఆయా ప్రాదేశిక నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు వేసి ఉంటే, అందులో ఏదో ఒకటి ఎంచుకొని మిగిలిన వాటిని ఉపసంహరించుకోవాల్సి ఉంటుంది. లేనిపక్షంలో అభ్యర్థులు సమర్పించిన అన్ని నామినేషన్లు తిరస్కరణకు గురై ఎక్కడి నుంచైనా పోటీకి అనర్హులుగా మిగిలిపోతారు. ఉదాహరణకు రెండు చోట్ల ఎంపీటీసీగా లేదా రెండు చోట్ల జెడ్పీటీసీగా నామినేషన్లు వేసి విత్ డ్రా చేసుకోకపోతే అనర్హులు అవుతారు. ఒక చోట ఎంపీటీసీగా, మరో చోట జెడ్పీటీసీగా పోటీ చేసినా, ఆ నామినేషన్లు చెల్లుబాటు అవుతాయి.

విజయ్ దేవరకొండ, రష్మిక నిశ్చితార్థం

వచ్చే ఫిబ్రవరిలో డెస్టినేషన్ వెడ్డింగ్!



సాక్షి, సినిమా: హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందన్నా నిశ్చితార్థం శుక్రవారం నిరాడంబరంగా జరిగింది. హైదరాబాద్‌లోని విజయ్ దేవరకొండ నివాసంలో ఉదయం 11 గంటల ప్రాంతంలో వీరి ఎంగేజ్‌మెంట్ అయింది. ఇరు కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కొన్నేళ్లుగా వీరు డేటింగ్ చేస్తున్నారని, ప్రేమలో ఉన్నారనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. అయితే దీనిపై ఇటు విజయ్ కానీ, అటు రష్మిక కానీ ఎప్పుడూ స్పందించలేదు. కానీ, వెకేషన్ కోసం విదేశాలకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు మాత్రం ఎయిర్‌పోర్ట్‌లో ఫొటోగ్రాఫర్ల కంట పడేవారు. అదేవిధంగా చాలాసార్లు రెస్టారెంట్ల వద్ద కనిపించేవారు. వారిద్దరూ ఎక్కడ కనిపించినా ఆ ఫొటోలు నెట్టింట వైరల్ అయ్యేవి. ఆ ఫొటోలను బట్టి ఎవరికి నచ్చిన కథనాలు వారు అల్లేసుకునేవారు. వీరి నిశ్చితార్థంపై గతంలోనూ పలు వార్తలొచ్చినప్పటికీ అవి వదంతులుగా మిగిలిపోయాయి. అయితే శుక్రవారం ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా విజయ్, రష్మిక నిశ్చితార్థం చేసుకున్నారు. 2026 ఫిబ్రవరి ఆఖరులో వీరు డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోనున్నట్లు తెలిసింది. విజయ్, రష్మిక కలిసి తొలిసారి 'గీత గోవిందం'(2018) చిత్రంలో నటించారు. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. ఆ తర్వాత వీరిద్దరూ 'డియర్ కామ్రేడ్' (2019) సినిమాలో జంటగా నటించారు. ఆ తర్వాత ఎవరి సినిమాలతో వారు బిజీబిజీగా దూసుకెళ్తున్నారు.

కొడుకు మీద కోపంతో..

- భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త
- మహబూబాబాద్ జిల్లా ఆలేరులో ఘటన




స్వప్న (ఫైల్)


నెల్లికుదురు: కొడుకు మీద కోపంతో భార్యను గొడ్డలితో భర్త నరికి చంపిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని ఆలేరు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్ బాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చీకటి నరేశ్, స్వప్న (38) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. హాస్టల్లో ఉండి చదువుకుంటున్న ఇద్దరు కుమారులు (మైనర్లు) దసరా సెలవులకు ఇంటికి వచ్చారు. కాగా, పండుగను పురస్కరించుకుని పెద్దకుమారుడు తన స్నేహితులతో కలసి గురువారం మద్యం తాగి ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. దీంతో తండ్రి నరేశ్.. 'చదువుకుంటున్న నీకు తాగుడు ఎందుకు' అని ఆగ్రహం వ్యక్తం చేశాడు. తర్వాత ఆ రాత్రి సద్దుమణిగిన గొడవ శుక్రవారం ఉదయం మళ్లీ జరిగింది. ఇలా మద్యం తాగితే ఎలా చదువుకుంటావు అని తండ్రి కోపంతో మందలించాడు. నరేశ్ ఆగ్రహంతో గొడ్డలితో కుమారుడిపై దాడి చేసేందుకు వస్తుండగా ఏమీ అనవద్దని భార్య స్వప్న అడ్డుకుంది. దీంతో కుమారుడిని ఇలా తయారు చేసిందే నీవని భార్య స్వప్నపై నరేశ్ గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

పోషిస్తున్న అమ్మమ్మనే కడతేర్చాడు..

డబ్బు ఇవ్వకపోవడంతో దాడి చేసి చంపేసిన మనవడు



పద్మావతి (ఫైల్)



సాయితేజ

ఎర్రుపాలెం: తల్లిదండ్రులు మృతి చెందడంతో పెంచి పెద్ద చేసిన అమ్మమ్మను ఆమె మనవడు కడతేర్చిన ఘటన ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం సఖినవీడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శాఖమూరి పద్మావతి (60) తన కుమార్తె అనసూర్యకు మొలుగుమాడుకు చెందిన బాలకృష్ణతో వివాహం జరిపించింది. కాగా, బాలకృష్ణ పదేళ్ల క్రితం, అనసూర్య రెండేళ్ల క్రితం మృతి చెందడంతో వారి కుమారుడు చీరాల సాయితేజ (23) అమ్మమ్మవద్ద ఉంటున్నాడు. మధిరలోని ఓ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న సాయి చెడు వ్యసనాలకు బానిసై డబ్బు కోసం అమ్మమ్మను వేధించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం కూడా డబ్బు కావాలని ఒత్తిడి తేగా ఆమె లేవని చెప్పింది. అంతేకాక చెడు అలవాట్లు మానుకోవాలని మందలించింది. దీంతో ఆమెపై కోపం పెంచుకున్న సాయి తర్వాత ఇంట్లో మంచంపై నిద్రిస్తుండగా జుట్టు పట్టుకుని మంచం కోడుకేసి తలను పలుమార్లు కొట్టడంతో పాటు కింద పడేసి తలను నేలకేసి బాదాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలైన పద్మావతి అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై సమాచారం అందుకున్న మధిర సీఐ మధు, ఎస్ఐ రమేశ్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్తరాంధ్ర అతలాకుతలం

తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఎడతెగని వర్షాలు

సాక్షి, అమరావతి : తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర వణికింది...! ఎడతెరిపి లేని భారీ వర్షంతో తడిసి ముద్దయింది...! మరీ ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా అతలాకుతలమైంది...! విజయనగరం విలవిల్లాడింది...! విశాఖపట్నంలోనూ తీవ్రత కనిపించింది..! ఏకధాటిగా కురిసిన వానకు నదులు, వాగులు పొంగి ప్రవహించాయి...! గంటకు 60–70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయడంతో అనేకచోట్ల చెట్లు రోడ్లపై కూలిపోయాయి. వేలాది ఎకరాల్లో పంట పొలాలు మునగడంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. కాగా, వేర్వేరు ఘటనల్లో గోడకూలి వృద్ధ దంపతులు సహా ముగ్గురు మృతిచెందారు. నది ప్రవాహంలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. రికార్డు స్థాయిలో 18.03 సెంటీమీటర్ల వర్షం కురవడంతో శ్రీకాకుళం జిల్లా పలాస–కాశీబుగ్గ పట్టణాలు చెరువుల్లా మారాయి. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోనూ పలుచోట్ల అతి భారీ వర్షాలు కురవడంతో ఆయా ప్రాంతాలు జలమయమయ్యాయి.


వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం మాతల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంశధార.. నీట మునిగిన పరిసర ప్రాంతాలు

కూరలో కారం తక్కువగా ఉందని..

భర్త మందలించడంతో భార్య ఆత్మహత్య



గంగోత్రి (ఫైల్)

ఇబ్రహీంపట్నం : కూరలో కారం తక్కువగా ఉందని భర్త మందలించడంతో మనస్తాపానికి గురైన అల్లెపు గంగోత్రి (22) అనే యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామంలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎర్దండి శివారులోని వడ్డెర కాలనీకి చెందిన అల్లెపు గంగోత్రి, అల్లెపు సంతోష్‌లు పెద్దల అంగీకారంతో గత నెల 26న ప్రేమ వివాహం చేసుకున్నారు. దసరా పండుగ సందర్భంగా గురువారం అత్తవారింటికి వచ్చిన సంతోష్.. మాంసం కూరలో కారం తక్కువగా ఉండటంతో భార్యతో గొడవ పడి తినకుండా తమ ఇంటికి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపానికి గురైన గంగోత్రి రాత్రి సమయంలో ఇంట్లో దూలానికి చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త సంతోష్‌తో గొడవ జరగడంతోపాటు మరికొన్ని కారణాలతో తన కూతురు ఆత్మహత్య చేసుకుని ఉంటుందని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

క్లుప్తంగా...

మెడికల్ ఎవిడెన్స్ లేకుంటే సమర్థించలేం: హైకోర్టు

• అత్యాచార కేసులో స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: అత్యాచార కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని బలపరిచే మెడికల్ ఎవిడెన్స్ లేకుంటే ఆమె సాక్ష్యాన్ని సమర్థించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. నమ్మశక్యమైన ఆధారం ఒకటన్నా ఉన్నా ఇలాంటి కేసులో శిక్ష విధించే అవకాశం ఉంటుందని చెప్పింది. కేవలం ఆమె ఫిర్యాదు ఆధారంగా జైలుకు పంపలేమని చెబుతూ.. నిందితుడికి ట్రయల్ కోర్టు విధించిన పదేళ్ల జైలు శిక్షను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. ప్రేమించి వివాహం చేసుకుంటానని చెప్పి లైంగికంగా వేధించి మోసం చేశాడంటూ హైదరాబాద్ కిషన్‌బాగ్‌కు చెందిన ఇర్ఫాన్‌పై ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బహదూర్‌పురా పోలీసులు 2009లో కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ జరిపిన ట్రయల్‌కోర్టు నిందితుడికి పదేళ్ల జైలు, రూ.1,000 చొప్పున రెండు సెక్షన్లలో జరిమానా విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఇర్ఫాన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు. యువతితో ప్రేమలో ఉన్న ఇర్ఫాన్ 2008లో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటికి వచ్చి బెదిరించి లైంగికంగా వేధించాడని ఆమె ఫిర్యాదు చేసిందన్నారు. యువతి వెంటనే ఫిర్యాదు చేయకుండా, 6 నెలల తర్వాత ఫిర్యాదు చేయడం.. లిఖిత పూర్వక, మౌఖిక ఫిర్యాదుల్లో వ్యత్యాసం ఉండటం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అంతేకాదు, వైద్య పరీక్షలతోపాటు ఫోరెన్సిక్ పరీక్షల్లో ఎలాంటి ఆధారం లభించలేదన్నారు. ట్రయల్‌కోర్టు ఇలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా శిక్ష విధించడం చెల్లదన్నారు.

త్వరలో కవిత రాష్ట్రవ్యాప్త పర్యటన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్రవ్యాప్త పర్యటనకు శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారు. మేధావులు, కవులు, కళాకారులు, వివిధ రంగాల నిపుణులతో సమావేశమయ్యేలా షెడ్యూలుకు రూపకల్పన జరుగుతోంది. కాగా, తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్టీ సామాజికవర్గం నేత ఎల్.రూప్‌సింగ్‌ను నియమిస్తున్నట్లు కవిత ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రియాజుద్దీన్, మంచాల వరలక్ష్మి, పుస్కూరి శ్రీకాంత్ రావు, కొట్టాల యాదగిరి, కోల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రంగు నవీన్ ఆచారి, రాష్ట్ర కార్యదర్శులుగా జాడి శ్రీనివాస్, గుంటి సుందర్, సేనాపతి అర్చనను నియమించారు.

పైరసీ.. బొమ్మ చూపిస్తోంది!



ప్రపంచంలో రెండో పెద్ద పైరసీ మార్కెట్ మనదే మనదేశం నుంచి 1,756 కోట్ల విజిట్స్ నమోదు

సాక్షి, స్పెషల్ డెస్క్

ఇటీవల హైదరాబాద్ పోలీసులు దేశంలోనే అతిపెద్ద సినీ పైరసీ గుట్టు రట్టు చేశారు. ఐదేళ్లలో 1,050 సినిమాలను పైరసీ చేసిన ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా పైరసీపై చర్చ మొదలైంది. భారత వినోద పరిశ్రమకు పైరసీ 'బొమ్మ' చూపిస్తోంది. విడుదలైన రోజే పైరసీ వెబ్‌సైట్లలో సినిమా దర్శనమిస్తోంది. అంతేకాదు పైరసీ భూతం చట్టానికే సవాల్ విసురుతోంది. పైరసీ సమస్య ఒక్క సినిమా పరిశ్రమకే కాదు.. టీవీ, మ్యూజిక్, సాఫ్ట్‌వేర్, పబ్లిషింగ్ రంగాలకూ విస్తరించింది.

ప్రపంచవ్యాప్తంగా గత ఏడాది పైరసీ వెబ్‌సైట్ల విజిట్స్ 21,630 కోట్లు నమోదయ్యాయి. 2024లో మొత్తం పైరసీ ట్రాఫిక్‌లో మనదేశ వాటా 8.12%. అంటే మన దేశం నుంచి 1,756 కోట్ల విజిట్స్ నమోదయ్యాయన్నమాట. పబ్లిక్, ప్రైవేట్ టొరెంట్స్, వెబ్ ఆధారంగా ఫిల్మ్, టీవీ, మ్యూజిక్ స్ట్రీమింగ్; సాఫ్ట్‌వేర్, పబ్లిషింగ్ రంగాలలో ప్రపంచ పైరసీ ట్రెండ్స్‌ను పర్యవేక్షిస్తున్న డేటా కంపెనీ 'మ్యూసో'.. 'పైరసీ ట్రెండ్స్ అండ్ ఇన్‌సైట్ రిపోర్ట్ 2024' అనే నివేదిక రూపొందించింది. దీని ప్రకారం పైరసీ వెబ్‌సైట్ల వీక్షకుల సంఖ్యలో 12% వాటాతో అమెరికా తొలి స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో భారత్ ఉంది.

జీఎస్టీ నష్టం రూ.4,313 కోట్లు

ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 'ద రాబ్ రిపోర్ట్ 2024' ప్రకారం.. 2023లో భారత వినోద పరిశ్రమ పైరసీ కారణంగా రూ.22,400 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు రూ.8,700 కోట్లు, థియేటర్లకు రూ.13,700 కోట్ల నష్టం వాటిల్లింది. మొత్తంగా ప్రభుత్వానికి జరిగిన జీఎస్టీ నష్టం రూ.4,313 కోట్లు.

పైరసీ కంటెంట్ ఏయే భాషల్లో ఎక్కువ డౌన్లోడ్ చేస్తున్నారు/వీక్షిస్తున్నారంటే..

హిందీ	40%
ఇంగ్లీష్	31%
దక్షిణాది	23%

మొదటి స్థానం మనదే

మ్యూసో 2023 నివేదిక ప్రకారం ప్రపంచ చలనచిత్ర పైరసీలో మనదే పైచేయి. మొత్తం పైరసీలో 30.58% వాటా మన దేశానిదే. యూఎస్ 6.26%, టర్కీ 5.75% వాటాతో ఆ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. పైరసీ కంటెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని చూసేవారితో (49.6 శాతం) పోలిస్తే.. అప్పటికప్పుడే చూసే (స్ట్రీమింగ్) వాళ్లు కాస్త ఎక్కువ ఉండటం (50.4 శాతం) గమనార్హం. వినోదం ఇప్పటికీ ఖరీదుగా ఉండడం, అందుబాటు విషయంలో కస్టమర్ల అంచనాలను అందుకోలేకపోవడం వల్లే పైరసీ కొనసాగుతోందని నివేదిక వెల్లడించింది. అయితే ప్రపంచవ్యాప్తంగా 2023తో పోలిస్తే గత ఏడాది ఈ–బుక్స్, ఆడియో బుక్స్, పేపర్స్, మ్యాగజైన్స్ వంటి పబ్లిషింగ్ రంగంలో పైరసీ 4.3% పెరిగింది.

ఆకర్షణీయ ప్రత్యామ్నాయం

మ్యూసో 2023 నివేదిక ప్రకారం ప్రపంచ చలనచిత్ర పైరసీలో మనదే పైచేయి. మొత్తం పైరసీలో 30.58% వాటా మన దేశానిదే. యూఎస్ 6.26%, టర్కీ 5.75% వాటాతో ఆ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. పైరసీ కంటెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని చూసేవారితో (49.6 శాతం) పోలిస్తే.. అప్పటికప్పుడే చూసే (స్ట్రీమింగ్) వాళ్లు కాస్త ఎక్కువ ఉండటం (50.4 శాతం) గమనార్హం. వినోదం ఇప్పటికీ ఖరీదుగా ఉండడం, అందుబాటు విషయంలో కస్టమర్ల అంచనాలను అందుకోలేకపోవడం వల్లే పైరసీ కొనసాగుతోందని నివేదిక వెల్లడించింది. అయితే ప్రపంచవ్యాప్తంగా 2023తో పోలిస్తే గత ఏడాది ఈ–బుక్స్, ఆడియో బుక్స్, పేపర్స్, మ్యాగజైన్స్ వంటి పబ్లిషింగ్ రంగంలో పైరసీ 4.3% పెరిగింది.

అంతర్జాతీయంగా 2024లో పైరసీ వెబ్‌సైట్ల విజిట్స్ ఇలా

రంగాల వారీగా	టీవీ	పబ్లిషింగ్	సినిమా	సాఫ్ట్‌వేర్	సంగీతం
విజిట్స్ (కోట్లలో)	9,679	6,638	2,427	1,488	1,398
ఏడాదిలో వృద్ధి/తగ్గుదల శాతాల్లో	-6.8	+4.3	-18	-2.1	-18.6

పైరసీ ట్రాఫిక్ (విజిట్స్, కోట్లలో)	యూఎస్‌ఏ	భారత్	రష్యా ఫెడరేషన్	ఇండోనేషియా	వియత్నాం
	2,667	1,756	1,540	1,211	744

పైరసీ కంటెంట్‌ను అత్యధికంగా (63 శాతం) చూస్తున్నది అక్రమ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే. ఆ తరవాతి స్థానాల్లో మొబైల్ యాప్స్ (16 శాతం), సోషల్ మీడియా (10 శాతం) ఉన్నాయి.

యూట్యూబ్‌లో చూసి.. పైరసీ చేసి..

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఇటీవల చిక్కిన సినీ పైరసీదారుడు అశ్వినీ కుమార్ వ్యవహారంలో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. బిహార్‌లోని పట్నాకు చెందిన అతను కేవలం పదో తరగతే చదివినప్పటికీ యూట్యూబ్‌లో చూసి హ్యాకింగ్ నేర్చుకొని మరీ పైరసీ ద్వారా సినీ పరిశ్రమను కొల్లగొట్టడం అందరినీ అవాక్కు చేసింది.

సినీ పైరసీదారుడు అశ్వినీ కుమార్ అరెస్టుతో వెలుగులోకి ఆసక్తికర అంశాలు

- చదివింది టెన్త్.. అయినా నెట్‌లో హ్యాకింగ్ వీడియోలు చూసి నేర్చుకున్న కేటుగాడు
- తన ప్రతిభను పరీక్షించుకొనేందుకు తొలుత పలు ప్రభుత్వ వెబ్‌సైట్లను హ్యాక్ చేసిన వైనం
- ఆపై డిజిటల్ సంస్థల సర్వర్లను హ్యాక్ చేసి మూడేళ్లలో 550 సినిమాల పైరసీ
- టెలిగ్రాం చానళ్లతోపాటు గేమింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లకు విక్రయం
- నిందితుడికి చెందిన లక్ష డాలర్ల విలువైన క్రిప్టో కరెన్సీని సీజ్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

సాఫ్ట్‌వేర్‌పై పట్టు సాధించి..

పగలంతా నిద్రపోతూ రాత్రుళ్లు యూట్యూబ్‌లో హ్యాకింగ్ వీడియోలు చూస్తూ ఎథికల్ హ్యాకింగ్, కోడింగ్‌తోపాటు జావా, పైథాన్ స్క్రిప్ట్స్, పెనెట్రేషన్ టెస్టింగ్ టూల్స్ తదితరాలపై నిందితుడు పట్టు సాధించాడు. అనంతరం తన ప్రతిభను సరిచూసుకోవడానికి తొలుత కేంద్ర ఎన్నికల సంఘంతోపాటు బిహార్, జార్ఖండ్‌కు చెందిన వివిధ ప్రభుత్వ వెబ్‌సైట్లను హ్యాక్ చేశాడు. ఆపై సినీ పైరసీపై దృష్టి పెట్టి వివిధ టెలిగ్రాం చానళ్ల అడ్మిన్లతోపాటు గేమింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లతో కుమ్మక్కయ్యాడు.

సర్వర్లను హ్యాక్ చేసి...

సినిమాలను గతంలో రీళ్ల ఆధారంగా థియేటర్లలో ప్రదర్శించే విధానం ఉండగా ప్రస్తుతం డిజిటల్ పద్ధతిలో శాటిలైట్ లింక్ ద్వారానే థియేటర్లలో స్క్రీన్లపైకి సినిమాలు ప్రదర్శితమవుతున్నాయి. ఇందుకోసం వివిధ డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ పని చేస్తున్నాయి. విడుదలకు సిద్ధమైన సినిమాలను నిర్మాతలు డిజిటల్ మీడియా సంస్థలతో ఒప్పందాలు చేసుకొని అందిస్తే ఆయా సంస్థలు వాటిని తొలుత సర్వర్లలో భద్రపరుచుకుంటున్నాయి. అనంతరం ప్రపంచవ్యాప్తంగా ఉన్న థియేటర్లకు శాటిలైట్ ద్వారా పంపిస్తున్నాయి. ఇలాంటి సంస్థల సర్వర్లపై కన్నేసిన అశ్వినీ కుమార్ వాటిని హ్యాక్ చేసి హెచ్‌డీ ప్రింట్స్‌ను ఆన్‌లైన్‌లో తస్కరించేవాడు. కొన్ని సినిమాలను విడుదలైన ఒకట్రెండు రోజులకు, మరికొన్నింటిని విడుదలకు ముందే కాపీ చేసుకొనేవాడు. ఇలా మూడేళ్లలో వివిధ భాషలకు చెందిన 550 సినిమాలను పైరసీ చేసిన అతను.. 120 సినిమాలను విడుదలకు వారం ముందే తస్కరించాడు. ఈ జాబితాలో అల్లు అర్జున్ నటించిన పుష్ప–2 కూడా ఉంది. ఇవన్నీ లింకుల రూపంలో ఆయా టెలిగ్రాం చానళ్ల ద్వారా, పాప్‌అప్ యాడ్స్ రూపంలో బెట్టింగ్, గేమింగ్ యాప్స్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా లక్షల మందికి చేరాయి.

క్రిప్టో కరెన్సీ రూపంలో లావాదేవీలు...

అశ్వినీ కుమార్‌కు అంతర్జాతీయ లింకులు ఉన్నట్లు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. విదేశాల్లోని ఆయా టెలిగ్రాం చానళ్లు, వెబ్‌సైట్లు, యాప్‌ల నిర్వాహకులకు పైరసీ సినిమాల వీడియోలను నిందితుడు పంపగా అందుకు ప్రతిఫలంగా క్రిప్టో కరెన్సీ రూపంలో అతను నగదు పొందినట్లు ఆధారాలు సేకరించారు. వాటిని సేఫ్ పాల్, ట్రస్ట్ వంటి నాన్–కస్టోడియన్ వాలెట్స్‌లో భద్రపరుచుకున్నాడు. కేంద్ర ఆర్థిక శాఖ అధీనంలోని ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్‌ఐయూ) అనుమతితో నడిచేవి కస్టోడియన్ వాలెట్స్ అయితే... అనుమతి లేకుండా నడిచేవి నాన్–కస్టోడియన్ కిందకు వస్తాయి. కస్టోడియన్ వాలెట్స్ ఆపరేట్ చేయడానికి వినియోగదారుడి కేవైసీ వివరాల నమోదు, వర్చువల్ వెరిఫికేషన్ తప్పనిసరి. ఇలా చేస్తే పోలీసుల దర్యాప్తులో ఉనికి బయటపడుతుందనే ఉద్దేశంతో సైబర్ నేరగాళ్లు ఎక్కువగా నాన్–కస్టోడియన్ వాలెట్స్ వాడుతున్నారు. ఎట్టకేలకు అశ్వినీ కుమార్‌ను పట్టుకున్న పోలీసులు.. అతని పేరిట వివిధ నాన్–కస్టోడియన్ వాలెట్స్‌లో ఉన్న దాదాపు లక్ష డాలర్ల విలువైన క్రిప్టో కరెన్సీని పోలీసులు సీజ్ చేశారు.

మన మాటే ఆయుధం

▶ మొదటి పేజీ తరువాయి

కొలిన్ గొన్సాల్వేస్ మాట్లాడుతూ.. లద్దాఖ్‌లో ప్రజలు చేస్తున్న ఆందోళనలో యువత పాత్ర ప్రధానంగా ఉందన్నారు. మణిపూర్‌లో 2022లో ప్రారంభమైన హింస నేటికీ చల్లారలేదని ఆందోళన వ్యక్తం చేశారు. హింసలో మరణించిన వారి కుటుంబాలకు కనీస పరిహారం దక్కలేదని, నిరాశ్రయులైన వారికి పునరావాసం కల్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా అమలు కాలేదన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల నిర్మూలన పేరిట గిరిజనులను తరలించే యత్నం జరుగుతోందని, గిరిజన ఆవాసాల్లో ఉన్న అత్యంత విలువైన ఖనిజాలను తవ్వేందుకే ఈ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం తలపెట్టిందని మండిపడ్డారు. కేంద్ర హోంమంత్రి అత్యంత దారుణంగా మాట్లాడుతూ హింసాత్మకమైన వ్యాఖ్యలు చేస్తున్నారని, దీనిపై ప్రతీ పౌరుడు గొంతెత్తాలని పిలుపునిచ్చారు.

వ్యంగ్యంతో కూడిన విమర్శలకు తీవ్ర ప్రభావం: వీర్ దాస్, నటుడు



ఏదైనా సమస్యపై వ్యంగ్యంతో కూడిన విమర్శలు చేసినప్పుడు అవి తీవ్ర ప్రభావం చూపడమేకాక... అంతే వేగంతో వాటికి పరిష్కారం కూడా లభిస్తుంది. అలాంటి విమర్శలు చేయాలంటే భావప్రకటనా స్వేచ్ఛ అవసరం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేనట్లు కనిపిస్తోంది. విమర్శలపై ప్రభుత్వం సహనాన్ని కోల్పోతోంది. వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టడం పరిపాటిగా మారింది. హాస్యం అనేది సమాజానికి అద్దంలాంటిది. అందులో కనిపించే వ్యంగ్యం సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను బయటకు చూపుతుంది.

ఆర్థిక అసమానతలు: ప్రొ. రతిన్ రాయ్



దేశంలోని చాలా రాష్ట్రాల మధ్య ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరుగుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో ఉత్తరాది రాష్ట్రాల కంటే దక్షిణాది రాష్ట్రాల వాటా ఎక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం ఢిల్లీ కంటే రెట్టింపుగా ఉంది. ఇక తమిళనాడు, కేరళ రాష్ట్రాల వృద్ధి ఇండోనేసియా దేశం కంటే ఎక్కువ. జనాభా పరంగా పెద్ద రాష్ట్రాలైన ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లో నేపాల్ వృద్ధి కంటే చాలా తక్కువ. దేశంలోని రాష్ట్రాల మధ్య సమానత్వంతో కూడిన ఆర్థిక విధానాలుండాలి. లేకుంటే పేదలు, మధ్యతరగతి వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందవు. ఆర్థిక విధానాలను సరిచేసుకుంటేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది.

నిజాయితీ జర్నలిజం కావాలి: ఆర్ఫా ఖానమ్ శేర్వానీ, సీనియర్ ఎడిటర్, ది వైర్



ప్రజాస్వామ్య రక్షణలో మీడియా పాత్ర కీలకం. నాలుగో స్తంభంగా పిలిచే మీడియా ప్రభుత్వాలకు మద్దతుగా ప్రచారం చేయడం కంటే ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. మీడియా స్వేచ్ఛను నియంత్రిస్తే అది ప్రజాస్వామ్యానికి ఎంతో ప్రమాదం. సమాజంలో సమస్యలు, ప్రభుత్వ లోసుగులను మీడియా బయటకు చెప్పకుంటే ప్రజలు తప్పుదోవ పట్టే ప్రమాదం ఉంది. అందుకే నిజమైన వార్తలను నిజాయితీగా ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉంది.

సైన్యాన్ని బలపరిస్తే సరిపోదు: ప్రవీణ్ సాహ్నీ, ఎడిటర్, ఫోర్స్ మేగజైన్



దేశం సురక్షితంగా ఉండాలంటే కేవలం సైన్యానికి అధిక నిధులు కేటాయిస్తే సరిపోదు. ఆర్థిక, సాంకేతికంగా ప్రత్యేక దృష్టి సారించి బలపర్చాలి. ఇప్పటివరకు యుద్ధమంటే సైనికులు మాత్రమే చేసేవారు. ఇకపై జరిగే ఆధునిక యుద్ధాలు సాంకేతిక పరిజ్ఞానంతో జరిగేవే. ఇక అమెరికా–భారత్ విషయంలోనూ ఇబ్బందికర వాతావరణం కనిపిస్తోంది. చైనా, పాకిస్తాన్ అనుసరిస్తున్న వ్యూహాలు భారత్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. అంతర్జాతీయంగా బలమైన వ్యవస్థగా ఎదగాలంటే సరైన స్పృహతో ప్రభుత్వం పాలన సాగించాలి.

నైతికత, సహనంతోనే భవిష్యత్తు: రుద్రాంగ్శు ముఖర్జీ, చరిత్రకారులు, అశోకా వర్సిటీ చాన్స్‌లర్



నైతికత, సహనం, జ్ఞానంతోనే యువతకు మెరుగైన భవిష్యత్తు సాధ్యమవుతుంది. మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలోచనలు ఈ అంశాలను ప్రస్ఫుటం చేస్తాయి. నేటి సమాజంలో ప్రజల్లో విభజన భావాలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితి దేశ సమగ్రతకు పెనుముప్పుగా మారే ప్రమాదం ఉంది. ఇలాంటి ఆలోచనల నుంచి సరైన మార్గంలో నడిపించేందుకు సరైన విద్యావిధానం అవసరం. స్వతంత్రంగా ఆలోచనలు చేసే విధంగా, మానవతా విలువలు పెంపొందించేలా విద్యావిధానం ఉండాలి.

...భారతీయ సంస్కృతి

▶ మొదటి పేజీ తరువాయి

'దసరా సమ్మేళనం'లో గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అలయ్ బలయ్‌ని ఈ ఏడాది ప్రత్యేకంగా 'ఆపరేషన్ సిందూర్' వీరులకు శ్రద్ధాంజలి, సైనికుల త్యాగాలను స్మరించే కార్యక్రమంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ అలయ్ బలయ్ వంటి అసాధారణమైన వేడుకల తర్వాత మానవ సంబంధాలు మరింత బలపడతాయని చెప్పారు. జమ్మిచెట్టును పూజించడం ద్వారా పర్యావరణం, ప్రకృతిని ప్రేమించాలనే పురాతన ధర్మాన్ని నేటికీ చాటి చెబుతున్నారన్నారు.

- మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా ప్రసంగిస్తూ 'కేవలం 88 గంటల్లో ముగిసిన ఆపరేషన్ సిందూర్ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలకు ఈ ఆపరేషన్ ఒక సమాధానం' అన్నారు. • మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు 'దేశాన్ని కులం, మతం, ప్రాంతం పేరుతో చీల్చే ప్రయత్నాలు సాగవు. నేపాల్‌లో ఏదో జరిగిందని, భారత్‌లోనూ అలాంటిది జరుగుతుందని ఆశించేవారి ఆశలు నెరవేరవు, భిన్నత్వంలో ఏకత్వమే భారత్ బలం'అన్నారు.
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 'దేశానికి ఏ సమస్య వచ్చినా అందరం ఏకం కావాలి. అదే నిజమైన అలయ్ బలయ్'అని అన్నారు. • కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రసంగిస్తూ...'మనుషులు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుంటే మన స్సులు పరిశుభ్రమవుతాయి. రాజస్తాన్‌లోని బికనీర్ ప్రాంతంలోనూ అలయ్ అంటూ జానపదగీతం ఉంది (పాడి వినిపించారు). జాతీయ సమైక్యతకు ఒక రూపం, చిహ్నంగా అలయ్ బలయ్ నిలుస్తోంది'అన్నారు.
- మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'తెలంగాణ సాధనకు అందరం ఐక్యంగా పోరాటం చేశాం. బయట కత్తులు దూసుకునే వారు ఇక్కడకు రాగానే అలయ్ బలయ్ చేసుకుంటారు'అని చెప్పారు.
- నటుడు నాగార్జున మాట్లాడుతూ 'అలయ్ బలయ్'లో సత్కారం చేయించుకోవడం తొలిసారి. చాలా కొత్తగా ఉంది. ఇరవై ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తుండడం గొప్పవిషయం'అని చెప్పారు.
- ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం ప్రసంగిస్తూ 'అలయ్ బలయ్ అంటే హృదయపూర్వకంగా ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకోవడం. ఇది మన పూర్వీకుల నుంచి వస్తోంది'అని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, మంత్రులు డి.శ్రీధర్‌బాబు, డా.వివేక్ వెంకటస్వామి, సీపీఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డా.కె.నారాయణ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, ఎంపీలు డా.కె.లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్య, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్ రావు, అనిల్‌కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీలు సి.అంజిరెడ్డి, మల్క కొమురయ్య, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, మాజీ ఎంపీలు ఏపీ జితేందర్‌రెడ్డి, వి.హనుమంతరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, గాయకులు విమలక్క, మంగ్లీ, వందేమాతరం శ్రీనివాస్ పాల్గొన్నారు.



అలయ్ బలయ్‌లో గీతాలాపన చేస్తున్న దత్తాత్రేయ మనవరాళ్లు. చిత్రంలో కోమటిరెడ్డి, విజయలక్ష్మి, జస్టిస్ ఎన్వీ రమణ, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, దత్తాత్రేయ, విద్యాసాగర్‌రావు, నాగార్జున, బ్రహ్మానందం తదితరులు

ఆచారాలను పునరుజ్జీవింపజేసేందుకే : రాష్ట్రపతి

సాక్షి, న్యూఢిల్లీ: ఆచారాలను పునరుజ్జీవింపజేసేందుకే 'అలయ్ బలయ్' కార్యక్రమమని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము అన్నారు. ఇది సోదరభావాన్ని పెంపొందించే సాంస్కృతిక ఉత్సవమని కొనియాడారు. బండారు దత్తాత్రేయ ప్రారంభించిన అలయ్ బలయ్ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని తెలిపారు. ఇంత గొప్ప వేడుకకు అనివార్య కారణాల వల్ల రాలేకపోతున్నానంటూ రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. 'హైదరాబాద్‌లో అక్టోబర్ 3న అలయ్ బలయ్ పండుగ ఎంతో ఉత్సాహంగా జరుపుకోవడం నాకెంతో సంతోషంగా ఉంది. బతుకమ్మ నృత్యాలు, జానపద కళలకు ప్రతీక. నవరాత్రి ఉత్సవాల సమయంలో నిర్వహించే అన్ని వర్గాలను ఒకచోటకు చేర్చే ఘనమైన వేడుక. తెలంగాణ సంస్కృతి, ప్రజల్లోని ఐక్యత, సమాజ విలువల వ్యాప్తికి ఇదో సామాజిక సమావేశంగా ఉపయోగపడుతుంది' అని ద్రౌపది ముర్ము తన సందేశంలో తెలిపారు.

'లక్ష'ణంగా ఖజానా!

▶ మొదటి పేజీ తరువాయి

ఈసారి కూడా ఎక్కువేనని 'కాగ్'లెక్కలు చెబుతున్నాయి. గతేడాది ఆగస్టు 31 నాటికి ఆ ఏడాది బడ్జెట్ ప్రతిపాదనలతో పోలిస్తే 59.79 శాతం అప్పులు తీసుకోగా ఈసారి అది మరో రెండు శాతం పెరిగింది.

పన్ను ఆదాయం ఇలా...

ఈ ఆర్థిక సంవత్సరంలోని ఐదు నెలల రాబడులను పరిశీలిస్తే గతేడాది కంటే కొంచెం తగ్గినా అటూఇటుగానే పన్ను ఆదాయం వస్తోందని 'కాగ్'వెల్లడించింది. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి జీఎస్టీ కింద రూ. 21,144 కోట్లు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ. 6,218 కోట్లు, అమ్మకపు పన్ను పద్దు కింద రూ. 14,079 కోట్లు, ఎక్సైజ్ రూపంలో రూ. 7,758 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ. 7,413 కోట్లు, ఇతర పన్నులు, డ్యూటీల ద్వారా రూ. 3,352.82 కోట్లు వచ్చాయి. వాటికి అదనంగా పన్నేతర ఆదాయం కింద రూ. 1,578 కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ. 1,673 కోట్లు సమకూరాయి.

రూ.కోట్లలో కోచింగ్!

▶ మొదటి పేజీ తరువాయి

ఆత్మహత్యలకు కారణమని ఎన్‌సీఆర్‌బీ తెలిపింది.

కట్టడికి కార్యాచరణ మొదలైనా..

కోచింగ్ సెంటర్ల ఒత్తిడి వల్ల విద్యార్థులకు జరుగుతున్న నష్టాన్ని నివారించాలని నిర్ణయించిన కేంద్ర విద్యాశాఖ.. ఇందుకోసం ఈ ఏడాది మొదట్లో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. కేంద్ర ఉన్నత విద్యా కార్యదర్శి వినీత్ జోషి చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో సీబీఎస్ఈ చైర్మన్, పాఠశాల ఉన్నత విద్య విభాగాల సంయుక్త కార్యదర్శులు, ఐఐటీ మద్రాస్, తిరుచ్చి, కాన్పూర్ ఎన్ఐటీ, ఐఐటీ, ఎన్‌సీఈఆర్‌టీ ప్రతినిధులు సహా మరికొందరిని ఇందులో సభ్యులుగా చేర్చింది. కోచింగ్‌తో పనిలేకుండా విద్యార్థులు పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలనే కోణంలో పరిశీలించి నివేదిక ఇవ్వడంతోపాటు ప్రైవేటు కోచింగ్ సెంటర్ల ప్రచార, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలని ఈ కమిటీని కేంద్రం ఆదేశించింది. పాఠశాల విద్యలో లోపాలు, క్రిటికల్ థింకింగ్ విధానాలు, పాఠశాల విద్య నుంచే పోటీ పరీక్షల సన్నద్ధత, కాలేజీల్లో కెరీర్ గైడెన్స్, ఒత్తిడి లేని సిలబస్ తీసుకురావడంపై కమిటీ అధ్యయనం చేయాలని సూచించింది. అయితే ఈ కమిటీ ఇప్పటివరకు సరైన మార్గదర్శకాలను సూచించలేదు.

ఉన్నత విద్యామండలి సిఫార్సులివి..



బాలకిష్టారెడ్డి

కోచింగ్ కేంద్రాల వల్ల జరిగే నష్టాన్ని కట్టడి చేయడానికి చట్టబద్ధ నియంత్రణ అవసరమని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి ప్రభుత్వానికి ఇటీవల నివేదించారు. 'సాక్షి'కి ప్రత్యేకంగా అందిన ఈ నివేదికలోని పలు సిఫార్సులు ఇవి..

- ➤ కోచింగ్ సెంటర్లపై బలమైన నియంత్రణ వ్యవస్థ ఉండాలి.
- ➤ శిక్షణా కేంద్రాలకు గుర్తింపును తప్పనిసరి చేయాలి.
- ➤ డేటా ప్రైవసీ చట్టాల పరిధిలోకి వాటిని తేవాలి.
- ➤ ఆయా సెంటర్లపై ఫీజుల నియంత్రణ ఉండాలి. విదేశీ విద్యా కన్సల్టెంట్లు, ఆన్‌లైన్ విద్యా వేదికలు, సాఫ్ట్‌వేర్, టెక్నాలజీ ప్రొవైడర్లు నియంత్రణ పరిధిలో ఉండాలి.
- ➤ ఉన్నత విద్యా మండలి వద్ద కోచింగ్ కేంద్రాలు అనుమతి పొందేలా ఉండాలి. ఆయా కేంద్రాలను పర్యవేక్షించి ఏటా నాణ్యతను అధికారికంగా నిర్ణయించాలి.
- ➤ ఉన్నత విద్యలో తృతీయ పక్షం జోక్యం వల్ల నాణ్యత దెబ్బతింటోంది.
- ➤ ఆన్‌లైన్ వేదికలు, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అందిస్తున్న కోచింగ్ పారదర్శకంగా ఉండట్లేదు. గుర్తింపు లేని కోర్సులు, అర్హతలేని బోధకులు, పాత సిలబస్ వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. కోచింగ్ కేంద్రాలు లాభాలే తప్ప నాణ్యత పట్టించుకోవడం లేదు. అకడమిక్ పాఠాలతో ఒత్తిడి లేకుండానే విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు.

తల్లిదండ్రులూ కారణమే



ర్యాంకులే తప్ప విద్యార్థుల సామర్థ్యాన్ని తల్లిదండ్రులు అంచనా వేయడం లేదు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాల ప్రకారమే బోధించాలని పట్టుబడుతున్నారు. దీనివల్ల సగటు విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను తీర్చిదిద్దితే కోచింగ్‌తో పనే లేదు. - ఎంఎస్ రావు (జేఈఈ కోచింగ్ నిపుణుడు)

చట్టం తేవాల్సిందే



కోచింగ్ కేంద్రాల నియంత్రణకు పకడ్బందీ చట్టం తేవాలి. నాణ్యత లేని, నిపుణులు లేని కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై ఒత్తిడి పెంచి ర్యాంకులతో ప్రచారం చేసుకొనే కోచింగ్ కేంద్రాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి. ఈ అంశాన్ని శాసనమండలిలో లేవనెత్తుతా. చట్టం తెచ్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా. - పింగిలి శ్రీపాల్‌రెడ్డి (ఉపాధ్యాయ ఎమ్మెల్సీ)

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 4-10-2025


సందర్భం

బాగా ఇష్టమైన ఇల్లు కాలి బూడిదైతే...
ఆ బూడిదను చూస్తూ ఏడుస్తూ కూర్చోలేము.
ఒక్కో ఇటుక పేరుస్తూ
కొత్త ఇంటికి సిద్ధం అవుతాము.
జార్జియా మెలోని అలాగే చేసింది.
కుటుంబ కల్లోలాన్ని మనసుపైకి రానివ్వకుండా
తిరుగులేని నాయకురాలిగా ఎదిగింది.
ఇటలీ తొలి మహిళా ప్రధాని అయింది.
ఆమె ఆత్మకథ 'ఐయామ్ జార్జియా -
మై రూట్స్, మై ప్రిన్సిపుల్స్ (ఇండియన్ ఎడిషన్)కు
ప్రధాని నరేంద్ర మోదీ ముందుమాట రాశారు.


ఇటలీ ప్రధాని జార్జియా మెలోని



“ గ్రే రాక్ మెథడ్ గురించి విన్నారా? కొందరు తమ మాటల ద్వారా మనల్ని బాధ పెట్టాలని చూస్తారు. మనం బాధ పడితే వారి లక్ష్యం నెరవేరినట్లే. అట్టే స్పందించకుండా, బాధపడకుండా ఉపయోగపడేది... గ్రే మెథడ్. అవతలి వ్యక్తి బాధపెట్టేలా, రెచ్చగొట్టేలా మాట్లాడినప్పుడు ఎలాంటి భావోద్వేగానికి గురి కాకుండా చాలా సింపుల్‌గా, ఒకటి రెండు ముక్కల్లో సమాధానం ఇవ్వడమే గ్రే రాక్ మెథడ్. ”



మెలోని గారి మన్ కీ బాత్

కొన్ని నెలల క్రితం అల్బేనియాలో జరిగిన ఒక సదస్సులో వివిధ దేశాల నేతలు హాజరయ్యారు. ఈ సదస్సుకు హాజరైన ఇటలీ ప్రధాని జార్జియా మెలోనికి అల్బేనియా అధ్యక్షుడు స్వాగతం పలికిన తీరు వైరల్ అయింది. కారు దిగి వస్తున్న మెలోనికి వర్షంలో మోకాళ్లపై కూర్చొని నమస్కారం చెబుతూ ఆయన స్వాగతం పలికిన తీరు ప్రపంచాన్ని ఆకట్టుకుంది.

న్యూయార్క్‌లో జరిగిన ఒక అవార్డ్‌ల కార్యక్రమంలో... 'మెలోని నిజాయితీపరురాలు. ఆమె మనసు అందమైనది' అంటూ ఆమెపై ప్రశంసల వర్షం కురిపించాడు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్.

మోదీ ముందుమాట

'దేశభక్తి ఉట్టిపడే అత్యుత్తమ నాయకురాలు' అని 'ఐయామ్ జార్జియా – మై రూట్స్, మై ప్రిన్సిపుల్స్' పుస్తకానికి రాసిన ముందు మాటలో మన ప్రధాని నరేంద్ర మోదీ మెలోనిని కొనియాడారు. ఆమె వ్యక్తిగత, రాజకీయ ప్రయాణం గురించి వివరించారు. మెలోని ఆత్మకథను 'మన్‌కీ బాత్'లో చెప్పారు. "ఇటలీ ప్రధాన మంత్రి మెలోనిపై అభిమానం, స్నేహంతో ఈ ముందుమాట రాశాను. దీన్ని గౌరవంగా భావిస్తున్నాను. ఆమె స్ఫూర్తిదాయకమైన, చారిత్రక ప్రయాణం భారత్‌లో ఎంతోమందిని ప్రభావితం చేస్తుంది" అని తన ముందు మాటలో రాశారు మోదీ. గతంలో రెండు పుస్తకాలకు మాత్రమే మోదీ ముందు మాట రాశారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆనందీబెన్ పటేల్‌కు అంకితం ఇచ్చిన పుస్తకానికీ, ప్రముఖ బాలీవుడ్ నటి, రాజకీయ నాయకురాలు హేమమాలిని ఆత్మకథకు గతంలో ముందుమాట రాశారు.



ఇటలీలో జరిగిన జీ7 దేశాల శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్న మోదీని 'నమస్తే' అంటూ మెలోని స్వాగతం పలకడం వైరల్‌గా మారింది.

ఒక్క మాటలో చెప్పాలంటే... జార్జియా మెలోని అనేది 'ప్రధాన ఆకర్షణ'కు మరో పేరు.

అయితే ఆమె ప్రస్థానం నల్లేరు మీద నడక కాదు. ఒక్కో అడుగు వేస్తూ ప్రయాణం ప్రారంభించింది. ఆ ప్రయాణంలో ఎన్నో ప్రతికూలతలను అధిగమించి ముందుకు వెళ్లింది.

'ఐయామ్ జార్జియా–మై రూట్స్, మై ప్రిన్సిపుల్స్'ను ఒక అధ్యక్షురాలి ఆత్మకథగా మాత్రమే చూడనక్కర్లేదు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి ఇటలీ తొలి మహిళా అధ్యక్షురాలి స్థాయికి ఎదగడం అనేది సామాన్య విషయమేమీ కాదు. ధైర్యంలో, ఆత్మవిశ్వాసంలో, సానుకూల శక్తి విషయంలో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది మహిళలకు స్ఫూర్తినిస్తోంది మెలోని.

రోమ్‌లో పుట్టి గార్బటెల్లా జిల్లాలో పెరిగింది మెలోని. చాలా చిన్న వయసులో ఉన్నప్పుడే మెలోని తండ్రి, కుటుంబాన్ని విడిచి కానరీ దీవులకు వెళ్లాడు. అక్కడ మరో వివాహం చేసుకున్నాడు. మెలోనికి పదిహేడేళ్లు ఉన్నప్పుడు ఆమె తండ్రి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన కేసులో తొమ్మిది సంవత్సరాల జైలు శిక్ష అనుభవించాడు.

తండ్రి దూరం అయ్యాడు. తమకు ఇష్టమైన ఇల్లు అగ్ని ప్రమాదంలో నాశనం అయింది. బాల్యం, కుటుంబ విచ్ఛిన్నం తన రాజకీయ దృక్పథాన్ని ప్రభావితం చేశాయని తన ఆత్మకథలో రాసుకుంది మెలోని.

పొలిటికల్ పార్టీ ఇటాలియన్ సోషల్ మూమెంట్ (ఎంఎస్ఐ) యువ విభాగం 'యూత్ ఫ్రంట్'లో చేరడంతో మెలోని రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. ఆ తరువాత కాలంలో 'స్టూడెంట్ మూవ్‌మెంట్' నేషనల్ లీడర్‌గా ఎదిగింది. 'ప్రావిన్స్ ఆఫ్ రోమ్' కౌన్సిలర్‌గా పనిచేసింది. 'యూత్ యాక్షన్' అధ్యక్షురాలిగా ఎంపికైంది... ఇలా ఒక్కో మెట్టు ఎక్కుతూ ఇటలీ తొలి మహిళా అధ్యక్షురాలిగా చరిత్ర సృష్టించింది.

దస్తూరి తిలకం

ఏటీ కాలమైనా కలమే మేటి!

అంతా చేతిరాతలోనే ఉంది..
విషయ పరిజ్ఞానం నుంచి ఆరోగ్యం దాకా!
మరి ఈ డిజిటల్ యుగంలో హ్యాండ్‌రైటింగ్ ప్రస్తావన?
ఎలక్ట్రానిక్ వర్డ్స్‌తోనే అక్షరాభ్యాసం ప్రారంభించిన ఈ తరం
హ్యాండ్ రైటింగ్‌కి అర్థాన్ని పర్‌ఫ్లెక్సిటీలో పరికిస్తుందేమో!
ఆ పరిస్థితి రాకుండా పిల్లలు పెన్ను పట్టేలా చూడాల్సిన పని పెద్దలదే!
దస్తూరి మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఏంటీ?
అసలా రాతకు ఎందుకంత ప్రాధాన్యమివ్వాలి అనే అంశాల మీద
ప్రముఖ హ్యాండ్‌రైటింగ్ ఎనలిస్ట్ అండ్ గ్రాఫోథెరపిస్ట్,
విశ్రాంత ఆచార్యులు (సెస్, హైదరాబాద్)
డాక్టర్ సి. రామచంద్రయ్య ఏమంటున్నారో తెలుసుకుందాం...





చేతిరాతను మరచిపోతున్నామా? డిజిటల్ యుగంలో రాతకు కీ బోర్డ్ ప్రత్యామ్నాయమైంది. సెర్చింగ్ దగ్గర్నుంచి సందేశాలను చేరవేయడం దాకా అన్నిటికీ డిజిటల్ మాధ్యమమే! వ్యయప్రయాసల్లేని ఈ సౌకర్యం చెంతనుండగా చేతిరాతతో పనేముంటుంది? స్కూళ్లలో, కాలేజీల్లో విద్యార్థులకూ టాబ్లెట్లు, లాప్‌టాప్‌లు అందుబాటులోకి వచ్చాక పరీక్షల్లో మాత్రమే చేతిరాత అవసరమవుతోంది. ఆన్‌లైన్ పరీక్షలకు అదీ అనవసరమే అయింది. మన వ్యక్తిత్వం, అలవాట్లు ముఖ్యంగా మైండ్ – బాడీ కోఆర్డినేషన్ (సమన్వయం)కి సంబంధించి చేతిరాత ప్రాధాన్యాన్ని గుర్తిస్తున్నారు.

ఎందుకంటే చేతిరాత అనేది నాడీ – కండరాల చర్య. మెదడు పంపే సందేశాలను బట్టే రాసే వేళ్లు కదులుతాయి. మరైతే ఒకే భాషలో ఒకే అంశాన్ని రాసేవాళ్లందరి చేతిరాత ఒకేరకంగా ఉండాలి కదా? అంటే ఏ ఇద్దరి చేతిరాత ఒకటిగా ఉండే అవకాశం లేదు. కారణం.. వాళ్ల సబ్‌కాన్షస్ మైండ్‌లోని ఆలోచన, సంఘర్షణలు. అందుకే చేతిరాతను మెదడు రాతగా అభివర్ణిస్తారు. మనిషి వయసుతోపాటు ఆలోచనలు, మానసిక స్థితిలో కలిగే మార్పులను బట్టి చేతిరాతా మారుతూంటుంది.

విద్య, వైద్యం.. నేరపరిశోధన, వైవాహిక బంధాలు

ఇలా చేతిరాతను విశ్లేషించే శాస్త్రాన్ని గ్రాఫాలజీ అంటారు. చేతితో రాసే, గీసే అంటే అక్షరాలు, అసంపూర్తి గీతలు– డూడుల్స్, బొమ్మలు, సంఖ్యలు వగైరా అన్నీ ఈ శాస్త్రం పరిధిలోకి వస్తాయి. వీటి ఆధారంగా మనిషి వ్యక్తిత్వాన్ని గుర్తించే ప్రక్రియ అనాదిగా పలు నాగరికతల్లో ఉంది. ఒక నిర్దిష్ట అంశంగా గ్రాఫాలజీకి నాలుగువందల ఏళ్ల చరిత్ర ఉంది. గ్రాఫాలజీ మీద తొలిసారిగా 1622లో ఇటాలియన్ డాక్టర్, తత్వవేత్త కామిలో బాల్డి ఒక పుస్తకం రాశారు. చేతిరాతతో మనస్తత్వాన్ని విశ్లేషించడానికి లాటిన్ స్క్రిప్ట్‌నే సౌకర్యంగా భావిస్తారు. గ్రాఫాలజీ ఒక అకడమిక్ సబ్జెక్ట్‌గా ప్రవర్తనా శాస్త్రం కోవలోకి వస్తుంది. ఇది ఎక్కువగా మనస్తత్వశాస్త్రం, నాడీమండల శాస్త్ర విశ్లేషణలను గ్రహిస్తుంది. యూరప్, అమెరికాలోని కొన్ని యూనివర్సిటీల్లో గ్రాఫాలజీ కోర్సులున్నాయి. గ్రాఫాలజీ సంఘాలూ ఉన్నాయి. ఈ సబ్జెక్ట్‌ను సూడోసైన్స్ అని విమర్శించేవాళ్లూ లేకపోలేరు. అయినా రోజురోజుకూ దీని ప్రాముఖ్యం పెరుగుతూనే ఉంది. అమెరికాతోపాటు మన దగ్గరా పెద్ద పెద్ద కంపెనీలు కొన్నిరకాల పదవులకు అభ్యర్థుల చేతిరాతనూ పరిశీలనలోకి తీసుకుంటున్నాయి. సంబంధిత రంగంలో అభ్యర్థికి పూర్వ అనుభవం ఉన్నప్పటికీ కొన్ని లక్షణాలను బేరీజు వేయడం కోసం అలా చేతిరాతనూ పరిగణిస్తున్నారు. ఇంకా విద్య, వైద్యం, వ్యాపారం, నేరపరిశోధన, వైవాహికబంధాలు వంటి విషయాల్లోనూ చేతిరాతను పరిగణనలోకి తీసుకుంటున్నారు.

ఆరోగ్య రాత..

వివిధరకాల వ్యక్తిత్వలక్షణాలతోపాటు మెదడులో ఉద్భవించి నెమ్మదిగా భౌతికంగా వ్యక్తమయ్యే కొన్ని రకాల ఆరోగ్యసమస్యలనూ చేతిరాతతో గుర్తించవచ్చు. ఉదాహరణకు.. ఆత్మవిశ్వాసం/ఆత్మన్యూనత, అభద్రత, చికాకుపడటం, మొండితనం, సేవాతత్పరత, పట్టుదల, భావాలను వ్యక్తీకరించలేకపోవడం, ఏకాగ్రత లోపం, గతం గురించిన ఆందోళన, ఆధిపత్య ధోరణి, ఎవరో ఏదో అనుకుంటారని చేయాల్సిన పనులు చేయలేకపోవడం, ఆరోగ్య సమస్యలైన బీపీ, థైరాయిడ్, మైగ్రెన్, ప్రోస్టేట్, శ్వాసకోశ ఇబ్బందులు వగైరా దాదాపు వందకు పైగా లక్షణాలను చేతిరాతతో గుర్తించవచ్చు.

గ్రాఫోథెరపీ..

గ్రాఫాలజీ ద్వారా గుర్తించిన సమస్యలను గ్రాఫోథెరపీతో నెమ్మదిగా సరిచేసుకోవచ్చు. ఈ థెరపీ రాసే వేలును ఒక పద్ధతి ప్రకారం కదిలించడం ద్వారా నాడీ సంకేతాలను మెదడుకు పంపి తద్వారా ఉపచేతన మనస్సును ప్రభావితం చేస్తుంది. అయితే ఈ ప్రక్రియ సర్వరోగ నివారిణి కాదు. అలాగని వైద్యచికిత్సకు ప్రత్యామ్నాయమూ కాదు. చేయించుకుంటున్న చికిత్సకు ఒక సపోర్ట్‌గా మాత్రమే ఈ గ్రాఫోథెరపీ పనిచేస్తుంది. ఆధునిక జీవనశైలి సైడ్ ఎఫెక్ట్స్ అయిన మానసిక ఒత్తిడి, ఆందోళనలు నెమ్మదిగా అనేక శారీరక సమస్యలుగా మారుతాయి. ఉదాహరణకు హైపర్‌టెన్షన్, థైరాయిడ్, మైగ్రేన్, నిద్రలేమి, ప్రిడయాబెటిక్ మొదలైనవి. కాగితం మీద రాయడం ద్వారా మన ఆలోచనలకు ఒక స్థిరత్వం వస్తుంది. మనసు నెమ్మదిస్తుంది. గ్రాఫోథెరపీ 'నాడీ మార్పిడి' అనే సూత్రీకరణపై పనిచేస్తుంది. అంటే మెదడుకున్న సామర్థ్యం – కొత్తనాడీ మార్గాలను ఏర్పరచుకునే, పాతవాటిని మార్చుకునే వాటిపై ఆధారపడింది కాబట్టి చేతిరాత అనేది కేవలం కాగితం, కలానికి మాత్రమే పరిమితమైనది కాదు. అది మెదడుకు సంబంధించిన, స్పష్టత కలిగించే ప్రక్రియ.

పిల్లలకు..

చేతిరాత విషయంలో పిల్లలకు సంబంధించి పరిశీలిస్తే.. పిల్లల మెదడు బాల్యదశలో పరిణతి క్రమంలో ఉంటుంది కాబట్టి పదహారేళ్లు నిండేవరకు వాళ్ల చేతిరాతను విశ్లేషించరు. కానీ పిల్లలు ఒకవేళ అభద్రతకు, డిప్రెషన్‌కు గురవుతున్నా, తమలో తాము చిరాకు పడుతున్నా చేతిరాతతో గుర్తించవచ్చు. వాళ్ల చేతిరాతను శాస్త్రీయబద్ధంగా మలచడం ద్వారా ఆ సమస్యలనూ అధిగమించవచ్చు. స్వీడన్‌లో 2009లో స్కూళ్లలో పెద్ద ఎత్తున డిజిటలైజేషన్‌ను ప్రవేశపెట్టింది. పుస్తకాల్లో చదవడం, రాయడం చాలావరకు తగ్గిపోయాయి. దానివల్ల జరిగిన నష్టాన్ని పదిహేనేళ్ల తర్వాత కానీ గుర్తించలేకపోయారు. పుస్తకాలను, చేతిరాతను తిరిగి ప్రవేశపెట్టాలని ఇటీవలే నిర్ణయించారు. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లోని స్కూళ్లలో పలుపద్ధతుల్లో రాయిస్తున్నారు. ఇది ఆరోగ్యకరమైన పరిణామం కాదు. అక్షరాలను కలిపి రాయడమే ఉత్తమమైనది. కలిపి రాయడం వలన మెదడులోని వివిధ భాగాలు ప్రేరేపితమవుతాయని, నేర్చుకోవడానికి ఈ ప్రక్రియ చాలా ఉపయుక్తమైనదని, టైపింగ్‌లో అలాంటి ప్రేరణ జరగలేదని తేలింది. నార్వే యూనివర్సిటీ 2020లో పన్నెండేళ్లు నిండిన పిల్లలపై ఈ అధ్యయనం చేసింది. స్వీడన్, అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లోని స్కూళ్లలో చేతిరాతను తప్పనిసరి చేయాలన్న నిర్ణయాలకు ఆ అధ్యయనం తోడ్పడింది.

మాడ్యూల్..

చేతిరాతలో.. లెటర్ ఫార్మేషన్, కనెక్టివిటీ, జోనింగ్, స్పేసింగ్, వేగం.. అనే అయిదు ప్రధానాంశాలుండాలి. గ్రాఫోథెరపిస్ట్ పర్యవేక్షణలో ఒక క్రమపద్ధతిలో వీటిని నేర్చుకునేందుకు గ్లోబల్ పెన్మాన్షిప్ అకాడమీలో పిల్లల కోసం ఒక మాడ్యూల్‌ను రూపొందించింది. ఈ డిజిటల్ యుగంలో మన వ్యక్తిత్వాన్ని, భావోద్వేగాలను వ్యక్తపరచడానికి వీలున్న ఒకే ఒక మార్గం చేతిరాత. అందుకే దాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బ్యూటిటిప్స్



● కీరాని చిన్న ముక్కలుగా కట్ చేయాలి. దీనిలో పెసరపిండి, శనగపిండి, మెంతి పొడి కలిపి మిక్సీలో వేసి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకంతటికీ పట్టించి 30 నిమిషాల తరవాత తలస్నానం చేయాలి. వారంలో ఒకసారి ఈ ప్యాక్‌ని ఉపయోగించడం వలన పట్టుకుచ్చు లాంటి ఒత్తయిన జుట్టు మీ సొంతమవుతుంది.



● గ్లాస్ పచ్చిపాలలో పావు టీస్పూన్ ఉప్పు కలపాలి. రెండు నిమిషాల తరువాత పాలలో ఉప్పు కరిగిన తర్వాత ఆ పాలతో ముఖాన్ని కడుక్కుని, ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని కడిగేసుకోవాలి. ఇలా క్రమంగా పది రోజులపాటు చేస్తే నల్లమచ్చలు తగ్గి చర్మకాంతిలో వచ్చే తేడా ఇట్టే అర్థమవుతుంది.

● కొన్ని టీ ఆకులను మరిగించి, దానిలో ఐస్‌గడ్డల పొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని క్లాత్‌లోచుట్టి కనురెప్పలపై అయిదు నిమిషాలు ఉంచితీయాలి. ఇలా చేస్తే కళ్ల అలసట తీరి, కాంతివంతంగా కనిపిస్తాయి.

న్యూస్‌మేకర్

పరిశోధనా రంగంలో స్ఫూర్తి పతాకం

సంధ్యా షెనాయ్. సైన్స్ రంగంలో రాణించాలనుకునే భారత యువతకు ఒక స్ఫూర్తిపతాకం. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ డచ్ అకడమిక్ పబ్లిషర్ ఎల్సీయర్‌తో కలిసి ప్రతి ఏటా వెలువరించే అత్యంత ప్రతిభావంతులైన సైంటిస్ట్‌ల జాబితాలో ఆమె వరుసగా మూడుసార్లు నిలిచింది. తాజాగా వెలువడిన 2025 జాబితాలో ఆమెకు మూడోసారి స్థానం దక్కడంతో భారత పరిశోధనా రంగంలో హర్షాతిరేకాలు వెలువెత్తుతున్నాయి. సంధ్యా షెనాయ్ పరిచయం.

సంధ్యా షెనాయ్‌కు విద్యా రంగంలో, పరిశోధన రంగంలో సంచలనాలు సృష్టించడం కొత్త కాదు. 2010లో మొదటిసారి ఆమె ఘనత వార్తపత్రికల ద్వారా లోకానికి తెలిసింది. దానికి కారణం బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎం.ఎస్సీ కెమిస్ట్రీలో ఆమె సెంట్ పర్సెంట్ సాధించడం. ఇలా ఎం.ఎస్సీ కెమిస్ట్రీలో నూరు శాతం మార్కులు సాధించడం అసాధ్యం. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అంతవరకూ వరకూ ఆ ఘనత సాధించిన వారు ఒక్కరూ లేరు. మొదటిసారి సంధ్యా షెనాయ్ ఆ మార్కులు సాధించింది. 'స్టూడెంట్ అంటే ఇలా ఉండాలి' అని అందరి చేతా అనిపించుకుందామె.


సంధ్యా షెనాయ్

హాజరు.. చదువు...

కొంకిణి మాతృభాష కలిగిన సంధ్యా షెనాయ్ సొంత ప్రాంతం ఉడిపి. అక్కడే బి.ఎస్సీ. వరకూ చదివి కాలేజీలో గోల్డ్ మెడల్ సాధించింది. ఆ తర్వాత కుటుంబం బెంగళూరులో స్థిరపడటంతో అక్కడ పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో నూరు శాతం మార్కులు సాధించి నానో కెమిస్ట్రీలో పీహెచ్‌డీ కొనసాగించింది. 'నా చదువులో ఎప్పుడూ కాలేజీ ఎగ్గొట్టలేదు. నూరు శాతం అటెండెన్స్‌తో ఉంటాను. అలాగే క్లాసుల్లో రన్నింగ్ నోట్స్ మిస్ కాను. పరీక్షలకు అదే చదువుకుంటాను. అలాగే మార్కులు తెచ్చుకున్నాను' అంటుందామె. కెమిస్ట్రీలో విశేషమైన అభిరుచి ఉన్న షెనాయ్ మొదట అధ్యాపక వృత్తిలో ఉంటూనే తన పరిశోధనను కొనసాగించి ఉత్తమ సైంటిస్ట్ అవ్వాలని నిశ్చయించుకుంది.

వేస్ట్ హీట్‌ను విద్యుత్‌గా...

మంగళూరు శ్రీనివాస యూనివర్సిటీలో ప్రొఫెసర్, ప్రిన్సిపల్ రీసెర్చ్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న సంధ్యా షెనాయ్ థెర్మో ఎలక్ట్రిక్ మెటీరియల్స్‌లో విశేషమైన పరిశోధన కొనసాగిస్తూ అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన పత్రాలు ప్రచురించడం ద్వారా గుర్తింపు పొందింది. లండన్‌లోని 'రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ' (ఆర్.ఎస్.సి.) ఆమెను లీడింగ్ ఫిమేల్ రీసెర్చర్‌గా గుర్తించింది. ఈ గుర్తింపు పొందడం అంత సులువు కాదు. పర్యావరణ రంగానికి చేటు చేస్తున్న వేస్ట్ హీట్ (కర్మాగారాలు, ఇతర యంత్ర పరికరాల వల్ల వెలువడే ఉష్ణం) వృథా అవడమే కాకుండా పర్యావరణానికి చేటు చేస్తుండటం వల్ల ఆ వేస్ట్ హీట్‌ను విద్యుత్తుగా ఎలా మార్చవచ్చో పరిశోధనలు చేస్తూ, వాటి ఫలితాలను ప్రతిపాదిస్తూ సంధ్యా షెనాయ్ ప్రపంచవ్యాప్తంగా సైంటిస్ట్‌ల దృష్టిని ఆకర్షించింది. అందుకే ఆమెకు 2021లో 'యంగ్ సైంటిస్ట్' అవార్డ్, 2024లో 'కెమిస్ట్రీ మెడల్' లభించాయి.

ప్రపంచ సైంటిస్టుల జాబితాలో...

ప్రపంచంలో అత్యుత్తమ సైంటిస్టుల 2 శాతం పట్టికను స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతి ఏటా ప్రకటిస్తూ ఉంటుంది. ఆగస్టు 30 నాటికి ఆ సంవత్సరంలో వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించిన పరిశోధన పత్రాల ఆధారంగా, వాటికి అందిన ఆదరణను బేరీజు వేసుకుని సెప్టెంబర్‌లో ఈ జాబితాను విడుదల చేస్తారు. 2023 నుంచి సంధ్యా షెనాయ్ ఈ పట్టికలో నిలుస్తోంది. తాజాగా సెప్టెంబర్ 19న విడుదల చేసిన 2025 జాబితాలో మూడవసారి కూడా సంధ్యా షెనాయ్‌కు చోటు దక్కింది. ప్రపంచవ్యాప్త సైంటిస్టులకు సమఉజ్జీగా మన దేశం నుంచి ఒక మహిళా పరిశోధకురాలు ఈ స్థాయి గుర్తింపు పొందుతుండటం మన సైన్సు రంగానికి గర్వకారణం. అందుకే ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలి నేటి యువతరం.

పనీర్‌తో టేస్టీగా... హెల్దీగా



వంటిల్లు

పనీర్‌లో అధికంగా ప్రొటీన్ ఉంటుంది. ఇది శరీర కణాల నిర్మాణానికి, కండరాల బలానికి అవసరం. ప్రత్యేకంగా జిమ్ చేసే వారు, పిల్లలు, గర్భిణులకు పనీర్ బలాన్నిస్తుంది. పనీర్‌లో కాల్షియం ఎక్కువ ఉంటుంది. ఇది ఎముకలను, దంతాలను బలంగా ఉంచుతుంది. వయసు పైబడినవారిలో వచ్చే ఆస్టియోపోరోసిస్ సమస్యను నివారించడంలో సహాయపడుతుంది. పనీర్ తిన్న తర్వాత ఎక్కువసేపు ఆకలి వేయదు. అందువల్ల వెయిట్ లాస్ డైట్ ఫాలో అవుతున్న వారు తమ భోజనంలో పనీర్‌ను చేర్చుకోవచ్చు. పనీర్‌లోని విటమిన్లు, మినరల్స్ శరీరానికి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అయితే, ఫుల్-ఫ్యాట్ పనీర్ ఎక్కువ తింటే కొలెస్ట్రాల్ పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల మితంగా తీసుకోవడం మంచిది. పనీర్‌తో చేయదగిన హెల్దీ వంటకాలు.. నేటి వంటిల్లులో.

పనీర్ స్పైసీ ర్యాప్



కావలసినవి: గోధుమ రొట్టె – 1; పనీర్ క్యూబ్స్ – కప్పు (సన్నగా తరగాలి); ఉల్లిపాయ, క్యాప్సికం – సన్నగా తరిగినవి; పెరుగు – 2 స్పూన్లు; పచ్చిమిర్చి – 1; ఉప్పు, మిరియాల పొడి – తగినంత; పనీర్ మసాలా – చిటికెడు;

తయారీ: ● ఒక గిన్నెలో పై పదార్థాలన్నీ వేసి, పనీర్ మసాలాతో కలపాలి ● చపాతీ పైన పనీర్ మిశ్రమాన్ని పెట్టి, రోల్ చేసి, సర్వ్ చేయాలి ● ఇది హెల్దీ బ్రేక్‌ఫాస్ట్ / డిన్నర్‌కి సరైన ఎంపిక.

పనీర్ సలాడ్

కావలసినవి: పనీర్ క్యూబ్స్ – కప్పు (స్టిక్‌కి గుచ్చి, గ్రిల్ పైన పనీర్ క్యూబ్స్‌ని అన్నివైపులా కాల్చాలి); క్యాప్సికమ్, క్యారెట్, టొమాటో – (స్లైసులుగా తరిగినవి); నిమ్మరసం – టీస్పూన్; మిరియాల పొడి – చిటికెడు; ఉప్పు – తగినంత;

తయారీ: ● అన్ని పదార్థాలను కలిపి, సర్వ్ చేయాలి ● ప్రొటీన్లు పుష్కలంగా ఉండే ఈ సలాడ్ తేలికగా జీర్ణమవుతుంది.



పనీర్ వెజిటబుల్ గ్రేవీ



కావలసినవి: పనీర్ – కప్పు; టొమాటోలు – 2 (మెత్తగా గ్రైండ్ చేయాలి); ఉల్లిపాయ – 1 (తరిగినది); పాలకూర, బీన్స్, క్యారెట్, పచ్చి బఠానీ – కొద్దిగా (సన్నగా తరిగినవి); అల్లం వెల్లుల్లి పేస్ట్ – టీస్పూన్; పసుపు, కారం, ధనియాల పొడి – తగినంత; ఉప్పు – తగినంత; నూనె – టీస్పూన్; కొత్తిమీర తరుగు – టీ స్పూన్;

తయారీ: ● బాణలిలో నూనె వేసి, ఉల్లిపాయలు వేయించాలి ● అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి, కలపాలి ● టొమాటో గ్రేవీ వేసి, ఉడికించాలి ● పసుపు, కారం, ధనియాలపొడి వేసి, కూరగాయలు, పనీర్, తగినంత ఉప్పు వేసి కలిపి, ఉడికించాలి ● చివరగా కొత్తిమీర చల్లి దించాలి ● చపాతీ లేదా బ్రౌన్ రైస్‌తో వడ్డించాలి.

పనీర్ పెప్పర్ సూప్



కావలసినవి: పనీర్ చిన్న ముక్కలు – కప్పు; ఉల్లిపాయ, క్యారెట్, బీన్స్ – సన్నగా తరిగినవి; అల్లం వెల్లుల్లి పేస్ట్ – అర టీ స్పూన్; మిరియాల పొడి – టీ స్పూన్; ఉప్పు – తగినంత; నీళ్లు లేదా కూరగాయలు ఉడికించగా మిగిలిన నీళ్లు – 2 కప్పులు;

తయారీ: ● కూరగాయలు ఉడికించాక పనీర్ వేసి మరిగించాలి ● చివర్లో మిరియాల పొడి వేసి వేడి వేడిగా సర్వ్ చేయాలి ● ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

బులియన్
(బంగారం 10 గ్రా.; వెండి కిలో) అక్టోబర్ 3న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,21,710	1,20,160	1,18,040	1,20,150	1,21,700	1,18,250
బంగారం (22 క్యారెట్లు)	1,14,356	1,03,200	1,08,200	1,11,450	1,12,150	1,08,400
వెండి	1,53,000	1,49,800	1,61,000	1,48,800	1,50,000	1,61,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి బిజినెస్

శనివారం
4-10-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
224	58
81,207	24,894

విదేశీ సూచీలు

సూచీ			
నాస్‌డాక్	22,897	▲	53
డోజోన్స్	47,058	▲	537
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,486	▲	58
డాక్స్	24,422	▲	309
షాంఘై	3,883	▲	20
నికాయ్	45,769	▲	832

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.25	89.27
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.78	120.76
€	యూరో	ఎస్‌బీఐ	102.65	105.44
¥	జపాన్ యెన్ (100)	థామస్‌కుక్	59.00	61.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	56.22	60.08
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.54	70.25
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.79	24.28
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.29	24.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.59	13.42

టాటా క్యాపిటల్ @ రూ.310-326

- మెగా ఐపీఓ ధరల శ్రేణి ప్రకటించిన కంపెనీ
- ఈ నెల 6 నుంచి 8 వరకు పబ్లిక్ ఆఫర్
- రూ. 15,512 కోట్ల సమీకరణపై కన్ను



ముంబై: టాటా క్యాపిటల్ మెగా పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రంగం సిద్ధమైంది. ఈ ఇష్యూకు రూ.310-326 ధరల శ్రేణిని కంపెనీ నిర్ణయించింది. ఐపీఓ ఈ నెల 6న మొదలై 8న ముగుస్తుంది. జూలైలో చేపట్టిన రైట్స్ ఇష్యూతో పోలిస్తే ఐపీఓ షేరు ధర 5 శాతం తక్కువేనని, విస్తృత స్థాయిలో భాగస్వామ్యంతో పాటు మరింత మంది రిటైల్ ఇన్వెస్టర్లను ఆకర్షించడమే దీని లక్ష్యమని కంపెనీ ఎండీ, సీఈఓ రాజీవ్ సబర్వాల్ పేర్కొన్నారు. రైట్స్ ఇష్యూ ద్వారా టాటా క్యాపిటల్ షేరుకు రూ.343 చొప్పున రూ.1,750 కోట్లు సమీకరించింది.

అతి పెద్ద ఇష్యూ...

ఐపీఓ ద్వారా టాటా క్యాపిటల్ రూ.15,512 కోట్లు సమీకరించే అవకాశం ఉంది. మార్కెట్ విలువ రూ.1.38 లక్షల కోట్లుగా నమోదు కావచ్చని అంచనా. దీంతో ఈ ఏడాది మన స్టాక్ మార్కెట్లో అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా ఇది నిలుస్తుంది. ఇష్యూలో భాగంగా టాటా సన్స్ ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా 23 కోట్ల షేర్లను, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) 3.58 కోట్ల షేర్లను విక్రయించనున్నాయి. కంపెనీ 21 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేస్తోంది. కంపెనీలో ప్రస్తుతం టాటా సన్స్‌కు 88.6%, ఐఎఫ్‌సీకి 1.8 శాతం వాటా ఉంది. దేశంలో మూడో అతిపెద్ద బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)గా నిలుస్తున్న టాటా క్యాపిటల్ లోన్ బుక్ రూ.2.3 లక్షల కోట్ల పైమాటే. ఇందులో 88 శాతం రుణాలు రిటైల్ ఖాతాదారులు, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎస్ఎంఈ) ఇచ్చినవే కావడం గమనార్హం. 2023లో నవంబర్‌లో టాటా టెక్నాలజీస్ అరంగేట్రం తర్వాత టాటా గ్రూప్ నుంచి వస్తున్న మరో భారీ ఐపీఓ కానుంది.

హైదరాబాద్‌లో క్యాప్రి గ్లోబల్ హౌసింగ్ ఫైనాన్స్ కార్యాలయం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: క్యాప్రి గ్లోబల్ హౌసింగ్ ఫైనాన్స్ (క్యాప్రి హోమ్ లోన్స్) తాజాగా హైదరాబాద్‌లో తమ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించింది. దక్షిణాదిన విస్తరణ వ్యూహంలో భాగంగా కరీంనగర్, వరంగల్‌లో రెండు కొత్త శాఖలతో పాటు మరో అయిదు బ్రాంచీలను ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ బిజినెస్ హెడ్ మునీష్ జైన్ తెలిపారు. తెలంగాణలో 28 లక్షల కొత్త గృహాలకు (గ్రామీణ ప్రాంతాల్లో 6 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 22 లక్షలు) డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో అఫోర్డబుల్ హౌసింగ్ విభాగంలో తమ సంస్థ విస్తరణకు మరింత అవకాశం ఉందని పేర్కొన్నారు.

మెటల్ షేర్లు మెరిశాయ్!

- రెండో రోజూ లాభాల్లో మార్కెట్
- సెన్సెక్స్ 224 పాయింట్లు, నిఫ్టీ 58 పాయింట్లు ప్లస్



ముంబై: ప్రపంచ మార్కెట్ల సానుకూల ట్రెండ్... మెటల్, టెలికం షేర్లలో కొనుగోళ్ల జోరుతో మార్కెట్ వరుసగా రెండో రోజూ లాభాల్లో నిలిచింది. తీవ్ర ఆటుపోట్ల మధ్య సెన్సెక్స్ 224 పాయింట్లు లాభపడి 81,207 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 80,650 వద్ద కనిష్టాన్ని, 81,252 వద్ద గరిష్టాన్ని తాకింది. కనిష్ట స్థాయి నుంచి ఇండెక్స్ 602 పాయింట్లు పుంజుకోవడం విశేషం. ఇక నిఫ్టీ కూడా 58 పాయింట్లు లాభపడి 24,894 వద్ద క్లోజైంది. కాగా, వారం మొత్తంమీద చూస్తే, సెన్సెక్స్ 780 పాయింట్లు, నిఫ్టీ 240 పాయింట్ల చొప్పున ఎగబాకాయి.

మెటల్ సూచీ జిగేల్..

బీఎస్‌ఈలో రంగాల వారీగా మెటల్ ఇండెక్స్ 1.85 శాతం జంప్ చేసింది. ముఖ్యంగా లాయిడ్ మెటల్స్ 6.14 శాతం ఎగబాగగా... టాటా స్టీల్ 3.4 శాతం పెరిగింది. నాల్కో (3.1%), జిందాల్ స్టెయిన్‌లెస్ (2.87%), హిండ్ జింక్ (2.18%), హిందాల్కో (1.85%), జేఎస్‌డబ్ల్యూ స్టీల్ (1.58%), వేదాంత (1.3%) లాభపడిన వాటిలో కొన్ని.

ఇతర ముఖ్యాంశాలివీ..

- ఇతర సూచీల్లో టెలికం 1.16 శాతం, కన్జూమర్ డ్యూరబుల్స్ 1.15 శాతం, కమోడిటీస్ 1.12 శాతం ఉన్నాయి. రియల్టీ, హెల్త్‌కేర్ సూచీలు పడిపోయాయి.
- సెన్సెక్స్ జాబితాలో పవర్ గ్రిడ్ (3.15%), యాక్సిస్ బ్యాంక్ (1.9%), కోటక్ మహీంద్రా బ్యాంక్ (1.8%), ఎల్‌అండ్‌టీ (1.7%), భారత్ ఎలక్ట్రానిక్స్ (1.51%), భారతీ ఎయిర్‌టెల్ (1.49%) లాభపడ్డాయి. టెక్ మహీంద్రా (-1.1%), మారుతీ (1.04%), అల్ట్రాటెక్ (0.86%), బజాజ్ ఫిన్‌సర్వ్ (0.41%) నష్టాలను చవిచూశాయి.
- ఆసియా మార్కెట్లలో నికాయ్ భారీగా జంప్ చేయగా.. హాంకాంగ్ సూచీ మైనస్‌లో క్లోజైంది. యూరప్ సూచీలు కూడా లాభాలతో ముగిశాయి.

టెక్స్‌టైల్స్ పీఎల్‌ఐ స్కీమ్ గడువు పెంపు

డిసెంబర్ 31 వరకు పొడిగింపు



న్యూఢిల్లీ: టెక్స్‌టైల్స్ రంగానికి సంబంధించి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్‌ఐ) పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు తుది గడువును ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు కేంద్రం పొడిగించింది. ఆగస్టులో మొదలుపెట్టిన మలి విడతలో మ్యాన్-మేడ్ ఫైబర్ (ఎంఎంఎఫ్) దుస్తులు, ఎంఎంఎఫ్ ఫ్యాబ్రిక్స్, టెక్నికల్ టెక్స్‌టైల్స్ సహా వివిధ విభాగాల నుంచి దరఖాస్తులు భారీ సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలో గణనీయంగా ఆసక్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఈ స్కీములో పాల్గొనేందుకు భావి ఇన్వెస్టర్లకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు టెక్స్‌టైల్స్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. జౌళి పరిశ్రమ వృద్ధికి తోడ్పడటం, పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పించడం లక్ష్యంగా 2021 సెప్టెంబర్ 24న ప్రభుత్వం ఈ స్కీమును ప్రకటించింది. ఇప్పటివరకు ఈ పథకం కింద రూ. 28,711 కోట్ల పెట్టుబడుల హామీలతో 74 సంస్థలు ఎంపికయ్యాయి.

ప్రపంచ ఆర్థిక స్థిరీకరణ శక్తిగా భారత్

- వెలుపలి షాక్‌లను తట్టుకుని నిలబడగలదు
- మారుతున్న ప్రపంచ వాణిజ్య గమనం
- 8 శాతం స్థిరమైన వృద్ధి అవసరం
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రతరం అవుతున్నాయని, ఆర్థిక ఆంక్షలు–టారిఫ్‌లు ప్రపంచ సరఫరా వ్యవస్థలను మార్చేస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఈ తరుణంలోనూ భారత్ 8 శాతం వృద్ధిరేటును ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. ఢిల్లీలో 'కౌటిల్య ఆర్థిక సమావేశం 2025'ను ప్రారంభించిన సందర్భంగా మంత్రి సీతారామన్ మాట్లాడారు. వాణిజ్యం, ఇంధన భద్రత పరంగా ప్రపంచం ఎంతో అసమతుల్యతలను చూస్తోందని, నిర్మాణాత్మక పరివర్తనం దిశగా అడుగులు వేస్తోందని చెప్పారు. ఈ తరుణంలో భారత్ స్థిరీకరణ శక్తిగా నిలుస్తున్నట్టు చెప్పారు. వెలుపలి షాక్‌లను తట్టుకోగలదన్నారు. ''2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు 8 శాతం మేర స్థిరమైన జీడీపీ వృద్ధికి చేరుకోవడం అవసరం. మనం చూస్తున్నది తాత్కాలిక అస్థిరతలు కాదు. నిర్మాణాత్మక మార్పు. ఒకప్పుడు బలమైన కూటములు అనుకున్నవి నేడు కాల పరీక్షను ఎదుర్కొంటున్నాయి. కొత్త కూటములు అవతరిస్తున్నాయి. కనుక కేవలం ప్రపంచ అస్థిరతలను ఎదుర్కోవడమే కాదు. వాణిజ్యం, ఇంధనం, ఆర్థిక అస్థిరతలతోనూ పోరాడాల్సి రావడం మనముందున్న సవాలు''అని అని పేర్కొన్నారు.

ప్రపంచ సంస్థలు బలోపేతం కావాలి..

అంతర్జాతీయ సంస్థలు (డబ్ల్యూటీవో, ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ తదితర) బలోపేతం కావాల్సిన అవసరాన్ని మంత్రి సీతారామన్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. అవి నిర్వీర్యమవుతుండడంతో ప్రపంచ విశ్వాసం సన్నగిల్లుతున్నట్టు చెప్పారు. ఇవి నేటి వాస్తవాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉందన్నారు. దేశీయంగా సంస్కరణలు అమలు చేయడం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో సమన్వయం చేసుకోవడం ద్వారా భారత్ పెరుగుతున్న సుంకాల అవరోధాలను, వాణిజ్య కూటముల్లో మార్పులను అధిగమించగలదని చెప్పారు. పెరిగిపోయిన ఉద్రిక్తతలు, అధిక సుంకాలు, విధానపరమైన తీవ్ర అనిశ్చితులతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సమస్యలను ఎదుర్కొంటున్నట్టు మంత్రి తెలిపారు. అలాగే, పెట్టుబడులు తగ్గుముఖం పట్టడం, పెరిగిపోయిన నిధుల వ్యయాలు, ఇంధన ధరల్లో అస్థిరతలు సైతం వేధిస్తున్నట్టు చెప్పారు. వీటన్నింటి మధ్య భారత్ స్థిరీకరణ శక్తిగా పనిచేస్తున్నట్టు పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో భారత్ ద్రవ్య స్థిరీకరణ, మూలధన వ్యయాల నాణ్యతపై దృష్టి సారించినట్టు మంత్రి సీతారామన్ చెప్పారు. ''జీడీపీలో వినియోగం, పెట్టుబడుల వాటా ఈ కాలంలో స్థిరంగా కొనసాగింది. భారత్ వృద్ధి దేశీ అంశాలపై బలంగా ఆధారపడి ఉంది. ఇది వెలుపలి షాక్‌లను పరిమితం చేస్తోంది. దీంతో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని సాధిస్తోంది''అని వివరించారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
వంటింట్లోకి నలభీములు! | నవరాత్రుల్లో విక్రయాలకు జీఎస్‌టీ జోష్

ట్రూఆల్ట్ లిస్టింగ్ గుడ్..



బయో ఇంధన ఉత్పత్తి సంస్థ ట్రూఆల్ట్ బయోఎనర్జీ మెరుగైన లిస్టింగ్‌తో ఇన్వెస్టర్లను మెప్పించింది. ఇష్యూ ధర రూ.496తో పోలిస్తే బీఎస్‌ఈలో 7 శాతం ప్రీమియంతో రూ.531 వద్ద ప్రారంభమై.. దాదాపు అదే స్థాయిలో ముగిసింది. ఇంట్రాడేలో 11 శాతం మేర జంప్ చేసింది. కంపెనీ మార్కెట్‌విలువ రూ.4,552 కోట్లుగా నమోదైంది.

కాగా, జినకుషాల్ ఇండస్ట్రీస్ స్టాక్ కూడా లిస్టింగ్‌లో ఓ మోస్తరు లాభాలను అందించింది. ఇష్యూ ధర రూ.121తో పోలిస్తే 3.3 శాతం లాభంతో రూ.125 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 5.8 శాతం పెరిగినప్పటికీ.. చివరకు స్వల్పలాభంతో రూ.121.6 వద్ద స్థిరపడింది.

సాక్షి స్పోర్ట్స్



హైదరాబాద్ హాక్స్ శుభారంభం

సొంతగడ్డపై మొదలైన ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ శుభారంభం చేసింది. గురువారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో బ్లాక్‌హాక్స్‌కు కాలికట్ హీరోస్ నుంచి ప్రతీ గేమ్‌లోనూ గట్టి పోటీ ఎదురైనప్పటికీ హైదరాబాద్ ఆటగాళ్లు గెలిచేందుకు శ్రమించారు. చివరకు హైదరాబాద్ హాక్స్ 15-12, 18-16, 18-16తో కాలికట్ జట్టుపై విజయం సాధించింది. సర్వీస్‌లో బ్లాక్‌హాక్స్ పైచేయి సాధించింది. 18 పాయింట్లు సర్వీస్‌లో దక్కించుకుంది. కానీ కాలికట్ 11 పాయింట్లే నెగ్గింది. సూపర్ సర్వీస్‌లో కాలికట్ 2 పాయింట్లు చేసింది. బ్లాక్‌హాక్స్ తరఫున సాహిల్ (11 పాయింట్లు), నియాస్ అబ్దుల్ (8) అదరగొట్టారు. జాన్ జోసెఫ్, శిఖర్ సింగ్ చెరో 6 పాయింట్లు సాధించారు. కాలికట్ జట్టులో అశోక్ బిష్ణోయ్ (13), తరుషా చమత్ (9) రాణించారు. శుక్రవారం జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో బెంగళూరు టార్పెడోస్ 15-9, 11-15, 13-16, 17-15, 15-9తో గోవా గార్డియన్స్‌పై గెలుపొందింది.



ఇంగ్లండ్ ఘనవిజయం

- 10 వికెట్లతో దక్షిణాఫ్రికా ఓటమి
- మహిళల వన్డే ప్రపంచకప్

గువాహటి: బౌలర్లు విజృంభించడంతో మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన పోరులో ఇంగ్లండ్ మహిళల జట్టు 10 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా మహిళల జట్టు 20.4 ఓవర్లలో 69 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ సినాలో జాఫ్తా (22; 3 ఫోర్లు) ఒక్కతే రెండంకెల స్కోరు చేయగా... మిగిలినవాళ్లంతా విఫలమయ్యారు. కెప్టెన్ లౌరా వార్వర్ట్ (5), తజ్మీమ్ బ్రిట్స్ (5), సునె లుస్ (2), మరీనే కాప్ (4), అనెకె బాష్ (6) ఒకరివెంట ఒకరు పెవిలియన్‌కు వరుస కట్టారు. ఇంగ్లండ్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లిన్సే స్మిత్ 7 పరుగులే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టగా... సీవర్ బ్రంట్, సోఫియా ఎకిల్‌స్టోన్, చార్లీ డీన్ తలా రెండు వికెట్లు తీశారు. అనంతరం స్వల్ప లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 14.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 73 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు బ్యూమౌంట్ (35 బంతుల్లో 21 నాటౌట్; 3 ఫోర్లు), అమీ జోన్స్(50 బంతుల్లో 40 నాటౌట్; 6 ఫోర్లు) ఆకట్టుకున్నారు. 215 బంతులు మిగిలుండగానే మ్యాచ్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు భారీ రన్‌రేట్‌ను తమ ఖాతాలో వేసుకుంది. టోర్నీలో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు 7 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై విజయం సాధించింది. వరల్డ్ కప్‌లో భాగంగా శనివారం శ్రీలంకతో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా తలపడనుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

మూడు శతకాల మోత

వెస్టిండీస్‌తో విజయ దశమి రోజు మొదలైన తొలి టెస్టులో రెండో రోజే టీమిండియా శాసించే స్థితిలో నిలిచింది. ఇంగ్లండ్ గడ్డపై భారత్‌ను గట్టెక్కించిన హైదరాబాద్ స్పీడ్‌స్టర్ సిరాజ్... కరీబియన్ జట్టును తొలి రోజే ఆలౌట్ చేయడంలో కీలకపాత్ర పోషించాడు. రెండో రోజు ఓవర్‌నైట్ బ్యాటర్ లోకేశ్ రాహుల్‌తో పాటు ధ్రువ్ జురేల్, రవీంద్ర జడేజా శతక్కొట్టడంతో భారత్ ఇప్పటికే భారీ ఆధిక్యం అందుకుంది. ఈ రెండు రోజుల్లోనే విండీస్ జట్టు అటు బ్యాటింగ్‌లో ఇటు బౌలింగ్‌లో కుదేలైంది.



రాహుల్ | జడేజా | జురేల్

- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 448/5
- రాహుల్, జురేల్, జడేజా సెంచరీలు
- ఇప్పటికే 286 పరుగుల ఆధిక్యం
- 162 పరుగులకే కుప్పకూలిన విండీస్

అహ్మదాబాద్: భారత పర్యటనకు వచ్చిన వెస్టిండీస్ జట్టుకు టెస్టు సిరీస్ మొదలైన రెండు రోజుల్లోనే టీమిండియా తడాఖా చూపెట్టింది. స్టార్ పేసర్లు సిరాజ్ (4/40), బుమ్రా (3/42) కరీబియన్ బ్యాటర్ల పని పట్టారు. కుల్దీప్, సుందర్‌ల స్పిన్ కూడా వారి పేస్‌కు తోడవడంతో కనీసం వన్డే ఓవర్ల కోటానైనా పర్యాటక జట్టు ఆడలేకపోయింది. తర్వాత భారత బ్యాటర్లు లోకేశ్ రాహుల్, ధ్రువ్ జురేల్, జడేజాలు మూకుమ్మడిగా విండీస్ బౌలర్లపై చెలరేగారు. భారత్ ఈ రకమైన ఆల్‌రౌండ్ జోరు చూస్తుంటే... మూడు రోజుల్లోనే ముగిసేలా ఉంది. ముందుగా వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 44.1 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌటైంది. జస్టిన్ గ్రీవ్స్ (48 బంతుల్లో 32; 4 ఫోర్లు) చేసిన 30 పైచిలుకు స్కోరే ఇన్నింగ్స్ అత్యధిక వ్యక్తిగత స్కోరు! కుల్దీప్ 2, సుందర్ ఒక వికెట్ తీశారు. తర్వాత భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 128 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 448 పరుగులు చేసింది. ధ్రువ్ జురేల్ (210 బంతుల్లో 125; 15 ఫోర్లు, 3 సిక్సలు), కేఎల్ రాహుల్ (197 బంతుల్లో 100; 12 ఫోర్లు), రవీంద్ర జడేజా (176 బంతుల్లో 104 బ్యాటింగ్; 6 ఫోర్లు, 5 సిక్సలు) శతక్కొట్టారు. రోస్టన్ చేజ్‌కు 2 వికెట్లు దక్కాయి.

సిరాజ్ కూల్చేశాడు

మొదటి రోజు గురువారం టాస్ గెలిచిన వెస్టిండీస్ బ్యాటింగ్‌కు శ్రీకారం చుట్టింది. అయితే నాలుగో ఓవర్ నుంచే సిరాజ్ ఓ వైపు, బుమ్రా రెండో వైపు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో కరీబియన్ బ్యాటర్లను క్రీజులోనే నిలువనీయలేదు. దీంతో తేజ్‌నారాయణ్ చందర్‌పాల్ (0), జాన్ క్యాంప్‌బెల్ (8), అలిక్ అతనేజ్ (12), బ్రాండన్ కింగ్ (13)... ఇలా టాప్-4 బ్యాటర్లను కోల్పోయిన విండీస్ 42/4 స్కోరు వద్దే కష్టాల్లో చిక్కుకుంది. కాసేపు కెప్టెన్ చేజ్ (24; 4 ఫోర్లు), షై హోప్ (26; 3 ఫోర్లు) వికెట్ల పతనాన్ని ఆపగలిగారే కానీ... కుల్దీప్ దిగగానే హోప్‌ను అవుట్ చేయడంతో వందలోపే సగం (ఐదు) వికెట్లను కోల్పోయింది. వందయ్యాక చేజ్‌ను సిరాజ్ పెవిలియన్ చేర్చాడు. గ్రీవ్స్ చేసిన ఆమాత్రం స్కోరుతో విండీస్ 150 పైచిలుకు స్కోరును కష్టంగా చేయగలిగింది.

రాహుల్ శతకం

ఓపెనర్లు జైస్వాల్ (36; 7 ఫోర్లు), రాహుల్ చక్కని ఆరంభాన్నిచ్చారు. కానీ తక్కువ వ్యవధిలోనే జైస్వాల్, సాయి సుదర్శన్ (7) అవుటయ్యారు. కెప్టెన్ గిల్ అండతో రాహుల్ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా తొలి రోజును 121/2 స్కోరు వద్ద ముగించారు. శుక్రవారం 57 పరుగుల వద్ద అవుటయ్యే ప్రమాదం నుంచి బయటపడిన రాహుల్ సెంచరీ దిశగా పయనించగా, అర్ధ శతకం పూర్తయిన వెంటనే గిల్ నిష్క్రమించాడు. జురేల్ క్రీజులోకి రాగా లంచ్ బ్రేక్‌కు ముందే భారత్ స్కోరు 200 దాటింది. దీంతో పాటే రాహుల్ టెస్టుల్లో 11వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వెంటనే తన కుమార్తె ఇవారా కోసం అన్నట్లుగా ఈల వేస్తూ వేడుక చేసుకున్నాడు. మొత్తానికి సొంతగడ్డపై దాదాపు తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెర దించుతూ సెంచరీ సాధించాడు. 2016 డిసెంబర్లో సెంచరీ అనంతరం మళ్లీ ఇప్పుడే భారత గడ్డపై రాహుల్ శతకం సాధించాడు.

కదంతొక్కిన జురేల్, జడేజా

రాహుల్ అవుటయ్యాక జురేల్‌కు జడేజా జత కలిశాడు. వీళ్లిద్దరు క్రీజులో పాతుకొనిపోవడంతో భారత్ స్కోరుతో పాటే విండీస్ కష్టాలు అంతకంతకు పెరిగిపోయాయి. రెండో సెషన్లోనే ఇద్దరు అర్ధ సెంచరీలు సాధించగా జట్టు స్కోరు 300లకు చేరింది. 162 పరుగులకే ప్రత్యర్థి జట్టు అన్ని వికెట్లను కోల్పోతే... జురేల్, జడేజా ఇద్దరే ఐదో వికెట్‌కు 206 పరుగులు జోడించడం భారత్ భారీస్కోరుకు బాటవేసింది. ఆరో టెస్టులో జురేల్ తొలి అంతర్జాతీయ సెంచరీ ముచ్చట తీర్చుకున్నాడు. అతను అవుటయ్యాక జడేజా శతకం పూర్తయ్యింది. భారత్ ఎదుర్కొన్న 128 ఓవర్లలో 3.5 రన్‌రేట్‌తో పరుగులు సాధించింది. బ్యాటర్లంతా కలిసి 45 బౌండరీలు, 8 సిక్సర్లు బాదారు. ఆట నిలిచే సమయానికి జడేజాతో సుందర్ (9 బ్యాటింగ్) అజేయంగా నిలిచాడు.


స్కోరు వివరాలు

వెస్టిండీస్ తొలిఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (సి) **జురేల్ (బి) బుమ్రా** 8; తేజ్ నారాయణ్ (సి) **జురేల్ (బి) సిరాజ్** 0; అతనేజ్ (సి) రాహుల్ **(బి) సిరాజ్ 12;** కింగ్ (బి) సిరాజ్ 13; చేజ్ **(సి) జురేల్ (బి)** సిరాజ్ 24; షై హోప్ (బి) **కుల్దీప్ 26; గ్రీవ్స్** (బి) బుమ్రా 32; పియర్ **(ఎల్బీడబ్ల్యూ) (బి)** సుందర్ 11; వేరికన్ (సి) **జురేల్ (బి)** కుల్దీప్ 8; జాన్ లేన్ (బి) **బుమ్రా 1**; సీలెస్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 21; మొత్తం (44.1 ఓవర్లలో ఆలౌట్) 162. వికెట్ల పతనం: 1-12, 2-20, 3-39, 4-42, 5-90, 6-105, 7-144, 8-150, 9-153, 10-162.

బౌలింగ్: బుమ్రా 14-3-42-3, సిరాజ్ 14-3-40-4, నితీశ్ 4-1-16-0, రవీంద్ర జడేజా 3-0-15-0, కుల్దీప్ యాదవ్ 6.1-0-25-2, సుందర్ 3-0-9-1.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) షై హోప్ (బి) సీలెస్ 36; రాహుల్ (సి) గ్రీవ్స్ (బి) వేరికన్ 100; సాయి సుదర్శన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చేజ్ 7; గిల్ (సి) గ్రీవ్స్ (బి) చేజ్ 50; ధ్రువ్ జురేల్ (సి) షై హోప్ (బి) పియర్ 125; జడేజా బ్యాటింగ్ 104; సుందర్ బ్యాటింగ్ 9; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (128 ఓవర్లలో 5 వికెట్లకు) 448. వికెట్ల పతనం:** 1-68, 2-90, 3-188, 4-218, 5-424. **బౌలింగ్:** సీలెస్ 19-2-53-1, జాన్ లేన్ 15-0-38-0, జస్టిన్ గ్రీవ్స్ 12-4-59-0, జొమెల్ వేరికన్ 29-5-102-1, పియర్ 29-1-91-1, రోస్టన్ చేజ్ 24-3-90-2.

'అపోలో' ఆట మొదలు



విండీస్‌తో తొలి టెస్టులో భారత జట్టు కొత్త స్పాన్సర్ 'అపోలో టైర్స్' లోగో ఉన్న జెర్సీతో బరిలోకి దిగింది. ప్రధాన స్పాన్సరర్‌గా బీసీసీఐకి మూడేళ్ల కాలానికి అపోలో రూ. 579 కోట్లతో ఒప్పందం చేసుకుంది.



103 మంది మావోల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఒకేరోజు 103 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దంతెవాడ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బీఎస్.నేగీ, బీజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్‌యాదవ్ గురువారం ఆ వివరాలు వెల్లడించారు. మావోయిస్టులు ఎదుర్కొంటున్న పరిస్థితులు, కాలం చెల్లిన సిద్ధాంతాల నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 103 మంది మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారన్నారు. ఇందులో ఒక డీవీసీఎం, నలుగురు పీపీసీఎంలు, ఐదుగురు ఏరియా కమిటీ సభ్యులు, ఐదుగురు మిలీషియా, డిప్యూటీ మిలీషియా కమాండర్లు, నలుగురు జనతన సర్కార్ అధ్యక్షులు, 22 మంది సభ్యులు, 23 మంది మిలీషియా ప్లాటూన్ సభ్యులతో పాటు వివిధ కేడర్ల బాధ్యులు ఉన్నారని వివరించారు. లొంగిపోయిన వారిలో 43 మందిపై రూ.1.06 కోట్ల రివార్డు ఉండగా.. మొత్తంలో 23 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సెక్టార్ ఐజీ కమల్‌లోచన్ కశ్యప్, కోబ్రా, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన మావోయిస్టులు

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హతం

బీజాపూర్ జిల్లా పూజారికాంకేర్ గ్రామానికి చెందిన మడకం బీమా(45) ఇంటికి గురువారం తెల్లవారుజామున నలుగురు మావోయిస్టులు వచ్చి మాట్లాడే పని ఉందని నిద్రలేపి బయటకు తీసుకెళ్లారు. ఇంటి ఆవరణలోనే గొడ్డలితో తల, ఛాతీపై దారుణంగా నరికి హత్య చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఘటన జరిగిన గ్రామంలోనే సీఆర్‌పీఎఫ్ క్యాంపు ఉన్నా మావోయిస్టులు ఈ దుశ్చర్యకు పాల్పడడం సంచలనం కలిగించింది.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్‌స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో గురువారం డీఆర్‌జీ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో పోలీసు బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరుపుతూ పారిపోతుండగా, బలగాలు వారిని వెంబడిస్తూ కాల్పులు జరపడంతో ఒక మావోయిస్టు మృతి చెందాడు. మృతుడిని గుర్తించాల్సి ఉంది.

మావోయిస్టుల అంతానికి పంతం

- వారి ఏరివేతే లక్ష్యంగా కేంద్రం కీలక చర్యలు
- ఈసారి డీజీపీల సదస్సు ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టులను పూర్తిగా అంతం చేయాలన్న లక్ష్యం దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే కేంద్ర కమిటీలోని కీలక సభ్యుల ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇదే అదనుగా మావోయిస్టుల ఏరివేతను మరింత ముమ్మరం చేసేందుకు కేంద్ర హోంశాఖ వ్యూహరచన చేస్తోంది. ఏటా జాతీయస్థాయిలో నిర్వహించే అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీల సదస్సును ఈసారి ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే నవంబర్ 28 నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు ఛత్తీస్‌గఢ్ తొలిసారి ఆతిథ్యం ఇవ్వబోతోంది. ఈ సదస్సు మావోయిస్టుల నిర్మూలనకు అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధానంగా చర్చించనుందని, ఆ సందేశాన్ని మరింత బలంగా పంపేందుకే కేంద్ర హోంశాఖ ఛత్తీస్‌గఢ్‌ను ఇందుకు వేదికగా ఎంచుకున్నదని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఈ సదస్సు ప్రారంభోత్సవానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ముగింపు కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరుకానున్నారు. యాంటీ నక్సల్ ఆపరేషన్ల స్ట్రాటజీ రూపకల్పనతోపాటు సైబర్ సెక్యూరిటీ, నార్కోటిక్స్ కంట్రోల్, అంతర్గత భద్రత అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి మొత్తం 250 మంది పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా మరో 200 మంది వరకు అధికారులు పరోక్షంగా ఈ సదస్సుకు హాజరుకానున్నారు.

లిడ్‌క్యాప్ ఆస్తులను పరిరక్షించాలి

- మంద కృష్ణ మాదిగ



సాక్షి, హైదరాబాద్: లిడ్‌క్యాప్ భూములు, ఆస్తు లను పరిరక్షించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మంద కృష్ణ మాదిగ కలిసి వినతిపత్రం అందజేశారు. లిడ్‌క్యాప్ అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, లిడ్‌క్యాప్, లెదర్ వర్క్‌పై సమగ్రమైన అవగాహన కలిగిన అధికారిని మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించాలని కోరారు.

వలస కార్మికులకు ఉచిత వీసాలు

- యూఏఈలోని అబుదాబి ఏడీఎన్‌హెచ్ కంపెనీలో ఉపాధి కల్పన

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్‌లో ఉపాధి పొందాలనుకునే వలస కార్మికులకు అబుదాబిలోని ఏడీఎన్‌హెచ్ కంపెనీ తెలంగాణలోని జీటీఎం సంస్థ ద్వారా ఉచితంగా వీసాలను జారీ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. పలుమార్లు అనేకమందికి ఉచితంగా వీసాలు ఇచ్చిన ఈ సంస్థ..మరోసారి ఉచిత వీసాల జారీకి ఇంటర్వ్యూలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని అబుదాబి కేంద్రంగా పనిచేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ ఏడీఎన్‌హెచ్ కంపెనీ క్లీనింగ్, క్యాటరింగ్ రంగాల్లో యువతకు ఉపాధి కల్పిస్తోంది. ఈనెల 10న జగిత్యాలలో, 11న నిజామాబాద్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. ఈసీఎన్ఆర్ పాస్‌పోర్టు కలిగి ఉన్న యువకులకు అర్హత వయస్సు 21 నుంచి 38 ఏళ్ల వరకూ ఉండొచ్చని జీటీఎం సంస్థ చైర్మన్ చీటి సతీష్‌రావు 'సాక్షి'తో చెప్పారు. బేసిక్ ఇంగ్లిష్ వచ్చి ఉండాలని, పచ్చబొట్టు కనబడకుండా ఉండాలని తెలిపారు. ఒరిజినల్ పాస్‌పోర్టుతో జగిత్యాల లేదా నిజామాబాద్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన వారికి రూ. 23 వేల వరకూ వేతనం, ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్టు వెల్లడించారు. ఎవరికీ నయాపైసా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఏదైనా సమాచారం కోసం అభ్యర్థులు జీటీఎం సంస్థ నిజామాబాద్ (8686860999), ఆర్మూర్ (8332062299), జగిత్యాల (8332042299), సిరిసిల్ల (9347661522) నంబర్లలో సంప్రదించాలని సతీష్‌రావు సూచించారు.

Persona	Special Price Post GST 2.0@@	Reduction In Ex-Showroom Price#	Additional Benefits#
Pure	₹5.49 L	₹0.70 L	₹0.50 L
Adventure	₹6.55 L	₹0.61 L	₹0.50 L
Accomplished+	₹7.70 L	₹0.71 L	₹0.50 L
Creative+	₹8.14 L	₹0.97 L	₹0.50 L

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


ఆసియాలో అతిపెద్ద
ఫర్నిచర్ అమ్మకం
63% తగ్గింపు
₹1
36 నెలల
ఉచితం
ఎలక్ట్రిక్ బైక్
₹49,999
ఫర్నిచర్ కొనుగోలుతో
లక్కీ డ్రాలు లేవు | స్క్రాచ్‌కార్డులు లేవు | గ్యారంటీగా బహుమతులు
బైక్ ప్యాకేజీ : 3 సీటర్ సోఫా కమ్ బెడ్ + సెంటర్ టేబుల్ +
క్వీన్ సైజ్ కాట్ + క్రాకరీ యూనిట్ + ఉచితం ఎలక్ట్రిక్ బైక్
బైక్ ఉచితం
MRP ₹1,24,999
Sale ₹ 49,999
PER DAY EMI ₹54
Limited to 1 bike per customer
రాకీ సోఫా సెట్ 3+2+1
ఉచితం సెంటర్ టేబుల్
+ 2 సైడ్ టేబుల్స్
+ కార్పెట్ విలువ
రూ. 25,000/- గలవి
MRP ₹64,999
Sale ₹ 33,333
PER DAY EMI ₹30
Same Day DELIVERY
ప్రీమియం బెడ్ రూమ్ సెట్: హైగ్లాస్ డ్యూకో పెయింటెడ్ హైడ్రాలిక్
కింగ్ సైజ్ బెడ్, 2 బెడ్ సైడ్ టేబుల్స్‌తో + 5 డోర్ వార్డ్‌రోబ్
+ డ్రెస్సింగ్ టేబుల్, స్టూల్‌తో + ఉచితం బైక్
బైక్ ఉచితం
MRP ₹2,69,999
PER DAY EMI ₹140
Sale ₹ 1,29,999
కింగ్ సైజ్ కాట్, 2 బెడ్‌సైడ్ టేబుల్స్‌తో
& హై గ్లోస్ ఫినిష్, కుషన్‌తో &
హైడ్రాలిక్ స్టోరేజ్+ బైక్ ఉచితం
బైక్ ఉచితం
MRP ₹1,39,999
Sale ₹ 59,999
PER DAY EMI ₹65
బైక్ ఉచితం
రిక్లైనర్ సోఫా సెట్: 3+2+1
+ ఉచితం ఎలక్ట్రిక్ బైక్
MRP ₹2,14,999
Sale ₹ 99,999
PER DAY EMI ₹108
బ్రెజిల్ సోఫా సెట్: 3+2+1+ డివైడర్ + ఉచితం షోకేస్
+ కార్పెట్ + బైక్
MRP ₹ 1,09,999
Sale ₹ 49,999
PER DAY EMI ₹54
ఉచితం ♦ బైక్
♦ బుక్ కేస్ ♦ కార్పెట్
4 చైర్స్‌తో మార్బుల్ డైనింగ్ టేబుల్+
ఉచితం సింగిల్ కాట్,
రూ. 8,000 విలువ గలది
MRP ₹32,999
Sale ₹ 13,999
PER DAY EMI ₹15
An ISO-9001:2015 Certified Company
BANTIA
Furnitures
Affordable Lifestyles Since 1955
బాంటియా ఎస్టేట్, సిఖ్ రోడ్, సికింద్రాబాద్
ఏదైనా డైనింగ్ టేబుల్ కొనండి మరియు పొందండి 30 పీసుల క్రాకరీ సెట్ ఉచితం ● ఏదైనా కాట్ కొనండి మరియు పొందండి 4 పీసుల బెడ్‌షీట్ సెట్ మరియు పెయింటింగ్ ఉచితం
ఏదైనా సోఫా కొనండి మరియు పొందండి కార్పెట్ మరియు సెంటర్ టేబుల్ ఉచితం ● మ. 1 గం.కు ముందు కొనుగోలు చేయండి మరియు పొందండి కర్టెన్ మరియు సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఉచితం
79933 33351, 79950 00930
♦ ఎ.ఎస్. రావ్ నగర్ ♦ అత్తాపూర్ ♦ బోడుప్పల్ ♦ దిల్‌సుఖ్‌నగర్ ♦ హైటెక్ సిటీ ♦ కరీంనగర్ ♦ కర్మన్‌ఘాట్
♦ కొంపల్లి ♦ కూకట్‌పల్లి ♦ నాగోల్ ♦ సికింద్రాబాద్ ♦ వరంగల్ ♦ విజయవాడ ♦ www.bantia.in



వైఎస్ జగన్ హయాంలో చిత్తూరు జిల్లా పల్లె చెరువులో నిర్మించిన గ్రామా సచివాలయ భవనం

నాడు...

ఆరేళ్ల క్రితం అక్టోబరు 2న దేశ చరిత్రలో ఒక విప్లవాత్మక కార్యక్రమం. వైఎస్ జగన్ ప్రభుత్వం హయాంలో గాంధీజీ జయంతి సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థకు అంకురార్పణ. ప్రభుత్వ సేవలు, కార్యక్రమాలను ప్రజలకు గడప వద్దనే అందించడమే లక్ష్యంగా పనిచేశాయి...! కులం, మతం, పార్టీలతో సంబంధం లేకుండా అందరినీ సమానంగా చూశాయి. అంకితభావంతో విధి నిర్వహణతో గాంధీజీ చెప్పిన గ్రామ స్వరాజ్యానికి నిలువుటద్దంలా నిలిచాయి.

నేడు...

గ్రామ, వార్డు సచివాలయాలు ప్రజల సేవల కన్నా ప్రభుత్వ పెద్దలు చెప్పే ఇంటింటి సర్వేలకు పరిమితం అయ్యాయి. ఎన్నో ఆశలతో ఉద్యోగాల్లో చేరిన గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఆత్మగౌరవం దక్కితే చాలని భావించే దుస్థితి. తమ డిమాండ్ల సాధనకు వారం, పది రోజులుగా నిరసనలు చేపడుతున్నా పట్టించుకునేవారు లేరు. రోడ్లపైకి వచ్చి, కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తున్న వీరు... గురువారం దసరా పండుగ నాడు 'మహాత్మా మా గోడు వినయ్యా'అంటూ వాట్సాప్‌లో స్టేటస్ పెట్టి ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు.

● ఉక్కిరిబిక్కిరి...

సచివాలయాలకు ఊపిరందేనా!

నాడు ప్రజల గడప వద్దనే సేవలు.. నేడు సర్వేలకే పరిమితం

- ఆత్మగౌరవం, పెండింగ్ సమస్యలపై రోడ్లెక్కిన ఉద్యోగులు
- 'మహాత్మా మా గోడు వినయ్యా'అంటూ స్టేటస్‌లతో నేడు ఆందోళనలు
- గాంధీజీ ఆశయాల మేరకు గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సచివాలయాలు- వాలంటీర్ల వ్యవస్థకు వైఎస్ జగన్ ప్రభుత్వం శ్రీకారం
- ఐదేళ్ల పాటు ప్రజలకు ఇళ్ల దగ్గరే సచివాలయ, వలంటీర్ల సేవలు
- అవినీతి, పైరవీల్లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలు అమలుకు పటిష్ట వ్యవస్థ
- అధికారం చేపట్టిన 4 నెలల్లో 1.34 లక్షల మంది శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు రెండు నెలలకే 2.66 లక్షల మంది వలంటీర్లు
- కుగ్రామాల్లోనూ సువిశాల ఆఫీసులు, కంప్యూటర్, నెట్ వసతులు
- పల్లె, పట్నం అనే తేడా లేకుండా సొంతూళ్లలోనే కోట్ల వినతులు పరిష్కారం
- కూటమి ప్రభుత్వం వచ్చాక 4 నెలల్లోనే ఆ వ్యవస్థలు నిర్వీర్యం
- ప్రస్తుతం సుప్తచేతన స్థితిలో గ్రామ,వార్డు సచివాలయాల వ్యవస్థ
- ప్రజలు మళ్లీ ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థకు పూర్తిగా మంగళం
- కరపత్రాల పంపిణీ, సర్వే పనుల్లో బిజీగా సచివాలయాల ఉద్యోగులు

సాక్షి, అమరావతి: దేశ చరిత్రలో తొలిసారిగా పౌర సేవలు, సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే చేరవేస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్ గ్రామ, వార్డు సచివాలయాలను వ్యవస్థను ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యం వచ్చాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2019 అక్టోబరు 2కు ముందు రాష్ట్రంలో 3 వేల గ్రామ పంచాయతీలకు కనీసం కార్యాలయ భవనాలు లేవు. పెద్ద గ్రామాల్లో సైతం శిథిలావస్థకు చేరిన పంచాయతీ కార్యాలయాలు తప్ప మరో ప్రభుత్వ కార్యాలయం ఉండని పరిస్థితి. 4–5 పంచాయతీలకు ఒక్కరే కార్యదర్శి. కానీ, ఆ పంచాయతీ కార్యాలయాన్ని ఎప్పుడు తెరుస్తారో ఆ గ్రామ ప్రజలకే తెలియదు. అలాంటి సమయంలో గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు తర్వాత ప్రతి గ్రామంలో 8 నుంచి 10 మంది శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో అందుబాటులోకి వచ్చారు.

- ప్రజల గడప వద్దనే సేవలు అందించేందుకు ప్రతి 50 మందికి ఓ వలంటీరును వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చింది. రోజూ ఉదయం 10 గంటలకే వీరంతా ప్రభుత్వ సేవలకు ప్రజలకు సిద్ధంగా ఉండేవారు. సాయంత్రం 3–5 గంటల మధ్య సచివాలయ ఉద్యోగులు ప్రత్యేకంగా వినతుల స్వీకరణకే కేటాయించారు. కుగ్రామాల్లో ఉండే సచివాలయాల్లో 545 వరకు రాష్ట్ర ప్రభుత్వ సేవలతో పాటు పాస్‌పోర్టు బుకింగ్ తదితర కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల సర్వీసులనూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించింది. ఈ వ్యవస్థకు అనుబంధంగా వాలంటీర్ల వ్యవస్థను నాడే ప్రవేశపెట్టారు.

ప్రభుత్వం మారగానే కుదేలు

16 నెలల క్రితం వచ్చిన టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం గ్రామ, వార్డు వాలంటీరు–సచివాలయ వ్యవస్థను బలహీనపరిచే చర్యలు మొదలుపెట్టింది. గత ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో పనిచేసిన వలంటీర్ల వ్యవస్థను లేకుండా చేశారు. వలంటీర్లు చేసిన పనులకు గ్రామ, వార్డు సచివాలయాల్లోని శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకుంటున్నారు. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల్లో అందజేయాల్సిన ప్రభుత్వ సేవలు కుంటుపడుతున్నాయి. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తిఅయిన సందర్భంగా సీఎం చంద్రబాబు ఫోటోతో కూడిన స్టిక్కర్లను ఇళ్లకు అంటించే బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకే అప్పగించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేసే కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంచుతున్నారు

అవినీతి, పైరవీ లేకుండా సేవలు

గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు, అంతకు ముందు ఏ ప్రభుత్వ పథకం అమలు చేసినా ఊళ్లో ఏ ఐదు, పదిమందికో లబ్ధి దక్కేది. అది కూడా ఊళ్లో పెద్దలతో పైరవీలు చేసుకునేవారికో, లంచం ఇచ్చే వారికో అవకాశం ఉండేది. అయితే, వైఎస్ జగన్ పాలనలో సచివాలయాల ద్వారా ప్రతి ప్రభుత్వ పథకాన్ని సంతృప్త స్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందే విధానం ప్రవేశపెట్టారు. ఎలాంటి పక్షపాతం, పైరవీలు, అవినీతికి తావివ్వలేదు. ఇరుకు భవనాల్లోని పంచాయతీ కార్యాలయాలకు వైఎస్ జగన్ ప్రభుత్వం మోక్షం కల్పించింది. సచివాలయాల సేవలను ప్రజలకు అందించేలా ప్రతి చోటా రూ.43.60 లక్షలు ఖర్చుపెట్టి 2,623 చదరపు అడుగుల విశాలమైన రెండంతస్తుల గ్రామ సచివాలయం భవనాలను నిర్మించారు. రూ.4,750 కోట్ల ఖర్చుతో 10,893 గ్రామ సచివాలయాలను మంజూరు చేయగా చాలాచోట నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటి పక్కనే రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాన్ని కూడా గత ప్రభుత్వం చేపట్టింది.వైఎస్ జగన్ ప్రభుత్వం గ్రామ సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు, భవనాల నిర్మాణానికి పరిమితం కాకుండా కార్యాలయాల్లో ఆధునిక మౌలిక వసతులు కల్పించింది.

4 నెలలకే 1.34 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు

ఉమ్మడి ఏపీలో 40 ఏళ్ల కిందట మండల వ్యవస్థ తీసుకొచ్చినప్పుడు ఎలాంటి ప్రత్యేక ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. దీంతో ప్రజలకు సమర్థంగా పథకాలు అందలేదు. సుస్థిర అభివృద్ధి (ఎస్‌డీజీ) లక్ష్యాల సాధనలో ఉమ్మడి ఏపీ మిగిలిన రాష్ట్రాలతో పోల్చితే చాలా అంశాలలో వెనుకబడింది. కానీ, వైఎస్ జగన్ ప్రభుత్వం సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు సమర్థంగా సంక్షేమ కార్యక్రమాలు అందాలని భావించింది. దీనికోసం కొత్తగా ఏర్పాటు చేసిన 15,004 గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసేందుకు 1.34 లక్షల కొత్త శ్వాశత ప్రభుత్వ ఉద్యోగాలను మంజూరు చేసింది. 4 నెలల్లోనే భర్తీ ప్రక్రియను ముగించింది. సచివాలయాలకు అనుబంధంగా పనిచేసేందుకు గ్రామాల్లో ప్రతి 50 ఇళ్లకు ఒకరు, పట్టణాల్లో 75–100 ఇళ్లకు ఒకరు చొప్పున 2.66 లక్షల మంది వాలంటీర్లను వైఎస్ జగన్ ప్రభుత్వం నియమించింది. అందుబాటులో ఉన్న వనరులను సముచితంగా వినియోగించి జిల్లాల సంఖ్యను 13 నుంచి 26కు, రెవెన్యూ డివిజన్లను 52 నుంచి 77కి పెంచడం ద్వారా ప్రభుత్వం పరిపాలనాపరమైన పునర్ నిర్మాణం చేపట్టింది.

యునిసెఫ్ సైతం భాగస్వామ్యం

ఐక్యరాజ్యసమితి అనుబంధ యునిసెఫ్ కూడా ఏపీలో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల సాధనకు గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థతో ఒప్పందం చేసుకుంది. ఆ సంస్థ ప్రతినిధులు గ్రామ, వార్డు సచివాలయాల రాష్ట్ర కార్యాలయంలో ప్రత్యేక సిబ్బందిని కూడా నియమించారు. కోవిడ్ విపత్తు సమయంలో రాష్ట్రంలో ప్రాణ నష్టం చాలా తక్కువగా ఉండడానికి గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ ఒక కారణం అని కేంద్ర ప్రభుత్వం సైతం ప్రశంసించింది. విపత్తు వేళ వాలంటీర్లు–సచివాలయాల సిబ్బంది మూడు రోజుల వ్యవధిలోనే రాష్ట్రమంతా ఇంటింటి సర్వేలు దాదాపు 30 విడతల పాటు నిర్వహించడం గమనార్హం. యునిసెఫ్‌తో పాటు కేంద్రం ప్రశంసలతో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు.. గ్రామ, వార్డు సచివాలయాలను తమ రాష్ట్రాల్లో ప్రవేశపెట్టేందుకు ఏపీలో పరిశీలన చేశాయి.

1.34 లక్షల ఉద్యోగాల భర్తీ దేశంలో ఇప్పటికీ రికార్డే

2019 జులై–అక్టోబరు మధ్య 1.34 లక్షల శాశ్వత గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాల భర్తీకి రాష్ట్రవ్యాప్తంగా 21.69 లక్షల మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. 19,50,630 మంది రాత పరీక్షలకు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేయలేదు. యువత కూడా అంత పెద్ద సంఖ్యలో ఒకేసారి పరీక్షలు రాయడం దేశ చరిత్రలోనే లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

రేషనలైజేషన్ పేరిట ఉద్యోగుల కుదింపు

వైఎస్ జగన్ ప్రభుత్వంలో 10–11 మంది చొప్పున పనిచేసేలా సచివాలయాలు ఏర్పాటు కాగా, కూటమి ప్రభుత్వం... వాటి పరిధిలో నివాసం ఉండే జనాభా ఆధారంగా ఉద్యోగుల సంఖ్యను 6–8కి మధ్యకు పరిమితం చేయాలని నిర్ణయించింది. గ్రామాల్లో నిత్యం ప్రజలకు కావాల్సిన ప్రభుత్వ సేవలను అందించే వీఆర్వోలు, అగ్రికల్చర్, వెటర్నరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గతంలో ఒక్కో సచివాలయంలో ఒక్కొక్కరు చొప్పున పనిచేశారు. కానీ, ఆయా కేటగిరీ ఉద్యోగులను 2, 3 సచివాలయాలకు ఒకరు చొప్పున తగ్గించాలని కూటమి సర్కారు నిర్ణయించింది. ఈ ప్రక్రియ తిరిగి చాలా గ్రామాల్లో కొన్ని రకాల ప్రభుత్వ సేవలకు విఘాతం కలిగిస్తుందన్న విమర్శలున్నాయి. దీనికితోడు ఆరేళ్ల క్రితం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు సమయంలో సరఫరా చేసిన కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయడం లేదు. ప్రభుత్వం కొత్తవి సరఫరా చేయడం లేదని ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి.

మృతదేహం తరలింపునకు కష్టాలు


పడవపై మృతదేహాన్ని తరలిస్తున్న కుటుంబసభ్యులు

చింతూరు (అల్లూరి సీతా రామరాజు జిల్లా): అనారోగ్యంతో మృతి చెందిన ఓ మహిళ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు కుటుంబసభ్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వరద అడ్డంకిగా ఉండడంతో పడవపై మృతదేహాన్ని తరలించిన ఘటన గురువారం చింతూరు మండలంలో జరిగింది. వీఆర్‌పురం మండలం చొప్పల్లికి చెందిన పొన్నాడ నారాయణమ్మ(47) అనారోగ్యంతో బుధవారం గుంటూరు ఆసుపత్రిలో మృతి చెందింది. గురువారం ఆమె మృతదేహాన్ని చొప్పల్లి తరలించేందుకు చింతూరు తీసుకువచ్చారు. ఆ గ్రామానికి వెళ్లేందుకు మార్గమధ్యంలోని జల్లివారిగూడెం, సోకిలేరు, చీకటివాగుల వరదనీరు రహదారిపై నిలిచివుంది. దీంతో చీకటివాగు వద్దనుంచి మృతదేహాన్ని చింతూరుకు చెందిన ఎర్రం శ్రీను మరపడవపై తరలించేందుకు సన్నాహాలు చేశారు. అదే సమయంలో పడవ ఇంజిన్ మరమ్మతులకు గురికావడంతో పడవ యజమాని తెడ్డుసాయంతో వరదనీటిలో పడవను నడుపుతూ మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చాడు.

చిరు వ్యాపారాలను దెబ్బతీస్తున్న టీటీడీ

సీపీఎం నేత బీవీ రాఘవులు మండిపాటు

తిరుపతి అన్నమయ్య సర్కిల్: మానవసేవే మాధవసేవ అంటూ ప్రతినిత్యం ప్రచారం చేసే టీటీడీ శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్యల పట్ల కనీసం దయ దాక్షిణ్యం లేకుండా వ్యవహరిస్తోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మండిపడ్డారు. స్థానిక టీటీడీ పరిపాలన భవనం వద్ద చేపట్టిన శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. బాధితులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారుల ఉపాధిని టీటీడీ దెబ్బతీయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కనీసం న్యాయంకై 14 నెలలుగా దీక్షలు జరపాల్సిన దుస్థితి తిరుపతిలో ఏర్పడటం దురదృష్టకరమన్నారు. టీటీడీ పాలకమండలి, యాజమాన్యం తక్షణం స్పందించి శ్రీవారి మెట్టు వ్యాపారుల న్యాయమైన సమస్యను పరిష్కరించాలని వారి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మైనర్ బాలుడిపై పోక్సో కేసు నమోదు

కర్నూలు(టౌన్): కర్నూలు నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఓ మైనర్ బాలుడిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. పాతబస్తీకి చెందిన ఓ మైనర్ బాలుడు ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. అదే వీధిలో 10వ తరగతి చదివే ఓ బాలికతో స్నేహం ఏర్పడి ప్రేమగా మారింది. చనువు పెరిగి ఇద్దరూ దగ్గరవడంతో ఆ బాలిక గర్భం దాల్చింది. గత నెల 20న బాలిక కడుపునొప్పితో బాధ పడుతుండటంతో తల్లి గ్రహించి ఆరా తీసింది. విషయం తెలుసుకుని ట్యాబ్లెట్లు ఇచ్చింది. తీవ్ర నొప్పితో బాధ పడుతున్న ఆ బాలిక ఇంట్లోనే శిశువుకు జన్మనిచ్చింది. తల్లిదండ్రులు వెంటనే కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే శిశువు మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. మైనర్ బాలికను మోసం చేసి గర్భవతిని చేసిన మైనర్ బాలుడిపై బాధిత తండ్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

జీఎస్టీ వసూళ్లు పెరిగాయి

రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ బాబు.ఎ

సాక్షి, అమరావతి: పన్ను రేట్లు తగ్గిన తర్వాత జీఎస్టీ వసూళ్లు పెరిగాయని రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ బాబు.ఎ తెలిపారు. సెప్టెంబర్ నెల జీఎస్టీ వసూళ్లలో 7.45 శాతం వృద్ధి నమోదయ్యిందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఎస్టీ 2.0 ద్వారా పలు వస్తువులపై పన్నుల శాతం తగ్గిందన్నారు. సెప్టెంబర్ 2024తో పోల్చితే నికర జీఎస్టీ సేకరణ 7.45 శాతం పెరగగా.. స్థూల సేకరణ 4.19 శాతం పెరిగిందన్నారు. అలాగే ఈ ఏడాది సెప్టెంబర్‌లో అన్ని రంగాల వసూళ్లు రూ.4,335 కోట్లని, గతేడాది ఇదే నెలకు సంబంధించిన రూ.4,045 కోట్లతో పోల్చితే 7.17 శాతం వృద్ధి నమోదైందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు చేసిన మొత్తం వసూళ్లు రూ.26,686 కోట్లకు చేరాయని.. గతేడాది ఇదే కాలంలో నమోదైన రూ.25,373 కోట్లతో పోలిస్తే 5.17 శాతం పెరుగుదల నమోదైందని తెలిపారు.

పండుగనాడు భారీ చోరీలు

- గుంటూరు జిల్లాలో రెచ్చిపోయిన దొంగలు
- తెనాలిలో కారు అద్దం పగలగొట్టి రూ. 15 లక్షలు అపహరణ
- తూములూరులో ఓ ఇంట్లో రూ.10 లక్షల విలువైన ఆభరణాలు చోరీ


కారు అద్దం పగులగొట్టి ఉన్న దృశ్యం

తెనాలిరూరల్/కొల్లిపర: దసరా నాడు గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో దొంగలు రెచ్చిపోయారు. రెండు వేర్వేరు ఘటనల్లో రూ.25 లక్షల విలువైన సొత్తు అపహరించుకెళ్లారు. తెలంగాణలో ఉన్నతస్థాయి అధికారులుగా పనిచేస్తున్న దంపతులు గురువారం రాత్రి గుంటూరు జిల్లా తెనాలి పాండురంగపేటలో ఓవర్ బ్రిడ్జి వెంబడి ఉన్న కన్వెన్షన్ సెంటర్‌లో ఓ వివాహానికి హాజరయ్యారు. కారులో వచ్చిన వీరు కన్వెన్షన్ సెంటరులోకి వెళ్లగా..కారును డ్రైవరు అక్కడికి సమీపంలో ఓవర్ బ్రిడ్జి వెంబడి ఉంచాడు. ఫోన్ మాట్లాడుకుంటూ కొద్దిసేపటికి చూసుకోగా కారు అద్దం పగులగొట్టి ఉంది. కారులోని ఉంచిన బ్యాగు కనబడకపోవడంతో కారు యజమానులకు డ్రైవర్ సమాచారమిచ్చాడు. బ్యాగులో రూ.5లక్షల నగదు, 100 గ్రాముల బంగారు ఆభరణాలు, క్రెడిట్ కార్డులు, పాస్‌పోర్టు ఉన్నాయని సదరు ఉన్నతాధికారులు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో కొల్లిపర మండలం తూములూరు గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన మోటూరు మధుసూదనరావు బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామంలో రైస్ మిల్లు నడుపుతున్నాడు. వారానికోసారి ఇంటికి వచ్చి వెళుతుంటాడు. పిల్లలిద్దరూ హాస్టల్‌లో ఉంటారు. మధుసూదనరావు భార్య దసరా సందర్భంగా ఇటీవల బంధువుల ఇంటికి వెళ్లింది. తాళం వేసి ఉన్న ఇంటిని గమనించిన దుండగులు లోనికి ప్రవేశించి బీరువాలో ఉంచిన ఆభరణాలను అపహరించారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు మధుసూదనరావుకు సామాచారమివ్వగా ఆయన వచ్చి పరిశీలించుకుని 96 గ్రాముల ఆభరణాలు చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

- వేకువజాము నుంచే నిరీక్షించినా దక్కని ఫలితం
- కొద్దిసేపటికే సరకు పూర్తవడంతో అన్నదాతలకు నిరాశ


యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

కె.కోటపాడు: వేకువజాము నుంచే వేచి ఉన్నా యూరియా లభించకపోవడంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలంలో చౌడువాడ గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం యూరియా పంపిణీ జరుగుతుందన్న సమాచారంతో వేకువజామునే రైతు సేవా కేంద్రం వద్దకు రైతులు చేరుకున్నారు. రైతు సేవా కేంద్రం వద్ద రైతుల పాస్ పుస్తకాలు జెరాక్స్‌లతో పాటు ఆధార్‌కార్డులను లైన్‌లో ఉంచి వ్యవసాయశాఖ అధికారులు వచ్చేంత వరకూ వేచి ఉన్నారు. తీరా రైతు సేవా కేంద్రానికి వచ్చిన 12 టన్నుల యూరియా కోసం 600 మంది రైతులు పోటీ పడ్డారు. పంపిణీ ప్రారంభించిన కొద్ది సేపటికే సరకు పూర్తయ్యింది. దీంతో యూరియా దక్కని రైతులు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీఏసీఎస్‌ల ద్వారా, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇచ్చేవారని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. చౌడువాడ రెండు సచివాలయాల పరిధిలో గల చౌడువాడ, గరుగుబిల్లి, మల్లంపాలెం, పాచిలవానిపాలెం గ్రామాల్లో పంటల సాగును వ్యవసాయశాఖ అధికారులు పరిగణనలోకి తీసుకొని త్వరితగతిన మరలా యూరియాను రైతులకు పంపిణీ చేసే చర్యలను వ్యవసాయశాఖ అధికారులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తన్నుకున్న తమ్ముళ్లు

నడిరోడ్డుపై ఎమ్మెల్యే సాక్షిగా బూతులతో కొట్లాట

పలువురికి గాయాలు...

కొల్లూరు: నడిరోడ్డుపై విచక్షణ మరిచి తెలుగు తమ్ముళ్లు కొట్లాటకు దిగిన ఘటన బాపట్ల జిల్లా కొల్లూరులో శుక్రవారం రాత్రి జరిగింది. కొల్లూరు టీడీపీలో రెండు వర్గాలు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. శుక్రవారం సాయంత్రం టీడీపీ మండలాధ్యక్షుడు మైనేని మురళీ వర్గానికి చెందిన అనంతవరానికి చెందిన నాయకుడు, మరో వర్గ నాయకుడు మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్ వర్గాల నడుమ మాటల యుద్ధం జరిగింది. కొల్లూరు ఎంప్లాయిస్ రిక్రియేషన్ హోంలో వేమూరు టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీకి వచ్చిన సమయంలో మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్‌ను లక్ష్యంగా చేసుకొని అనంతవరానికి చెందిన నాయకుడు దూషించాడు. మాటల తీవ్రత పెరగడంతో అసభ్య పదజాల దూషణలకు దిగారు. వివాదం ముదరకుండా కనగాల వర్గం నాయకులు బస్టాండ్ సెంటర్లో ప్రభుత్వ కార్యక్రమమైన జీఎస్టీ సమావేశం వద్దకు వచ్చారు. దూషణల సమాచారం తెలుసుకున్న మైనేని వర్గీయులు బస్టాండ్ సెంటర్‌కు భారీగా చేరుకున్నారు. ఎమ్మెల్యే ఆనందబాబు సాక్షిగా జీఎస్టీ సమావేశం ప్రారంభమవుతున్న సమయంలో ఇరు వర్గాల నడుమ మరోమారు వాగ్వాదం జరిగి కొట్లాటకు దారితీసింది. ఒక వర్గం పై మరో వర్గం బాహాబాహీకి దిగి పిడిగుద్దులు, కుర్చీలు, హెల్మెట్లతో దాడులకు పాల్పడ్డారు. వీరికి సర్దిచెప్పడానికి ఎమ్మెల్యే చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కొట్లాటను తాత్కాలికంగా సద్దుమణిచి జీఎస్టీ సమావేశాన్ని ముగించిన ఎమ్మెల్యే ఆనందబాబు అక్కడ నుంచి వెళ్లిపోయారు. అనంతరం తిరిగి మరలా ఒకరిపై ఒకరు దాడులకు తెగబడటంతో పలువురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. పరిస్థితిని అదుపు చేసేందుకు వేమూరు సీఐ పీవీ. ఆంజనేయులు, కొల్లూరు ఎస్ఐ జానకీ అమరవర్ధన్ ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది.

నేటితో ముగియనున్న పీజీ ఫైనల్ ఫేజ్ రిజిస్ట్రేషన్

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో పీజీసెట్–2025 రెండవ విడత (ఫైనల్ ఫేజ్) అడ్మిషన్ల ప్రక్రియ శనివారంతో ముగియనుంది. ఈ మేరకు ఇప్పటికే ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. రెండవ, చివరి విడత అడ్మిషన్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు ఆయా కోర్సులకు సంబంధించి ఈనెల 6వ తేదీన వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పించారు. అనంతరం పీజీ సెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రిజర్వేషన్లు, సాధించిన మార్కుల ఆధారంగా 8వ తేదీన సీట్లను కేటాయించనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో ఈనెల 11వ తేదీలోపు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. మిగిలిన సీట్లకు త్వరలో స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు.

ముగిసిన ఎన్‌సీసీ ట్రెక్కింగ్ శిబిరం


ట్రెక్కింగ్ ముగింపు కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు

తిరుపతి సిటీ: ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో గతనెల 25 నుంచి ప్రారంభమైన అఖిల భారత ఎన్‌సీసీ ట్రెక్కింగ్ శిబిరం గురువారంతో ముగిసింది. తిరుపతి శేషాచలం బయోస్పియర్ రిజర్వ్ పరిసర ప్రాంతాలు, తిరుమల జూలాజికల్ పార్క్, రీజనల్ సైన్స్ సెంటర్, నాగార్జునం ఎకోలాజికల్ పార్క్‌లలో జరిగిన ఎన్‌సీసీ ట్రెక్కింగ్ యాత్రకు స్పందన లభించింది. ఇందులో దేశ వ్యాప్తంగా ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి 510 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 15 మంది ఎన్‌సీసీ అసోసియేట్ అధికారులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియా మాట్లాడుతూ.. స్థానిక వృక్ష, జంతు జాలంపై క్యాడెట్లకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రెక్కింగ్‌లో పాల్గొన్న క్యాడెట్‌లకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, పలు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. గురువారం అర్ధరాత్రి వరకు 75,188 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,640 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.66 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో తిరుమలేశుని దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలైకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

సాయిబాబా సేవలో పీవీ సింధు


సింధు దంపతులకు సాయిబాబా చిత్రపటాన్ని బహూకరిస్తున్న పాతూరి నాగభూషణం

పెదవడ్లపూడి(మంగళగిరి) : గుంటూరు జిల్లా పెదవడ్లపూడిలోని భగవాన్ సత్య షిరిడి సాయిబాబాను శుక్రవారం ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు దంపతులు దర్శించుకున్నారు. గోశాలలో గోపూజ నిర్వహించారు. తొలుత ఆలయ చైర్మన్ పాతూరి నాగభూషణం, కమిటీ ప్రతినిధులు సింధు దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

గజలక్ష్మి నమో నమామి


గజ వాహనంపై శ్రీవారి పట్టపురాణి

చంద్రగిరి: విజయదశమి సందర్భంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు గురువారం గజ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. విజయదశమి పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. విద్యుత్ దీపాల కాంతుల నడుమ అమ్మవారికి ఊంజల్‌సేవను కనుల పండువగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన గజవాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

రాజరాజేశ్వరీ దేవిగా బోయకొండ గంగమ్మ



చౌడేపల్లి: చిత్తూరు జిల్లా బోయకొండలో గంగమ్మ గురువారం రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు గోవర్ధనశర్మ, గంగిరెడ్డి తదితర అర్చక బృందం ఆధ్వర్యంలో ఆలయంలో ఏర్పాటుచేసిన అమ్మవారి ఉత్సవమూర్తి వద్ద ఈఓ ఏకాంబరంతోపాటు ఉభయదారులు గణపతి పూజ, అభిషేకాలు, అర్చనలు, ఊంజల్‌సేవ, చండీ హోమంతో పాటు పూర్ణాహుతి నిర్వహించారు. పది రోజుల పాటు జరిగిన దసరా మహోత్సవాలు ఎట్టకేలకు ముగిశాయి.

టీటీడీకి రూ.30 లక్షలు విరాళం

తిరుమల: తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన గుర్రం వెంకటేశ్వర్లు టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ అంకిత్ టీటీడీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని (స్విమ్స్) పథకానికి గురువారం రూ.30 లక్షలు విరాళంగా అందించారు. ఈమేరకు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీఆర్ నాయుడుకు విరాళం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారామ్ పాల్గొన్నారు.



బొగొటా ఫ్లవర్ షో

దేశ దేశాల నుంచి పూలు వచ్చి కొలువు తీరితే ఎలా ఉంటుంది? ఇదిగో ఇలా ఉంటుంది. కొలంబియా దేశంలోని బొగొటా నగరంలో ప్రతి ఏటా ఇంటర్నేషనల్ ఫ్లవర్ షో జరుగుతుంది. ఈ సంవత్సరం అక్టోబర్ 2 నుంచి మొదలైంది. రంగుల రంగుల పూలు ఇక్కడ ప్రదర్శనకు తెచ్చారు. ఇక్కడ కనపడుతున్నది గులాబీలు. ఎన్ని రంగులతో ఎన్ని వన్నెలతో ఉన్నాయో చూడండి. ప్రతి ఇంటిలో పూల మొక్కలు ఉండాలి. కనీసం ఒకటైనా ఉండాలి. ప్రతి రోజూ పూలతో గుడ్ మార్నింగ్ చెప్పి బడికి బయల్దేరితే ఆ సంతోషమే వేరు.

• మీకు తెలుసా?

వరి ఎలా పండిస్తారో తెలుసా?





పిల్లలూ! మీరు పల్లెలకు వెళ్లినప్పుడు అక్కడ మీకు పచ్చని వరిచేలు కనిపిస్తుంటాయి. అవి మీ మనసు ఎంతో ఆహ్లాదంగా అనిపిస్తాయి. అయితే వరి ఎలా పండిస్తారో, అందుకోసం ఎలా శ్రమిస్తారో మీకు తెలుసా?



వరి ద్వారానే మనకు వడ్లు, ఆ తర్వాత బియ్యం వస్తాయి. ముందుగా రైతులు నీటిలో ధాన్యాన్ని నానబెడతారు. గతంలో గతేడాది వరి గింజల్ని విత్తనాలుగా వాడేవారు. ప్రస్తుతం మార్కెట్లోనూ ఇవి దొరుకుతున్నాయి. ఆ గింజల్ని పొలంలోని ఒక చిన్నభాగం (మడి)లో చల్లుతారు. వారం రోజుల్లో వాటికి మొలకలు వస్తాయి. ఆ వారంలోనే మరో వైపు పొలాన్ని దుక్కి దున్ని, నీరు నింపి సిద్ధంగా ఉంచుతారు. మడిలో నుంచి మొలకల్ని తీసి, దుక్కి దున్నిన పొలంలో ఒక క్రమపద్ధతిలో వాటిని నాటుతారు. దీన్నే 'నాట్లు వేయడం' అంటారు. వరి చేనుకు నీటి వసతి చాలా అవసరం. నిరంతరం నీరు ఉండాలి. నాటిన పైరు పెరుగుతూ చివరన వరికంకులు తయారవుతాయి. ఈ సమయంలో పలు రకాల పురుగులు, తెగుళ్ల వాటిని నాశనం చేసే అవకాశం ఉంది. వాటి నివారణకు పురుగుమందులు, ఎరువులు పిచికారీ చేయాలి. పొలంలో గడ్డి, పిచ్చిమొక్కలు(కలుపు) పెరగకుండా ఎప్పటికప్పుడు తీసేయాలి. ఇలా నాలుగైదు నెలల పాటు జాగ్రత్తగా వరిని చూసుకుంటే కంకులు కోతకు వస్తాయి. కోతల అనంతరం వాటిని కుప్పలు వేసి, అనంతరం వాటి నుంచి వడ్లను వేరు చేస్తారు. ఆ వడ్లను మిల్లులకు పంపి, అక్కడ వాటిని బియ్యంగా మారుస్తారు. అలా బియ్యం మనదాకా చేరుతుంది. వరిలో చాలా రకాల వంగడాలున్నాయి. ఆయా రకాన్ని బట్టి ఈ ప్రక్రియలో మార్పుచేర్పులు అవసరం అవుతాయి.

• వండర్ గర్ల్

మ్యూజిక్ డైరెక్టర్ ఎథీనా



కేరళ రాష్ట్రం పతనంతిట్టకు చెందిన ఎథీనా మరియం అనిష్‌కు చిన్ననాటి నుంచి సంగీతం పట్ల మక్కువతో పెరిగింది. ఆమె తల్లిదండ్రులు సైతం ఆమె ఆసక్తిని గుర్తించి అందుకు తగ్గ శిక్షణ అందించారు. ఇష్టం, ఏకాగ్రతతో సంగీతాన్ని వింటూ సాధన చేసిన ఎథీనాకు సొంతంగా బాణీలు కట్టాలన్న ఆలోచన వచ్చింది. అలా తనకు తోచిన విధంగా రాగాలు కట్టి పాటలు పాడేది. వాటిని తన చుట్టూ ఉన్నవారికి వినిపించేది. వారు మెచ్చుకోవడంతో ఆమెలో ఆత్మవిశ్వాసం పెరిగింది. 2022 12 సెప్టెంబర్‌న 'మనోరమ మ్యూజిక్ ఛానల్' ద్వారా 'హృద్యం' అనే ఆల్బమ్ విడుదల చేశారు. అందులో ఎథీనా స్వరపరిచిన 'కలామెరయ్యో ఎన్నుల్లిల్ ధ్యాను రాగమై వన్నవల్' అనే పాట అనేకమందిని ఆకట్టుకుంది. 14 ఏళ్ల వయసులోనే స్వరకర్తగా మారిన ఎథీనా ప్రతిభను గుర్తించిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ఆమెకు ధ్రువపత్రం అందించారు. మరిన్ని పాటలు స్వరపరిచి సంగీత దర్శకురాలిగా పేరు తెచ్చుకుంటానని నమ్మకంగా చెప్తోంది ఎథీనా.

• కథ

మనిషి తోక



విజయవర్మ అనే రాజు ఎంతో తెలివైనవాడిగా పేరు తెచ్చుకున్నాడు. ఎంత జటిలమైన సమస్య వచ్చినా తన మేధోశక్తితో దాన్ని ఎదుర్కొనేవాడు.

ఒక రోజు విజయవర్మ సభలో ఉండగా ఇద్దరు వ్యక్తులు వచ్చారు. అందులో ఒక వ్యక్తి తన భుజానికున్న సంచీలో నుంచి ఒక పామును తీసి నేల మీద పెట్టాడు. అతను చేసిన పనికి సభలో కలవరం రేగింది. అయితే ఆ పాము కదలకపోవడంతో అది మరణించిందని అందరూ గ్రహించారు.

ఆ వ్యక్తి రాజుకు నమస్కరిస్తూ 'అయ్యా! ఇది నా పెంపుడు పాము. ఈ పామును ఆడిస్తూ, జనాల దగ్గర డబ్బులు తీసుకుంటూ పొట్టపోసుకుంటుంటాను. నా పాము ఇప్పటిదాకా ఎవరికీ ఏ హానీ చేయలేదు. ఎవరినీ కాటేయలేదు. రోజూ నా పామును కాసేపు బయటకు వదలడం అలవాటు. ఆ సమయంలో అది నా ఇల్లు దాటి పొలాల్లోకి వెళ్లింది. అక్కడ ఇతను పనిచేసుకుంటున్నాడు. పామును చూడగానే దాని తోక పట్టి, గాల్లోకి లేపి, నేలకేసి కొట్టి చంపేశాడు. నాకు మీరే న్యాయం చేయాలి' అని తన సమస్య విన్నవించాడు.

రాజు మరో వ్యక్తి వంక చూశాడు. 'అయ్యా! నేను ఈ పామును చంపిన మాట నిజమే! పొలంలో పనిచేసుకుంటూ ఉండగా కాళ్ల మధ్యలోనుంచి ఏదో కదిలినట్లు అనిపించింది. చూస్తే ఈ పాము. ఒక్క క్షణం గుండె ఆగినంత పనైంది. వెంటనే ధైర్యం తెచ్చుకొని, దాన్ని దూరంగా విసిరేయాలని అనుకున్నాను. అయితే అది మళ్లీ నా మీద పగబడుతుందేమోనని అనిపించి వెంటనే నేలకేసి కొట్టాను. అది ఇతని పెంపుడు పామన్న విషయం నాకు తెలియదు' అని ఆ వ్యక్తి వివరించాడు.

'నా పాము అని అతనికి తెలిసినా, తెలియకపోయినా నష్టం జరిగింది నాకు. నాకు మీరే న్యాయం చేయాలి' అన్నాడు పాములవాడు.

'అయ్యా! ఇతనికీ నాకూ కొంతకాలంగా ఊళ్లో గొడవలు జరుగుతున్నాయి. అది మనసులో పెట్టుకొని నా మీద ఇలాంటి అభియోగాలు మోపుతున్నాడు' అన్నాడు మరో వ్యక్తి.

విజయవర్మకు ఇది చిత్రమైన సమస్యలా అనిపించింది. పామును చంపినందుకు మనిషికి శిక్ష వేయాలా, వేస్తే ఎలాంటి శిక్ష వేయాలన్నది అతనికి అంతుబట్టలేదు. అలాగని వదిలేయడమూ సరైన పద్ధతి కాదు. సృష్టిలో ప్రతి ప్రాణికీ జీవించే హక్కు ఉంది.

'నీకు ఎలాంటి న్యాయం కావాలి? అతను నష్టపరిహారం చెల్లించాలా, లేదా మరో పామును తెచ్చి ఇవ్వాలా?' అని విజయవర్మ పాములవాణ్ని అడిగాడు.

'అయ్యా! నాకు పరిహారం ఏమీ వద్దు. నాకు నా పామే కావాలి. లేదంటే నా పాము ఎలాంటి బాధ పొందిందో ఇతనికీ అదే బాధ కలగాలి. ప్రాణానికి ప్రాణమే సరైన శిక్ష' అన్నాడతను.

విజయవర్మ ఆశ్చర్యంగా చూశాడు. ఇంతలో ఆయన మనసులో ఓ ఆలోచన మెరిసింది. వెంటనే పాములవాడి వైపు తిరిగి 'నీ పాము పొందిన బాధే ఇతనూ పొందాలి. అంతేనా?' అని అడిగాడు. అవునని పాములవాడు తలాడించాడు.

'సరే! ఇతను నీ పామును ఎలా చంపాడో నువ్వూ ఇతణ్ని అలాగే చంపేయ్' అన్నాడు రాజు. ఆయన మాటతో సభలోని వారంతా ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. తమ రాజు ఇటువంటి తీర్పు ఇచ్చాడేమిటని ఆశ్చర్యపోయారు. 'నీ పామును ఇతనెలా చంపాడో, నువ్వూ ఇతణ్ని అలాగే చంపాలి. నువ్వు కూడా ఇతని తోక పట్టుకొని, గాల్లోకి గిరగిరా తిప్పి నేలకేసి కొట్టు' అన్నాడు విజయవర్మ.

పాములవాడు గతుక్కుమన్నాడు. ఆ మాటలో సభలోని వారి ముఖాల్లో నవ్వు విరిసింది. తమ రాజు సరైన తీర్పే ఇచ్చాడని అందరూ తృప్తి పడ్డారు.


'అదెలా సాధ్యం అయ్యా? మనిషికి తోకెలా ఉంటుంది? ఇతణ్ని నేనెలా ఎత్తుకొని గాల్లో తిప్పగలను?' అన్నాడు పాములవాడు.

'ఏమో? అదంతా నాకు తెలియదు. నీ పామును ఎలా చంపాడో ఇతణ్ని అలాగే చంపు. లేదంటే మరణించిన పాముకు నష్టపరిహారం తీసుకొని వెళ్లు. ఏది కావాలో తేల్చుకో' అన్నాడు రాజు.

తన తప్పుకు బుద్ధి తెచ్చుకున్న అతను పరిహారం తీసుకొని వెళ్లిపోయాడు. రాజు తెలివికి ప్రజలంతా జేజేలు పలికారు.


• పుస్తకాలు

నేతాజీ జీవిత స్ఫూర్తి



బాలసాహిత్య రచనకు జీవితం అంకితం చేసిన రచయితల్లో రెడ్డి రాఘవయ్య ఒకరు. 'బాలసాహిత్య విభూషణ' బిరుదాంకితులు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితంపై రాసిన పుస్తకం ఇది. ఆయన జీవితంలోని స్ఫూర్తిదాయకమైన అంశాలను ఈ పుస్తకంలో పిల్లలకు అర్థమయ్యే భాషలో రాశారు. 2002లో ఈ పుస్తకం తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ బాలసాహిత్య పురస్కారాన్ని పొందింది.

రస్కిన్ బాండ్ కథలు



బాలల కోసం ప్రముఖ రచయిత రస్కిన్ బాండ్ రాసిన కథలివి. ఆయన రాసిన కథల్ని ఒకచోట చేర్చి పుస్తకాలుగా వెలువరించారు. అందులో మొదటి భాగం ఇది. ఇందులో 'ఎ స్పెషల్ ట్రీ', 'ది విండ్ ఆన్ హాంటెడ్ హిల్', 'రోమి అండ్ ది వైల్డ్‌ఫైర్', 'గుడ్‌బై, మిస్ మెకెంజీ' తదితర కథలున్నాయి. ఇవన్నీ పిల్లలకు ఎంతో ఆసక్తిని కలిగిస్తాయి. వారిని సరికొత్త ఊహాలోకానికి తీసుకెళ్తాయి.

పిల్లల హృదయాలను తాకే 10 ప్రపంచ సినిమాలు!

పిల్లలూ... సినిమాలు కేవలం వినోదం కోసం మాత్రమే కాదు. కొన్ని ఊహాశక్తిని పెంపొందిస్తాయి, నీతి పాఠవాలను నేర్పుతాయి. స్నేహం, కుటుంబ బాంధవ్యాలను బలపరుచుకోవడానికి తోడ్పాటుని అందిస్తాయి. మీ మనసులను ఆకర్షించే పది ప్రపంచస్థాయి సినిమాల గురించి ఈరోజు తెలుసుకుందాం.

1. The Wizard of Oz (1939)



డారథీ అనే అమ్మాయి తన ఊరి నుంచి మాయా ప్రపంచం ఓజ్ ల్యాండ్‌కు వెళ్తుంది. తన స్నేహితులు స్కేర్‌క్రో, టిన్ మ్యాన్, లయన్‌లతో కలిసి సాహస యాత్ర చేస్తుంది. కళ్లను కట్టి వేసే విజ్యుల్స్, ఐకానిక్ పాటలు మిమ్మల్ని మంత్ర ముగ్ధులను చేస్తాయి. ఈ సినిమా స్నేహం, ధైర్యం, కుటుంబ విలువలను గుర్తు చేస్తూ సాగుతుంది.

2. Toy Story (1995)



పిక్సర్ సంస్థ తయారుచేసిన మొదటి ఇవ యానిమేషన్ చిత్రం. బొమ్మలైన వుడీ, బజ్ లైట్‌యియర్‌లు యాండీ అనే బాలుడి కోసం అడ్వెంచర్‌లో పాల్గొంటాయి. ఫన్నీ డైలాగులు, ఎస్కేప్ సీక్వెన్స్‌లు చిన్న పిల్లలకు నవ్వు తెప్పిస్తాయి. స్నేహం, ఈర్ష్యను అధిగమించడం గురించి సాగే ఈ కథ పిల్లలకు సులభంగా అర్థమవుతుంది.

3. E.T. the Extra&Terrestria (1982)

స్టీవెన్ స్పీల్‌బర్గ్ రూపొందించిన ఈ చిత్రంలో ఎలియట్ అనే బాలుడు ఇ.టీ. అనే ఏలియన్‌తో స్నేహం చేసి, అతన్ని ఇంటికి పంపే సాహసం చేస్తాడు. బైక్ ఫ్లైట్ సీన్, ఎమోషనల్ గుడ్‌బై మూమెంట్ పిల్లల హృదయాలను తడుముతాయి. ఈ చిత్రం స్నేహం, ఒంటరితనం అంశాలతో మనసుని హత్తుకుంటుంది.

4. The Lion King (1994)

సింబా అనే లయన్ క్యూబ్ తన తండ్రి మరణం తర్వాత రాజ్యాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంటాడు. హాకునా మటాటా పాట, స్టాంపీడ్ సీన్ పిల్లలకు ఆకట్టుకుంటాయి. షేక్‌స్పియర్ హామ్లెట్ ఆధారంగా రూపొందిన ఈ చిత్రం బాధ్యతలు, జీవన చక్రం గురించి నేర్పుతుంది.

5. Spirited Away (2001)

హయావో మియాజాకి రూపొందించిన జపాన్ యానిమేషన్ మాస్టర్‌పీస్. చిహిరో అనే అమ్మాయి మ్యాజికల్ వరల్డ్‌లో ఒక ప్రమాదంలో చిక్కుకున్న తన తల్లిదండ్రులను కాపాడటానికి చేసే సాహసమే ఈ సినిమా. విజువల్స్, డ్రాగన్ ఫైట్ సీన్స్ ధైర్యం, పర్యావరణ సందేశాలను అందిస్తుంది. ఈ చిత్రం అందరినీ ఆలోచింపచేస్తుంది.

6. Finding Nemo (2003)



తన కొడుకు నెమోని వెతికడటం కోసం మర్లిన్ సముద్రంలో ప్రమాదకరమైన ప్రయాణం ప్రారంభిస్తాడు. జ్ఞాపకశక్తి తక్కువ అయిన డోరి సహకారంతో, భయాలను అధిగమిస్తూ, ధైర్యం, నమ్మకంతో నెమోని రక్షిస్తాడు. నమో ఎవరు? తనకి సముద్రానికి సంబంధం ఏంటంటనేదే మిగతా కథ. ఈ సినిమా ప్రేమ, ధైర్యం, పట్టుదలతో ఎదగడం, సమయానుకూలంగా విడిపోడం కూడా ముఖ్యమని చూపిస్తుంది.



7. Mary Poppins (1964)



మేరీ పాపిన్స్ అనే మ్యాజిషియన్ నాన్నీ బ్యాంక్స్ పిల్లలతో లండన్‌లో సాహసాలు చేస్తుంది. చిమ్నీ స్వీప్ డ్యాన్స్, సూపర్‌కాలిఫ్రాజిలిస్టిక్ పాటలు ఆకట్టుకుంటాయి. ఈ డిస్నీ మ్యూజికల్ పిల్లలకు సరదాగా అనిపిస్తుంది.

8. The Iron Giant (1999)

1950ల అమెరికాలో హోగార్థ్ అనే బాలుడు ఒక రోబోట్‌తో స్నేహం చేస్తాడు. శాంతి, యుద్ధం గురించి చెప్పే ఈ చిత్రం ఎమోషనల్ క్లైమాక్స్‌తో కంటతడి పెట్టిస్తుంది. సూపర్‌మ్యాన్ రిఫరెన్స్ సీన్స్ ఆకట్టుకుంటాయి.

9. Willy Wonka & the Chocolate Factory (1971)

విల్లీ వోంకా ఫ్యాక్టరీలో గోల్డెన్ టికెట్ గెలిచిన పిల్లలు చాక్లెట్ అడ్వెంచర్‌లో పాల్గొంటారు. ఓంప లోంపా రూమ్, వోంకా ఎంట్రీ సీన్స్ అబ్బురపరుస్తాయి. ఈ చిత్రం పిల్లలకు డ్రీమ్ వరల్డ్‌లా ఉంటుంది.

10. Inside Out (2015)

రైలీ అనే 11 ఏళ్ల అమ్మాయి మనసులోని భావాల ఆధారంగా తీసిన ఈ చిత్రం, మనసు తాలూకా ప్రతీ భావాన్ని ఒకేలా పరిగణించాలని చెప్పే సైకలాజికల్ మూవీ. ఇందులోని సన్నివేశాలు ఎమోషనల్ ఇంటెలిజెన్స్, మెంటల్ హెల్త్ గురించి నేర్పుతాయి. పెద్ద పిల్లలకు ఈ చిత్రం థెరపీలా పనిచేస్తుంది.

• మహనీయులు

నవ్య కవితా పితామహుడు.. రాయప్రోలు సుబ్బారావు

'నవ్య కవితా పితామహుని'గా పేరుపొందిన రాయప్రోలు సుబ్బారావు తెలుగులో భావ కవిత్వానికి ఆద్యుడు.

1892 మార్చి 17న గుంటూరు జిల్లా కాకుమాను మండలం గార్లపాడు గ్రామంలో సుబ్బారావు జన్మించారు. ఆయన మామ అవ్వరి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆయనకు సంస్కృతం, తెలుగు బోధించారు. సుబ్బారావు బాపట్ల ఉన్నత పాఠశాలలో చదివారు. అనంతరం కాకినాడ, రాజమండ్రిలో చదువుకున్నారు. ఆ సమయంలోనే సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. 1913లో సుబ్బారావు రాసిన 'తృణ కంకణము' కావ్యం ద్వారా తెలుగు కవిత్వంలో నూతన శకం ఆరంభమైనదని సాహితీవేత్తలు అంటారు. అదే సమయంలో 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం' తయారీలో కొమర్రాజు వెంకట లక్ష్మణరావుకు సుబ్బారావు సహకరించారు. తెలుగు సాహిత్యంలో విశేషమైన కృషి చేశారు.



ఆంధ్రావళి, కష్టకమల, వనమాల, మిశ్రమంజరి, స్నేహలతా దేవి, స్వప్నకుమారము, తెలుగు తోట, మాధురీ దర్శనం, రూపనవనీతం, రవీంద్రుని అస్తమయం వంటి కావ్యాలు రాశారు. అనుమతి, భజగోవిందము, సౌందర్య లహరి, దూతమత్తేభము వంటి అనువాదాలు చేశారు. అప్పటిదాకా సంస్కృత రచనలపై అతిగా ఆధారపడిన తెలుగు కవిత్వాన్ని సుబ్బారావు స్వతంత్ర రచనలవైపు మళ్లించారు.

హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1919లో ప్రారంభించిన తెలుగు విభాగానికి రాయప్రోలు సుబ్బారావు 25 సంవత్సరాలు అధిపతిగా పని చేశారు. ఆయన రాసిన 'ఏ దేశమేగినా..ఎందుకాలిడినా', 'శ్రీలు పొంగిన జీవగడ్డయి' వంటి దేశభక్తి గేయాలు జనాన్ని ఉత్తేజితుల్ని చేశాయి. 1984 జూన్ 30న రాయప్రోలు సుబ్బారావు కన్నుమూశారు.

బిజినెస్ రీల్

మలబార్ గోల్డ్‌కి హైకోర్టులో ఉపశమనం

సంస్థ పరువుకు భంగం కలిగించే కంటెంట్ తొలగించాలంటూ న్యాయస్థానం ఆదేశం



హైదరాబాద్: యునైటెడ్ కింగ్‌డం (యూకే)లో కొత్త షోరూమ్ విషయంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌కి బాంబే హైకోర్టులో ఊరట లభించింది. షోరూమ్ ప్రారంభానికి సంబంధించి కంపెనీ పరువుకు భంగం కలిగించేలా ప్రచురించిన పోస్టులు, కంటెంట్‌ను తొలగించాలంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు, వెబ్‌సైట్లు, వార్తా సంస్థలను న్యాయస్థానం ఆదేశించింది. బ్రాండ్ ప్రమోషన్‌లో భాగంగా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంపిక చేసే బాధ్యత, అక్కడి కార్యక్రమాన్ని సమన్వయపర్చేందుకు తాము నియమించుకున్న కంపెనీదే అయినప్పటికీ, పోటీదారులు తమ ప్రతిష్టను దెబ్బతీసేలా తప్పుడు కథనాలను ప్రచారం చేసినట్లు సంస్థ తన వాదనలను వినిపించింది. వీటితో ఏకీభవించిన న్యాయస్థానం సదరు అభ్యంతరకరమైన వార్తలు, కంటెంట్‌ను వెంటనే తొలగించాలంటూ సంబంధిత మీడియా సంస్థలను ఆదేశించినట్లు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తెలిపింది. వీటిలో మెటా ప్లాట్‌ఫాంలు, గూగుల్, ఎక్స్‌తో పాటు ఓన్లీ ఫ్యాక్ట్, జబ్ స్టూడియోస్ లాంటివి ఉన్నట్లు వివరించింది.

జీఆర్‌టీ జ్యువెలర్స్ రూ. 50 లక్షల విరాళం



హైదరాబాద్: సమాజ శ్రేయస్సుకు తన వంతు తోడ్పాటు అందించే దిశగా జీఆర్‌టీ జ్యువెలర్స్, సేలంలోని అయోధ్య ఆర్య వైశ్య చారిటబుల్ ఫౌండేషన్‌కు రూ. 50 లక్షలు విరాళం ప్రకటించింది. తక్కువ ఖర్చుతో వసతి సదుపాయాన్ని అందించేందుకు, ఛత్రం నిర్మాణం, సామూహిక అన్నదానం వంటి కార్యక్రమాలకు ఈ నిధులు ఉపయోగపడనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ 'ఆనంద్' అనంత పద్మనాభన్ తెలిపారు. నిరుపేదలకు ఆహారం, ఆశ్రయం కల్పించాలనే లక్ష్యంతో దీన్ని తలపెట్టినట్లు ఆయన వివరించారు. 1964లో ఏర్పాటైన జీఆర్‌టీ జ్యువెలర్స్, అత్యంత విశ్వసనీయమైన ఆభరణాల బ్రాండ్‌లలో ఒకటిగా ఎదిగింది. బంగారం, వజ్రాలు, ప్లాటినం మొదలైన వాటితో విశిష్టమైన ఆభరణాలు అందిస్తోంది. దక్షిణ భారతదేశం, సింగపూర్‌లో 65కి పైగా షోరూమ్‌లు ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-10-2025

విశాఖ	510-00
చిత్తూరు	528-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	520-00
విజయవాడ	520-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATA STEEL	173.29	3.45
POWERGRID	288.65	2.85
KOTAKBANK	2,108.00	2.17
AXISBANK	1,183.00	2.03
LT	3,742.90	1.98

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
MAXHEALTH	1,070.00	-3.88
TECHM	1,398.00	-1.27
EICHERMOT	6,935.00	-1.23
COALINDIA	383.90	-1.18
MARUTI	15,808.00	-0.98

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,768
ఎన్ఎస్ఈ	1,12,827
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,40,693
ఎఫ్ఐఐ	- 1,583
డీఐఐ	+ 490

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.18	$ 60.48
బ్రెంట్	64.69	$ 64.11

వంటింట్లోకి నలభీములు!

ఎయిర్ ఫ్రై నుంచి డీప్ ఫ్రై వరకు స్వయంగా వంట చేసుకుంటున్న మగాళ్లు

- కుక్‌వేర్ మార్కెట్‌కు కొత్త జోష్
- బ్రాండెడ్ కుక్‌వేర్‌కి పెరుగుతున్న డిమాండ్



ముంబైలోని చిన్న వంటగదిలో 29 ఏళ్ల జస్టిన్ వారంలో ఒక రాత్రి తన ఎయిర్ ఫ్రయర్‌లో స్వీట్ పోటాటో వెజెస్ వేయిస్తూ, సలాడ్ సిద్ధం చేస్తుంటాడు. వంట అనేది అతనికి విసుగెత్తించే పని కాదు, రిలాక్స్ అవడానికి, స్నేహితులను ఎంటర్‌టైన్ చేయడానికి, కొత్త రుచులను అన్వేషించడానికి అదో మార్గం. జస్టిన్ ఇప్పుడు భారతదేశ నగరాల్లో పెరుగుతున్న ఒక వర్గానికి ప్రతినిధి. ఇటీవలి కాలంలో ఎక్కువ మంది పురుషులు స్టైలిష్ గాడ్జెట్లు, ఆధునిక కుక్‌వేర్‌తో వంటింట్లోకి అడుగుపెడుతున్నారు. ఇది మారుతున్న అలవాట్లకే కాదు వాణిజ్యపరంగా కూడా ఒక విప్లవం.

దృక్పథం మారుతోంది...

ఆన్‌లైన్లో వంటింటి సామాను కొనేవారిలో ఇపుడు 30% మంది పురుషులే ఉంటున్నారు ఐదారేళ్ల క్రితం ఇది చాలా తక్కువ శాతం మాత్రమే. ఇంట్లో వంటగది ఎలా ఉండాలి, కుకింగ్ త్వరగా అయ్యేందుకు ఏమేం వస్తువులు కొనాలి అనే నిర్ణయాన్నిఇపుడు అనేక ఇళ్లలో భార్యాభర్తలిద్దరూ కలిసి తీసుకుంటున్నారని స్టాల్ కిచెన్స్ సీఈఓ ధ్రువ్ అగర్వాల్ తెలిపారు

వంటింటి సామ్రాజ్యానికి ఇప్పటికీ మహిళలే మహారాణులైనా పురుషుల వాటాకూడా క్రమంగా పెరుగుతోందని వండర్ చెఫ్ వ్యవస్థాపకుడు రవి సక్సేనా స్పష్టంచేశారు.

70% వారానికోసారి...

ఆన్‌లైన్ కొనుగోళ్ల ఆల్గరిథమ్‌ను పరిశీలిస్తే వంటింటి సామాను కొనే పురుషులు రెండు రకాలని తెలుస్తోంది. మొదటిరకం.. స్వతంత్రంగా జీవించే యువకులు వీరు రోజువారీ వాడుకకు పనికివచ్చే, నాన్-టాక్సిక్ కుక్‌వేర్, ఒకటి రెండు మాత్రమే కొనుగోలు చేస్తారు.ఇక రెండో రకం ప్యాషనేట్ కుక్స్ (బిజీ ప్రొఫెషనల్స్) వీరు ప్రతిరోజూ వంట చేయకపోయినా, ప్రీమియం సెట్‌లు కొనుగోలు చేసి సంప్రదాయ కుటుంబ వంటకాలతోపాటు రెస్టారెంట్‌లో లభించే రుచులను వంటింట్లో తయారుచేసేందుకు ప్రయత్నిస్తారు.

కుక్‌వేర్ కొనే పురుషుల్లో 70% మంది కనీసం వారానికి ఒకసారి వాటిని వాడతారు. వీరు ఎక్కువగా ప్రీమియం ఉత్పత్తులు, పూర్తి సెట్‌లను కొనడానికి ఇష్టపడతారు. వీరి సగటు ఆర్డర్ విలువ ఇతరులతో పోలిస్తే 12% ఎక్కువని ఎంబర్ కుక్‌వేర్ సీఈఓ సిద్ధార్థ్ గడోదియా చెప్పారు. పురుషులకు బాగా నచ్చేవి, ఎక్కువగా కొనే కిచెన్ ఉత్పత్తులు మల్టీ-ఫంక్షనల్ పరికరాలు (కలపడం, ముద్ద చేయడం, కట్ చేయడం, ఆవిరి వేయడం, వండడం ఇలా ఆల్ రౌండర్ టైపువి. స్టీలు పెనాలు, మూకుళ్లు ఉంటాయని గడోదియా తెలిపారు.

మొత్తానికి, పురుషులు వంటింట్లోకి అడుగు పెట్టడం వల్ల కుక్‌వేర్ మార్కెట్‌కి కొత్త కళ వచ్చింది.

పురుషులు వంటగదిలోకి రావడానికి కారణాలు

- ఆరోగ్యంపై శ్రద్ధ (తక్కువ నూనె, ప్రాసెస్ చేసిన ఆహారం తగ్గించడం)
- ఫ్లెక్సిబుల్ వర్క్ ప్యాటర్న్స్ (హోమ్ ఆఫీస్, వర్క్-లైఫ్ బ్యాలెన్స్)
- సోషల్ మీడియాలో నోరూరిస్తూ లభించే సులభమైన రెసిపీలు

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల తగ్గింపునకు ప్రోత్సాహకం

పథకాన్ని ప్రకటించిన ఆర్‌బీఐ



ముంబై: బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను (గడువు తీరినా క్లెయిమ్ చేయకుండా ఉండిపోయినవి) తగ్గించేందుకు ఆర్‌బీఐ ఒక పథకాన్ని తీసుకొచ్చింది. ఒక ఖాతా కార్యకలాపాల్లేకుండా (ఇనాపరేటివ్) ఉండిపోయిన కాలం, అందులో ఉన్న డిపాజిట్ ఆధారంగా బ్యాంకులకు ప్రోత్సాహకం చెల్లించనుంది. 4 ఏళ్లకు పైగా కార్యకలాపాల్లేని ఖాతాలకు సంబంధించి 5 శాతం లేదా రూ.5,000, అలాగే పదేళ్లకు పైగా కార్యకలాపాల్లేని ఖాతాలకు సంబంధించిన డిపాజిట్ల విలువలో 7.5 శాతం లేదా రూ.25,000 ఏది తక్కువ అయితే ఆ మేరకు బ్యాంకులకు ప్రోత్సాహంగా అందనుంది. ప్రస్తుతమున్న అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను అలాగే.. నిర్ణీతకాలం దాటిన తర్వాత డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్‌కు బదిలీ అయ్యే ఇలాంటి డిపాజిట్లను తగ్గించడం లక్ష్యంగా పథకాన్ని తీసుకొచ్చినట్టు ఆర్‌బీఐ తెలిపింది. కస్టమర్లు/డిపాజిటర్లు తమ ఖాతాలను తిరిగి యాక్టివేట్ చేసుకునేందుకు.. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారికి చెల్లించేందుకు వీలుగా బ్యాంకులను చురుగ్గా పనిచేయించడమే దీని ఉద్దేశ్యమని పేర్కొంది. ప్రస్తుత నిబంధనల కింద బ్యాంకు ఖాతాల్లో క్లెయిమ్ లేకుండా 10 ఏళ్లకు మించిన డిపాజిట్లను డీఈఏ ఫండ్‌కు బదిలీ చేయాల్సి ఉంటుంది. ఇలా డీఈఏ కిందకు బదిలీ అయిన తర్వాత కూడా వాటిని డిపాజిటర్లు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ ఏడాది జూన్ నాటికి ఇలాంటి డిపాజిట్లు రూ.67,000 కోట్లుగా ఉన్నాయి.

బంగారం తయారీదారులకు మూలధన రుణాలు

బంగారం, వెండి ముడి పదార్థంగా వినియోగించే తయారీదారులకు సైతం మూలధన రుణాలను (అవసరం మేరకు) అందించేందుకు బ్యాంక్‌లను ఆర్‌బీఐ అనుమతించింది. ఇప్పటి వరకు జ్యుయలర్లకే ఈ వెసులుబాటు ఉండేది.

విదేశీ కంపెనీలకూ ప్రిజంప్టివ్ పన్ను పథకం

ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సూచన

న్యూఢిల్లీ: విదేశీ కంపెనీలకు సైతం ప్రిజంప్టివ్ పన్ను పథకాన్ని ప్రవేశపెట్టాలంటూ కేంద్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ కీలక సూచన చేసింది. దీనివల్ల సులభత్వం, స్పష్టత ఏర్పడుతుందని పేర్కొంది. శాశ్వత ఏర్పాటుకు సంబంధించి వివాదాలకు ఐచ్ఛిక ప్రిజంప్టివ్ పన్ను విధానం ముగింపు పలుకుతుందని అభిప్రాయపడింది. ప్రిజంప్టివ్ పన్ను పథకం కింద.. కంపెనీల వాస్తవ లాభాలు, వ్యయాలతో సంబంధం లేకుండా స్థిర, ముందస్తుగా నిర్ణయించిన రేటుపై పన్ను చెల్లిస్తే సరిపోతుంది. దీనివల్ల కంపెనీలపై నిబంధన అమలు భారం తగ్గుతుంది. అకౌంట్ పుస్తకాలను నిర్వహించే భారం ఉండదు. విదేశీ కంపెనీలకు సైతం దీన్ని అమలు చేయడం వల్ల నిబంధనల అమలు భారం తగ్గుతుందన్నది నీతి ఆయోగ్ అభిప్రాయం. దీర్ఘకాలిక సమస్యకు ఇది ఆచరణాత్మక పరిష్కారం కాగలదని పేర్కొంది. అంతర్జాతీయంగా వ్యాపార సూచీల్లో భారత్ స్థానం మెరుగుపడుతుందని పేర్కొంది. ఈ సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసిన సందర్భంగా నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ''స్థిరమైన, స్పష్టమైన, ఊహించతగిన పన్ను విధానం అన్నది పెట్టుబడులకు, ఆర్థిక వృద్ధికి ఎంతో అవసరం. పెట్టుబడిదారులకు లేదా వ్యాపారాలకు అనిశ్చితి అన్నది ఎంత మాత్రం మంచిది కాదు. 2047 నాటికి వికసిత్ భారత్‌గా అవతరించాలన్నది లక్ష్యం. ఇందుకు గాను వేగంగా వృద్ధి చెందాల్సి ఉంటుంది. ప్రజలకు తగినన్ని ఉపాధి అవకాశాలు చూపించాలి. వీటన్నింటికీ పెట్టుబడులు, ఊహాత్మక వ్యాపార వాతావరణం అవసరం''అని సుబ్రమణ్యం పేర్కొన్నారు.

డీ2సీలోనే ఎఫ్ఎంసీజీ కొనుగోళ్లు

గత ఐదేళ్లపై క్రిసిల్ రేటింగ్స్ నివేదిక



న్యూఢిల్లీ: గత ఐదేళ్లలో దేశీయంగా ఎఫ్ఎంసీజీ దిగ్గజాలు ప్రధానంగా డైరెక్టు కన్జూమర్(డీ2సీ) విభాగంలోని కంపెనీలనే కొనుగోలు చేసినట్లు రేటింగ్ దిగ్గజం క్రిసిల్ పేర్కొంది. ఇతర సంస్థల కొనుగోళ్లలో ముప్పావువంతు డీ2సీ సంస్థలేనని తెలియజేసింది. తద్వారా ఎఫ్ఎంసీజీ రంగంలోని దిగ్గజాలు వృద్ధికి ఊతమివ్వడంతోపాటు.. ప్రీమియం విభాగాలలో విస్తరణకు దారి ఏర్పరచుకున్నట్లు తెలియజేసింది. దీంతోపాటు విస్తరణ, లాభదాయకతల్లో టార్గెట్ సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది. ఈ జాబితాలో హిందుస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) ఇటీవల అప్‌రైజింగ్ సైన్స్ ప్రయివేట్(మినిమలిస్ట్)ను రూ. 2,706 కోట్లకు సొంతం చేసుకోగా.. సాతియా న్యూట్రాస్యూటికల్స్(ప్లిక్స్)ను రూ. 380 కోట్లకు మారికో కొనుగోలు చేసింది. హీలియోస్ లైఫ్‌స్టైల్(ద మ్యాన్ కంపెనీ)ను రూ. 272 కోట్లు వెచ్చించి ఇమామీ టేకోవర్ చేయగా.. స్ప్రౌట్‌లైఫ్ ఫుడ్స్(యోగా బార్)ను రూ. 225 కోట్లకు ఐటీసీ చేజిక్కించుకుంది. ఈ అధ్యయనానికి 82 ఎఫ్ఎంసీజీ కంపెనీలను, 58 డీ2సీ సంస్థలను పరిగణనలోకి తీసుకున్నట్లు క్రిసిల్ రేటింగ్స్ వెల్లడించింది.

ఒడిదుడుకుల ప్రపంచానికి లంగరుగా భారత్

- పటిష్టంగా దేశ ఆర్థిక స్థితి
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి



న్యూఢిల్లీ: ఒడిదుడుకుల్లో కొట్టుమిట్టాడుతున్న ప్రపంచాన్ని స్థిరపర్చే లంగరుగా భారత్ కీలక పాత్ర పోషిస్తోందని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ద్రవ్యోల్బణం తక్కువ స్థాయిలో ఉండటం, విదేశీ మారక నిల్వలు సమృద్ధిగా ఉండటం, కరెంటు అకౌంటు లోటు నెమ్మదించడం, బ్యాంకులు..కార్పొరేట్ల బ్యాలెన్స్ షీట్లు బలంగా ఉండటం తదితర అంశాల దన్నుతో దేశ ఆర్థిక స్థితి పటిష్టంగా ఉందని ఆయన చెప్పారు. 'ప్రభుత్వంలోని విధానకర్తలు, నియంత్రణ సంస్థలు, నియంత్రిత సంస్థల సమిష్టి కృషితో ఇది సాధ్యపడింది. ఇటీవల ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ, పటిష్టమైన వృద్ధి బాటలో ఎకానమీ కుదురుకున్నట్లుగా కనిపిస్తోంది. ఇదొక గొప్ప ఫీట్‌లాంటిదే' అని ఆయన పేర్కొన్నారు. కౌటిల్య ఎకనమిక్ కాంక్లేవ్ 2025లో పాల్గొన్న సందర్భంగా మల్హోత్రా ఈ విషయాలు చెప్పారు. అనేక దశాబ్దాలుగా నిర్మితమైన భారత ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా సూక్ష్మ ఆర్థిక పరిస్థితులు, ధరల కట్టడి, ఆర్థికాంశాలు, స్థిరమైన విధానాలపై ప్రధానంగా దృష్టి పెట్టడం ఇందుకు దోహదపడిందని ఆయన వివరించారు. ఇటీవలి పరపతి సమీక్షలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం భారత్ వృద్ధి రేటును 6.5 శాతం నుంచి 6.8 శాతానికి పెంచిన ఆర్‌బీఐ ద్రవ్యోల్బణ అంచనాలను 3.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గించింది. వర్షపాతం సాధారణంగా కన్నా అధిక స్థాయిలో ఉండటం, జీఎస్‌టీ రేట్లను క్రమబద్ధీకరించడం తదితర సానుకూలాంశాలు ఇందుకు కారణమని పేర్కొంది. సెప్టెంబర్ 26తో ముగిసిన వారంలో భారత విదేశీ మారక నిల్వలు 700.236 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

సెబీకి ఇన్‌ఫ్రాడాట్ మార్కెట్ ప్రాస్పెక్టస్



న్యూఢిల్లీ: బిల్డింగ్ మెటీరియల్ ప్లాట్‌ఫాం ఇన్‌ఫ్రాడాట్‌మార్కెట్ తాజాగా తమ ఐపీవోకి సంబంధించి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి కాన్ఫిడెన్షియల్ ప్రాతిపదికన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. తాజా షేర్ల జారీ, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద ప్రస్తుత షేర్‌హోల్డర్లు షేర్లను విక్రయించడం ద్వారా కంపెనీ సుమారు రూ. 4,500–5,000 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. ఇందుకోసం కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, హెచ్‌ఎస్‌బీసీ మొదలైన సంస్థలను మర్చంట్ బ్యాంకర్లుగా కంపెనీ నియమించుకుంది. ఇన్‌ఫ్రాడాట్‌మార్కెట్ ఇటీవలే రూ. 24,600 కోట్ల వేల్యుయేషన్‌తో రూ. 730 కోట్లు సమీకరించింది. 2016లో సౌవిక్ గుప్తా, ఆదిత్య శార్దా ప్రారంభించిన ఈ సంస్థలో యాక్సెల్, టైగర్ గ్లోబల్ తదితర దిగ్గజ సంస్థలు ఇన్వెస్ట్ చేశాయి.

అంతర్జాతీయ అనిశ్చితులకు బంగారం సరికొత్త కొలమానం



ప్రపంచ అనిశ్చితులకు సరికొత్త కొలమానంగా బంగారం ధరలు వ్యవహరిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ముడి చమురు ధరలు ఎలా ఉండేవో బంగారం ధరలు కూడా అలాగే మారినట్లు చెప్పారు. ద్రవ్యపరంగా నేడు ప్రతి దేశం ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతమున్న వాణిజ్య విధాపరమైన వాతావరణం కొన్ని ఆర్థిక వ్యవస్థల వృద్ధికి నష్టం కలిగించనున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో కొన్ని స్టాక్ మార్కెట్లు కరెక్షన్‌ను చూడొచ్చని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి అవకాశాలను ఎన్నో అంశాలు ప్రభావితం చేస్తున్నాయంటూ.. ఈక్విటీ మార్కెట్లు సైతం ఆత్మవిశ్వాంతో కనిపిస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయంగా పలు మార్కెట్లలో ర్యాలీ వెనుక టెక్నాలజీ స్టాక్స్ పాత్రను ప్రస్తావిస్తూ.. త్వరలో దిద్దుబాటు చోటుచేసుకోవచ్చన్నారు. ''భౌగోళిక రాజకీయపరమైన ఉద్రిక్తతలు మునుపటి దశాబ్దంలో చమురు ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఆ తర్వాత ఒక శ్రేణికి పరిమితమయ్యాయి. కొన్ని ఆర్థిక వ్యవస్థల్లో చమురు అవసరాలు తగ్గడం ఇందుకు కారణం. గతంలో ప్రపంచ అనిశ్చితులను చమురు ధరలు ఎలా అయితే కొలమానంగా పనిచేశాయో.. ఇప్పుడు బంగారం ధరలు తీరు కూడా అలాగే ఉంది''అని మల్హోత్రా వివరించారు.

ఈ-స్పోర్ట్స్ కోసం ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ప్రతిపాదన



న్యూఢిల్లీ: ఈ-స్పోర్ట్స్, డిజిటల్ సోషల్ గేమ్స్‌ను ప్రోత్సహించేందుకు, రియల్ మనీ గేమ్స్ (ఆర్ఎంజీ)పై నిషేధం అమలుకు ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియాను (ఓజీఏఐ) ఏర్పాటు చేసేలా కేంద్రం ప్రతిపాదన తెరపైకి తెచ్చింది. దీనికి ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ (మెయిటీ) సారథ్యం వహిస్తుంది. సమాచార-ప్రసార శాఖ, యూత్ అఫైర్స్ తదితర శాఖల సమన్వయంతో ఇది పనిచేస్తుంది. ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ (పీఆర్‌వోజీ) చట్టం 2025 కింద కేంద్రం ఈ మేరకు ముసాయిదా నిబంధనలను ఆవిష్కరించింది. వీటిపై అక్టోబర్ 31లోగా సంబంధిత వర్గాలు తమ అభిప్రాయాలను తెలియజేయాల్సి ఉంటుంది. ముసాయిదా ప్రకారం ఓజీఏఐకి మెయిటీలోని అదనపు కార్యదర్శి స్థాయి అధికారి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ఇది దేశీయంగా చట్టబద్ధంగా ఆడతగిన ఈ-స్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమ్స్‌ను ఆమోదిస్తుంది.

అలాగే పీఆర్‌వోజీ చట్టాన్ని ఉల్లంఘించే గేమ్స్, స్పోర్ట్స్‌ను రద్దు కూడా చేయగలదు. ఆన్‌లైన్ మనీ గేమింగ్ సర్వీసులు ఆఫర్ చేసే వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ. 1 కోటి వరకు జరిమానా లేదా రెండింటినీ కలిపి విధించే అవకాశం ఉంటుంది. ఆన్‌లైన్ మనీ గేమ్స్‌పై ప్రకటనలు ఇస్తే రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ. 50 లక్షల వరకు జరిమానా విధించవచ్చు.

నవరాత్రుల్లో విక్రయాలకు జీఎస్‌టీ జోష్

- పదేళ్ల గరిష్ట స్థాయిలో అమ్మకాలు
- ఆటో, ఎలక్ట్రానిక్స్ జోరు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వస్తు, సేవల పన్నుల (జీఎస్‌టీ) తగ్గింపుతో పండగ సీజన్లో అమ్మకాలకు బూస్ట్ ఇచ్చినట్లయింది. ఈసారి నవరాత్రుల్లో దశాబ్దకాలంలోనే అత్యధికంగా విక్రయాలు నమోదయ్యాయి. వాహనాలు, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. గతేడాది నవరాత్రులతో పోలిస్తే మారుతీ సుజుకీ సేల్స్ రెట్టింపయ్యాయి. 3.5 లక్షల బుకింగ్స్ నమోదయ్యాయి. నవరాత్రుల్లో తొలి ఎనిమిది రోజుల్లో కంపెనీ 1.65 లక్షల వాహనాలను డెలివరీ చేసింది. మారుతీ సుజుకీ గతేడాది ఇదే వ్యవధిలో సుమారు 85,000 వాహనాలను విక్రయించింది. మహీంద్రా అండ్ మహీంద్రా వాహనాల అమ్మకాలు 60 శాతం పెరిగాయి. క్రెటా, వెన్యూలాంటి మోడల్స్‌కి డిమాండ్ నెలకొనడంతో హ్యుందాయ్ వాహన విక్రయాల్లో ఎస్‌యూవీల వాటా దాదాపు 72 శాతంగా నమోదైంది. టాటా మోటర్స్ 50,000కు పైగా వాహనాలను విక్రయించింది. ఆల్ట్రోజ్, పంచ్, నెక్సాన్, టియాగోలాంటి మోడల్స్‌కి డిమాండ్ నెలకొంది. ఇక ద్విచక్ర వాహనాల సంస్థ హీరో మోటోకార్ప్ షోరూంలను సందర్శించే వారి సంఖ్య రెట్టింపు కాగా, బజాజ్ ఆటో విక్రయాలు సైతం గణనీయంగా పెరిగాయి.

ఎల్‌జీ, హయర్ రెండంకెల స్థాయి వృద్ధి..

కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఎల్‌జీ, హయర్, గోద్రెజ్ అప్లయెన్సెస్ మొదలైన సంస్థల విక్రయాలు రెండంకెల స్థాయిలో పెరిగాయి. హయర్ అమ్మకాలు 85 శాతం ఎగిశాయి. 65 అంగుళాల టీవీలను రోజుకు 300–350 మేర విక్రయించింది. రూ. 2.5 లక్షల పైగా ఉండే 85 అంగుళాలు, 100 అంగుళాల టీవీలకు సంబంధించి దీపావళి స్టాక్ దాదాపుగా అమ్ముడైపోయింది. అతిపెద్ద రిటైల్ సంస్థ రిలయన్స్ రిటైల్ విక్రయాలు 20–25 శాతం పెరిగాయి. పెద్ద స్క్రీన్ టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, ఫ్యాషన్ మొదలైన విభాగాల్లో భారీగా అమ్మకాలు నమోదయ్యాయి. విజయ్ సేల్స్ విక్రయాలు కూడా 20 శాతం పెరిగాయి.



మీరాబాయి చానుకు రజతం

వరల్డ్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

ఫోర్డె (నార్వే): భారత స్టార్ వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజత పతకంతో మెరిసింది. మహిళల 48 కేజీల విభాగంలో బరిలోకి దిగిన మీరా రెండో స్థానంలో నిలిచింది. 2017 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం, 2022 టోర్నీలో రజతం నెగ్గిన మీరాబాయి... ఇప్పుడు మూడో పతకం ఖాతాలో వేసుకుంది. నార్వే వేదికగా జరిగిన పోటీల్లో మీరాబాయి 199 కేజీల (స్నాచ్‌లో 84 కేజీలు+క్లీన్ అండ్ జెర్క్‌లో 115 కేజీలు) బరువెత్తి రజతం కైవసం చేసుకుంది. ఉత్తర కొరియాకు చెందిన రి సాంగ్ గుమ్ 213 కేజీల (స్నాచ్‌లో 91 కేజీలు+క్లీన్ అండ్ జెర్క్‌లో 122 కేజీలు) బరువెత్తి ప్రపంచ రికార్డు నెలకొల్పడంతో పాటు పసిడి పతకం గెలుచుకుంది. థాయ్‌లాండ్‌కు చెందిన థాన్యాథోన్ సుక్‌చరోన్ 198 కేజీల (స్నాచ్‌లో 88 కేజీలు+క్లీన్ అండ్ జెర్క్‌లో 110 కేజీలు)తో కాంస్య పతకం నెగ్గింది. స్నాచ్‌లో తొలి ప్రయత్నం లోనే 84 కేజీల బరువెత్తని చాను... ఆ తర్వాత రెండు ప్రయత్నాల్లో 87 కేజీల బరువెత్తడంలో విఫలమైంది. మరోవైపు క్లీన్ అండ్ జెర్క్‌లో తొలుత 109 కేజీలు బరువెత్తిన మీరాబాయి... రెండో ప్రయత్నంలో 112 కేజీలు, మూడో ప్రయత్నంలో 115 కేజీల బరువెత్తింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో సైతం చాను క్లీన్ అండ్ జెర్క్‌లో 115 కేజీల బరువు ఎత్తే రజత పతకం గెలుచుకుంది. 'పతకం సాధించడం ఆనందంగా ఉంది. ఈ ప్రదర్శన నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ లక్ష్యంగా సాగుతున్నా. ఈ క్రమంలో పాల్గొనే ప్రతి టోర్నీ దానికి సన్నాహకమే. త్వరలో జరగనున్న కామన్వెల్త్ గేమ్స్, ఆసియా గేమ్స్‌లో మెరుగైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తా. పోటీపడ్డ ప్రతిసారీ కొత్తగా ఏదో ఒకటి నేర్చుకునేందుకు ప్రయత్నిస్తా. దేశానికి మరిన్ని పతకాలు అందించడమే నా ప్రధాన లక్ష్యం' అని మీరాబాయి చెప్పింది. ఆమె కోచ్ విజయ్ శర్మ మాట్లాడుతూ... ఈ పతకం మీరాబాయి కఠోర సాధనకు ఫలితమని అన్నాడు. 'ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 200 కేజీల మార్క్ అందుకోవాలని మీరా లక్ష్యంగా పెట్టుకుంది. దానికి ఒక్క అడుగు దూరంలో నిలిచి పోయింది. రానున్న కాలంలో కామన్వెల్త్, ఆసియా గేమ్స్, ఒలింపిక్స్ జరగనున్న నేపథ్యంలో ఆమె తీవ్ర సాధన చేస్తోంది. తన బలం, ఆత్మవిశ్వాసం పెంపొందించుకునేందుకు కష్టపడుతోంది' అని అన్నాడు.



కోచ్ విజయ్ శర్మతో మీరాబాయి

నిషాద్, సిమ్రన్ పసిడి వెలుగులు

- హైజంప్‌లో నిషాద్ కుమార్‌కు బంగారు పతకం
- 100 మీటర్ల పరుగులో సిమ్రన్ శర్మకు స్వర్ణం
- పట్టికలో నాలుగో స్థానానికి భారత్
- ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ జోరు సాగుతోంది. సొంతగడ్డపై జరుగుతున్న ఈవెంట్‌లో మన అథ్లెట్లు పతకాలతో మెరవడంతో... పట్టికలో భారత్ నాలుగో స్థానానికి ఎగబాకింది. పోటీల ఏడో రోజు శనివారం భారత్ ఖాతాలో రెండు స్వర్ణాలు సహా మొత్తం నాలుగు పతకాలు చేరాయి. పురుషుల హై జంప్‌లో నిషాద్ కుమార్ స్వర్ణం కైవసం చేసుకోగా... మహిళల 100 మీటర్ల రేసులో సిమ్రన్ శర్మ పసిడి వెలుగులు విరజిమ్మింది. ప్రీతీ పాల్, ప్రదీప్ కుమార్ కాంస్యాలు గెలుచుకున్నారు. ఓవరాల్‌గా ఈ చాంపియన్‌షిప్‌లో భారత్ ఇప్పటి వరకు 15 పతకాల (6 స్వర్ణాలు, 5 రజతాలు, 4 కాంస్యాలు)తో పట్టికలో నాలుగో స్థానానికి ఎగబాకింది. మరో రెండు రోజుల పాటు పోటీలు జరగనుండగా... భారత్ మరిన్ని పతకాలు సాధించే అవకాశం ఉంది. ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్ ఇప్పటి వరకు 2024లో (జపాన్) అత్యుత్తమంగా 17 పతకాలు సాధించింది. ఇప్పుడా సంఖ్యను దాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. బ్రెజిల్ 37



(12 స్వర్ణాలు, 18 రజతాలు, 7 కాంస్యాలు), చైనా 38 (9 స్వర్ణాలు, 16 రజతాలు, 13 కాంస్యాలు), పోలాండ్ 15 (8 స్వర్ణాలు, 2 రజతాలు, 5 కాంస్యాలు) వరుసగా పట్టిక తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.

సిమ్రన్ కెరీర్ బెస్ట్ ప్రదర్శన

మహిళల 100 మీటర్ల టి12 ఫైనల్లో సిమ్రన్ 11.95 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అత్యుత్తమ వ్యక్తిగత టైమింగ్‌తో పసిడి చేజిక్కించుకుంది. 2024 పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్యం, గత ప్రపంచ చాంపియన్‌షిప్ 200 మీటర్ల విభాగంలో పసిడి నెగ్గిన సిమ్రన్... తాజా ఎడిషన్‌లోనూ 200 మీటర్ల విభాగంలో పోటీ పడాల్సి ఉంది. టి12 విభాగం దృష్టి లోపానికి సంబంధించింది కాగా... ఈ పరుగులో ఆమెకు ఉమర్ సైఫీ గైడ్‌గా వ్యవహరించాడు. 'పతకం సాధించడం ఆనందంగా ఉంది. 200 మీటర్లలోనూ ఇదే జోరు కొనసాగిస్తూ దేశానికి మరో పతకం అందిస్తా' అని సిమ్రన్ చెప్పింది. పురుషుల హైజంప్ టి47 విభాగంలో నిషాద్ 2.14 మీటర్ల ఎత్తు దూకి అగ్రస్థానం దక్కించుకున్నాడు. ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నిషాద్‌కు ఇదే తొలి పసిడి పతకం. గతంలో 2020 టోక్యో, 2024 పారిస్ పారాలింపిక్స్‌లో నిషాద్ రజత పతకాలు నెగ్గాడు. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం, 2023 పోటీల్లో రజతం గెలిచాడు. 'ఈ రోజు కోసం చాన్నాళ్లుగా ఎదురుచూస్తున్నా. దీని కోసం ఎంతగానో శ్రమించా. గతంలో రజత పతకాలు సాధించినా... పసిడి మాత్రం చిక్కలేదు. ఇది నా రోజు. ఫలితంతో సంతృప్తిగా ఉన్నా' అని నిషాద్ అన్నాడు. ఆరేళ్ల వయసులో గడ్డికోత మిషన్‌లో పడి నిషాద్ కుడి చేయి కోల్పోయాడు. మహిళల 200 మీటర్ల టి35 విభాగంలో ప్రీతి 30.03 సెకన్లలో లక్ష్యాన్ని చేరి కాంస్యం గెలవగా... పురుషుల డిస్కస్ త్రో ఎఫ్64లో ప్రదీప్ 46.23 మీటర్ల దూరంతో కాంస్యం ఖాతాలో వేసుకున్నాడు.

224 పరుగుల ఆధిక్యంలో విదర్భ

- రెండో ఇన్నింగ్స్‌లో 96/2
- రెస్ట్ ఆఫ్ ఇండియాతో ఇరానీ కప్



నాగ్‌పూర్: ఇరానీ కప్ మ్యాచ్‌పై విదర్భ జట్టు పట్టు బిగించింది. రెస్టాఫ్ ఇండియాతో జరుగుతున్న ఈ పోరులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి విదర్భ ఓవరాల్‌గా 224 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ప్రస్తుతం విదర్భ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 36 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో చాంపియన్‌గా నిలిచిన విదర్భ జట్టు... ఇరానీ కప్‌లోనూ అదే జోరు కొనసాగుతోంది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో అథర్వ తైడె (15), అమన్ (37) అవుట్ కాగా... ధ్రువ్ షోరె (60 బంతుల్లో 24 బ్యాటింగ్; 1 ఫోర్), దానిశ్ మాలేవర్ (37 బంతుల్లో 16 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. రెస్టాఫ్ ఇండియా బౌలర్లలో మానవ్ సుతార్, గుర్‌నూర్ బ్రార్ చెరో వికెట్ పడగొట్టారు. వర్షం కారణంగా మూడో రోజు కూడా ఆటకు ఆటంకం వాటిల్లింది. మ్యాచ్‌లో మరో రెండు రోజుల ఆట మిగిలి ఉండగా... 8 వికెట్లు చేతిలో ఉన్న విదర్భ జట్టు... ప్రత్యర్థి ముందు ఎంత లక్ష్యాన్ని నిర్దేశిస్తుందో చూడాలి. అంతకుముందు విదర్భ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 342 పరుగులు చేయగా... రెస్టాఫ్ ఇండియా 69.5 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రజత్ పాటీదార్ (125 బంతుల్లో 66; 10 ఫోర్లు), అభిమన్యు ఈశ్వరన్ (112 బంతుల్లో 52; 6 ఫోర్లు) అర్ధసెంచరీలు చేశారు. రుతురాజ్ గైక్వాడ్ (9), ఇషాన్ కిషన్ (1), మానవ్ సుతార్ (1) విఫలమవడంతో రెస్టాఫ్ ఇండియా భారీ స్కోరు చేయలేకపోయింది. విదర్భ బౌలర్లలో యశ్ ఠాకూర్ 4 వికెట్లు పడగొట్టగా... హర్ష్ దూబే, పార్థ్ చెరో 2 వికెట్లు తీశారు.

స్కోరు వివరాలు

విదర్భ తొలి ఇన్నింగ్స్: 342; రెస్టాఫ్ ఇండియా తొలి ఇన్నింగ్స్: అభిమన్యు (ఎల్బీ) (బి) పార్థ్ 52; ఆర్యాన్ జుయెల్ (ఎల్బీ) (బి) దర్శన్ 23; యశ్ ధుల్ (స్టంప్డ్) వాడ్కర్ (బి) హర్ష్ దూబే 11; రజత్ పాటీదార్ (సి) రాథోడ్ (బి) హర్ష్ దూబే 66; రుతురాజ్ గైక్వాడ్ (సి) రాథోడ్ (బి) యశ్ ఠాకూర్ 9; ఇషాన్ కిషన్ (ఎల్బీ) (బి) పార్థ్ 1; మానవ్ సుతార్ (ఎల్బీ) (బి) యశ్ ఠాకూక్ 10; ఆకాశ్‌దీప్ (సి) అథర్వ (బి) యశ్ ఠాకూర్ 14; అన్షుల్ కంబోజ్ (నాటౌట్) 10; గుర్‌నూర్ బ్రార్ (సి) దూబే (బి) యశ్ ఠాకూర్ 13; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (69.5 ఓవర్లలో ఆలౌట్) 214. వికెట్ల పతనం:** 1–52, 2–73, 3–105, 4–119, 5–124, 6–142, 7–175, 8–191, 9–191, 10–214. **బౌలింగ్:** హర్ష్ దూబే 22–5–58–2; ఆదిత్య ఠాకరే 11–1–40–1; దర్శన్ నల్కండే 8–1–26–1; యశ్ ఠాకూర్ 16.5–3–66–4; పార్థ్ రెఖడే 12–3–24–2.

విదర్భ రెండో ఇన్నింగ్స్: అథర్వ తైడె (సి) ఆకాశ్‌దీప్ (బి) మానవ్ సుతార్ 15; అమన్ (సి) ఇషాన్ కిషన్ (బి) గుర్‌నూర్ బ్రార్ 37; ధ్రువ్ షోరె (బ్యాటింగ్) 24; దానిశ్ మాలేవార్ (బ్యాటింగ్) 16; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (36 ఓవర్లలో 2 వికెట్లకు) 96. వికెట్ల పతనం:** 1–42, 2–64. **బౌలింగ్:** సారాంశ్ జైన్ 9–0–28–0; ఆకాశ్‌దీప్ 3–1–4–0; మానవ్ సుతార్ 14–1–35–1; అన్షుల్ కంబోజ్ 4–0–14–0; గుర్‌నూర్ బ్రార్ 6–2–11–1.

దబంగ్ ఢిల్లీ 'టాప్' షో

చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో దబంగ్ ఢిల్లీ జోరు కొనసాగుతోంది. వరుసగా మూడో మ్యాచ్‌లో విజయం సాధించిన దబంగ్ ఢిల్లీ జట్టు... తిరిగి పాయింట్ల పట్టికలో అగ్ర స్థానానికి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పోరులో దబంగ్ ఢిల్లీ 43–26 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్‌ను మట్టికరిపించింది. ఢిల్లీ కెప్టెన్ అషు మాలిక్ 14 పాయింట్లతో విజృంభించగా... మిగిలినవాళ్లంతా అతడికి అండగా నిలిచారు. యూపీ యోధాస్ తరఫున గగన్ గౌడ 12 పాయింట్లతో పోరాడినా తక్కిన వాళ్ల నుంచి అతడికి సరైన సహకారం దక్కలేదు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 22 రెయిడ్ పాయింట్లు సాధించగా... యోధాస్ 20 రెయిడ్ పాయింట్లు సాధించింది. అయితే ట్యాక్లింగ్‌లో సత్తాచాటిన ఢిల్లీ జట్టు 11 పాయింట్లు ఖాతాలో వేసుకోగా... యూపీ యోధాస్ 5 ట్యాక్లింగ్ పాయింట్లకే పరిమితమైంది. ఈ మ్యాచ్‌లో యూపీ యోధాస్‌ను ఢిల్లీ జట్టు మూడుసార్లు ఆలౌట్ చేసింది. తాజా సీజన్‌లో 10 మ్యాచ్‌లాడిన ఢిల్లీ 9 విజయాలు, ఒక పరాజయంతో 18 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక 'టాప్'కు చేరింది. యూపీ యోధాస్ 10 మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 6



పరాజయాలతో 8 పాయింట్లు సాధించి పట్టిక తొమ్మిదో స్థానంలో ఉంది. శుక్రవారమే జరిగిన మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 45–33 పాయింట్ల తేడాతో హర్యానా స్టీలర్స్‌పై గెలుపొందింది. తలైవాస్ సారథి అర్జున్ దేశ్వాల్ 22 పాయింట్లతో వీరవిహారం చేశాడు. శనివారం పుణేరి పల్టన్‌తో జైపూర్ పింక్ పాంథర్స్, గుజరాత్ జెయింట్స్‌తో బెంగాల్ వారియర్స్ తలపడనున్నాయి.





యువ భారత్ ఘన విజయం

యూత్ టెస్టులో ఇన్నింగ్స్ తేడాతో ఆసీస్ చిత్తు

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా పర్యటనలో యూత్ వన్డే సిరీస్‌ను 'క్లీన్ స్వీప్' చేసిన భారత అండర్–19 జట్టు... సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ అదే జోరు కనబర్చింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం ముగిసిన తొలి యూత్ టెస్టులో ఆయుశ్ మాత్రే సారథ్యంలోని భారత అండర్–19 జట్టు ఇన్నింగ్స్ 58 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా అండర్–19 జట్టును చిత్తు చేసింది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 243 పరుగులు చేయగా... అనంతరం వైభవ్ సూర్యవంశీ, వేదాంత్ త్రివేది సెంచరీలతో కదం తొక్కడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 428 పరుగులు చేసింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబాటు కొనసాగించిన ఆస్ట్రేలియా అండర్–19 జట్టు 49.3 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. ఆర్యాన్ శర్మ (44 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలినవాళ్లంతా విఫలమయ్యారు. భారత బౌలర్లలో దీపేశ్ దేవేంద్రన్, ఖిలాన్ పటేల్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... కిషన్ కుమార్, అన్‌మోల్‌జీత్ సింగ్ రెండేసి వికెట్లు చొప్పున తీశారు. ఇరు జట్ల మధ్య మంగళవారం నుంచి మెకాయ్‌లో రెండో యూత్ టెస్టు ప్రారంభం కానుంది. ఈ పర్యటనలో తొలుత ఆడిన మూడు యూత్ వన్డేల్లోనూ భారత అండర్–19 జట్టు విజయాలు సాధించింది.

టి20 వరల్డ్ కప్‌లో నమీబియా, జింబాబ్వే

2026 టోర్నీకి అర్హత సాధించిన రెండు జట్లు



దుబాయ్: వచ్చే ఏడాది భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) పురుషుల టి20 ప్రపంచకప్‌నకు నమీబియా, జింబాబ్వే అర్హత సాధించాయి. ఆఫ్రికా రీజినల్ టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరడం ద్వారా ఈ రెండు జట్లు వరల్డ్‌కప్ బెర్త్ దక్కించుకున్నాయి. సెమీఫైనల్లో జింబాబ్వే 7 వికెట్ల తేడాతో కెన్యాపై విజయం సాధించగా... నమీబియా 63 పరుగుల తేడాతో టాంజానియాపై గెలుపొందింది. తద్వారా మెగా టోర్నీకి అర్హత సాధించాయి. 2026 ఫిబ్రవరి, మార్చి మధ్య జరగనున్న ఈ టోర్నీలో మొత్తం 20 దేశాలు పాల్గొంటాయి. అందులో భారత్, శ్రీలంక ఆతిథ్య హక్కులతో నేరుగా అర్హత సాధించగా... 2024 వరల్డ్‌కప్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన అఫ్గానిస్తాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, అమెరికా, వెస్టిండీస్ జట్లు వరల్డ్‌కప్ బెర్త్ దక్కించుకున్నాయి. ఐర్లాండ్, న్యూజిలాండ్, పాకిస్తాన్ ర్యాంకింగ్స్ ప్రకారం అర్హత సాధించాయి. దీంతో మొత్తం 12 జట్లు మెగా టోర్నీ బెర్త్ దక్కించుకోగా... మిగిలిన ఎనిమిది జట్లను వివిధ క్వాలిఫయింగ్ టోర్నీల ద్వారా ఎంపిక చేస్తారు. ఇప్పటికే జరిగిన అమెరికా క్వాలిఫయర్స్‌లో కెనడా జట్టు... యూరప్ క్వాలిఫయర్స్‌లో ఇటలీ, నెదర్లాండ్స్ జట్లు టోర్నీకి బెర్త్ దక్కించుకోగా... తాజాగా ఆఫ్రికా క్వాలిఫయర్స్ నుంచి నమీబియా, జింబాబ్వే ముందంజ వేశాయి. దీంతో వరల్డ్‌కప్‌లో పాల్గొనబోయే 17 జట్లపై స్పష్టత రాగా... ఆసియా క్వాలిఫయర్స్ ద్వారా మరో మూడు జట్లను ఎంపిక చేయనున్నారు.

తిలక్ వర్మ మెరిసినా...

రెండో అనధికారిక వన్డేలో భారత్ 'ఎ' పరాజయం

కాన్పూర్: ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో జరిగిన రెండో అనధికారిక వన్డేలో భారత 'ఎ' జట్టు పరాజయం పాలైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన రెండో మ్యాచ్‌లో... శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత 'ఎ'జట్టు డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 9 వికెట్ల తేడాతో ఓడింది. దీంతో సిరీస్ 1–1తో సమమైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 'ఎ' జట్టు 45.5 ఓవర్లలో 246 పరుగులకు ఆలౌటైంది. ఇటీవల ఆసియాకప్ టి20 టోర్నమెంట్ ఫైనల్లో పాకిస్తాన్‌పై అజేయ అర్ధశతకంతో మెరిసి జట్టును గెలిపించిన తిలక్ వర్మ మరోసారి ఆకట్టుకున్నాడు. తాజా మ్యాచ్‌లో తిలక్ 122 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 94 పరుగులు చేసి త్రుటిలో శతకం కోల్పోయాడు. ప్రస్తుతం భారత టి20 జట్టులో కీలక సభ్యుడిగా కొనసాగుతున్న తిలక్ వర్మ... ఇప్పుడు వన్డే ఫార్మాట్ లోనూ సత్తా చాటాడు. రియాన్ పరాగ్ (54 బంతుల్లో 58; 6 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీ సాధించాడు. రియాన్‌తో కలిసి నాలుగో వికెట్‌కు తిలక్ 101 పరుగులు జతచేశాడు. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన ఈ హైదరాబాద్ బ్యాటర్ చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. తొలి మ్యాచ్‌లో సెంచరీలతో మెరిసిన ప్రభ్‌సిమ్రన్ సింగ్ (1), శ్రేయస్ అయ్యర్ (8)తో పాటు... అభిషేక్ శర్మ (0), నిశాంత్ (1) విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో జాక్ ఎడ్వర్డ్స్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఆస్ట్రేలియా లక్ష్యఛేదన ప్రారంభించాక భారీ వర్షం



కారణంగా మ్యాచ్ నిలిచిపోగా... ఆసీస్ లక్ష్యాన్ని 25 ఓవర్లలో 160గా నిర్ణయించారు. ఛేదనలో ఆసీస్ 16.4 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 160 పరుగులు చేసి గెలిచింది. మెకంజీ హార్వే (49 బంతుల్లో 70 నాటౌట్; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), కూపర్ (31 బంతుల్లో 50 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్ధశతకాలతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. భారత బౌలర్లలో నిషాంత్ ఒక వికెట్ పడగొట్టాడు. టీమిండియా పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 4 ఓవర్లలో 44 పరుగులు సమర్పించుకున్నాడు. ఇరు జట్ల మధ్య ఆదివారం నిర్ణయాత్మక మూడో మ్యాచ్ జరగనుంది.

నిరసన గళం...


మెక్సికో రాజధాని మెక్సికో సిటీలో గురువారం '1968నాటి విద్యార్థులపై పోలీసు కాల్పుల ఘటన'కు గుర్తుగా చేపట్టిన ర్యాలీలో పోలీసులతో ఘర్షణ



శుక్రవారం జర్మనీ రాజధాని బెర్లిన్‌లో జరిగిన శాంతి ప్రదర్శనలో 'నో వార్' అనే బ్యానర్‌తో పెద్ద సంఖ్యలో పాల్గొన్న జనం


అవినీతికి వ్యతిరేకంగా, ఆరోగ్యం, విద్యారంగాల్లో సంస్కరణల కోసం మొరాకోలోని కాసాబ్లాంకాలో జరిగిన ర్యాలీలో నినాదాలు చేస్తున్న యువత

గాజా కోసం...


ఇటలీలోని బొలొగ్నా నగరంలో శుక్రవారం పాలస్తీనా అనుకూలుర నిరసన ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు


పాలస్తీనాకు అనుకూలంగా, ఇజ్రాయెల్ వైఖరిపై నిరసనగా తెలుపుతూ రోమ్‌లోని పురాతన కొలోజియం వద్ద జరిగిన ప్రదర్శన



గాజా తీరంలోకి గ్లోబల్ సముంద్ ఓడలు వెళ్లకుండా ఇజ్రాయెల్ సైన్యాన్ని అడ్డుకోవడాన్ని నిరసిస్తూ స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరిగిన ర్యాలీ

మహారాష్ట్రలో 24 x 7 హోటళ్లు

- వైన్ షాపులకు మాత్రం నో

ముంబై: రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు, థియేటర్లు, ఇతర వినోద స్థలాలు 24 గంటలూ అందుబాటులో తెరిచి ఉంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం తాజాగా అనుమతి ఇచ్చింది. ఈ మేరకు అక్టోబర్ 1 నుంచి కొత్త విధానాన్ని అమల్లోకి తెస్తూ ప్రభుత్వ తీర్మానాన్ని (జీఆర్) విడుదల చేసింది. అయితే, వైన్ షాపులు, బార్లు, డ్యాన్స్ బార్లు, హుక్కా పార్లర్లు, డిస్కోథెక్స్, పర్మిట్ రూమ్‌లకు మాత్రం 24 గంటలూ తెరిచి ఉంచేందుకు అనుమతి ఇవ్వలేదు. దుకాణాలు, వాణిజ్య సంస్థలు వారంలో అన్ని రోజులు అందరికీ అందుబాటులో ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అందులో పనిచేసే సిబ్బంది పనిగంటలు మాత్రం ఇప్పుడు ఉన్నవే యధాతథంగా కొనసాగుతాయని పేర్కొంది. ఈ నిబంధనలు కఠినంగా అమలయ్యేలా స్థానిక అధికారులు, పోలీసులు పర్యవేక్షించాలని చెప్పింది. తాము 2020 జనవరిలో తీసుకొచ్చిన విధానాన్నే ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేసిందని, ఇందులో ఎలాంటి కొత్తదనం లేదని శివసేన (యూబీటీ) నాయకుడు ఆదిత్యా ఠాక్రే విమర్శించారు.

ఆన్‌లైన్ గేమింగ్‌పై ఉక్కుపాదం

- ఉల్లంఘనలకు ఏడేళ్ల జైలు, భారీ జరిమానా
- ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా ఏర్పాటు
- కఠిన నిబంధనలతో కేంద్రం ముసాయిదా జారీ

సాక్షి,న్యూఢిల్లీ: దేశంలో ఆన్‌లైన్ గేమింగ్ పేరుతో జరుగుతున్న అక్రమాలకు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఈ రంగాన్ని నియంత్రించేందుకు 'ది ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ రూల్స్–2025'పేరుతో అత్యంత కఠినమైన నిబంధనలతో ముసాయిదాను విడుదల చేసింది. తాజా నిబంధనల ప్రకారం, డబ్బుతో పందెం ఆటలను (ఆన్‌లైన్ మనీ గేమ్స్) నిర్వహించే వారికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.20 లక్షల జరిమానా విధించనున్నారు. ఈ నిబంధనల అమలు కోసం సివిల్ కోర్టు అధికారాలతో 'ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా'ను ఏర్పాటు చేయనున్నారు.

అన్ని అధికారాలతో అథారిటీ

కొత్తగా ఏర్పాటయ్యే ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీకి విస్తృత అధికారాలు కట్టబెట్టారు. అథారిటీ ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉంటుంది. ఐటీ మంత్రిత్వ శాఖకు చెందిన జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారి దీనికి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. సమాచార, ప్రసార, యువజన వ్యవహారాలు, క్రీడలు, ఆర్థిక సేవల శాఖల అధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ అథారిటీకి సివిల్ కోర్టుకు సమానమైన అధికారాలు ఉంటాయి. ఏ గేమ్‌ను 'ఆన్‌లైన్ మనీ గేమ్'గా వర్గీకరించాలనే తుది నిర్ణయం అథారిటీకే ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే రిజిస్ట్రేషన్లను రద్దు చేయడం లేదా సస్పెండ్ చేయడంతో పాటు, చట్టవిరుద్ధమైన వేదికలను బ్లాక్ చేయాలని బ్యాంకులు, ఇతర సర్వీస్ ప్రొవైడర్లను ఆదేశించగలదు.

భారీ జరిమానాలు, కఠిన శిక్షలు

ముసాయిదాలో నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు ప్రతిపాదించారు. ఆన్‌లైన్ మనీ గేమ్స్ నిర్వహిస్తే ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.20 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. అథారిటీ ఆదేశాలను పాటించకపోవడం వంటి ఇతర ఉల్లంఘనలకు మూడేళ్ల వరకు జైలు, రూ.10 లక్షల జరిమానా విధించవచ్చు. ఈ–స్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమ్‌లను అందించే ప్రతి సంస్థ తప్పనిసరిగా అథారిటీ వద్ద నమోదు చేసుకోవాలి. ఈ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఐదేళ్ల వరకు చెల్లుబాటులో ఉంటుంది. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం పటిష్టమైన మూడంచెల యంత్రాంగాన్ని ప్రతిపాదించారు. మొదటిది గేమింగ్ కంపెనీ గ్రీవెన్స్ ఆఫీసర్, రెండోది స్వీయ–నియంత్రణ సంస్థ, మూడోది ప్రభుత్వం ఏర్పాటు చేసే అప్పిలేట్ బాడీ. దీని ద్వారా వినియోగదారుల ఫిర్యాదులకు స్పష్టమైన, సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ–స్పోర్ట్స్‌ను క్రీడల శాఖ, ఆన్‌లైన్ సోషల్ గేమ్‌లను సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నియంత్రిస్తుంటాయి.

హైవేలపైనే క్యూఆర్ కోడ్..!

సాక్షి, న్యూఢిల్లీ: ఇకపై ఒక్క క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు మనం ప్రయాణించే జాతీయ రహదారి(ఎన్‌హెచ్) పూర్తి సమాచారాన్ని పొందవచ్చు. ప్రయాణించే ఎన్‌హెచ్‌కు సంబంధించిన నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) ఫీల్డ్ ఆఫీస్‌తోపాటు ఆసుపత్రులు, పెట్రోల్ పంపులు, టాయిలెట్లు, పోలీస్ స్టేషన్లు, రెస్టారెంట్లు, టోల్ ప్లాజాకు దూరం, ట్రక్ లే బై, పంచర్ రిపేర్ షాప్, వాహన సర్వీస్ స్టేషన్లు/ఈ–ఛార్జింగ్ స్టేషన్ వంటి సమీపంలోని సౌకర్యాల గురించిన వివరాలను అందించనుంది. నేషనల్ హైవేల ప్రయాణించే వాహనదారులకు పారదర్శకతను పెంపొందించడంతో పాటు, ప్రయాణ సౌలభ్యాన్ని అందించేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర రవాణా శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇందులో భాగంగా క్యూఆర్ కోడ్‌లతో కూడిన సమాచార సైన్ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. 'క్యూర్ కోడ్'సైన్ బోర్డులను.. ఎన్‌హెచ్‌లకు రెండు వైపు సౌకర్యాలు, విశ్రాంతి ప్రాంతాలు, టోల్ ప్లాజాలు, ట్రక్ లే–బైలు, హైవే ప్రారంభ/ముగింపు పాయింట్లు, సంకేతాల దగ్గర ఉంచనున్నారు. వాహనదారులకు రహదారి భద్రతను కల్పించడంలోనూ క్యూఆర్ సూచిక బోర్డులు సాయపడతాయని భావిస్తున్నట్లు తెలిపింది. ఎన్‌హెచ్ నంబర్, హైవే చైనేజ్, ప్రాజెక్ట్ పొడవు, నిర్మాణం/మెయింటెనెన్స్ టైం, హైవే పెట్రోల్ కోసం కాంటాక్ట్ నంబర్లు, టోల్ మేనేజర్, ప్రాజెక్ట్ మేనేజర్, రెసిడెంట్ ఇంజనీర్, ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్–1033 సమాచారాన్ని కూడా క్యూర్ కోడ్‌తో పొందవచ్చని వెల్లడించింది.

పాక్ అణచివేత వల్లే పీఓకేలో అశాంతి

- హింసకు పాక్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- భారత విదేశాంగ శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లో ప్రస్తుతం నెలకొన్న అశాంతి, అలజడికి ముమ్మాటికీ పాకిస్తాన్ ప్రభుత్వ అణచివేతే కారణమని భారత విదేశాంగ శాఖ ఆరోపించింది. పాకిస్తాన్ పాలకులు పీఓకేలోని వనరులను విచ్చలవిడిగా దోచుకోవడంతోపాటు అక్కడి ప్రజలు అభివృద్ధికి దూరంగా ఉంచారని విమర్శించింది. అసంతృప్తికి లోనైన జనం తిరుగుబాటు ప్రారంభించారని పేర్కొంది. పీఓకేలో సామాన్య ప్రజలపై పాక్ సైన్యం దాడులకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు స్పష్టంచేసింది. పీఓకేను పాక్ సర్కార్ బలవంతంగా, చట్టవిరుద్ధంగా ఆక్రమించుకుందని మండిపడింది. పాక్ సైనిక బలగాల దాడుల్లో సామాన్యులు బలైపోతున్నారని, ఇప్పటికే ఎంతోమంది గాయపడ్డారని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం ఆందోళన వ్యక్తంచేశారు. అక్కడ మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, దీనిపై అంతర్జాతీయ సమాజం స్పందించాలని కోరారు. పీఓకేలో హింసాకాండ, అమానవీయ ఘటనలకు పాక్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని తేల్చిచెప్పారు. మరోవైపు పీఓకేలో ఘర్షణలకు పొరుగు దేశమే కారణమని పాకిస్తాన్ మంత్రి అహసాన్ ఇక్బాల్ పరోక్షంగా భారత్‌ను నిందించారు. పొరుగుదేశం విసురుతున్న వలలో చిక్కుకోవద్దని, శాంతికి కట్టుబడి ఉండాలని ఆందోళనకారులకు సూచించారు. ఇదిలా ఉండగా, పీఓకేలో గత 29న ఘర్షణలు మొదలైన సంగతి తెలిసిందే. భద్రతా బలగాల కాల్పుల్లో ఇప్పటిదాకా 12 మంది మరణించారు. 150 మందికిపైగా గాయపడ్డారు.

చెవ్రాన్ రిఫైనరీలో ఎగసిపడ్డ మంటలు

లాస్‌ఏంజెలెస్: అమెరికాలోని లాస్‌ఏంజెలెస్ నగరానికి సమీపంలో ఉన్న చెవ్రాన్ చమురు శుద్ధి కర్మాగారంలో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. రిఫైనరీ నుంచి ఆకాశంలోకి వ్యాపిస్తున్న మంటలు మైళ్ల దూరం మేర కనిపించాయి. శుక్రవారం ఉదయానికల్లా మంటలను అదుపు చేసినట్లు ఎల్ సిగుండో ప్రాంత అధికారులు తెలిపారు. ప్రజలు ఎటువంటి ఆందోళనలకు గురి కావాల్సిన పని లేదన్నారు. మంటలు పూర్తిగా ఆగలేదని, ముందు జాగ్రత్తగా అటుగా వెళ్లే రహదారుల్ని మూసివేశామన్నారు. అగ్ని ప్రమాదం కారణంగా కర్మాగారంలోని సిబ్బందికి ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదని, గాలి కాలుష్య సమస్యలు కూడా తలెత్తలేదని చెవ్రాన్ కంపెనీ తెలిపింది. భద్రతా ప్రాంతానికి దూరంగా ప్రమాదం జరిగిందని చెప్పిన ఆ కంపెనీ..కారణాలను మాత్రం వెల్లడించలేదు. లాస్‌ఏంజెలెస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈ కర్మాగారం కేవలం 1.6 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. అయితే, ఎయిర్‌పోర్టులో రాకపోకలపై ఘటన ప్రభావం లేదని అధికారులు చెప్పారు. 1911లో మొదలైన ఈ రిఫైనరీలో రోజుకు 2.90 లక్షల బ్యారెళ్ల చొప్పున ముడి చమురు శుద్ధి అవుతుంది.

కాంగ్రెస్ ఖాదీని మర్చిపోయింది

- ఖాదీ పునర్వైభవానికి ప్రధాని మోదీ కృషి
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు



రోహతక్: దేశానికి స్వాతంత్య్రం వచ్చాక కాంగ్రెస్ పార్టీ ఖాదీ విషయమే మర్చిపోయిందని హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. ఖాదీని ప్రోత్సహించేందుకు ఆ పార్టీ చేసిందేమీ లేదన్నారు. ఖాదీ అంటే కేవలం డ్రెస్ మాత్రమే కాదు, మన స్వదేశీ, ఆత్మనిర్భరతకు చిహ్నాలని మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన హరియాణాలోని రోహతక్‌లో జరిగిన పలు కార్యక్రమాల్లో ప్రసంగించారు. 'స్వాతంత్య్రం వచ్చాక చేసిన దానికంటే ఖాదీ అభివృద్ధికి గత 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం ఎంతో చేసిందన్నారు. అప్పట్లోనే ఖాదీకి ప్రోత్సాహం ఇచ్చినట్లయితే మన దేశంలో నిరుద్యోగ సమస్య ఉండేదే కాదని చెప్పారు. స్వాతంత్య్ర సంగ్రామం సమయంలో మహాత్మాగాంధీ పేదరికాన్ని పారదోలేందుకు, దేశం స్వయం సమృద్ధం సాధించేందుకు, స్వదేశీ భావనను పెంచేందుకు ఖాదీని ఆయుధంగా వాడుకున్నారని గుర్తు చేశారు. మహాత్మాగాంధీ ఇచ్చిన ప్రోత్సాహంతో దేశంలో లక్షలాదిమంది నేతగాళ్ల జీవితాల్లో ఎంతో మార్పు వచ్చిందని, ఆదేసమయంలో ఆయన ఆధ్వర్యంలో ఉద్యమం బలోపేతమైందని అమిత్ షా పేర్కొన్నారు. కాంగ్రెస్ మర్చిపోయిన ఖాదీకి తిరిగి వైభవం సాధించేందుకు గుజరాత్‌కు సీఎంగా ఉన్న సమయం నుంచే నరేంద్ర మోదీ కృషి మొదలైందన్నారు. ఫలితంగా 2014–15లో రూ.33 వేల కోట్లుగా ఉన్న ఖాదీ, గ్రామ పరిశ్రమ కమిషన్ (కేవీఐసీ)ల టర్నోవర్ నేడు రూ.1.70 లక్షల కోట్లకు చేరుకుందన్నారు.

11 ఏళ్లలో 70 శాతం పురోగతి

డైరీ రంగం గత 11 ఏళ్లలో ప్రధాని మోదీ పాలనలో 70 శాతం మేర పురోగతి సాధించిందని అమిత్ షా వివరించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగంగా నిలిచిందని చెప్పారు. పాల ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న 6.60 కోట్ల లీటర్ల నుంచి 2028–29 నాటి 10 కోట్ల లీటర్లకు పెంచాలని ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు. అదేవిధంగా, 2029 కల్లా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రతి గ్రామ పంచాయతీలోనూ సహకార సంఘాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. గత ఏడాదిలోనే 33 వేల సహకార సంఘాలు కొత్తగా నమోదయ్యాయని తెలిపారు.

జుబీన్ మృతిపై జ్యుడీషియల్ కమిటీ

ప్రత్యేక విచారణకు ఏర్పాటు చేసిన అసోం ప్రభుత్వం

గౌహతి: గాయకుడు జుబీన్ గార్గ్ మృతిపై ప్రత్యేకంగా విచారణ జరిపేందుకు జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ ప్రకటించారు. గౌహతి హైకోర్టు జడ్జి జస్టిస్ సౌమిత్ర సైకియా సారథ్యంలో కమిషన్ ఏర్పాటవుతుందని ఫేస్‌బుక్‌లో తెలిపారు. ఈ మేరకు గౌహతి ప్రధాన న్యాయమూర్తి ఆమోదం తెలిపారన్నారు. జుబీన్ గార్గ్ మృతికి దారి తీసిన పరిస్థితులు, కారణాలకు సంబంధించిన సమాచారాన్ని ఎవరైనా ఈ కమిషన్‌కు అందివ్వవచ్చని సీఎం అన్నారు. జుబీన్ వెంట ఉన్న అసోం అసోసియేషన్ ఆఫ్ సింగపూర్ సభ్యులు ముందుకు వచ్చి సహకరించాలన్నారు. లేకుంటే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సింగపూర్‌లో సముద్రంలో ఈత కొడుతూ సెప్టెంబర్ 19వ తేదీన జుబీన్ చనిపోవడం తెల్సిందే. ఆయన అక్కడ జరిగే నార్త్ ఈస్ట్ ఫెస్టివల్‌కు హాజరయ్యేందుకు వెళ్లారు. ఫెస్టివల్ నిర్వాహకుడు శ్యాంకను మహంతా, జుబీన్ మేనేజర్ సిద్ధార్థ శర్మ, రెండు రోజుల క్రితమే అరెస్ట్ చేశారు. శుక్రవారం ఆ కార్యక్రమ బ్యాండ్ సభ్యులైన శేఖర్ జ్యోతి గోస్వామి, అమృత్‌ప్రభ మహంతాలను అదుపులోకి తీసుకున్నారు. ఈత కొడుతుండగా జుబీన్‌కు ప్రమాదం జరిగిన సమయంలో అక్కడే పడవలో వీరిద్దరూ ఉన్నట్లు చెబుతున్నారు. కాగా, కోర్టు వీరిని 14 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది. జుబీన్ హత్యపై 10 మందిపై కేసులు నమోదు కాగా ఇప్పటి వరకు నలుగురిని అరెస్ట్ చేసినట్లయింది. జుబీన్ గార్గ్ మృతిపై నమోదైన 60కి పైగా కేసులను సీఐడీ విచారిస్తోంది.

సింగపూర్ ఆస్పత్రిలో చేపట్టిన జుబీన్ గార్గ్ పోస్టుమార్టం నివేదికను ఆయన భార్య గరిమాకు అందించామని, గౌహతి మెడికల్ కాలేజీ ఆస్పత్రి చేపట్టిన పోస్టుమార్టం నివేదిక శనివారం అందాక ఆమెకే ఇస్తామని, వాటిని బహిర్గతం చేయాలా వద్దా అనేది ఆమె ఇష్టమన్నారు.

శ్యాంకను మహంతా కుంభకోణంపై ఈడీ, ఐడీ దృష్టిసారించాయి. మహంతా పలు ఆర్థిక నేరాలకు పాల్పడ్డాడని, బినామీ పేర్లను ఆస్తులను కూడబెట్టారంటూ వచ్చిన ఆరోపణలను ఈడీ, ఐడీ పరిశీలిస్తున్నాయి. జుబీన్ గార్గ్ మరణానికి కారణంగా ఆరోపణలున్న మహంతాను ఇప్పటికే అసోం సీఐడీ పోలీసులు అరెస్ట్ చేయడం తెల్సిందే. ఈ సందర్భంగా పోలీసులు శ్యాంకను మహంతా గత 20 ఏళ్లుగా పాల్పడుతున్న ఆర్థిక అవకతవకలను గుర్తించారు. వీటి వివరాలను ఐడీ, ఈడీ అధికారులు ఇప్పటికే సీఐడీ కార్యాలయానికి వెళ్లి తెల్సుకున్నారు.

ఫ్లోరిడా తీరంలో దొరికిన వెయ్యికి పైగా బంగారు నాణేలు



ఫ్లోరిడా: వందల ఏళ్ల క్రితం అట్లాంటిక్ సముద్రంలో మునిగిపోయిన నౌకలోని సంపద తాజాగా వెలుగు చూసింది. అమెరికాలోని ఫ్లోరిడా తీరానికి నిధుల తీరంగా పేరుంది. వందల ఏళ్ల నాటి అపూర్వ సంపద ఇక్కడ బయటపడుతుండటంతో ఈ పేరు నిలిచిపోయింది. తాజాగా, మళ్లీ ఫ్లోరిడా తీరం తన పేరును సార్థకం చేసుకుంది. స్పానిష్ వలస పాలన కాలం నాటి వెయ్యికి పైగా బంగారు వెండి నాణేలు దొరికాయి. ఇవన్నీ బొలీవియా, మెక్సికో, పెరూల్లో ముద్రితమైనవే కావడం గమనార్హం. వీటి విలువ రూ.8.50 కోట్లు పైమాటేనంటున్నారు. 1715 ఫ్లీట్ సొసైటీ సంస్థ తాజాగా ఈ విషయం ప్రకటించింది. 1715 జూలై 31వ తేదీన స్పెయిన్ వైపు వెళ్తున్న నౌకలు తీవ్ర తుపాను తాకిడికి గురై నీటమునిగాయి. అప్పుడు సముద్ర గర్భంలోకి చేరిన సంపదలో కొంతభాగాన్ని ఇప్పుడు తాము వెలికి తీశామని ఈ కంపెనీ సగర్వంగా తెలిపింది. గత కొన్నేళ్లుగా అనేక మంది ఈ సొత్తును గుర్తించి, వెలికి తీశారంది. అయితే, ఇక్కడ ఇంత పెద్ద మొత్తంలో బయటకు తీయడం ఇదే మొదటిసారని పేర్కొంది. ఫ్లోరిడా చట్టాల ప్రకారం..ఇలాంటి సొత్తు రాష్ట్ర ప్రభుత్వానికే చెందుతుంది. ఒక వేళ ఔత్సాహికులు బయటకు తీసిన పక్షంలో ప్రభుత్వానికి ఆ నిధిలో 20 శాతం వరకు దక్కుతుంది.

వాంగ్‌చుక్ నిర్బంధం అక్రమం

సుప్రీంకోర్టులో వాంగ్‌చుక్ భార్య గీతాంజలి అంగ్మో పిటిషన్



న్యూఢిల్లీ: ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ)కింద నిర్బంధించడాన్ని సవాల్ చేస్తూ ఆయన భార్య గీతాంజలి అంగ్మో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన భర్తను నిర్బంధించడం రాజ్యాంగ వ్యతిరేకం, ఏకపక్షం, చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా డిమాండ్‌తో ఆయన దీక్షకు పూనుకోవడం, కేంద్ర పాలిత ప్రాంతంలో నిరసనలు హింసాత్మక రూపం దాల్చి నలుగురు చనిపోగా 90 మంది వరకు గాయపడటం తెల్సిందే. ఈ పరిణామాల నేపథ్యంలో అధికారులు ఆయన్ను సెప్టెంబర్ 26న అదుపులోకి తీసుకుని, రాజస్తాన్‌లోని జోథ్‌పూర్ జైలుకు తరలించారు. అంగ్మో తరఫున సీనియర్ లాయర్ వివేక్ తన్ఖా హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. వెంటనే విచారణ చేపట్టి, వాంగ్‌చుక్‌ను సుప్రీంకోర్టులో హాజరు పరచాలంటూ లద్దాఖ్ యంత్రాంగాన్ని ఆదేశించాలన్నారు. ఆయన్ను నేరుగా, ఫోన్ ద్వారా కలిసి మాట్లాడేందుకు తక్షణమే అవకాశం కల్పించాలన్నారు. కేంద్ర హోం శాఖ, లద్దాఖ్ యంత్రాంగం, లేహ్ డిప్యూటీ కమిషనర్, జోథ్‌పూర్ జైలు సూపరిటెండెంట్‌లను ఇందులో ప్రతివాదులుగా చేరారు. 'అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన ఆవిష్కర్త, పర్యావరణవేత్త, సామాజిక సంస్కర్త అయిన వాంగ్‌చుక్, లద్దాఖ్‌లో పర్యావరణ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం గాంధేయ విధానంలో, శాంతియుతంగా సాగే ఆందోళనలను మాత్రమే సమర్థించారు'అని అందులో పేర్కొన్నారు. దీర్ఘకాలం పాటు నిరాహార దీక్ష సాగించిన వాంగ్‌చుక్ తిరిగి కోలుకుంటున్న సమయంలో పోలీసులు అరెస్ట్ చేయడం, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనన్నారు. అత్యవసరమైన వస్తువులు, మందులు తీసుకోనివ్వకుండా కుటుంబసభ్యులతో మాట్లాడనీయకుండా హడావుడిగా ఆయన్ను జోథ్‌పూర్ సెంట్రల్ జైలుకు తరలించారని అందులో ఆరోపించారు. ఇప్పటి వరకు ఆ నిర్బంధానికి గతల కారణాలను కుటుంబసభ్యులకు అధికారులు వెల్లడించలేదని పిటిషన్‌లో తెలిపారు. తనను దాదాపుగా గృహ నిర్బంధంలో ఉంచారని అంగ్మో తెలిపారు. వాంగ్‌చుక్ స్థాపించిన హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్, లద్దాఖ్ (హెచ్ఐఏఎల్) విద్యార్థులను, సిబ్బందిని అధికారులు విచారణ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. వాంగ్‌చుక్‌కు విదేశీ సంస్థలతో సంబంధాలను అంటగడుతూ దుష్ప్రచారం సాగిస్తున్నారన్నారు. నిర్బంధానికి సంబంధించిన ఉత్తర్వులను బయటపెట్టాలని, అరెస్ట్‌కు కారణాలను తెలిపే అన్ని రికార్డులను బహిర్గతం చేయాలని కోరారు. వాంగ్‌చుక్‌కు వెంటనే డాక్టర్‌తో వైద్య పరీక్షలు చేయించి, ఆరోగ్య నివేదికలను బయటపెట్టాలన్నారు.

భారత్‌ను ఆంగ్లేయులు పాలించలేదు

ఎలాన్ మస్క్ షేర్ చేసిన 'ఎక్స్' పోస్ట్‌పై తీవ్ర విమర్శలు

వాషింగ్టన్: భారతదేశాన్ని ఆంగ్లేయులు పాలించలేదని, వలసపాలన అంటూ ఏదీ లేదన్న శ్వేత జాత్యహంకార వాది స్టిఫాన్ మోలిన్యూక్స్ పోస్ట్‌ను షేర్ చేసిన టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్‌పై విమర్శల జడివాన కురిసింది. బ్రిటిష్ వలసవాదాన్ని తిరస్కరించడం ద్వారా చరిత్రను మార్చేందుకు, వలస పాలన దుర్మార్గాలను చెరిపి వేసేందుకు ప్రయత్నించారంటూ మస్క్‌పై భారతీయులు సహా పలువురు విమర్శించారు. వలసవాదంతో భారత్‌కు వివిధ రకాలుగా వాటిల్లిన అపారనష్టాన్ని ఎత్తి చూపారు. వీటన్నిటినీ కాదనడం నాజీల మారణహోమాన్ని సమర్థించడమేనన్నారు. కెనడాకు చెందిన శ్వేత జాత్యహంకార వాది స్టెఫాన్ మిలిన్యూక్స్ కుట్ర సిద్ధాంతాలను ప్రచారం చేయడంలో దిట్ట. ఇతడి యూట్యూబ్ చానెల్‌పై యూట్యూబ్ 2020లో నిషేధం విధించింది. ఇటీవల ఇతడు 'ఎక్స్'లో..'భారతీయులు ఇంగ్లండ్‌లో అడుగు పెట్టి ఆంగ్లేయులుగా మారితే. భారతదేశంలో అడుగు పెట్టిన ఆంగ్లేయులు భారతీయులయ్యారు. అందువల్ల ఆంగ్లేయులు భారతదేశాన్ని పాలించలేదు. వలస పాలన అనేదే లేదు'అని పేర్కొన్నాడు. ఈ పోస్ట్‌కు 1.80 కోట్ల వ్యూస్ రాగా ఇదే పోస్ట్‌ను మస్క్ రీపోస్ట్ చేస్తే మరో 1.67 కోట్ల వ్యూస్ వచ్చాయి. గతంలో ఇతడే శ్వేత జాతీయులతో పోలిస్తే నల్ల జాతీయులు, శ్వేత జాతీయులు కానివారు మేధాశక్తిలో తక్కువంటూ వ్యాఖ్యానించాడు. ఇతడి ట్వీట్లను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమారుడు జూనియర్ ట్రంప్ తరచుగా రీట్వీట్ చేస్తుంటారు. ఎక్స్‌లో 4.28 లక్షల ఫాలోయర్లున్న మోలిన్యూక్స్‌ను పేమెంట్స్ వేదిక పేపాల్ కూడా 2019లో నిషేధించడం గమనార్హం. '2.27 కోట్ల ఫాలోయర్లను కలిగిన వ్యక్తి ఇటువంటి తప్పుదారి పట్టించే, ఉద్దేశపూర్వకంగా చేసే ప్రకటనలను ప్రచారం చేసిన వారిని వదలకూడదు'అని మస్క్‌పై యూకేకు చెందిన రచయిత, రాయల్ ఆసియాటిక్ సొసైటీ సభ్యుడు సతీష్ కె శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోలిన్యూక్స్ వ్యాఖ్యలు భారతీయులను అవమానించేలా ఉన్నాయని మరొకరు ఎక్స్‌లో పేర్కొన్నారు. భారతదేశాన్ని 200 ఏళ్లపాటు యథేచ్ఛగా దోచుకుని కూడా వలసపాలను తిరస్కరించడం వలసవాద ఆధిపత్యం ధోరణికి నిదర్శనమన్నారు.

తుగ్లక్‌పై తిరుగుబాటు చేసిన బహమనీషా సర్దార్?

హసన్ గంగూ 1350లో కౌలాస్ దుర్గంపై దండెత్తాడు. పానగల్లు కోటను ఆక్రమించి, అమరావతి దాకా తన రాజ్యాన్ని విస్తరించాడు. నీలగిరి కోటను కూడా ఆక్రమించాడు. ఇతడు 1356లో రెండోసారి దండెత్తి భువనగిరి దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నాడు. హసన్ గంగూ తర్వాత ఒకటో మహమ్మద్‌షా 1364-65లో గోల్కొండ దుర్గం సహా పరిసర ప్రాంతాలను ఆక్రమించాడు. ఒకటో మహమ్మద్‌షా భారతదేశంలో మొదటిసారిగా యుద్ధ రంగంలో గన్‌పౌడర్ ఉపయోగించాడు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ



కాకతీయానంతర యుగం

బహమనీ సుల్తాన్లు

కాకతీయ రాజ్య పతనం తర్వాత దక్షిణాపథమంతా ఢిల్లీ సుల్తాన్ మహ్మద్ బిన్ తుగ్లక్ ఆధీనంలోకి వచ్చింది. తర్వాత కొద్ది కాలానికే ఆంధ్ర దేశంలో స్వతంత్ర రాజ్యాలు ఆవిర్భవించాయి. తుగ్లక్ మీద తిరుగుబాటు చేసిన అనేక మంది సర్దారుల్లో హసన్ గంగూ అబ్దుల్ ముజఫర్ ఒకడు. తెలంగాణకు పశ్చిమోత్తర ప్రాంతంలో బహమనీ షా వంశీయుడైన హసన్‌గంగూ ఢిల్లీ చక్రవర్తి మహమ్మద్ బిన్ తుగ్లక్‌పై తిరుగుబాటు చేశాడు. 1341లో దౌలతాబాద్ రాజధానిగా బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. ఆ సమయంలో ఉత్తర తెలంగాణను ముసునూరి వంశానికి చెందిన కాపయ నాయకుడు పాలిస్తున్నాడు. తిరుగుబాటు సమయంలో కాపయ హసన్ గంగూకు సహాయపడ్డాడు. తర్వాతి కాలంలో ఇది నష్టానికి దారి తీసింది. బహమనీ రాజ్యం సుదీర్ఘ కాలంపాటు తెలంగాణకు పక్కలో బల్లెంలా తయారైంది. బహమనీలు అనేకసార్లు తెలంగాణపై దండయాత్ర చేశారు. 1350లో హసన్ గంగూ కౌలాస్(నిజామాబాద్ జిల్లా) దుర్గాన్ని ఆక్రమించాడు. పానగల్లు కోటను స్వాధీనం చేసుకొని, అమరావతి దాకా తన రాజ్యాన్ని విస్తరించాడు. నీలగిరి కోటను కూడా ఆక్రమించాడు. అప్పటి నుంచే నీలగిరి నల్లగొండగా మారింది. ఇరు రాజ్యాలకు గోల్కొండ సరిహద్దుగా ఉండేలా కాపయ సంధి చేసుకున్నాడు. హసన్ గంగూ తుంగభద్ర వరకు పురోగమించి విజయనగర రాజ్యభాగాలను, పశ్చిమాన కొంకణ్ రాజ్యాన్ని ఆక్రమించాడు. 1356లో రెండోసారి దండెత్తి భువనగిరి దుర్గాన్ని ఆక్రమించాడు. హసన్ గంగూ తన రాజధానిని దౌలతాబాద్ నుంచి గుల్బర్గాకు మార్చాడు. రాజ్యాన్ని గుల్బర్గా, దౌలతాబాద్, బీదర్, బీరార్ అనే నాలుగు రాష్ట్రాలుగా విభజించాడు. ఇతడి రాజ్యానికి ఉత్తరాన మాండు, దక్షిణాన రాయచూర్, పశ్చిమాన గోవా, తూర్పున భువనగిరి (కొంతకాలం) సరిహద్దులుగా ఉండేవి.

బహమనీ పాలకులు..

హసన్ గంగూ తర్వాత ఒకటో మహమ్మద్‌షా (1358-75), ముజాహిద్‌షా (1375-78), రెండో మహమ్మద్ షా (1378-97), ఫిరోజ్‌షా (1397-1422), అహ్మద్‌షా (1422-36), రెండో అల్లావుద్దీన్ అహ్మద్‌షా (1436-58), హుమాయూన్ (1458-61), నిజాంషా (1461-63), మూడో మహమ్మద్‌షా (1463-82), మహమూద్‌షా (1482-1518) బహమనీ రాజ్యాన్ని పాలించారు.

హసన్ గంగూ తర్వాత కూడా బహమనీలు అనేక సార్లు తెలంగాణ సహా ఇతర తెలుగు ప్రాంతాలపై దండెత్తారు. ఒకటో మహమ్మద్‌షా 1364-65లో గోల్కొండ దుర్గం సహా పరిసర ప్రాంతాలను ఆక్రమించాడు. ఇతడు భారతదేశంలోనే మొదటిసారిగా యుద్ధ రంగంలో గన్‌పౌడర్ ఉపయోగించాడు.

పద్మనాయకులతో మైత్రి

1366లో పద్మనాయక వంశానికి చెందిన రేచర్ల అనపోత నాయకుడి చేతిలో కాపయ మరణించాడు. తెలంగాణ పద్మనాయకుల వశమైంది. వీరి కాలంలో బహమనీ సుల్తాన్లు కొంతకాలం మిత్రులుగా మరి కొంతకాలం శత్రువులుగా మెలిగారు. రెండో హరిహరరాయలు పద్మనాయక రాజ్యంపై రెండో బుక్కరాయలను దండయాత్రకు పంపాడు. ఈ సమయంలో బహమనీలు పద్మనాయకులకు అండగా నిలిచారు. విజయనగర రాజుల ఆధీనంలోని కొత్తకొండ (మహబూబ్‌నగర్ జిల్లా)ను పద్మనాయకులు స్వాధీనం చేసుకోవడానికి తోడ్పడ్డారు. బుక్కరాయలు మరోసారి ఓరుగల్లు, మెదక్, పానుగల్లును ముట్టడించాడు. ఈ సమయంలోనూ బహమనీలు పద్మనాయకులకు తోడుగా నిలిచారు.

సామంతులుగా పద్మనాయకులు

ఫిరోజ్‌షా 1417-19లో పానగల్లును ముట్టడించాడు. విజయనగర రాజుల సహాయంతో పద్మనాయకులు అతణ్ని ఓడించారు. దీంతో విజయనగర, పద్మనాయక రాజ్యాలు సన్నిహితమయ్యాయి. ఇదే సమయంలో బహమనీలతో పద్మనాయకుల వైరం తీవ్రమైంది. ఫలితంగా తర్వాతి కాలంలో పద్మనాయకుల రాజ్యానికి నష్టం వాటిల్లింది. అహ్మద్‌షా రెండో దేవరాయలతో యుద్ధం చేశాడు. ఈ సమయంలో రేచర్ల మాదానాయుడు విజయనగర పక్షం వహించాడు. ఇది బహమనీ సుల్తాన్ల ఆగ్రహానికి కారణమైంది. 1425లో బహమనీలు ఓరుగల్లు సహా అనేక దుర్గాలను ఆక్రమించారు. దీంతో పద్మనాయక రాజ్యం విచ్ఛిన్నం కావడం ప్రారంభమైంది. అహ్మద్‌షా 1432లో తెలంగాణ మీద దండయాత్ర చేసి రాయగిరి, భువనగిరి దుర్గాలను ఆక్రమించాడు. తెలంగాణలో అధిక భాగం బహమనీ రాజ్యంలో కలిసిపోయింది. పద్మనాయకులు కొంతకాలం సామంతులుగా రాజ్యాన్ని పాలించారు. అహ్మద్‌షా తన రాజధానిని గుల్బర్గా నుంచి బీదర్‌కు మార్చాడు. అహ్మద్‌షా గుజరాత్, మాళవ ప్రాంతాలపై దండయాత్ర చేశాడు. ఇదే అదనుగా పద్మనాయకులు కోల్పోయిన తమ ప్రాంతాలను తిరిగి ఆక్రమించారు. కానీ ఆ యుద్ధాలు ముగిశాక అహ్మద్‌షా తెలంగాణపై దండెత్తాడు. ఓరుగల్లు, రామగిరి (కరీంనగర్) మొదలైన దుర్గాలన్నింటినీ స్వాధీనం చేసుకున్నాడు. 1435 నాటికి (దేవరకొండ మినహా) రాచకొండ సహా తెలంగాణలో అధిక భాగం తిరిగి బహమనీల వశమైంది. బహమనీ రాకుమారుడైన దానూర్‌ఖాన్ రాచకొండ రాజప్రతినిధి అయ్యాడు.

1444లో సింగమనాయుడు, కపిలేశ్వర గజపతి సాయంతో తన రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. సుల్తాన్ తమ్ముడైన మహమూద్ ఖాన్ రాచకొండలో సామంత రాజయ్యాడు.

హుమాయూన్ రాజైన తర్వాత బహమనీ రాజ్యంలో తిరుగుబాట్లు జరిగాయి. వీటిని ఆసరా చేసుకొని తెలంగాణను తిరిగి జయించడానికి పద్మనాయకులు ప్రయత్నించారు. జలాల్‌ఖాన్, సికిందర్ బాలకొండలో స్వతంత్రం ప్రకటించుకున్నారు. వీరు పద్మనాయకులతో స్నేహం చేశారు. హుమాయూన్ తిరుగుబాట్లను అణచివేసి, దేవరకొండను ముట్టడించాడు. పద్మనాయకులు 1461లో బహమనీ సైన్యాలను పారదోలి రాచకొండ, భువనగిరి, ఓరుగల్లు మొదలైన దుర్గాలను తిరిగి పొందగలిగారు. పద్మనాయకులకు కపిలేశ్వర గజపతి కుమారుడైన హంవీరుడు సహాయం చేశాడు. తెలంగాణలో బహమనీలకు స్థానం లేకుండా చేశారు. హుమాయూన్‌షా తర్వాత నిజాంషా కాలంలో బహమనీలు తెలంగాణను తిరిగి ఆక్రమించే ప్రయత్నం చేశారు. కపిలేశ్వరుని సాయంతో పద్మనాయకులు వారిని ప్రతిఘటించారు.

కొంత కాలానికి గజపతుల్లో అంతఃకలహాలు తలెత్తాయి. ఇదే అదనుగా తెలంగాణను జయించడానికి మూడో మహమ్మద్‌షా తన సేనాని అయిన నిజాం ఉల్‌ముల్క్ ఇబ్రహీంను పంపాడు. 1475 నాటికి తెలంగాణ మొత్తం బహమనీల వశమైంది. పద్మనాయక రాజ్యం అంతరించింది. అనంతరం బహమనీలు తెలుగు దేశాన్నంతా జయించి రెండు భాగాలుగా విభజించారు.

తెలంగాణకు ఓరుగల్లు రాజధాని కాగా, రెండో భాగానికి రాజధాని రాజమహేంద్రవరం. మూడో మహమ్మద్‌షా 1481లో కంచి మీద దాడి చేసే నాటికి రాజమహేంద్రవరం, తెలంగాణ తరఫ్‌లను బ్రహీ నిజాం ఉల్‌ముల్క్, ఆజంఖాన్‌ల ఆధీనంలో ఉంచాడు.

బహమనీ రాజ్య విచ్ఛిన్నం

మూడో మహమ్మద్‌షా 1482లో మరణించడంతో బహమనీ రాజ్యం విచ్ఛిన్నం కావడం మొదలైంది. ఇతడి తర్వాత రాజైన మహమూద్ షా కాలంలో ఓరుగల్లు పాలకుడైన ఆదిల్‌ఖాన్ మరణించాడు. రాజమహేంద్ర పాలకుడైన కివాన్ ఉల్ ముల్క్ తన రాజ్యాన్ని కోల్పోయి ఓరుగల్లును ఆక్రమించాడు. సుల్తాన్ అతణ్ని పారదోలాడు. సుల్తాన్ నలుగురు కుమారుల్లో చివరి వాడైన కలీముల్లా 1537లో మరణించాడు. దీంతో బహమనీ వంశం అంతరించింది. 1500 ప్రాంతంలో బహమనీ సామ్రాజ్యం నుంచి అయిదు స్వతంత్ర రాజ్యాలు ఆవిర్భవించాయి.

రాజ్యాలు	-	స్థాపకులు
అహ్మద్‌నగర్	-	నిజాం ఉల్ ముల్క్
బీజాపూర్	-	ఆదిల్ షా
గోల్కొండ	-	కుతుబ్ ఉల్ ముల్క్
బీరారు	-	ఇమాదుల్ ముల్క్
బీదర్	-	బరీద్ ఇమామాలిక్

వీటిలో గోల్కొండ రాజ్యం తెలంగాణ భూభాగంలో ఏర్పడింది.

పద్మనాయకుల పాలనా విశేషాలు

పాలనా విధానం

పద్మనాయకులు పాలనలో కాకతీయులను అనుసరించారు. పాలనా వ్యవహారాల్లో ప్రధానులు, సేనానులు, పురోహితులు రాజుకు సలహా ఇచ్చేవారు. పద్మనాయక రాజ్యంలో రాచకొండ, దేవరకొండ, అనుముల, పాడిచేడు, ఆమనగల్లు, అనంతగిరి, ఉర్లుకొండ, ఉంద్రుగొండ, స్తంభగిరి, ఓరుగల్లు, భువనగిరి, జల్లపల్లి, పానగల్లు మొదలైన దుర్గాలు ఉండేవి. వీటికి దుర్గాధ్యక్షులు ఉండేవారు. వీరు సైన్యాన్ని పోషించి పద్మనాయకులకు యుద్ధాల్లో తోడ్పడేవారు. రాజ్య విభాగాల్లో ముఖ్యమైంది 'సీమ'. గ్రామం రాజ్యానికి పునాది. గ్రామాల్లో పన్నెండు రకాల వృత్తి పనివాళ్లు ఉండేవారు.

పన్నులు: రాజ్యానికి భూమి మీద వచ్చే పన్నులే ప్రధాన ఆదాయం. పంటలో 1/6వ వంతు శిస్తు రూపంలో వసూలు చేసేవారు. పద్మనాయకులు పొరుగు రాజ్యాలైన విజయనగర, రెడ్డి, గజపతులు, బహమనీ సుల్తాన్లతో నిరంతరం యుద్ధాలు చేయడం వల్ల ప్రజల మీద పన్నుల భారం ఎక్కువగా పడింది.

ఆర్థిక పరిస్థితులు, వ్యవసాయం

పద్మనాయకులు కాకతీయుల వ్యవసాయ విధానాన్నే అనుసరించారు. అనపోత సముద్రం, రాయసముద్రం, నాగ సముద్రం, పర్వతరావు తటాకం, వేదగిరి తటాకం మొదలైన తటాకాలను తవ్వించారు. ఏతాము, రాట్నాల ద్వారా కూడా పొలాలకు నీటి వసతి కల్పించేవారు. 'కాలమెడసేసిన / ఏతము లెత్తి కాల్వలున్ పాయలు, కోళ్ల, నూతులను / బావులు రాట్నములున్ బలార్థమై' అన్న కొరవి గోపరాజు పద్యం తరీ (పొలం) సేద్యంలో వచ్చిన కొత్త మార్పును తెలుపుతుంది. గ్రావిటీ పద్ధతిలో నీరందించే చెరువులతోపాటు నూతన నీటి పారుదల పద్ధతులు వచ్చినట్లు తెలుస్తోంది. కరవు సమయాల్లో గ్రావిటీ పద్ధతిలో నీరందని పొలాలకు కూడా నీరందించే కొత్త పద్ధతులు, సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. అవి.. ఏతాము, పర్రైకాల్వలు, కోల్ (కోళ్ల) బావులు (వాగుల నుంచి వచ్చే నీళ్లను గుంతలకు మళ్లించి వాటి నుంచి మోట ద్వారా తరలించే పద్ధతి), నూతులు, రాట్నాలు, మోటలు. నాటి ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. పోతన కూడా వ్యవసాయం చేయడమే దీనికి నిదర్శనం. వరి, జొన్న, సజ్జ, చెరకు, నువ్వులు, పత్తి మొదలైనవి నాటి ముఖ్య పంటలు, అరటి, ద్రాక్ష తోటలు కూడా ఉండేవి.

పరిశ్రమలు

నాటి పరిశ్రమల్లో నేత పరిశ్రమదే అగ్రస్థానం. వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా రంగుల పరిశ్రమ ఉండేది. 'సింహాసన ద్వాత్రింశిక' అనే గ్రంథంలో పలు రకాల పట్టువస్త్రాల ప్రస్తావన కనిపిస్తుంది. ఓరుగల్లు, దేవరకొండ, గోల్కొండ ప్రాంతాలు వస్త్ర పరిశ్రమ కేంద్రాలుగా ఉండేవి. నిర్మల్ కత్తులు విదేశాల్లో కూడా ప్రసిద్ధి చెందాయి.

వ్యాపారం

ఈ కాలంలో ఉక్కు, గాజు, అద్దాలు, కాగితం వాడుకలోకి వచ్చాయి. వైశ్య, తెలగ, బలిజలు వ్యాపారం చేసేవారు. కృష్ణానది పక్కన ఉన్న వాడపల్లి పద్మనాయకుల వ్యాపార కేంద్రం.

సాంఘిక పరిస్థితులు

వర్ణాశ్రమ ధర్మం స్థూలంగా అమల్లో ఉండేది. బ్రాహ్మణుల్లో వైదిక, నియోగి భేదాలు ఏర్పడ్డాయి. వెలమ, రెడ్డి కులాలకు చెందిన కొందరు వ్యవసాయాన్ని వదిలిపెట్టి రాజకీయాల్లోకి వచ్చారు. మిగిలిన శూద్ర కులాల వారు వ్యవసాయం, వృత్తి పనులను అవలంబించారు. వైష్ణవ భక్తి ఉద్యమం వల్ల అన్ని కులాల్లో భక్తిభావం పెరిగింది. విద్యాభిలాష మొలకెత్తింది. ప్రజలు అధిక వడ్డీలు చెల్లించాల్సి వచ్చేది. నాటి పురుషులు ధోతి, అంగీ, ఉత్తరీయం, తలపాగ ధరించేవారు. స్త్రీలు రవిక, కాసెకట్టు, రంగుల చీరలు ధరించేవారు. ప్రజలు భజనలు, కోలాటాలు, వీధి నాటకాలు, కోడి పందేలు, ఓమన గుంటలాట, గచ్చకాయలాట, పుంజీతం లాంటి క్రీడలతో వినోదించేవారు. సామాన్య ప్రజలు పేదరికం కారణంగా చదువుకోలేకపోయేవారు. తెలంగాణలో ఇప్పటికీ 'సాకబోయడం' అనే ఆచారం ఉంది. ఇది పూర్వం నుంచే ఉందని సింహాసన ద్వాత్రింశిక ఆధారంగా తెలుస్తోంది. కొరవి గోపరాజు ఏకశిలా నగరాన్ని ఓరుగల్లుకు పర్యాయ పదంగా వాడటాన్ని బట్టి వరంగల్లుకే ఏకశిలానగరమనే మరో పేరు ఉందని తెలుస్తోంది. కొరవి గోపరాజు 'దివ్వెల పండుగ' అనే పదప్రయోగం చేశారు. దీన్ని బట్టి తెలంగాణలో దీపావళిని 'దివిలి పండుగ' అని కూడా పిలిచే అలవాటు ఆ కాలం నుంచే ఉందని తెలుస్తోంది. పార్శీ భాష ప్రభావం మొదలైంది. తెలుగు ప్రజల వేషధారణపై కూడా పార్శీ ప్రభావం పడింది. దూదేకుల(పింజారులు) కులం ఉనికిలోకి వచ్చింది. ముస్లింల దండయాత్రల వల్ల ఉత్తర భారతంలోని సతీసహగమనం తెలంగాణలోనూ అక్కడక్కడా కొన్ని ఉన్నత వర్గాల్లో కనిపించేది. తెలంగాణ సాంఘిక జీవితానికి ప్రతిబింబం సింహాసన ద్వాత్రింశిక. బతుకమ్మ, కోలాటం, హోళీ తదితర పండగలు ప్రాచుర్యం పొందాయి..

లిపి అనే పదం ఏ భాషలోని డిపి నుంచి పుట్టింది?

తెలుగు బోధన పద్ధతులు

మాదిరి ప్రశ్నలు

1. భాష అనే పదం ఏ ధాతువు నుంచి వచ్చింది?
1) భాస్ 2) భాష్
3) భాశ్ 4) భాష్యతి
2. భాష్యత ఇతిభాషా అంటే అర్థమేమిటి?
1) భావ వినిమయ సాధనం భాష
2) భావ గ్రహణ సాధనం భాష
3) భాషించేది భాష
4) భావ ప్రకటన చేసేది భాష
3. 'మానవులు తమ అభిప్రాయాలను ఎదుటివారికి తెలుపుతూ పరస్పరం సహకరించుకోవడానికి తోడ్పడే మౌఖిక ధ్వనుల స్వతంత్ర వ్యవస్థ భాష' అని ఎవరన్నారు?
1) హాకెట్ 2) సైమన్ పాటర్
3) ఎస్.కృష్ణస్వామి 4) రామచంద్రవర్మ
4. 'పలు భాషణ అలవాట్లతో కూడిన సంక్లిష్ట వ్యవస్థ భాష' అని ఎవరన్నారు?
1) హాకెట్ 2) రామచంద్రవర్మ
3) ఎస్.కె.వర్మ 4) రామచంద్ర శుక్లా
5. మనసులోని భావ పరంపరను ఏ పదాలు, ఏ వాక్యాలు ఎదుటివారికి అందిస్తాయో, ఆ పదాలు, ఆ వాక్యాలే భాష అని నిర్వచించింది?
1) హాకెట్ 2) సైమన్ పాటర్
3) రామచంద్ర శుక్లా
4) రామచంద్ర వర్మ
6. బుద్ధిజీవుల అనుభవాల అభివ్యక్తే భాష అని ఎవరన్నారు?
1) ఐజ్లర్ 2) రామచంద్రవర్మ
3) హాకెట్ 4) సైమన్ పాటర్
7. క్రియా పదాల నుంచి భాష పుట్టిందన్న ధాతువాదాన్ని సమర్థించిన భారతీయ భాషావేత్త?
1) కాత్యాయనుడు 2) యాస్కాచార్యుడు
3) ఋష్యశృంగుడు 4) మాక్స్‌ముల్లర్
8. ప్రకంపన వాదమని ఏ వాదాన్ని అంటారు?
1) పూ-పూ వాదం
2) యోహిహో వాదం
3) డింగ్-డాంగ్ వాదం
4) భౌవౌ వాదం
9. డింగ్-డాంగ్ వాదాన్ని ఎవరు ప్రతి పాదించారు?
1) యాస్కాచార్యుడు 2) మాక్స్‌ముల్లర్
3) చామ్‌స్కీ 4) కాత్యాయనుడు
10. ఆనందం, దుఃఖం, ఆశ్చర్యం వంటి ఉద్వేగాల ప్రకటనాభిలాషే భాషకు మూలమని చెప్పిన వాదం?
1) ప్రకంపన వాదం
2) యొహిహో వాదం
3) పూ-పూ వాదం
4) వివక్షా ప్రేరణ వాదం
11. చామ్‌స్కీ అనే హేతువాది ప్రతిపాదించిన వాదం?
1) సంపాదన వాదం 2) స్వతస్సిద్ధ వాదం
3) సాంకేతిక వాదం 4) ధాతు వాదం
12. తత్వశాస్త్రంలోని అనుభవవాదం ఆధా రంగా ప్రతిపాదించిన వాదం?
1) సంపాదన వాదం 2) సాంకేతిక వాదం
3) స్వతస్సిద్ధ వాదం 4) ధాతు వాదం
13. సంపాదన వాదాన్ని ఇలా కూడా వ్యవహరిస్తారు?
1) ప్రకృతి వాదం 2) సాంకేతిక వాదం
3) అనుభవ వాదం
4) క్రమ పరిణామ వికాస వాదం
14. 'మనిషి పుట్టుకతో భాష రాదు. శిశువు పెరిగే కొద్దీ పరిసరాలతో తాను పొందే అనుభవాల నుంచి భాషాభివృద్ధి జరుగు తుంది' అని చెప్పిన వాదం?
1) సాంకేతిక వాదం
2) సంపాదన వాదం
3) స్వతస్సిద్ధ వాదం
4) డింగ్-డాంగ్ వాదం
15. ఏ గూటి చిలుక ఆ గూటి పలుకులు పలుకుతుందనే నానుడి ఏ భాషావాదాన్ని సమర్థిస్తుంది?
1) స్వతస్సిద్ధవాదం
2) క్రమ పరిణామ వికాస వాదం
3) సాంకేతిక వాదం
4) సంపాదన వాదం
16. ఏ శాస్త్రంలోని ప్రవృత్తివాదం సంపాదన వాదాన్ని బలపరుస్తుంది?
1) తత్వశాస్త్రం 2) మనస్తత్వశాస్త్రం
3) భాషాశాస్త్రం 4) జంతుశాస్త్రం
17. ఎవరు తన ప్రయోగాల ద్వారా సంపాదన వాదాన్ని నిరూపించారు?
1) పావ్‌లోవ్ 2) మాక్స్‌ముల్లర్
3) బి.ఎఫ్.స్కిన్నర్ 4) థార్న్‌డైక్
18. 'భాష ఒక తరం నుంచి తర్వాతి తరాలకు ప్రసరిస్తుంది. అంటే సంస్కృతి వలే భాష కూడా తర్వాత తరతరాలకు సంక్రమిస్తుం ది'. ఇది భాష ఏ లక్షణం?
1) ప్రత్యేకత 2) ప్రేరణ దూరత
3) ద్వివిధ నిర్మాణం
4) సాంస్కృతిక ప్రసరణం
19. లిపి అనే పదం ఏ భాషలోని డిపి నుంచి పుట్టింది?
1) లాటిన్ 2) గ్రీకు
3) పార్శీ 4) సంస్కృతం
20. ఎక్కడ లభించిన అశోకుని శిలాశాసనం ఆధారంగా 1వ శతాబ్దం నాటికే ఆంధ్ర దేశంలో లిపి ఉన్నట్లు తెలుస్తుంది?
1) అద్దంకి 2) అమరావతి
3) ఎర్రగుడిపాడు 4) పొట్లదుర్తి
21. తెలుగు లిపి ఏ లిపికి సన్నిహితంగా ఉన్నట్లు అశోకుని శిలాశాసనం వల్ల తెలుస్తుంది?
1) వంగలక్షర లిపి 2) కన్నడ లిపి
3) బ్రాహ్మీ లిపి 4) దేవనాగరి లిపి
22. తెలుగు లిపి ఏ లిపి నుంచి ఉద్భవించిందని అంటున్నారు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

1) కన్నడ లిపి 2) మౌర్య లిపి
3) దేవనాగరి లిపి 4) దక్షిణ బ్రాహ్మీ లిపి
23. ఎవరి కాలంలో ద్రావిడ భాషకు సంబంధించిన 'ఱ' అనే అక్షరం శాసనాల్లో కనిపి స్తుంది?
1) శాతవాహనులు 2) శాలంకాయనులు
3) చాళుక్యులు 4) విష్ణుకుండినులు
24. లిపి పరిణామ క్రమాన్ని తెలుగు భాషా చరిత్ర అనే గ్రంథంలో చక్కగా వివరించినవారు?
1) జి.యన్. రెడ్డి
2) భద్రిరాజు కృష్ణమూర్తి
3) పి.ఎస్. సుబ్రహ్మణ్యం
4) తూమాటి దోణప్ప
25 చాళుక్య వంశానికి చెందిన ఎరికల్ ముత్తురాజు వేయించిన తొలి తెలుగు శాసనం ఎక్కడ లభిస్తుంది?
1) కలమందలపాడు 2) అద్దంకి
3) ఎర్రగుడిపాడు
4) పొట్లదుర్తి- మాలెపాడు
26. నన్నయ ఏ లిపిలో భారతం రాశాడు?
1) దేవనాగరి లిపి 2) వేంగి చాళుక్య లిపి
3) బ్రాహ్మీ లిపి 4) మూలద్రావిడ లిపి
27. ఏ కవి కాలం నాటి లిపికి, నేటి తెలుగు లిపికి సన్నిహిత సంబంధం ఉంది?
1) నన్నయ 2) తిక్కన
3) పాల్కురికి సోమనాథుడు
4) శ్రీనాథుడు
28. తెలుగు వర్ణమాలలోని చ, జ అక్షరాల్లో దంత్యోచ్చారణ కోసం '౼' గుర్తును ఎవరు చేర్పించినట్లు గుర్తించారు?
1) సి.పి. బ్రౌన్ 2) చిన్నయసూరి
3) బిషప్ కాల్డ్వెల్
4) వేటూరి ప్రభాకరశాస్త్రి
29. తెలుగు భాషకు చిన్నయసూరి రాసిన అత్యంత ప్రామాణిక వ్యాకరణ గ్రంథం?
1) ప్రౌఢ వ్యాకరణం
2) సూత్రాంధ్ర వ్యాకరణం
3) ఆంధ్రశబ్ద లక్షణ సంగ్రహం
4) బాల వ్యాకరణం
30. 'తెలుగునకు వర్ణములు ముప్పదియారు' అని ఎవరు ఏ గ్రంథంలో చెప్పారు?
1) ప్రౌఢ వ్యాకరణం- బహుజనపల్లి సీతారామాచార్యులు
2) బాల వ్యాకరణం- చిన్నయసూరి
3) ఆంధ్రశబ్ద చింతామణి- నన్నయ
4) శబ్దరత్నాకరం- బహుజనపల్లి సీతారామాచార్యులు
31. మనకు గాలి, నీరు, ఆహారం ఎంత ముఖ్యమో ఇది కూడా అంతే ముఖ్యం?
1) ధ్వని 2) వాక్యం
3) భావ ప్రకటన 4) భాష
32. తనకు తానే మాట్లాడుకోవడం లేదా తనకే పరిమితమైన లేఖనాన్ని ఏమంటారు?
1) గ్రహణం 2) అభివ్యక్తి
3) ఆత్మగతం 4) ప్రకాశం
33. భాషోపాధ్యాయుడు తరగతి గదిని ఎలా భావించి, కృత్రిమ సన్నివేశాలు, ఘట్టాలు, సృష్టించి విద్యార్థులకు అనుభవపూర్వకమైన భాషా వినియోగం కలిగించాలి?
1) ఒక ప్రయోగశాలగా
2) సౌరకుటుంబంలా
3) ఒక సూక్ష్మ సమాజంగా
4) వసుధైక కుటుంబంగా
34. భాషాధ్వనులకు పుట్టుక, పలకడంలో ముఖ యంత్ర వినియోగం, ధ్వనితరంగాల లక్షణం వివరించేది?
1) వ్యాకరణ శాస్త్రం 2) భాషాశాస్త్రం
3) మనోవిజ్ఞాన శాస్త్రం 4) ధ్వని విజ్ఞానం
35. వాగుత్పత్తిలో కంఠం, తాలువు, మూర్ధం, దంతమూలం, పై పెదవి వీటిని ఏమంటారు?
1) కంఠధ్వనులు 2) స్థానాలు
3) కరణాలు 4) ప్రయత్నాలు
36. వాగుత్పత్తిలో జిహ్వ, ఓష్ఠం, గళగర్తం లను ఏమంటారు?
1) కరణాలు 2) స్థానాలు
3) ప్రయత్నాలు 4) ధ్వని వర్ణాలు
37. నన్నయ నుంచి పరవస్తు చిన్నయసూరి వరకు వెల్లివిరిసిన సాహిత్యమంతా ఏ భాష లో నిక్షిప్తమైంది?
1) ప్రామాణిక భాష 2) సరళగ్రాంథిక భాష
3) గ్రాంథిక భాష 4) మాండలిక భాష
38. ప్రామాణిక భాషనే ఇలా వ్యవహరిస్తారు?
1) మాండలికం 2) గ్రాంథికం
3) వ్యవహారికం 4) శిష్ట వ్యవహారికం
39. వ్యవహారిక భాష కోసం ఉద్యమం చేపట్టినవారు?
1) వేదం వెంకటరాయశాస్త్రి
2) గిడుగు సీతారామశాస్త్రి
3) గిడుగు రామమూర్తి
4) గురజాడ అప్పారావు
40. ఉపభాష, ప్రాదేశిక భాష అని ఏ భాషను పిలుస్తారు?
1) వ్యవహారికం 2) గ్రాంథికం
3) మాండలికం 4) ప్రామాణికం
41. ఏ మండలంలో సొమ్ములు అంటే ఆవులు అని అర్థం?
1) పూర్వ మండలం
2) మధ్య మండలం
3) దక్షిణ మండలం
4) ఉత్తర మండలం
42. నాగలిని మడక అని ఏ ప్రాంతంలో పిలుస్తారు?
1) గోదావరి 2) కోస్తాంధ్ర
3) తెలంగాణ 4) రాయలసీమ
43. మూలభాష నుంచి లక్ష్యభాషలోకి భాషాంతరీకరణం చేసే నేర్పును ఏమంటారు?
1) అనుకరణశక్తి
2) భాషాంతరీకరణ సామర్థ్యం
3) లక్ష్యాధారిత సామర్థ్యం
4) భాషా వినియోగం
44. 'మూల భాషా రచనాశైలి లక్ష్యభాషలో కూడా ఉంటూ, మూలానికి కట్టుబడి చేసే అనువాదం' ఏది?
1) మూలానువాదం
2) మూల విధేయానువాదం
3) స్వేచ్ఛానువాదం
4) పదానువాదం
45. అనువాదకుడు లక్ష్యభాషకు తగిన, తనదైనశైలిని, స్వతంత్రతను ప్రదర్శిస్తే దానిని ఏమంటారు?
1) స్వేచ్ఛానువాదం
2) భావానువాదం
3) పదానువాదం
4) మూల విధేయానువాదం
46. దినచర్య రహస్యలేఖలు దేనికి ఉదా హరణలు?
1) ప్రకాశం 2) అభివ్యక్తం
3) గ్రహణం 4) ఆత్మగతం

సమాధానాలు

1) 2;	2) 3;	3) 2;	4) 1;
5) 4;	6) 1;	7) 2;	8) 1;
9) 2;	10) 4;	11) 2;	12) 1;
13) 3;	14) 2;	15) 4;	16) 2;
17) 3;	18) 4;	19) 3;	20) 2;
21) 3;	22) 4;	23) 4;	24) 2;
25) 3;	26) 2;	27) 4;	28) 1;
29) 4;	30) 3;	31) 4;	32) 3;
33) 3;	34) 4;	35) 2;	36) 1;
37) 3;	38) 4;	39) 3;	40) 3;
41) 1;	42) 4;	43) 2;	44) 2;
45) 1;	46) 4.		

గత టెట్, డీఎస్సీ ప్రశ్నలు

1. భాషకు మూలం?
1) వాక్యం 2) ధ్వని
3) భావం 4) ఆలోచన
2. భాషకు మూలం కొన్ని ధాతువులే అని ప్రతిపాదించినవారు?
1) నోమ్‌చామ్‌స్కీ 2) బ్లూమ్‌ఫీల్డ్
3) యాస్కాచార్యుడు 4) కాత్యాయనుడు
3. ఆంధ్రభాషా బోధన సరస్వం పుస్తక రచయిత?
1) శ్రీరామచంద్రుని వేంకట శేషయ్య
2) పావులూరి కామేశ్వరరావు
3) గొడవర్తి సూర్యనారాయణ
4) కె.వి.వి.యల్. నరసింహారావు
4. మాక్స్‌ముల్లర్ ప్రతిపాదించిన భాషావాదం?
1) ధ్వన్యనుకరణ సిద్ధాంతం
2) ధాతు జన్యువాదం
3) డింగ్ డాంగ్ వాదం
4) భగవదత్తం
5. 'ఉండుద్ది, వచ్చుద్ది' మొదలైన క్రియా పదాలు వాడుకలో ఉన్న జిల్లా?
1) తూర్పుగోదావరి 2) పశ్చిమగోదావరి
3) కృష్ణా 4) గుంటూరు
6. బిందుపూర్వక 'బ' కారం ఏ భాషలో కన్పిస్తుంది?
1) మాండలిక 2) గ్రాంథిక
3) ప్రామాణిక 4) వ్యవహారిక
7. ప, ఫ, బ, భ, మ అనే వర్ణాలు?
1) దంత్యాలు 2) దంత్యోష్ఠ్యాలు
3) ఓష్ఠ్యాలు 4) తాలవ్యాలు
8. వ్యవహారంలో ఉణ్యాది క్రియారూపం కనిపించే జిల్లా?
1) శ్రీకాకుళం 2) నెల్లూరు
3) ఆదిలాబాద్ 4) తూర్పుగోదావరి

సమాధానాలు

1) 2;	2) 3;	3) 1;	4) 3;
5) 4;	6) 2;	7) 3;	8) 2.

నక్షత్రాల్లోని శక్తికి మూలాధారం ..?

నదీజలం కంటే సముద్ర జలాల్లో లవణాలు ఎక్కువ కాబట్టి సాంద్రత అధికంగా ఉంటుంది. అందువల్ల అత్యంత లవణమయమైన 'డెడ్ సీ' నీటిపై నడవవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో విక్రయించే మినరల్ వాటర్‌ను 'తిరోగామి ద్రవాభిసరణ' (రివర్స్ ఆస్మాసిస్) ప్రక్రియ ద్వారా ప్రాసెస్ చేస్తారు. ఇదే ఆర్.ఒ. ప్రక్రియగా ప్రాచుర్యంలో ఉంది. ఈ ప్రక్రియలో 'మెంబ్రేన్' (అతి సూక్ష్మ రంధ్రాలున్న పలుచని పొర) ద్వారా ఉప్పు (కఠిన) నీటిని అధిక పీడనాన్ని ఉపయోగించి పంపిస్తారు. మెంబ్రేన్ నుంచి స్వాదుజలం బయటకు వస్తుంది. దీనిలో అయాన్‌లన్నీ తొలగిపోతాయి. కాబట్టి 'డీ అయొనైజ్డ్ వాటర్' అని కూడా అంటారు.



	పరమాణు సంఖ్య	పరమాణు భారం	ప్రోటాన్ల సంఖ్య	న్యూట్రాన్లు
ప్రోటియం (H)	1	1	1	0
డ్యుటీరియం (D)	1	2	1	1
ట్రిటియం (T)	1	3	1	2

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

కెమిస్ట్రీ

హైడ్రోజన్ - దాని సమ్మేళనాలు

ఆవర్తన పట్టికలో మొదటి మూలకం హైడ్రోజన్. ఇది అత్యంత తేలికైంది. సాధారణ హైడ్రోజన్ పరమాణు సంఖ్య ఒకటి, పరమాణు భారం ఒకటి. న్యూట్రాన్లు లేని ఒకే ఒక కేంద్రకం హైడ్రోజన్. దీన్నే ప్రోటియం అని కూడా అంటారు. దీని సమస్థానీయాలు (ఐసోటోపులు) డ్యుటీరియం, ట్రిటియం.

- డ్యుటీరియంనే భార హైడ్రోజన్ అంటారు. ట్రిటియం రేడియోధార్మిక కేంద్రకం.
- హైడ్రోజన్ అత్యంత శ్రేష్ఠమైన ఇంధనం. దీన్ని మండించినప్పుడు నీటి ఆవిరి (H_2O) మాత్రమే విడుదలవుతుంది. కాబట్టి వాతావరణ కాలుష్యం ఉండదు.
- నక్షత్రాల్లోని శక్తికి మూలాధారం హైడ్రోజన్. హైడ్రోజన్‌కు చెందిన ఐసోటోపులు 'కేంద్రక సంలీన' చర్య ద్వారా అత్యధిక శక్తిని విడుదల చేస్తాయి. ఈ ప్రక్రియలోనే వివిధ మూలకాలు ఏర్పడతాయి.
- కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్‌ల మిశ్రమాన్నే ($CO+H_2$) 'వాటర్ గ్యాస్' అంటారు. దీన్నే నీలిగ్యాస్ అని కూడా అంటారు.
- హైడ్రోజన్‌ను ఇంధన ఘటాల్లో ఉపయోగిస్తారు. హైడ్రోజన్ లేదా కార్బన్ మోనాక్సైడ్ లేదా మీథేన్ లాంటి ఇంధనాలను దహనం చేయడం ద్వారా వచ్చే శక్తిని సరళరీతిలో విద్యుత్‌శక్తిగా మార్చే ఘటాలే ఇంధన ఘటాలు. వీటిలో 'ఆక్సిజన్' వాయువు 'ఆక్సీకరణి'గా పనిచేస్తుంది.
- ఇది నూనెలను 'హైడ్రోజనీకరణం' చేసి 'కొవ్వులు'గా మార్చడానికి ఉపయోగపడుతుంది. ఈ ప్రక్రియలో ఉత్ప్రేరకం 'నికెల్' లోహం. డాల్డాను ఈ విధానంలోనే రూపొందిస్తారు.
- 'ఫిషర్ - ట్రాప్స్' పద్ధతిలో కృత్రిమంగా పెట్రోల్ తయారు చేయడానికి దీన్ని ఉపయోగిస్తారు. ఈ పద్ధతిలో 'వాటర్ గ్యాస్' ను దానిలో సగం పరిమాణం ఉన్న 'హైడ్రోజన్'తో కలిపి ఐరన్ ఆక్సైడ్, కోబాల్ట్ ఉత్ప్రేరకాల సమక్షంలో 200°C వద్ద వేడిచేస్తే హైడ్రోకార్బన్ల మిశ్రమం (కృత్రిమ గ్యాసోలిన్) వస్తుంది.
- అమ్మోనియా తయారీలో ఒక ముఖ్యమైన అనుఘటకం హైడ్రోజన్.
- లోహ సంగ్రహణలో.. లోహ ఆక్సైడ్‌ల నుంచి క్షయకరణ పద్ధతిలో లోహాల్ని నిష్కర్షించడానికి హైడ్రోజన్‌ను ఉపయోగిస్తారు.

నీరు

గాలి తర్వాత అత్యంత అవసరమైంది నీరే. ప్రకృతిలో లభ్యమయ్యే నీటిలో అత్యంత శుద్ధమైంది 'వర్షపు నీరు'. తాగడానికి పనికివచ్చే నీటిని 'పోటబుల్ నీరు' అంటారు. నాలుగింట మూడు వంతుల నీరు సముద్రాల్లోనే ఉంది. సముద్ర జలాల్లో అనేక రకాల లవణాలుంటాయి. ఈ నీరు తాగడానికి పనికి రాదు. సబ్బుతో నురగనివ్వదు. ఇలాంటి నీటిని కఠిన జలం అంటారు. ప్రధానంగా కాల్షియం, మెగ్నీషియం బైకార్బొనేట్లు; క్లోరైడ్‌లు; సల్ఫేట్లు ఉండటం వల్ల నీటికి కఠినత్వం వస్తుంది.

నీటి కాఠిన్యత రెండు రకాలు. ఒకటి తాత్కాలిక కాఠిన్యత, రెండోది శాశ్వత కాఠిన్యత.

తాత్కాలిక కాఠిన్యత: కాల్షియం బై కార్బొనేట్, మెగ్నీషియం బై కార్బొనేట్ లవణాల కారణంగా నీటికి తాత్కాలిక కాఠిన్యం వస్తుంది.

- నీటిని మరిగించడం ద్వారా తాత్కాలిక కాఠిన్యతను పూర్తిగా తొలగించవచ్చు. మరిగిస్తే బైకార్బొనేట్లు కార్బొనేట్లుగా అవక్షేపితమవుతాయి. నీటిని మరిగించినప్పుడు పాత్ర అడుగుభాగంలో తెల్లని పొలుసులను గమనించవచ్చు. ఈ పొలుసుల్లో ఉండేది కాల్షియం, మెగ్నీషియం కార్బొనేట్‌లు. ఈ ప్రక్రియలో కార్బన్ డై ఆక్సైడ్ కూడా విడుదలవుతుంది. దీని కారణంగానే నీటిని మరిగిస్తున్నప్పుడు బుడగలు వస్తాయి.
- తాత్కాలిక కాఠిన్యాన్ని తొలగించడానికి తోడ్పడే మరో విధానం 'క్లార్క్ పద్ధతి'. కఠిన జలానికి సున్నపు నీరు లేదా మిల్క్ ఆఫ్ లైమ్ (కాల్షియం హైడ్రాక్సైడ్) కలపడం ద్వారా నీటి తాత్కాలిక కాఠిన్యాన్ని తొలగించవచ్చు.

నీటి శాశ్వత కాఠిన్యత: కాల్షియం, మెగ్నీషియం క్లోరైడ్‌లు, సల్ఫేట్లు నీటికి శాశ్వత కాఠిన్యాన్ని కలుగజేస్తాయి. అంటే నీటిలో కాల్షియం క్లోరైడ్, కాల్షియం సల్ఫేటు, మెగ్నీషియం క్లోరైడ్, మెగ్నీషియం సల్ఫేట్లు కరిగి ఉంటాయి.

- సాధారణంగా పెర్ముటిట్ (సోడియం అల్యూమినియం ఆర్థోసిలికేట్) లేదా కాల్గన్ (సోడియం హెక్సామెటా ఫాస్ఫేట్) ద్వారా కఠిన జలాన్ని పంపిస్తే అందులోని కాల్షియం, మెగ్నీషియం అయాన్‌లు తొలగిపోతాయి.
- అయాన్ మార్పిడి రెజిన్‌లు కూడా కఠిన జలాన్ని స్వాదుజలంగా మారుస్తాయి.
- 'స్వేదన' (డిస్టిలేషన్) ప్రక్రియ ద్వారా కూడా నీటి కఠినత్వాన్ని తొలగించవచ్చు. నీటిని మరిగించినప్పుడు ఆవిరవుతుంది. ఆవిరిని చల్లారిస్తే పరిశుద్ధ జలం (100% పరిశుద్ధమైంది) వస్తుంది.
- సముద్ర జలాన్ని 'ఆవిరి చేయడం' వల్ల చివరగా ఉప్పు మిగులుతుంది.
- నీటి రసాయన నామం హైడ్రోజన్ ఆక్సైడ్ (H_2O)
- నీటికి అనేక పదార్థాలను కరిగించుకునే స్వభావం ఉంటుంది. కాబట్టి దీన్ని సార్వత్రిక ద్రావణి అంటారు.
- 4°C వద్ద నీటికి గరిష్ఠ సాంద్రత ఉంటుంది. అందుకే నీటిని 0°C నుంచి 10°C వరకు వేడి చేసినప్పుడు ఉష్ణోగ్రత - ఘనపరిమాణానికి వక్రాన్ని గీస్తే 'హాకీ స్టిక్'లా ఉంటుంది. ఘనపరిమాణం మొదట తగ్గి తర్వాత పెరుగుతుంది.
- నీరు 0°C (273K) వద్ద ఘనీభవిస్తుంది. 100°C (373K) వద్ద మరుగుతుంది.
- లవణాలు ఎక్కువగా ఉండటం వల్ల సముద్ర నీటి సాంద్రత అధికంగా ఉంటుంది. అందువల్ల ఏదైనా వస్తువు నది నీటి నుంచి సముద్రం నీటిలోకి ప్రవేశిస్తే కొంచెం పైకి తేలుతుంది.
- నీటిని విద్యుద్విశ్లేషణ చేస్తే విఘటనం చెంది హైడ్రోజన్, ఆక్సిజన్‌లుగా విడిపోతుంది.
- నీటిని క్రిమిరహితం చేయడానికి విరంజన చూర్ణం (బ్లీచింగ్ పౌడర్) లేదా క్లోరిన్ వాయువు లేదా అతి నీలలోహిత (UV) కిరణాలను ఉపయోగిస్తారు.
- పాత్రలో నీటిని వేడిచేసినప్పుడు పై నుంచి మరుగుతుంది.
- పొడిగాలి కంటే తడిగాలిలో ధ్వని వేగం ఎక్కువ.

భారజలం

రసాయనికంగా భారజలాన్ని డ్యుటీరియం ఆక్సైడ్ (D_2O) అంటారు. దీన్ని హెచ్‌సీ యురే కనుగొన్నాడు. భారజలం ఘనీభవన స్థానం 3.82°C, బాష్పీభవన స్థానం 101.42°C. దీన్ని న్యూక్లియర్ రియాక్టర్లలో న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించడానికి మితకారిగా వాడతారు..

మాదిరి ప్రశ్నలు

1. హైడ్రోజన్ ఇంధన వాహనాలు కిందివాటిలో దేని 'ఎగ్జాస్ట్'ను ఉత్పత్తి చేస్తాయి? (సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్-2010)
   1) NH_3 2) CH_4
   3) H_2O 4) H_2O_2
2. రసాయనికంగా నీరు అనేది?
   1) ఆక్సిజన్ హైడ్రైడ్
   2) హైడ్రోజన్ ఆక్సైడ్
   3) డ్యుటీరియం ఆక్సైడ్
   4) నైట్రోజన్ హైడ్రైడ్
3. కిందివాటిలో స్వచ్ఛమైన జలం ఏది?
   1) నది నీరు 2) సముద్రపు నీరు
   3) భూమిని చేరకముందు వర్షపునీరు
   4) బావి నీరు
4. కిందివాటిలో రాకెట్ ఇంధనంగా ఉపయోగపడేది?
   1) ద్రవ హైడ్రోజన్
   2) ద్రవ అమ్మోనియా
   3) భారజలం 4) నీటి ఆవిరి
5. కిందివాటిలో దేనిలో హైడ్రోజన్ ఉండదు?
   1) నీరు 2) హైడ్రోజన్ పెరాక్సైడ్
   3) అమ్మోనియా 4) కార్బన్ డై ఆక్సైడ్
6. నీరు అనేది ఒక?
   1) మిశ్రమం 2) మూలకం
   3) సంయోగ పదార్థం 4) పరమాణువు
7. ఓడ నది నుంచి సముద్రంలోకి ప్రవేశిస్తే..?
   1)అది సముద్ర నీటిలో పైకి తేలుతుంది
   2) నీటిలోకి మరింతగా మునుగుతుంది
   3) ఎలాంటి మార్పూ ఉండదు
   4) ఓడలోని సరుకుపై ఆధారపడి ఉంటుంది
8. నీటిపై తేలుతున్న ఐస్ కరిగినప్పుడు బీకర్‌లోని నీటి స్థాయి?
   1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
   3) యథావిధిగా ఉంటుంది
   4) మొదట పెరిగి, తర్వాత తగ్గుతుంది
9. నీటికి శాశ్వత కాఠిన్యత కిందివాటిలో దేని వల్ల ఏర్పడుతుంది? (గ్రూప్-I, 2010)
   1) కాల్షియం సల్ఫేట్
   2) కాల్షియం బై కార్బొనేట్
   3) సోడియం బై కార్బొనేట్
   4) మెగ్నీషియం బై కార్బొనేట్
10. కృత్రిమ వర్షం కురిపించడానికి ఉపయోగించే సమ్మేళనం?
    1) సిల్వర్ అయొడైడ్
    2) సోడియం నైట్రేట్
    3) సోడియం క్లోరైడ్
    4) హైడ్రోజన్ పెరాక్సైడ్
11. గాయాలను క్రిమిరహితం చేయడానికి ఉపయోగించే హైడ్రోజన్ సమ్మేళనం ఏది?
    1) నీరు 2) హైడ్రోజన్ పెరాక్సైడ్
    3) భారజలం 4) అమ్మోనియా
12. నీరు ద్రవ రూపంలో ఉండటానికి కారణం?
    1) అయానిక బంధం
    2) సమయోజనీయ బంధం
    3) లోహబంధం 4) హైడ్రోజన్ బంధం

సమాధానాలు

1) 3; 2) 2; 3) 3; 4) 1; 5) 4; 6) 3; 7) 1; 8) 3; 9) 1; 10) 1; 11) 2; 12) 4.

Pronoun must be in subject form



Sentence correction section is one of the important areas in many competitive examinations. Eight types of errors pertaining to the following broad areas are generally given. Candidates who wish to secure good scores need to enhance their knowledge on these areas.

They are:

1. Collocation
2. Idioms and Phrases
3. Pronoun agreement
4. Concord
5. Modifiers
6. Verb sequences
7. Comparisons
8. Parts of speech

Out of these we have studied the first two topics collocation and idioms and phrases in the last sessions. Let us learn about pronoun agreement in this session.

Pronouns stand in for nouns in a sentence. Pronouns follow the same agreement rules as nouns, so when using a pronoun, it is important to be clear about what noun it is replacing. Take a look at the following tips:

1. A pronoun in the nominative form should be compared with the same form of the pronoun.
2. When two singular nouns are joined by and refer to the same person the pronoun used in their place should be singular in form.
3. A singular pronoun should be used when two singular nouns are joined by either or neither nor.
4. A pronoun in the plural form should be used when two nouns of different members are joined by 'or' or 'nor'.
5. The distributive pronouns 'either, neither, none, any, no one are used with singular verbs.
6. The indefinite pronoun 'one' should be used as 'one's for its possessive case.
7. The verbs such as cheat, prostrate, introduce, present, absent, satisfy, prepare, enjoy, hurt, avail of are followed by either an object or a reflexive pronoun.
8. The word 'who' as a relative pronoun in the nominative case takes a verb.
9. If a pronoun is to be placed after 'to be', the pronoun in the subjective case is used. A very important point to be noted is that we should use the personal pronouns in the order of second person, third person and first person. The order first person, second person and third person is possible when we admit guilt.

Pronoun Subject Vs Pronoun Object

Once you've found a pronoun in a Sentence Correction question, check whether it's acting as the SUBJECT or the OBJECT of the sentence or phrase. Is the following sentence correct or incorrect?

How could she blame you and he for the accident?

The first step is to identify the pronoun(s). There are three in this sentence: "she," "you," and "he". Next, try to define whether each pronoun is acting as a subject or object. Here, "she" is the subject, and the pronouns "you" and "he" are acting as the objects of the sentence.

How do we know this? Because "she" is doing the action (blaming) and "you" and "he" are receiving it (getting blamed). However, "he" does not seem to be in the correct form. "Who did she blame?", which is "him" not "he." ("Who did she blame? She blamed him")

The pronouns acting as objects must be in the objective case; "him" is objective - while "he," used in the sentence, is subjective, and therefore incorrect.

Incorrect: How could she blame you and he for the accident?

Correct: How could she blame you and him for the accident?

Who Vs Whom

If the pronoun is acting as a subject, use who. If it is acting as an object, use whom.

I don't know whom Kavitha married.

Why is "whom" correct? Because Kavitha is the subject of this sentence - not the person she married.

Singular and Plural Pronouns

Pronouns also act like nouns in the realm of verb agreement. For some pronoun questions, you also need to check if the pronoun and its verb agree in number.

Here's an example:

Incorrect: Everyone on the project have to come to the meeting.

Correct: Everyone on the project has to come to the meeting.

The pronoun "everyone" is singular. Its verb must therefore be singular as well: "has" is correct, not "have".

Possessive Pronoun Agreement

When you come across possessive pronouns such as your, their, his, and hers, check to see whether they agree with other pronouns in the sentence. Most possessive pronouns are used messily in spoken language, so be careful to take special note when you see two pronouns in a sentence.

Incorrect: Some of you will have to bring their own bags.

Correct: Some of you will have to bring your own bags.

In this sentence, the possessive pronoun towards the end of the sentence should match the pronoun following "Some of". Because the first pronoun is "you", the possessive pronoun must be your, not their.

Objects of to be verbs are in the subject form.

Watch for pronouns following "to be" verbs such "It should have been," "It is," "It could have been," "It was", and make sure they are in subject form.

Incorrect: It must have been her who called.

Correct: It must have been she who called.

"It must have been" is a "to be" verb, so the pronoun must be in subject form: "she," not "her".

Relative Pronouns

Which, that and who are relative pronouns. A relative pronoun must refer to the word immediately preceding it. If the meaning of the sentence is unclear, the pronoun is in the wrong position. Which introduces non-essential clauses; that introduces essential clauses. Who refers to individuals; that refers to a group of persons, class, type, or species.

Incorrect: The person whom draws the winning number hits the jackpot.

Correct: The person who draws the winning number hits the jackpot.

Here the relative pronoun 'who' is the correct form as it is the subject of the verb draws and also introduces the clause draws twinning number.

Impersonal Pronouns

We can use impersonal pronouns to talk about people in general or unspecified objects. The pronouns "one" and "you," which are included in a class of pronouns called "impersonal pronouns," are often improperly matched with their respective possessive pronouns.

Incorrect: One should have their teeth checked every six months.

Correct: One should have one's teeth checked every six months..

PRACTICE TEST

1. Her was better suited for the job.
2. Johnny and me drank a bottle of champagne.
3. The dinner was eaten by Smith and I.
4. Whom took out the trash?
5. Neither his bodyguards nor he were there.
6. Neither he nor his bodyguards was there.
7. If anyone comes over, take their name.
8. One should take your responsibilities seriously.
9. This test is for students which native language is not English.
10. My pencil is broken. Can I borrow its?

Answers and explanation:

1. She was better suited for the job.
   Here, the pronoun is the subject of the sentence, as "the job" is clearly not the subject, and there are no other nouns in the sentence. Because the pronoun stands in for "the woman", the pronoun should be the subject form of the her/she pronoun meaning, "she".
2. Johnny and I drank a bottle of champagne.
   Because it's confused so often in spoken language, it can be difficult to tell when the pronoun in the phrase "someone else and me/I" is used incorrectly. But it's actually quite easy to remember when to use "me" and when to use "I": cross out everything in the "someone else and me/I" phrase except the pronoun - and then read it aloud. How does it sound? If it sounds fine, the pronoun is correct; if it sounds really odd, the pronoun is incorrect.
   "Me drank a bottle of wine" sounds odd, so the proper pronoun is clearly "I".
3. The dinner was eaten by Smith and me.
   "I/me" is acting as the object, so the proper pronoun is "me."
4. Who took out the trash?
   You wouldn't say "him took out the trash," so the pronoun in the original sentence must match the form of the pronoun "he," which is a subject pronoun: who is correct.
5. Neither his bodyguards nor he was there.
6. Neither he nor his bodyguards were there.
   The constructions "either... or" and "neither... nor" always take the verb form that matches the noun that is closer to the verb. Thus, "were" is incorrect in the fifth sentence because "he," a singular pronoun, is closer to the verb than "bodyguards," a plural noun; but "were" is correct in the sixth sentence because the order of the subjects is reversed, so that the plural noun "bodyguards" is closer to the verb.
7. If anyone comes over, take his or her name.
   The subject is anyone, which is singular, and therefore requires a singular pronoun such as "his" or "her".
8. One should take one's responsibilities seriously.
   The subject is one, which is singular, and therefore requires a singular pronoun.
9. This test is for students whose native language is not English.
   The correct relative pronoun to be used in this sentence is 'whose'.
10. My pencil is broken, can I borrow yours?
    The correct possessive pronoun is 'yours'.